# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక నవంబర్, 2012 ₹ 20



మయూరి

# మిసిమి
మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**
*- Dammapada.*


**సంపుటి 23** నవంబరు **2012** **సంచిక 11**



*ప్రధాన సంపాదకుడు*
**చెన్నూరు ఆంజనేయ రెడ్డి**

*సంపాదకుడు*
**వల్లభనేని అశ్వినీకుమార్**

*సహాయ సంపాదకుడు*
**కాండ్రేగుల నాగేశ్వరరావు**

*సమాలోచక మండలి*

**డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి**
**డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి**
**కుర్రా జితేంద్రబాబు**
**నందిగం కృష్ణారావు**

*సంస్థాపక సంపాదకులు*
**రవీంద్రనాథ్ ఆలపాటి**



*Printed & Published by*

**Bapanna Alapati**
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
e-magazine : www.kinige.com/misimi

ప్రతి : ₹20 సంవత్సరానికి : ₹240
విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25

*మీ చందా* **మిసిమి** *పేర పై చిరునామాకు పంపండి.*


మరిన్ని వివరాలకు 80 వ పుట చూడండి.


# ఈ నెల...


కమ్మతెమ్మెరలు

1. గురజాడ గిరీశం ........................................ 5
   – *గొల్లపూడి మారుతీరావు*

2. జాషువా కవిత్వంలో జాలువారిన హాస్యం ............. 12
   – *ఆచార్య ఎండ్లూరి సుధాకర్*

3. రెండు భాషల వెండితెర పండితుడు ...................18
   – *మిసిమి*

5. తూర్పుగాలి – కొరియా కవిత్వం........................ 22
   – *ముకుంద రామారావు*

6. కర్ణాటకం – హిందూస్థానీ ............................... 34
   – *నండూరి పార్థసారథి*

7. గోసంగి ఛాయలు.......................................... 38
   – *కొలకలూరి మధుజ్యోతి*

8. నెహ్రూ తో చాప్లిన్........................................ 40
   – *మిసిమి*

7. కూచిపూడి నృత్య భారతి ................................ 44
   – *పసుమర్తి శేషబాబు*

8. పడమటి గాలి ............................................ 47
   – *మిసిమి*

9. బాల వాఙ్మయం........................................... 52
   – *న్యాయపతి రాఘవరావు*

10. తెలుగువారి వైద్య సంప్రదాయాలు ..................... 60
   – కుర్రా జితేంద్రబాబు

11. చెదిరిపోని పూలకారు కృష్ణశాస్త్రి జ్ఞాపకాలు ........... 66
   – *ప్రసాద వర్మ కామబుషి*

13. బుద్ధుడే ఎందుకు?...................................... 69
   – *డాక్టరు కాలువ మల్లయ్య*

12. సాంకేతిక భాషగా తెలుగు ............................. 72
   – *డాక్టరు అద్దంకి శ్రీనివాస్*

14. చదవండి (పుస్తక పరిచయం) .......................... 76

15. కళ, కళాకారుడు, విమర్శకుడు ......................... 78
   – *ఆస్కార్ వైల్డ్*


| | | | |
|---|---|---|---|
| *ముఖచిత్రం* | : శివ–పార్వతి | : *చిత్రకారిణి* : | అన్నపూర్ణ |
| *రెండవ అట్ట* | : మయూరి | : ” | : ఏలూరిపాటి |
| *మూడవ అట్ట* | : పద్మ రాగం | : ” | : |
| *నాల్గవ అట్ట* | : మౌన గానం | : ” | : |


(వివరాలు : 59 వ పుటలో)



'సూర్య చంద్రులను ఎవరు గుర్తించాలి' అంటుంది గడుసుగా మధురవాణి రవీంద్రనాథ్‌తో 'మాటామంతీ' లో....

సూర్య చంద్రులను ఎవరూ గుర్తించాల్సిన పనిలేదు కాని తప్పనిసరిగా దర్శించాలి దినచర్యలో... రవీంద్రనాథ్ ఆలోచన రూపం ***'మిసిమి',*** ఆ విధంగా తప్పనిసరిగా చూడవలసిన పత్రిక. అలాగే సూర్య చంద్రులకు వయస్సేముంటుంది? చిరంజీవులను అంకెలతో కొలవలేముకదా! ఇప్పటికి ఆయన జన్మించి తొంభైయేళ్లు... చిరంజీవ, చిరంజీవ...

వంద సంవత్సరాలకు పైగా 'గిరీశం' ఎందుకు బ్రతికున్నాడు? ఎవరిలో బ్రతికున్నాడు – ఎందుకు మన మధ్యలో తిరుగుతున్నాడు? చాలా ఆసక్తికరమైన విశ్లేషణ గొల్లపూడి మారుతీరావుది!

మనకు, మూడు తరాల ముందువారు 'ఆధునిక' ప్రపంచంలో అడుగు పెట్టి నిలదొక్కు కోవటానికి ఎన్ని పాట్లు పడ్డారో, ఎన్ని సార్లు నడిరోడ్డు మీద నిలబడ్డారో, ఎన్ని పూటలు తిండిలేక మాడారో– ఒక మార్పుకి, ఒక సంఘర్షణకి – ఎన్నో జీవితాలకు సరిపడిన శ్రమకు ప్రతీక ఎల్వీ! (పు. 18)

తెలుగులో బాల సాహిత్యం 'బాల'తో మొదలయింది. అర్ధశతాబ్దం పైగా 'చందమామ' వెలిగినా, ఇపుడు బాలలకు టివి పుణ్యమా అని పుస్తకాలే కరువై పోయినాయి. ఈ దిక్కుగా తెలుగు ప్రచురణ రంగం ఏమైనా చేయగలదా? (పు. 52)

'తెలుగు సాంకేతిక భాష'గా ఎంతవరకు అభివృద్ధి చెందింది? మనం ఎందుకు వెనక బడివున్నాం? (పు. 72)

తెలుగు వారికి ప్రత్యేక వైద్య సంప్రదాయాలున్నాయా? (పు. 58)

'తూర్పుగాలి' లో కొరియా కవితలు చదవండి – కొత్త అనుభూతి పొందండి!



***మిసిమి*** అట్టమీది బొమ్మలు ఎంతో బాగుంటున్నాయి అని ఎందరో పాఠకులు అంటున్నారు. సంతోషమే... కాని అక్టోబరు సంచికలు చాలా అట్టలు లేకుండా మాకు తిరిగి వచ్చినాయి. ఇందుకు సంతోషించాలా, విచారించాలా? ఇలా ప్రతినెలా జరుగుతూనే ఉంది మరి...

***మిసిమి*** పాఠకులకు దీపావళి శుభాకాంక్షలు....

– ***సంపాదకులు.***

# కమ్మతెమ్మెరలు

**ఉ**త్తరాలతో పలకరించే పాఠకులకు అభివందనాలు. ఎంతో ఆసక్తితో **మిసిమి** చదివి మీ అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్రాస్తున్నందుకు మా ఆనందాన్ని తెలుపుతూ, చేవగల్గిన ఉత్తరానికి **'సిద్ధార్థ'** పుస్తకం బహుమానంగా పంపుతున్నాము!

✶ "...మీ *అగాధం* చదివాను. ఒక్కసారిగా నా కాలేజి రోజులన్నీ గుర్తువచ్చి నాస్టాల్జియా కమ్మివేసింది. మీరు ఆస్కార్ వైల్డ్ మిగతా రచనలు కూడా, ముఖ్యంగా *ది పిక్చర్ ఆఫ్ డోరిన్ గ్రే* తెలుగు చేయండి. అభినందనలు.

**– యస్. వీరనారాయణ రెడ్డి,** ఐ.పి.యస్. హైదరాబాదు.

✶ "...అందమైన పుస్తకం *అగాధం* అందినది. చిక్కని తెలుగులో చక్కని భావ వ్యక్తీకరణతో మీరు ఆస్కార్ వైల్డ్ అంతరంగాన్ని చెక్కినట్లు ఆవిష్కరించారు. మిమ్మల్ని ఎలా అభినందించాలో తెలియక, తికమక పడుతున్నాం. ముఖ్యంగా క్రీస్తు చరిత్రను సామాజిక దృష్టితో అర్థం చేసుకుని కళాకారుని చెంత ఆ కరుణామయుని నిలబెట్టిన ఆస్కార్ వైల్డ్ చనిపోయి 130 సంవత్సరాలైనా ఇప్పటికీ అభినందనీయుడే. చట్టాలు దేశకాల పరిస్థితులను బట్టి మారిపోతుంటాయి. వైల్డ్‌ని బలి చేసిన చట్టం ఇప్పుడు ఆ దేశంలోనే ఆమోదయోగ్యంగా చలామణీ అవుతుంది. అంతే, కవులు, కళాకారులు ఎప్పుడూ కాలానికంటే ముందే ఉంటారు. నాగరిక ప్రపంచమే నత్త నడకతో ముందుకు వెళ్తోంది..."

**– తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి,** రాజమండ్రి.

✶ "...మీరు అత్యంత ఆదరంగా పంపిన వైల్డ్‌గారి *అగాధం* భద్రంగా అందినది. సీరియల్‌గా వచ్చినప్పుడు, కిందటి విశేషాలు మర్చి పోతానని సాధారణంగా వాటి జోలికి పోను. ఇప్పుడు పుస్తక రూపంలో చదువుతుంటే ఆ విలక్షణ ప్రతిభావంతుడి 'అంతర్వాణి' వింటున్నట్టుగా ఉన్నది. మీరు అంత ప్రేమగా, సమర్థవంతంగా శ్రమకోర్చి చక్కగా అనువదించింది ఎందుకో అర్థమవుతున్నది. మీకు శుభాకాంక్షలు..." **– సి. ధర్మారావు,** హైదరాబాదు.

✶ "...*అగాధం* అందింది, ఆనందం. ఆస్కార్ వైల్డ్ ఆత్మకృత అపరాధం వల్ల అనుభవించిన ఆవేదన, అనుభూతి డగ్లస్‌కి రాసిన లేఖ వల్ల సువిదితం. ఒక సుప్రసిద్ధ రచయిత మనోవైఖరిని, భావాలను వ్యక్తం చేసే ఈ రచనను తెలుగులోకానికి తేవటంలో మీ దక్షత అభినందనార్హం. రాస్‌కి రాసిన ఉత్తరం తరువాత, డగ్లస్‌కి రాసిన దీర్ఘలేఖ అని ఉపశీర్షిక ఉంచితే బాగుండేదనిపించింది. జైల్లో వైల్డ్‌కి రచనా సదుపాయాల సందర్భంలో వెనకటి తూరి పుటలలోని అంశాలు విరుద్ధంగా ఉన్నాయనిపించింది. ఏమైనా జైలు వాళ్ళు ఖైదీ రచనను చివరికి తిరిగి ఇవ్వటం విశేషమే కదా! మనకు దక్కవలసింది దక్కింది. మీ సత్కృషి కొనసాగాలని కాంక్ష..." **– మద్దాలి సత్యనారాయణ శర్మ,** హైదరాబాదు.

✶ "...ఇందుతో ఓ తులసీదళం పంపుతున్నాను. నిజానికి నేను గతం నుంచి మీ అభిమానినే. *మధురవాణి సంభాషణలు* ఇంకా నాకు గుర్తున్నాయి. ఒక్క మాటలో ***మిసిమి***లోని ప్రతి శీర్షిక, ప్రతి పుట సువర్ణ పత్రం. వాగ్దేవి చేవ్రాలు. అంతెందుకు ***మిసిమి*** చదవటమంటే ప్రపంచ విజ్ఞాన సారస్వతాన్ని అధ్యయనం చేసినట్లే. ప్రతిరోజు కనీసం రెండు శీర్షికలు చదివినవి అయినా సరే మరలా చదువుతున్నాను. రవీంద్రనాథుని స్వప్నాలు నిరంతరంగా కొనసాగించగలరు..."

**– వి. ప్రమోద్ కుమార్,** విజయవాడ.

✶ "..."Oscar Wilde's De Profundis" గ్రంథాన్ని *'అగాధం'* అనే పేరుతో మీరు అనువాదం చేసిన పద్ధతి నాకు ఎంతగానో నచ్చింది. మూలగ్రంథ హృదయాన్ని అక్షరాల అనువదించి పఠితృలోకాన్ని పరవశింపజేస్తున్నారు. ఇది నా వరకు నా అనుభూతి... ప్యారిస్‌లో రెండేళ్ళు దుర్భర దారిద్ర్యంలో గడిపిన వైల్డ్ 30-11-1900న కన్నుమూశాడు. స్వయంకృతాపరాధమూ, సమకాలీన కృత్రిమ సమాజపు విలువలు ఆ ప్రతిభాశాలిని బలి తీసుకొన్నాయి...
... మీ అనువాద గ్రంథం 'ఒక మేధావి రచయిత లోనయ్యే సంఘర్షణ నుంచి ఎంతటి సాహిత్యమైనా వెలువడుతుంది' అనే నగ్నసత్యాన్ని నిరూపించింది. మీకు నా ధన్యవాదాలు..." **– వి.వి.ఎల్ నరసింహారావు,** హైదరాబాదు.

✶ "...2012 సెప్టెంబరు ***మిసిమి*** సంచికలో మిత్రులు నందూరి పార్థసారథి గారు వ్రాసిన *భారతీయ సంగీతం మౌలిక లక్షణాలు* అనే వ్యాసంలో 13వ శతాబ్దానికి చెందిన శార్ఙ్గదేవుడుని *సంగీతరత్నాకరం* తరువాత రెండుగా చీలిపోయిన భారతీయ సంగీతంలో *రత్నాకరం* నుండి దూరంగా జరిగినది హిందూస్థానీ సంగీతమా లేక కర్ణాటక సంగీతమా అనే సందిగ్ధాన్ని మొట్టమొదటి పేరాలో ఎందుకైనా మంచిదనే ఉద్దేశ్యంతో ప్రారంభించినా గాని మిగిలిన వ్యాసంలో ముఖ్యంగా కర్ణాటక సంగీతమే బాగా దూరంగా జరింగదనే భావన ప్రస్ఫుటంగా గలిగేట్లుగా శృతుల గురించీ, స్వరాల గురించీ, రాగసమయాల గురించీ, ఋతువుల గురించీ, రసాల గురించీ, రాగాలాపనలో స్థాయిల గురించీ, లయల గురించీ, విస్తారంగానే వ్రాసి చివరకు సామాన్య విషయంలోకి జారిపోవడం జరిగినది.

...ఈ సందర్భంగానే కర్ణాటక సంగీత పద్ధతిలో కైశికి నిషాదానికి 27 రకాల ఛాయలుండగా యిదేస్వరానికి హిందూస్థానీ సంగీతంలో గల వివిధ ఛాయలను నేను తెలుసుకోగోరి చివరకు నేను చెప్పిన 27 రకాలను మాత్రమే ప్రదర్శించడం జరిగింది కాని హిందూస్థానీ సంగీత ఛాయలు మాత్రం తెలియనే లేదు నాకు...

...పైగా సంగీతానికి అతిముఖ్యవిభాగాలైన శృతిలయలలో లయకు సంబంధించిన తాళశాస్త్రం లో *సంగీత రత్నాకరం*లోనే జెప్పబడిన ద్రుత, లఘు, గురు, ప్లుత, కాక పాదాలలో ఏ ఒక్కదానినీ కూడా హిందూస్థానీ సంగీతంలో ఎవరూ వినియోగించడమే లేదు. (నేను తాళశాస్త్రంలో కొంచెం ఎక్కువ లోతుకు దిగవలసి వచ్చింది లెండి) అంతేగాక *సంగీత రత్నాకరం*లో 5వది యైన *తాళాధ్యాయం*లో జెప్పబడిన కాలం మార్గం, క్రియ, అంగము (పైన జెప్పిన ద్రుతాదులు), గ్రహము, జాతి, కళ, లయ, యతి, ప్రస్తారాలలో ఒక్క లయను మాత్రమే హిందూస్థానీ సంగీత పద్ధతిలో వాడుతుండగా, కర్ణాటక సంగీత పద్ధతిలో యివి అన్నీ అప్పటి నుండి ఇప్పటి వరకూ వినియోగింపబడుతూనే ఉన్నాయి...

...మరి నాకు తెలిసినంత వరకూ నాతో బాటుగా ప్రభుత్వ సంగీత కళాశాలలో పనిజేసిన మహావిద్వాంసుడు కీ.శే. సి.హెచ్. భీమశంకర రావుగారి పరమ గురువులైన విష్ణు దిగంబర్ పలూస్కార్ గారి సాంప్రదాయంలో కర్ణాటక సంగీత పద్ధతిలో వలె 72 మేళకర్తల పద్ధతినే అనుసరిస్తూండగా మధ్యలో భాత్కండే 10 ధాటీల పద్ధతిని తెచ్చినట్లుగానే కర్ణాటక సంగీతంలో కూడా కాలానుగుణంగానూ, అవసరానుగుణంగానూ కొన్ని మార్పులు చోటు చేసుకొని ఉండ వచ్చును...

...అయినాగాని మనకు సంగీత కచేరీలూ, అవార్డులూ, రివార్డులూ, బిరుదులూ, సన్మానాలూ, డిగ్రీలూ, ఉద్యోగాలూ, ధన కనక వస్తు వాహనాలూ పొందడం కోసం సంస్వార్థంతో ఎగబడే వారేకాని ప్రస్తుతం మన తరువాతి తరాల వారి కోసం స్వర లిపిని సంస్కరించి సులభతరం జేసేవారు కాని అటువంటి స్వర లిపిలో వెలసిన గ్రంథాలతో బాటుగా అదే స్వరముతో పాడిన అధునాతన సిడిలను, డివిడిలనుగాని విద్యార్థులకు అందించే వారు గాని యీ సంగీత విషయాలను అనుమానరహితంగా, నిర్దిష్టంగా, నిర్దుష్టంగా బోధించే విద్యాలయాలు, విశ్వవిద్యాలయాలుగాని వాటిలో బాధ్యతతో బోధించే అధ్యాపకులుగాని కనుచూపుమేరలో కానరాక పోవడం మన భారతజాతి దురదృష్టమనే చెప్పాలి...

...కుక్క ఏ ప్రక్కనుండి వెడితే మంచిదని ఎవరో అడిగితే మీదపడి కరవకుండా ఏ ప్రక్కనుండి వెళ్ళినా మంచిదే అని చెప్పిన విధంగా ఏ సంగీతం ఏ ప్రక్కకి ఎంత దూరం ఎప్పుడు జరిగిందనే వాదం కంటే పైన చెప్పిన విధంగా ప్రస్తుతం ఉన్న సంగీతాన్నయినా మన పిల్లలకు సత్వరంగా, సక్రమంగా అందించే ప్రయత్నం చేసే వారే సమాజానికి ప్రస్తుతం అత్యవసరం..."

– **ఆకెళ్ళ మల్లికార్జున శర్మ,** హైదరాబాదు.

# గురజాడ గిరీశం

– గొల్లపూడి మారుతీరావు

మహా స్రష్ట వాల్ట్ డిస్నీ సృష్టించిన *మిక్కీ మౌస్‌*కి ఇప్పుడు 84 సంవత్సరాలు. మహా సృష్టికర్త గురజాడ అప్పారావు సృష్టించిన గిరీశానికి ఇప్పుడు 123 సంవత్సరాలు. సృష్టికర్తలు ఇద్దరూ ఇప్పుడు లేరు. కాని సృష్టి వుంది. కళ చిరంజీవత్వానికి యివి రెండూ అద్భుతమైన ఉదాహరణలు. ఈ రెండింటినీ పోల్చడానికి కారణం ఉంది. మిక్కీ మౌస్ 8 దశాబ్దాల పైచిలుకు చిన్నా పెద్దా అందరినీ ప్రపంచమంతా ఆలోచింప జేసిన, ఆనందింపజేసిన సృష్టి, కేవలం కార్టూన్. గిరీశం తెలివైన అద్భుతమైన సోషల్ కార్టూన్. ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీషు డిక్షనరీ కార్టూన్ అంటే A drawing executed in an exaggerated style for humorous and satirical effect. సరిగ్గా గిరీశం అదే. ప్రపంచ దేశాలన్నింటిలోనూ *మిక్కీమౌస్* చిరంజీవి. *కన్యాశుల్కం* నాటకం తెలియని వారి మనస్సుల్లో కూడా గిరీశం పాత్ర చిరంజీవి.

**డామిట్! కథ అడ్డం తిరిగింది. / నాతో మాట్లాడ్డమే ఎడ్యుకేషన్.**
**చిన్నవాడికి చిన్న కాయలు. / పెద్దవాడికి పెద్దకాయలు –**

వంటి సంభాషణలు నానుడులుగా జనజీవనంలో స్థిరపడిపోయాయి. ఈ 123 సంవత్సరాలలో ఎన్నో రకాల పాత్రలలో, పాత్రీకరణల్లో, సినీమాల్లో, జీవితంలో గిరీశం తత్త్వాన్ని గుర్తుపట్టవచ్చు. 1892 నాటికి గిరీశం ఒక మహామేధావి తలలో మెరిసిన పాత్ర. ఈ శతాబ్దమంతా – గిరీశం అవతారం వివిధ రూపుల్లో రూపాంతరం చెంది అనునిత్యం మనకి దర్శనమిస్తూనే ఉంది. రకరకాలుగా సమాజంలో స్థిరపడింది. ఒక పాత్ర జీవలక్షణాన్ని చెప్పడానికి యింతకంటే తార్కాణం అక్కరలేదు.

*కన్యాశుల్కం*లో పెద్దా చిన్నా అన్నీ కలుపుకొని 32 పాత్రలున్నాయి. దాదాపు అన్ని పాత్రలకీ ఆనాటి జీవితంలో నకళ్లున్నాయి. అగ్నిహోత్రవధాన్లు, లుబ్ధావధాన్లు, కరటక శాస్త్రి, సౌజన్యారావు వంటి పాత్రలు – ఆయా మనస్తత్త్వాలకి ప్రాధాన్యం వహించే జనరలైజేషన్స్. వాస్తవాన్ని రంగస్థలానికి అన్వయించడంలో వచ్చే చిన్న అసామాన్యత ఏ పాత్రకయినా తప్పనిసరి. దీన్ని verisimilitude అంటాం. కాని ఒకేఒక పాత్రని రచయిత – తన మేధస్సుతో చిత్రీకరించారు. అది గిరీశం. మిగతా పాత్రలన్నీ realistic. ఒకే ఒక్క పాత్ర – గిరీశం cerebral. గురజాడ 31 పాత్రల సమీపానికి రాగలిగిన పాత్రీకరణ కాని – రాగలిగినంత జీవితాన్ని ప్రతిఫలించే పాత్రల సృష్టి కాని – ఏ కొద్దిగానో జరిగితే జరిగి వుండవచ్చుగాక. కాని గిరీశం వంటి పాత్ర సృష్టి ఆనాటికీ యీనాటికీ జరగలేదు. ఆ పాత్రీకరణను గుర్తు చేసేంత దగ్గరగా చాలా పాత్రలు వచ్చివుండొచ్చు. అవి మూల పాత్రకి బలహీనమయిన నకళ్లు. ఏమిటి ఈ ప్రత్యేకత? ఎందుకు? ఎలా? ఈ పరిశీలనే ఈ వ్యాస లక్ష్యం.

గిరీశం ఒక విధంగా గురజాడ Alter-ego. ఆయన జీవితంలో అంతవరకూ కూడబెట్టుకున్న విజ్ఞానాన్నంతటినీ గిరీశంలో వడ్డించారు రచయిత. గిరీశం గురజాడ అంత మేధావి. గురజాడకి ఉన్న అన్ని గొప్ప మౌలిక ప్రత్యేకతలూ ఉన్నవాడు. గురజాడ అంత గొప్ప కవి, విద్యాధికుడు. ఆయన *ఉపనిషత్తులు* చదివాడు. *శ్రీసూక్తం, పురుషసూక్తం* గురించి అనర్గళంగా చెప్పగలడు. టెన్నిసన్ అంత గొప్పగా కవితలు చెప్పగలడు. జావళీలు తెలుసు. తెలుగులో అద్భుతంగా పద్యాలు చెప్పగలడు. సురేంద్రనాథ్ బెనర్జీ, గ్లాడ్‌స్టన్ తలదన్నే, మేధస్సు కలవాడు. ఆడిటింగులో ఆయనకి ఆయనే సాటి. న్యాయసంబంధమైన విషయాల్లో, చట్టాల్లో ఆయనకి అనర్గళమైన అవగాహన ఉంది. ఈజ్‌మెంట్ రైట్స్ గురించి తెలుసు, సామెతలు తెలుసు, లోకోక్తులు తెలుసు. మెగస్తనీస్ గురించి, నార్త్‌పోల్ గురించి, ప్రపంచ సంస్కృతుల గురించి, భాషల గురించి – ఒకటేమిటి – అతనికి తెలియనిది లేదు– అనిపిస్తుంది. కాని గురజాడ తననుంచి గిరీశాన్ని ఎక్కడ దూరంగా నిలబెట్టాడు? ఆయా నిజాల విపర్యాయాన్ని బేరీజు వెయ్యడంలో, మేధస్సు వినియోగంలో, తన స్వప్రయోజనానికి

ఈ విజ్ఞానాన్ని అలవోకగా అన్వయించగల నేర్పులో, సమయస్ఫూర్తిలో Repartee తనలో ఉన్న జీనియస్‌ని ఒక పాత్రకి performing asset గా సంక్రమింపచేశాడు. ఇది తెలుగు దేశంలో అంతవరకూ కనీవినీ ఎరగని సృష్టి. అసలు వాడుక భాషలో నాటకమే అప్పటికి తొలి ప్రయత్నం.

ప్రాంతీయ భాష తరతరాల జన జీవన ప్రవంతిలో అరిగి అరిగి, నిగ్గుతేరి, కరెన్సీని పెంచుకున్న సాలిగ్రామం అవుతుంది. అది ఆ ప్రాంతపు filtered genius కి అద్దం పడుతుంది. ఆ కారణానికే మిగతావారికి తలుపు మూస్తుంది. నిజానికి గిరీశం పాత్రలోనూ ఎంతో కొంత ఆ దోషం లేకపోలేదు. కాని ఆ పాత్ర రేంజ్, ఇంగ్లీషు ప్రమేయం – ఆ పాత్రని ఆ మేరకు జనరలైజ్ చేసింది. అంతేకాదు. ఆ పాత్రీకరణ ప్రాంతీయ అవధుల్ని ఛేదించుకు బతికింది.

అందులోనూ ఈ పాత్ర ఒక రకమైన intellectual perversion కి ప్రతినిధి. ఇది ప్రేక్షకులు ఊహించని రేంజ్. అప్పటికీ ఇప్పటికీ, న్యాయంగా ఈ ప్రత్యేకత ఆ నాటకంతో, అక్కడే ఆగిపోవచ్చు. కాని తనకు తెలిసిన విషయాన్ని, తెలియని వారి మధ్య ప్రదర్శించి, తన ప్రయోజనాన్ని సాధించ గలిగే ప్రవృత్తికి 1897 దాదాపు ప్రారంభం. తెలుగు సమాజంలో ఆ తత్త్వం విశ్వరూపం దాల్చగలదని ఆనాడే గుర్తుపట్టి ఒక నమూనాను ప్రసాదించిన దార్శనికుడు గురజాడ. ఇది 32 పాత్రలలో ఒక్క గిరీశానికే చెల్లుతుంది. మిగతా పాత్రలు – అంటే రామప్పంతులు లోని నియోగపు లౌక్యం, అగ్నిహోత్రావధాన్లులోని వైదికపు మూర్ఖత్వం, కరటక శాస్త్రి విదూషకుడిగా లోక సంచారం చేసిన కారణంగా అతని భాష, ప్రవర్తనలో ఆ కాస్తపాటి తేడా– ఈ ఈ పాత్రలమధ్య ఉన్న అతి సునిశితమైన ఫిలిగ్రీ పనివాడితనం తుని దాటాక చాలమందికి అందకపోవచ్చు. ప్రకాశం జిల్లా కె.వి.రమణారెడ్డి గారి వంటివారు ఈ నాటకాన్ని టోకుగా నెత్తికెత్తుకోవడం వారి ఔదార్యమని సరిపెట్టుకోవాలని నాకనిపిస్తుంది. అంతమాత్రాన ఈ నాటకం ఘనతని కించపరచడం నా ఉద్దేశం ఎంతమాత్రంకాదు. నేను ఈ నాటక భక్తుడిని. కాని నా లాంటి, ఆనాటి భక్తులందరూ....

***ఎవరయినా గమనించారో లేదో శ్రీశ్రీ, ఆరుద్ర, శ్రీరంగం నారాయణ బాబు, రాచకొండ విశ్వనాథ శాస్త్రి, చాగంటి సోమయాజులు, నిన్న మొన్న అపూర్వమైన పరిశోధన ఈ నాటకం మీద చేసిన ఉపాధ్యాయులవారితో సహా అంతా ఉత్తరాంధ్ర వారు. మరొక్క అడుగు ముందుకు వేసి మరోమాట చెప్తాను. మీరంతా ఉత్తరాంధ్ర బ్రాహ్మణులు. ఈ నాటకాన్ని ప్రదర్శించి మూడు నాలుగు దశాబ్దాలు ప్రేక్షకుల్ని మెప్పించినవారు – జె.వి.సోమయాజులు, జె.వి.రమణమూర్తి, గరిమెళ్ల రామమూర్తి, రావి కొండలరావు వీరందరూ ఈ రచనలో స్వారస్యాన్ని అమృతప్రాయంగా ఆస్వాదించగల ఉత్తరాంధ్ర వారు. మళ్ళీ బ్రాహ్మణులు. వారికి ఈ రుచి అందినంత గొప్పగా, మిగతావారికి అంది వుండదు. అనుమానం లేదు. అందదు. కాని ఈ రచయితలు – తెలుగు దేశం నెత్తిన పెట్టుకున్న మహానుభావులు. కన్యాశుల్కాన్ని వారు నెత్తిన పెట్టుకున్నారు. వారిని సాహితీ ప్రపంచం నెత్తిన పెట్టుకుంది. Transferred ఇవి అనుకోవడానికి కటువుగా అనిపించవచ్చు. కాని నికార్సయిన నిజానికి ఆ రోగం వుంది. ఈ నాటకం ఆనాటి బ్రాహ్మణ కుటుంబాల్లో జరిగిన అరిష్టాన్ని అరికట్టే ఉద్దేశంతో వ్రాసిన రచన. ఇందులో తాగుళ్లూ, జూదాలూ, కోర్టులకెక్కి ఇళ్లు గుల్ల చేసుకోవడాలూ వంటి అంశాల్ని మరింత విస్తృతపరిచి రెండో ప్రతిలో కె.వి.రమణారెడ్డి గారి మాటల్లో నాటకాన్ని కలగూరగంపని చేసిన ప్రయత్నం.***

మరి గురజాడ రాష్ట్రంలో మిగతావారికి ఎలా అందాడు? ఈ నాటకానికి సంబంధించినంత వరకూ గిరీశం కారణంగా, ఇతరత్రా వారి అపూర్వమైన ముత్యాలసరాలు....

**దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్**
**మంచి చెడ్డలు మనుజులందున యెంచి చూడగ రెండె కులములు**
**మంచియన్నది మాలయైతే మాలనేయగుదున్**

వంటి అద్భుతమైన విశ్వమానవత్వాన్ని ప్రతిఫలించే 1891 నాటి ఓ రచయిత సంకల్ప బలం కారణంగా, ఇంత గొప్ప సంకల్పబలాన్నీ, ఇంతకంటే బల్లగుద్ది చెప్పిన మరో దార్శనికుడు మరో 550 సంవత్సరాల కిందనే ఇలాంటి అద్భుతమైన వివక్షని చూపాడు. ఆయన అన్నమాచార్య. ఒకే ఒక్క ఉదాహరణ. ఆయన *తందనానా హరే* అనే కీర్తన. మరి ఆయనకి ఇలాంటి పూజ ఎందుకు జరగలేదు? 250 సంవత్సరాలు ఆయన స్వామివారి భాండాగారంలోనే మరుగున ఉండిపోయాడు కనుక. ఆయన దృక్పథం విశాలమయినా దృష్టి దేవుడు కనుక. తర్వాతి తరాల సాంఘిక ప్రయోజనానికీ, దేవుడికీ పొంతన కుదరలేదు కనుక. ఇక్కడ ఈ విషయం ఆపుతాను.

మరి ఏ విధంగా *కన్యాశుల్కం* తన రెక్కలు చాచుకుని ప్రాంతీయతను దాటి చిరంజీవి అయింది? ప్రథమ తాంబూలం – మీరు క్షమిస్తే ఒకే తాంబూలం గిరీశం పాత్రకి ఇస్తాను. It has universal platitudes. పాత్రీకరణలో ఏ షేక్స్పియర్ పాత్రలకీ తీసిపోనిది. షేక్స్పియర్నే ఎందుకు సాక్ష్యం తేవాలంటే – ఆయన మరో 305 సంవత్సరాల ముందు సృష్టించిన పాత్రలచేత అమృతం తాగించాడు కనుక.

ఇంత విస్తృతంగా కాకపోయినా – ఈ విషయం మీద 1962లో నేనూ గుంటూరు శేషేంద్ర శర్మగారూ కలిసి ఆంధ్రప్రభలో ఒక వ్యాసం రాశాం. అది చేతికి దక్కితే బాగుణ్ణని 47 సంవత్సరాలు తపన పడ్డాను. దాన్ని ఈ మధ్య వేటపాలెం గ్రంథాలయంలో పట్టుకున్నాను. గురజాడ ప్రాంతానికి చెందిన విజయనగరం రచయితా, ప్రాంతీయతతో ప్రమేయంలేని తెలుగు రచయితా జుత్తూ జుత్తూ పట్టుకుని తగాదాలు పడి పడి – మా తగాదాకు రాజీగా ఇద్దరం కలిసి ఆ వ్యాసాన్ని రాశాం. అనుమానం వద్దు– ఇద్దరం గురజాడ భక్తులమే. కాని వేర్వేరు కారణాలకి. సరే! ఈ కథకి అది పిడకల వేట.

What is the single trait of this character called Gireesam to make it universal? ఒక్క మాటలో చెప్పాలంటే హిపోక్రసీ. హిపోక్రసీకి అంత పదునైన మేధస్సుని జతచేసిన కృషి నభూతో నభవిష్యతి Hypocracy is a fulltime job అన్నాడు ప్రముఖ రచయిత సోమర్సెట్ మామ్. నిద్దర్లోంచి లేపినా అంత అందంగా ఠంకం వేసినట్టు ఠస్సా వేయగల నేర్పు గిరీశానిది. కాదు గురజాడది. మరోసారి – ఇద్దరూ వేరుకారు. ఒకరి ఆల్టర్ ఇగో మరొకరు.

మేధస్సుతో, అద్భుతమైన లాజిక్తో, సమంజసంకాని తన ప్రయోజనాన్ని మన కళ్లముందే సాధించుకుపోవడం – ఆ పాత్ర జీనియస్. సజ్జనులకు ఇది కాస్త మింగుడు పడకపోవచ్చు. రామప్పతులులాగ ఏమిట్రా వీడి గోతాలు ? అనిపించవచ్చు. కాని ఇది నాటకం Scruples ముందు కూర్చున్న మేధావులది కావచ్చు. A play serves not only to the elite of the first row, but to the dum, deaf, old woman of the last bench. కాని మిగతా సామాజికులకు ఇది విందు భోజనం. మాకు గ్లాడ్స్టన్ ఎవరో తెలియక పోవచ్చు. ఏసెస్ బ్రిడ్జి ఏమిటో తెలియక పోవచ్చు. కాని *పూజా పునస్కారాలూ లేక ఇలా వున్నానుకాని లేకపోతే గ్లాడస్టన్లాగ దివాన్గిరీ చెలాయిద్దును* అనడం బాగుంది. ఆ పాత్రలో ఆత్మవిశ్వాసం, డిగ్నిటీ తెలుస్తోంది. ఎదుటివాడి తెల్లమొహం వేయడం కితకితలు పెడుతుంది.

Anti-heros are adored becuase of their fallibility and they get closer to the fundamentally flawed human nature. Their inadequacies take them closer to the audience. Their imperfection is not a liability but an asset.

ఇది పాత్రమాట. అలాగే గిరీశం నాటకానికి – అదే కారణానికి ఎసెట్ అయాడు. అదీ – ఆ పాత్రా – ఆ పాత్ర ప్రాధాన్యాన్ని సంతరించుకున్న నాటకం సాధించిన విజయం.

సరే. మరికొంచెం లోతుకి వెళ్దాం. గిరీశం చాలామట్టుకు అర్థమయే – అతని ఉద్దేశాల్లో ఏమాత్రమూ గజిబిజిలేని– ఎంత గడ్డుసమస్యనయినా నెగ్గుకురాగలగటం bravado, scholarship ప్రేక్షకులను అబ్బురపరిచింది.

*మా అబ్బాయీ మీరూ ఒక్క పర్యాయం యింగిలీషు మాట్లాడండి బాబూ* అని ముచ్చటపడుతూ అడిగిన వెంకమ్మని ఎలా బోల్తా కొట్టించాడో ప్రేక్షకులు చూశారు. ఆ తర్వాతే బుచ్చమ్మ గుమ్మం దగ్గరికి వచ్చి అయ్యా, మీరు చల్ది వణ్ణం తింటారా? అన్నప్పుడు not the slightest objection అన్నాడు గిరీశం తడుముకోకుండా. ఈ మాట బుచ్చమ్మకి చేరదు. చేరదని ప్రేక్షకులకి అర్థమౌతోంది. మరి ఎందుకా ఇంగ్లీషు మాట? అది పాత్రకి embellishment శలవుల్లో ఏం చెయ్యాలన్న సంభాషణ – అది పాత్ర గడుసుదనానికీ, భాష తెలీనివాళ్లని బోల్తా కొట్టించిన ఒక హాస్య సన్నివేశం. బుచ్చమ్మ ప్రశ్నకి సమాధానంగా గిరీశం అన్నమాట *నాట్ ది స్లైటెస్ట్ అబ్జెక్షన్* కేవలం పాత్ర స్వభావానికి ఊతం. ఇది బుచ్చమ్మకి చేరదు. 1891లో చాలామంది ప్రేక్షకులకూ చేరలేదేమో!

ఆ మాటకి వస్తే *దిసీజ్ బేస్ ఇన్గ్రాటిట్యూడ్, ఐ యాం డ్రెడ్ఫుల్లీ ఇన్ లౌ విత్ హెర్, ఐ టర్న్డ్ ఆల్టుగెదర్ ఏ న్యూ లీవ్* లాంటి మాటలు తెలుగు సాహిత్యంలో ఇంత సముచితంగా, ఇంత గొప్పగా, ఇంత కొత్తగా ఎవరూ ఎప్పుడూ వాడిన గుర్తులేదు. అదే ఆనాటి గిరీశం రంగస్థలానికి తీసుకొచ్చిన ఫ్రెష్నెస్ It is the style of the character. దానికి లాజిక్ లేదు.

*కన్యాశుల్కం* పుస్తకం ఎప్పుడు తెరిచినా మహారాజావారికి నాటకాన్ని అంకితం యిస్తూ గురజాడ రాసిన

మొదటి ఇంగ్లీషు వాక్యాన్ని చదివి మురిసిపోకుండా లోపలికి వెళ్లను. అది ఇది:

It is fabled that when the ancient demigod of your noble race was making a causeway across the sea to rescue his consort from captivity, the faithful squirrel brought at the end of its tail a few grains of sand, not indeed hoping to advance the high enterprise in any appreciable degree, but to show an inclination to serve.

ఆంగ్ల భాషలో ఇడియంనీ, ఆ భాషలో సౌందర్యాన్నీ కాచి వడబోసిన రచయిత మాత్రమే రాయగలిగిన వాక్యం ఇది. సందేహం లేదు. 53 సంవత్సరాల జీవితంలో 29 సంవత్సరాలు గురజాడ ఆంగ్ల రచయిత. ఆ వైభవం గిరీశంలో అద్భుతంగా ప్రతిఫలిస్తుంది.

ఆంగ్ల పాలనలో తమ ఆస్తుల్ని నిలుపుకోడానికి, తమ తగాదాలను తేల్చుకోడానికి కరణాల మధ్యవర్తిత్వం పోగా తప్పనిసరిగా కోర్టులు ఎక్కాల్సిన ఆనాటి ఇంగ్లీషురాని ఎంతో మందికి – ఇంగ్లీషు తెలిసిన వ్యక్తులు – కేవలం ఇంగ్లీషు తెలిసినందుకే అబ్బురంగా, గొప్పగా కనిపించారు. గిరీశం చేత తన కోర్టు కాగితాలన్నీ తెలుగులో రాయించుకోవచ్చునని సంబరపడతాడు అగ్నిహోత్రావధాన్లు. వాళ్ల ఆస్తులన్నీ కోర్టు వాజ్యాల వల్ల, వకీళ్లని పోషించడానికి కరిగిపోయాయి. కన్యాశుల్కమంతా కోర్టుకేసులు, దావాలు, మధ్యవర్తి రామప్పంతులు, లాయరు సౌజన్యారావు పంతులు, భీమారావు పంతులు, నాయుడు, సాక్ష్యం చెప్పవలసిన అసిరిగాడు, చెప్పించే ప్రయత్నంలో కానిస్టేబు, అంజనాలు వేసి దొంగ సాక్ష్యాలు పుట్టించే సిద్ధాంతి – ఇదే కథ. వీళ్లందరి మధ్యా *మీ వాడిని (అంటే వెంకటేశాన్ని) క్రిమినల్లో పోలీసు పరీక్ష పాసుచేయించేస్తాన* న్నవాడు నిజంగా దేవుడే. ఆ విధంగా గిరీశం అవసరం వున్న వాళ్లకి గంజాయివనంలో తులసిమొక్కలాగ కనిపించాడు. అది గంజాయి మొక్కేనని ఒక్క సౌజన్యారావే గుర్తుపట్టాడు.

వారి అజ్ఞానాన్ని – తప్పుడు తోవ తొక్కిన, కేవలం తన ప్రయోజనాల్ని జరుపుకోగలిగిన తన జ్ఞానంతో సంధించగల పాత్ర – గిరీశం. అందువల్ల ఇది రచయితకి ఆయుధం అయింది. అనూహ్యమయిన నవ్యత అయింది.

ఇక్కడ మరో వైచిత్రి ఉంది. అటు గిడుగు రామ్మూర్తి పంతులుగారి వ్యావహారిక ఉద్యమం, యిటు వీరేశలింగం పంతులు గారి సాంఘిక విప్లవాల స్ఫూర్తిని క్రోడీకరించి – ఈ రచనకు పూనుకున్నారు గురజాడ. ఆ మాట చెప్పనే చెప్పారు తన పీఠికలో. కాస్త కటువు మాటయినా కొత్త పుంత–సంప్రదాయ భ్రష్టత్వం లక్ష్యం. సంప్రదాయపు చట్రాన్నుంచి భాషనీ, ధోరణినీ కొత్తదారి తొక్కించిన మొదటి ప్రయత్నం లోనే ఆ తర్వాత కొన్ని దశాబ్దాల పాటు ఆ ఛాయలకుకూడా రాలేనంత జీనియస్‌ని ప్రకటించారు రచయిత.

ఇది ఒక పార్శ్వం. గిరీశం మరొక సంప్రదాయ భ్రష్టత్వానికి ప్రతీక. మొదటి విముఖత – రచన లక్ష్యం. రెండవది – పాత్రీకరణ లక్ష్యం. అప్పటికే మరో భాషను ఆపోశన పట్టిన ఓ మహా రచయిత– ఆ భాషలో స్వైరవిహారం చేస్తూనే ఒక weird logic నీ ఒక refreshing హాస్యాన్నీ – వెరసి తప్పుచేస్తున్నాడని, తప్పు త్రోవపట్టిస్తున్నాడని తెలుస్తున్నా అర్థం చేసుకోలేకపోయినా ఆమోదించే ప్రేక్షకుల ఇన్వాల్వుమెంట్‌ని జత చేశారు. ఇది సామాజికులందరికీ టోకుగా 'నల్లమందు' అలవాటు చేయటం లాంటిది. సామూహికంగా 'అక్రమాన్ని, అవినీతి'ని అంగీకరించే స్థాయిలో అలంకరించడం లాంటిది. దాని ఫలితం popular acceptance. ఈ అంగీకారం యథేచ్ఛగా ఇప్పటికీ సాగుతోంది. గిరీశం పాత్రగా కాకపోయినా గిరీశం తత్త్వంగా.

యాంటీ హీరోలో ఆ రుచి వుంది. ఇది అనాదిగా సాగుతున్న, సాగి చెల్లుబాటు అవుతున్న ఆత్మవంచన. ఇందులో ఆకర్షణ వుంది. సినీమా పరిభాషలో చెప్తాను. సినీరంగంలో సుస్థిరంగా స్థిరపడిన– అంటే తొలిరోజుల్లో ప్రేక్షకుల ఆమోదముద్రకు నోచుకున్న ఓ అరడజను పాత్రీకరణలను – తదాదిగా వారి కెరీర్‌లు నిరాఘాటంగా సాగిన సందర్భాలను ఉదహరిస్తాను.

రజనీకాంత్, అంజాద్ ఖాన్, కృష్ణంరాజు, చిరంజీవి, నేను. వీరంతా నెగిటివ్ పాత్రల ద్వారా ప్రేక్షకుల మధ్యకి వెళ్లి కూర్చున్నవారు, నిలదొక్కుకున్నవారు, వీళ్లందరికీ గురువు, మార్గదర్శి – గిరీశం. కొంగర జగ్గయ్య, పేకేటి శివరాం, నేనూ ఈ పాత్ర స్ఫూర్తితో ఎన్నో పాత్రలు చేశాం. నా కెరీర్‌లో కనీసం ముప్పై పాత్రలు చేసి వుంటాను. నటుడిగా నా మొట్టమొదటి పాత్ర దటీజ్ సుబ్బారావు *అథర్వణ శాస్త్రంలో ఆరో అధ్యాయంలో మూడో శ్లోకాన్ని* ఉదహరిస్తూ తన ఆవరణని పెంచుకుంటూంటాడు. *మనిషికో చరిత్ర*లో అవధాని మరో ఛాయ. నికార్సయిన లాజిక్, తన మాటని

నెగ్గించుకునే నేర్పు, బ్రతకనేర్వడం – ఇవన్నీ ఈ పాత్రీకరణ ఛాయలు. 123 సంవత్సరాలు బతికి బట్టకట్టుకున్న పాత్ర గిరీశం. మధురవాణికి పార్టింగ్ విజిట్ ఇవ్వాలని వచ్చిన గిరీశం మీద ఎవరికీ కోపం రాదు. పూటకూళ్లమ్మను తప్పించుకోడానికి పట్టెమంచం కింద దాక్కుని రామప్పంతుల్ని ముందుకు తోసిన గిరీశాన్ని – గిరీశం సరసతగానే ప్రేక్షకులు సరిపెట్టుకున్నారు. ఇది మోసం కదా ? పూటకూళ్ళమ్మకు అన్యాయం కదా? తప్పుకదా? ఇది గిరీశం అవకాశ వాదిత్వానికి insulation.

*బయటికి రారా కుక్కా!* అన్న పూటకూళ్లమ్మ తిట్టుని జీర్ణించుకుని *వెళ్లిప్పో! మంచం కిందకిరా* అని బుకాయించే 'తెలివి' తనాన్ని శతాబ్దం కిందటే మప్పిన మార్ఫియా వ్యాపారి గురజాడ. ఇక్కడ గిరీశం మనకి అవినీతిపరుడిగా కనిపించడు. ఎంతో మందిని ఆనందపరచే అవినీతి – సమాజం అంగీకరించే డెమోక్రసీకి ఆ రోజుల్లోనే శ్రీకారం చుట్టారు రచయిత. ఎంత దూరదృష్టి! సగటు అవినీతి, తప్పించు కోగలిగిన అవకాశవాది తెలివితేటలు, slapstick హాస్యం మంచిచెడుల విచక్షణ మీద ముసుగు కప్పింది.

An extremely intelligent manouvre sometime over balance the logical injustice, because popular acceptance of the generalised weakness of the common man undercuts the logic.

ఇందుకు గిరీశం అపూర్వమైన ఉదాహరణ. ఈ 'కిటుకు'ను institutionalise చేసి, ఒక పాత్రగా రూపుదిద్దిన ఘనత గురజాడది.

రాముడి పాత్ర ఆకర్షించడానికి తరతరాల సంస్కారం కావాలి. లేదా సత్ప్రవర్తన, సచ్ఛీలమనే పెట్టుబడులు కావాలి. అన్నిటికీ మించి ప్రేక్షకుల initiative కావాలి. ప్రేక్షకుల్ని గిలిగింతలు పెట్టే పక్క తోవకి, ప్రేక్షకుల ప్రయత్నం అక్కరలేదు. వాళ్ల 'బలహీనత' అనే పెట్టబడి చాలు. ఇది మధ్యతరగతి మానవుడి sensibility. It assures his sensitivities as also our latent pleasures.

గిరీశం మరొక గొప్ప ఆయుధం. అఖండమైన మేనేజిరియల్ స్కిల్.

He specialised the managerial skill to break the psychological barrier of the person's sensitivity and lay bare the traps that keep people from doing the right thing, dispite all advice.

కొన్ని ఉదాహరణలు చూద్దాం...

*అన్నం బ్రహ్మేతి వ్యజానాత్* అనే ఉపనిషద్వాక్యాన్ని ఉదహరించి, 'శ్యామాకాశ్చమే' అన్నమాటకి – *నాకు చామల అన్నం మా మాజాగా వుంటుంది. నాక్కావాలి దేవుడా!* అని సమర్ధించినవాడు. చమకానికి 'గేదె పెరుగూ చమే' అనే కోరికని కిట్టించినవాడు.

వితంతువులు లేకపోతే ఈ సమాజంలో సంస్కరణకి అవకాశం లేదని బుచ్చమ్మ వినేలాగ వెంకటేశానికి ఉపదేశం చేశాడు.

అబద్ధం చెప్పడం తప్పుకాదని దానికి తనదైన తర్కాన్ని జతచేశాడు. కొందరికి కందిపప్పు పచ్చడి రుచి, కొందరికి పెసరపప్పు పచ్చడి రుచి, కొందరు అదృష్టవంతులకి రెండు పచ్చళ్లూ రుచి. అలాగనే కొందరికి అబద్ధం రుచి. కొందరికి నిజం రుచి. చాలామందికి రెండింటి కలగలుపు రుచి. ఇది లోక స్వభావం కనుక అవసరం కలిగినప్పుడు తొణుకూ బెణుకూ లేకుండా అబద్ధం చెప్పవలసిందే.

నాచి కొశ్చన్ పరిష్కారానికి దగ్గర తోవని సూచించాడు: సానివాళ్లని పెళ్లిళ్లకి పిలవకపోవడం, వాళ్లని ఉంచుకోకపోవడం, ఆ పనులు చేసేవాళ్లని కనిపించినప్పుడల్లా తిట్టడం – యిలా నాలాంటి బుద్ధిమంతులు ఒకటై కొంతకాలం చేసేసరికి కలికంలో కయినా మరి సానిది ఉండదు.

ఈ వాదం చూడండి: యిన్ఫెంటు మేరేజీలు అయితేగాని యంగ్ విడోస్ వుండరు. యంగ్ విడోస్ వుంటేనే గాని విడో మేరేజీ రిఫార్ముకి అవకాశం ఉండదు. సివిలిజేషన్కల్లా నిగ్గు, విడో మేరేజీ అయినప్పుడు, యిన్ఫెంటు మేరేజీల్లేకపోతే సివిలైజేషన్ హాల్టై పోతుంది.

ఈ జీనియస్ గురజాడది. మరోసారి గురజాడ alter-ego గిరీశం. ఈ పోలికని సోదాహరణంగా చూద్దాం.

గిరీశం *బృహన్నారదీయం, శృంగార నైషధం* చదివాడు. అద్భుతమైన ప్రబంధ శైలిలో పద్యాలు చెప్పాడు.

**నదమా పొక్కిలి, జంబూ**
**నదమా మై ఛాయ, కోక నదమా పదమా**
**పదమా జడ, నడుమ వియత్**
**పదమా, నూగారు గూఢ పదమా చెలికిన్.**

ఆధునిక ప్రియులను (అంటే 123 ఏళ్ల కిందటిమాట!) చక్కలిగిలి పెట్టే పేరడీలు అల్లే ప్రతిభాశాలి.




గిరీశం, మధురవాణి

**ఖగపతి అమృతము తేగా**
**భుగ భుగమని పొంగి చుక్క నేలను వ్రాలెన్**
**పొగచెట్టయి జన్మించెను**
**పొగతాగనివాడు దున్నపోతయి పుట్టున్**

*చమకం, శ్రీసూక్తం, పురుష సూక్తం* చదువుకున్నాడు. చమకానికి పేరడీ చేయగలిగాడు. *చుక్కలవలె కర్పూరపు ముక్కలవలె నీదు కీర్తి ముల్లోకములన్ క్రిక్కిరిసి పిక్కటిల్లెను* వంటి పద్యాలు వల్లించగలడు.

కావ్య ధోరణిలో సరసతతో పద్యాలు రాయగలడు:

**యింతలు బదరీఫలములు**
**యింతలు మారేడు పళ్లు యీడుకు జోడై**
**బంతులు తామరమొగ్గలు**
**దంతీ కుచ కుంభముల బోలు తరుణీ కుచముల్.**

జావళీలు కూడ వచ్చును:

***కాముని విరిశరముల బారికి నే***
***నేమని సహింతునే చెలి, యేమని సహింతునే***

అని పాడాడు. *ఎటు లోర్తునే చెలియా?* అని సణిగాడు.

ఇంగ్లీషులో ad lib అంటాం. ఇతమిత్థమైన సాహిత్యం అక్కరలేకుండా గొణుగుకొనే సందర్భం. బాత్ రూంలో పాట పాడుకోవడం లాగ.

పొటిగ రామప్పంతులు నౌఖరు ఎదురు పడినప్పుడు చూడనట్టు తప్పించుకుపోయేటందుకు రచయిత ఒక శయ్యని అందించాడు. ఇది typical ad lib అక్కడా రెండు చక్కని ఇంగ్లీషు కవితలు రాశారు రచయిత.

**ఫుల్లు మూను లైటటా / జానుమిన్ను వైటటా**
**మల్లెకన్న మల్లెకన్న / నీదు మోము బ్రైటటా**

ఇదికాక ఆడిటింగులో అందె వేసిన చెయ్యి. పద్ధతిలో ఏ చిన్న పొరపొచ్చం లేకుండా బుచ్చమ్మతో వివాహానికి అన్ని పద్దుల్నీ పరిచి చూసి మంచిచెడ్డల్ని బేరీజు వేశాడు – అద్భుతంగా.

కోర్టుకేసుల్లో ఈజ్‌మెంట్ రైట్స్, వకాల్తాలూ అవీ క్షుణ్ణంగా వంటబట్టించుకున్నాడు.

ఇక మెగస్థనీసు, గ్లాడ్‌స్టన్, టెన్నిసన్, భాష్యం అయ్యంగార్, సురేంద్రనాథ్ బెనర్జీల వంటివారి చరిత్రల్ని ఆపోశన పట్టాడు.

చివరిలో సౌజన్యారావు పంతులు గిరీశాన్ని కాలేజీలో ప్రవేశించి పై పరీక్షలకు చదువుకోమన్నాడు కాని – గిరీశం ఏ విశ్వవిద్యాలాయానికీ అందనంత మేధావి. గురజాడ అంత విజ్ఞుడు. నాతో మాట్లాడడమే ఓ ఏద్యుకేషన్ అన్న మాట కేవలం ఉక్తిగా గాక, ఉపజ్ఞగా నిరూపించుకున్నాడు. అతనికి కావలసింది చదువుకాదు. వచ్చిన చదువుని సరైన మార్గంలో వినియోగించుకునే దృక్పథం.

గురజాడ గిరీశం పాత్రలో తన విశ్వరూపాన్ని ప్రదర్శించారు. It is an intellectual exercise - an enlightened straying into the traditional fallacies.

ఇక ప్లియోనిజం (pleonism), గ్రాండచ్చీ ఆఫ్ బేడెన్, ఏసెస్ బ్రిడ్జ్ – వంటివి 1897 నాటికే ప్రేక్షకులకు అందే విషయాలు కాకపోవచ్చు. కాని ఇంత విస్తృతమైన అవగాహనతో, సంప్రదాయపు మూర్ఖత్వాన్ని, ఛాందసాల్ని కడిగిపారేస్తూ, ప్రతి గుడ్డి నమ్మకానికీ కొత్త దొంగదారిని సూచిస్తూ – ప్రతీ ప్రయత్నంలో తన ప్రయోజనాన్ని సాధించుకునే ఈ పాత్ర – యిలాంటి పాత్ర – అప్పటికీ ఇప్పటికీ ఇంత సమగ్రంగా రాలేదు. His audactity, his tongue in cheek arguments, his brilliant repartee gained instant acceptance from the audiences. ఇది గడుసైన స్టైలైజేషన్.

ఇవాల్టికి ఈ గిరీశం తత్త్వం మరింత బలంగా స్థిరపడిందనిపిస్తుంది. దీన్ని 123 సంవత్సరాల కిందటే గుర్తుపట్టి ఒక సమగ్ర రూపాన్నివ్వగలిగిన ఓ రచయిత జీనియస్‌కి జాతి ఇప్పటికీ నివాళులనిర్పస్తుంది.

అన్నిటికీ మించి గిరీశం చెల్లుబాటుకి మరో అతి ముఖ్యమైన కారణం ఉంది. ప్రధానంగా రచనాకాలంనాటికి. శతాబ్దాల సంప్రదాయపు పునాదుల్ని సమూలంగా పెకలించే

ఆంగ్ల సంస్కృతికి ఒదిగి, అన్వయించుకొని బ్రతుకుతున్న కాలమది. సంప్రదాయం నుంచి వేర్పాటుకి, మార్పుకీ ఆనాటి ప్రయాణం. ఆ సంధి కాలంలో ఆంగ్ల సంస్కృతిని ఆపోశన పడుతూనే సంప్రదాయ సంస్కృతినుంచి విడాకులకు బలమైన కారణాలు ఎత్తిచూపగల ఓ పాత్ర వారి మధ్యకి వచ్చి తిష్టవేసింది. ఇది మీదపడిన ఉప్పెనని సమర్థించుకోడానికి తప్పనిసరయిన ఊతం. ఈ పాత్ర, ప్రతీ సంప్రదాయపు ఒరవవడినీ ఎందుకు భగ్నం చేయాలో సోదాహరణంగా ఎత్తి చూపుతోంది. హేతువుని ఆధారంగా నిలుపుతోంది. అది ఆనాటికి కొంగుబంగారం. దాని పేరు గిరీశం.

ఇప్పుడొక ముఖ్యమయిన మీమాంస. మరి ఇప్పటికీ ఈ పాత్ర రాణింపుకి కారణం? ఇది ఇంకా విచిత్రమైనది. ఇప్పటికి మన సమాజం ఆంగ్ల ప్రభావంతో పూర్తిగా తలమునకలయి – కుహనా సంస్కృతిని, ఆకర్షణలను నెత్తికి ఎత్తుకునే తరం వచ్చింది. ఫాదర్స్‌డేలూ, మదర్స్‌డేలూ, వాలంటీన్‌డేలూ, న్యూ ఇయర్ తాగుళ్లూ, బార్‌లూ, బీర్‌లూ, తాగే అమ్మాయిలూ, గర్ల్ ఫ్రెండులూ, స్టే యిన్ జీవితాలు – యివన్నీ నిలదొక్కుకున్నాయి. ఇది పాశ్చాత్య సంస్కృతిలో పీకలోతు దిగిన తరానికి ఎక్కడో సంప్రదాయపు మూలుగుని కాపాడాలనే మైనారిటీ వర్గం జుత్తు పీక్కొంటున్న సమయం. ఇక్కడా గిరీశందే రాజ్యం. ఇప్పుడు అతనికి మరీ చెల్లే రోజులు. అతి అలవోకగా అతని ధోరణిని అంగీకరించే రోజులు.

సంప్రదాయం నుంచి ఆంగ్ల ప్రభావానికి ఆ రోజుల్లో ప్రయాణం. ఆంగ్ల వ్యామోహం నుంచి సంప్రదాయాన్ని ఏ కాస్తో మిగుల్చుకునే యావ ఈనాటి ప్రయాణం. రెండు సంధికాలాల్లోనూ రెండు కారణాలకి గిరీశానిదే పైచెయ్యి. ఈ పరిణామాన్ని కాగితం మీద ఒక గ్రాఫ్‌గా వేస్తే గిరీశం ప్రయాణం 1892 నుంచి 2012 కి ఒక పెరాబోలా (parabola) గా కనిపిస్తుంది.

Gireesam is the epitome of Gurajada's genius, his scholarship, his scorching wit, his biting paradoxes - almost resembles Bernard Shaw, Oscar Wilde and Jean Anouilh. ఈ పేర్లను ఉదహరించడానికి కారణం ముప్పై సంవత్సరాలు ఆంగ్ల భాషలో రచనలు చేసిన రచయితకి ప్రపంచ ప్రఖ్యాతులయిన ఈ రచయితల, వారి ప్రత్యేకతలతో తప్పక పరిచయం ఉండే వుంటుంది అన్న నమ్మకం. నేను గురజాడ డైరీల్ని నార్ల వెంకటేశ్వర రావు గారితో నెలల తరబడి కూర్చుని పరిష్కరించే అవకాశం కలిగింది. అందులో ఆంగ్ల భాష పట్ల వారి ప్రభుత్వం, రుచీ అర్థమౌతుంది.

గిరీశం కేవలం పాత్రమాత్రమే కాదు. ఒక ధోరణికి, ఒక స్వభావానికి, ఒక వికారానికి ప్రతినిధి. శతాబ్దం పైగా ఈ పాత్రీకరణ ఛాయలు ఎన్నో పాత్రల మీద వివిధ మాధ్యమాలలో రూపు దిద్దుకున్నాయి.

కాక, ఒపీనియన్స్ అప్పుడప్పుడు ఛేంజి చేస్తూంటేనే గాని పొలిటీషియన్ కానేరడు అనే సూత్రాన్ని గురూపదేశంగా పాటిస్తున్న ఎందరు గిరీశాల్ని ఈనాడు రాజకీయ రంగంలో మనం చూడడం లేదు? వారు చెప్పే మాటలు, చేసే పనులూ – అతి దారుణమైన తమ దుశ్చర్యలను సమర్థించుకొనే పని వారికీ తెలుస్తూనే ఉందని మనకి తెలుస్తున్నా సిగ్గుపడని ఎందరు గిరీశాలు తెల్లారి లేస్తే మనకి పత్రికల్లో దర్శన మివ్వడం లేదు!

చేసిన మోసానికి *కుక్కా! బయటికిరా* అని నీచంగా తిడితే – దులిపేసుకుని *వెళ్లిప్పొ కిందకిరా* అన్నట్టు చిరువ్వుల్తో ఛాలెంజ్ చేసే గుండెలు తీసిన గిరీశాల్ని ఎంతమందిని చూడడం లేదు!

లక్షల కోట్లు భక్షించి, చిరునవ్వు చిందిస్తూ – ట్రూ రిపెంటెన్స్‌కి ట్వంటీఫోర్ అవర్స్ చాలునని కోర్టులు పట్టుకుని బెయిళ్ల కోసం తిరిగే కొత్తరకం గిరీశాలు మనకి రోజూ తటస్థపడుతున్నారు. ఈ శాల్తీలు వారి మూల విరాట్టును – అసలు గిరీశాన్ని కేవలం కార్టూన్ స్థాయిలోనే వదిలేశారు.

ఒక పాత్రీకరణ – శతాబ్దం పైగా పుష్టినీ, వాస్తవికతనూ సంతరించుకుని మరింత విశ్వరూపం దాల్చడం నేటి సమాజంలో చూస్తున్నాం. అదీ ఓ రచయిత జీనియస్‌కి ఉదాహరణ. కాలదోషాన్ని, ప్రదర్శన యోగ్యతకు అందని చట్రాన్ని – అన్నిటినీ దాటి నిత్యనూతనంగా, విశ్వజనీనమయిన పాత్ర గిరీశం. 1892లో ఓ రచయిత మనస్సులో రూపుదిద్దుకున్న శాల్తీ ఇవాళ తెలుగు దేశం – కాదు – భారతదేశమంతటా తన ఛాయల్ని విస్తరించింది.

The sheer resilience and currency of this astounding characterisation, the omnipotence of its nature, the reflection of its image in myriad forms in today's life is a tribute to the genius of its creator.

కన్యాశుల్కాన్ని 2012 లో కూడా ఒక సహేతుకమైన సాహితీ శిఖరంగా నిలిపిన ఒకే ఒక్క పాత్ర, **గిరీశం.**



# జాషువ కవిత్వంలో
## జాలువారిన హాస్యం

*- ఎండ్లూరి సుధాకర్*

కవిత్వంలో హాస్యం పలికించడం, పండించడం అంత ఆషామాషీ కాదు. పైగా జాషువ కవిత్వంలో హాస్యమా? అని అబ్బురపడే తరం కూడా ఇవాళ లేకపోలేదు. కొందరు విమర్శకులు జాషువాను కురుచ దృక్పథంతో చూస్తారు. కానీ జాషువా కవిత్వకాంతి బహుముఖీనమైనది. నవరసాలలో కరుణ రసాన్ని, హాస్యరసాన్ని పోషించడం కష్టం. ఈ రెండు రసాలూ జీవితంలో అనుభవించడం తెలిసినవాడే కవి అవుతాడు, కళాకారుడవుతాడు. హాస్యం మనిషిని ఆరోగ్యవంతంగా నిలబెట్టే పరమౌషధం. అందుకేనేమో *హాస్యబ్రహ్మ* జంధ్యాల మూడు ముక్కల్లో హాస్యతత్త్వాన్ని హాయిగా చెప్పగలిగాడు.

**నవ్వు ఒక భోగం/నవ్వించడం ఒక యోగం/నవ్వకపోవడం ఒక రోగం**

మహాకవి జాషువ కడుపార నవ్వగల కవి చక్రవర్తి. అదే స్థాయిలో నవ్వించగలిగిన చతురుడు. నవ్వులు గురించి జాషువా నాలుగు కాలాలపాటు నిలిచిపోయే గొప్ప పద్యం చెప్పాడు.

**నవ్వవు జంతువుల్, నరుడు నవ్వును నవ్వులు చిత్తవృత్తికిన్**
**దివ్వెలు, కొన్ని నవ్వు లెటు తేలవు కొన్ని విషప్రయుక్తముల్**
**పువ్వులువోలె ప్రేమరసమున్ వెలిగ్రక్కు విశుద్ధమైన లే**
**నవ్వులు సర్వ దుఃఖ దమనంబులు, వ్యాథులకున్ మహౌషధుల్**

*(కొత్త లోకము)*

జాషువ హాస్యస్ఫూర్తి గురించి నా మాటల్లో కంటే, రసజ్ఞురాలైన ఆయన చిన్నకూతురు హేమలతా లవణం (1932-2008) మాటల్లో వినండి. జాషువా నవ్వు రుచి తెలుస్తుంది.

అనేక ఇబ్బందులలో కూడా నవ్వగల ధీరోతాత్తుడు నాన్నగారు. తాను ఛలోక్తులు విసరడమే కాక తన మీద ఎవరైనా ఛలోక్తులు విసిరినా ఆయన ఆనందించేవారు *కవిగారూ! మీ మీసాలపై నిమ్మకాయలు నిలబెట్టవచ్చే* అని *ఎవరైనా అంటే నిమ్మకాయలేమిటి గుమ్మడికాయలే నిలబెడతా సంపెంగ నూనె ఉంటే* అనేవారు.

జాషువా హాస్యాన్ని ప్రత్యక్షంగా చూసిన పెద్ది సత్యన్నారాయణ అనే పెద్దాయన *నేనెరిగిన జాషువా* పుస్తకంలో తన జ్ఞాపకాలను ఇలా క్రోడీకరించారు. అవసరం వచ్చి భార్యను మేరీ (మెరాయ్) అని పిలిచేవాడు. ఆమె వెంటనే పిలుపందుకొనక మొరాయిస్తే, *మొరాయ్* అని కేక పెట్టేవాడు. జాషువాగారు ఏదయినా ఊరు ప్రయాణం పెట్టుకొంటే, ముందే దూరంగా వెళ్ళి, ఆగి జాషువా గారు వెలికి రాగానే, ఎదురుగా వచ్చి తొలగిపోయేది. *నాకు, రైలు అందకపోయినా, దొంగ జేబు కొట్టేసినా నీవే జవాబుదారీ!* అని భార్యను బెదిరించేవాడు. ఆ బెదిరింపు మాటలకు ముచ్చటపడి, ముసిముసి నవ్వులతో వంటింటిదారి పట్టేది. *వలరాజు ఉన్నాడాండీ!* అని సావాసగాడెవడో వచ్చి అడిగితే, *లేడు, గలభా రాజు మాత్రమున్నాడు* (వలరాజు జాషువ చిన్నకొడుకు) అని చమత్కరించేవాడు.

వలరాజు చిన్నపాటి కవి కూడా. జాషువతో పాటు సాహిత్య సభలకు అప్పుడప్పుడు వెళ్తుండేవాడు. అలా ఒకసారి వెళితే కూర్చోడానికి కుర్చీ లేదు. జాషువ గారికి మాత్రమే ఉంది. తండ్రి ప్రక్కన గుంజకు ఆనుకొని చేతులు కట్టుకొని నిలబడి ఉన్నాడు.

ఇంతలో ఆ ప్రక్క సీటులోంచి ఒక శాస్త్రిగారు జాషువాని పలకరిస్తూ *బావున్నారా పండిత పుత్రుడా!* అంటూ వలరాజు కేసి ఓ కొంటెచూపు చూశాడు. జాషువా హుందాగా మీసం మెలివేస్తూ కాదు, కవి కుమారుడని కంఠం ఖంగు మనిపించాడు. ఇక్కడ చమత్కారమేమిటంటే *పండిత పుత్ర పరమశుంఠ* అనేది లోక వ్యవహారం. కవి అనే శబ్దానికి *బ్రహ్మ, సృష్టికర్త అనే అర్థాలున్నాయి.*

ఆచార్య ఎండ్లూరి సుధాకర్, ఫోన్ : 9246650771

నా కుమారుడు నా అంతటి వాడని చెప్పడం జాషువ ఉద్దేశ్యం. ఒకసారి ఒక పిల్ల కవి వచ్చి, నాకు *ఫిరదౌసి* కావాలండీ! అంటే *లేదు, చచ్చిపోయి చాలా కాలమయింది* అని నవ్వించేవాడు.

జాషువాను పూర్తిస్థాయి హాస్యకవిగా ముద్రవేయలేం. కానీ ఆయన ఖండకావ్యాల్లో ఎండుద్రాక్షల్లా తియ్యని హాస్యం తగులుతూనే ఉంటుంది. ఎంత మహాకవి అయినా అతడి కవిత్వంలోనూ, వ్యక్తిత్వంలోనూ కొంత *సెన్సాఫ్ హ్యూమర్* ఉండాలి. అలా ఉన్న కవుల్నే కాలం గుర్తుపెట్టుకుంటుంది. ఈ రహస్యం జాషువాకు బాగా తెలుసు. ఆయన ఒకచోట ఈ నిజాన్ని అక్షరబద్ధం చేయడం గమనించాలి.

**హృదయం బావశ్యకమగు**
**సదా మహాకవికి, విశ్వసత్య పరతయున్**
**బెదరని గుండెయు హాస్యము**
**బొదిగిన చతురోక్తి ముఖ్యములు తలపోయన్** (నా కథ)

ఈ హాస్యం పొదిగిన చతురోక్తుల్ని జాషువా కవిత్వంలో పట్టుకోగలిగితే ఒక నవ్వుల ఖజానా దొరికినట్టే, *అనాథ* కావ్యం అత్యంత కరుణరసభరితమైంది. చాప్లిన్ సినిమాల్లోని పేదరికంలాగే ఉంటుంది. హంగ్రీ థర్టీస్‌లో ఈ రచన పుట్టింది. ఓ పేద విధవరాలు,ఆమె ఆరుగురు సంతానం, దయనీయమైన ఆమె దర్భర జీవితం *అనాథ* కావ్యం వృత్తాంతం.

ఒకరోజు ఆ అనాథ తన ఆరుగురు పిల్లలతో అడుక్కోవడానికి బయలుదేరుతుంది. నిలువనీడలేని ఆ కుటుంబం, ఉరుములు, మెరుపులతో కూడిన పెద్దవర్షంలో చిక్కుకుంటుంది. కాసేపటికి వాతావరణం సర్దుకుంటుంది. ఆ సన్నివేశాన్ని జాషువా ఎలా వర్ణించాడో గమనించండి.

**మగడు గొట్టిన రోదించి మానుకున్న**
**పెద్ద గయ్యాళి వలె వాన వెలసిపోయె**
**మమతలుడిగిన సన్యాసి మనసువోలే**
**గగన మండలంబెల్ల నిష్కలుషమయ్యె**

హృదయ విదారకమైన సందర్భాల్లో కూడా జాషువా ఉపమాన చమత్కారం కనిపిస్తుంది. ఇటువంటి చోట్ల చార్లీచాప్లిన్ నటనని గుర్తుకుతెస్తుంది.

1916–1919 వరకు జాషువా జీవికకోసం రాజమండ్రిలో ఉన్నాడు. వృత్తి, మూకీచిత్రాలకు కథా వాచకత్వం. కదిలో బొమ్మలకు పెద్ద గొంతేసుకొని సంభాషణలు చెప్పినా సంభావన మాత్రం మృగ్యం, సినిమా వాళ్ళు కళాకారులకు డబ్బులెగ్గొట్టి, నానా తిప్పలు పెట్టడం, జాషువా తన ఆత్మకథలో రాశాడు.

ఆనాటి తన కష్టాల్ని ఎంత కమ్మగా చెప్పుకున్నాడో చూడండి.

**ఇద్దరు సుతలుం కూరిమి**
**ముద్దియ మేరాంబతోడ ముట్టెదు జీతం**
**అద్దెకు ముద్దకు చాకలి**
**పద్దుకు సరిపోక పెక్కుపాట్లంబడితిన్**

ఇలా అయితే ఇక లాభం లేదనుకొని జాషువా ఆర్మీలో చేరుదామని నిశ్చయించుకున్నాడు. అవి మొదటి ప్రపంచ యుద్ధం (1914–1919) జరిగే రోజులు. జాషువాకు అక్కడ కూడా విధి వక్రీకరించింది. ఎలాగో చూడండి.

**కదనమున సైనికుడనై**
**బదుకుట మేలంచు సిద్ధపడి రిక్రూటింగ్**
**సదనమున కేగ ముగిసెం**
**గదనంబానాడె యేమి గ్రహచారంబో!**

జాషువా ఒకచోట ఇలా అంటాడు "పేదరికము పెద్ద వింత విద్యాశాల అందులోన లజ్జ గానపడదు". జాషువా తన కష్టాల్ని దైన్యంగా కాకుండా, ధైర్యంగా నవ్వుతూ చెప్పడం ఆయనకే చెల్లింది. ఇంట్లో గడవకపోయినా, చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా జాషువా సన్మానాల్లో పెట్టిన కొత్త బట్టలు ధరించి బయట దర్జాగా కనిపించేవాడు. అది చూసి లోకులే కాదు లోపలివాళ్ళు కూడా జాషువా దగ్గర నాలుగు డబ్బులున్నాయని ఆడిపోసుకునేవాళ్ళట. ఈ వైనాన్ని జాషువా సరదాగా చెప్పుకున్నాడు.

**కలవారిచ్చిన పట్టు వస్త్రములతో గన్పట్టునన్‌జూచి, శ్రీ**
**గల వాడీతడటంచు నల్వురన, నాకర్ణించి, నాకన్నకొ**
**ద్దులు, జుట్టాలును డబ్బు లేదనిన సంకోచింతు రీనాటిక**
**న్యుల మాటేల? ప్రచారమందు ఋతమున్ శుద్ధానృతంబయ్యెడిన్**

జాషువా రాజమండ్రిలో ఉంటున్నప్పుడే ఒకసారి పుష్కరాలు వచ్చాయి. జాషువా పుష్కర దృష్టి విలక్షణమైనది. రాజమండ్రిలో పరిచయమైన నాస్తిక మిత్రుడు, బ్రాహ్మణ పండితుడు తోలేటి వెంకట సుబ్బారావుతో కలిసి 'అఖండ గౌతమి' మీద పద్యాలు రాసి, కాగితం పడవలుగా చేసి గోదాట్లో వదిలాడు. ఆ పద్యాలు విన్న తోలేటి వెంకట సుబ్బారావు *వహ్వా! మొనగాడవురా జాషువా* అని మెచ్చుకున్నాడు. జాషువా చుట్టుపక్కల ఘాట్లన్నీ తిరిగాడు. కొబ్బరిముక్కల కోసం, చిల్లరనాణేల కోసం ఎగబడే పేద భిక్షుకుల్నీ చూశాడు. వాళ్ళని ఈసడించుకుంటున్న భక్త సందోహాన్ని గమనిస్తున్నాడు. ఈలోపు ఒకచోట నుండి కలకలం వినిపించింది.

**ఒక్క భక్త వరుని వొడిసి యెత్తుకపోయే**
**మొసలి యొకటి నీట మసలుచుండి**
**మేలు మేలు పర్వకాలాన చచ్చుట**
**పుణ్య మనిరి చూచుచున్నవారు**

విషాద హాస్యానికి ఈ పద్యం ఒక మచ్చు తునక. అంతేకాదు ప్రజల అజ్ఞానానికి మెత్తని చురక. ఒక్కొక్కసారి జాషువ హాస్యంలోనూ కొంటెతనం కనబడుతుంది. దానికి కారణం ఆయన అనుభవించిన అంటరానితనం కొంత కారణం కావచ్చు. ఉక్రోషం పుట్టినప్పుడు ఆయన కలం వ్యంగ్యాన్ని ఆశ్రయిస్తుంది. అది బ్రహ్మను సైతం ఆట పట్టించడానికి కూడా వెనుకాడదు.

**కనబడవేమిరా! జగము కల్పన చేసిన గారడీడ?**

అని నిలదీస్తాడు. అంతటితో ఊరుకోడు. ఊరుకుంటే జాషువా ఎందుకవుతాడు? ఈ అవకతవక సృష్టి చేసి చతుర్ముఖుణ్ణి (బ్రహ్మను) భూమ్మీదకు రావద్దని ఇలా వెటకారంగా హెచ్చరిస్తాడు. వస్తే నిన్ను 'జూ' లో పెడతారని చమత్కరిస్తాడు.

**నాలుగు మోములుం తలలు నాలుగు దాలిచి వత్తువేమో?యీ**
**కాలము వారు మానిసి మొగంబిది పద్మము కన్నదంచుజం**
**త్వాలయ మందు జేర్తురు సుమా! కమలాసన ! స్రష్టవంచు నీ**
**నాలుగు నోళ్ళు మొత్తుకొనినన్ వినరొక్కరు విశ్వసించరున్**

(కొత్త లోకము)

జాషువా గొప్ప సమయస్ఫూర్తి కనబడుతుంది. మంచి అవధానికుండే సరస గుణం ఇలాంటి పద్యాల్లో తేట తెల్లమవుతుంది. 'అల్లుడు' అనే ఖండికలో జాషువా ఎక్కుపెట్టిన ఈ సమస్యాత్మక పాదం పరిశీలిస్తే నవ్వు రాకమానదు.

**పురుషాకారత నున్న ..... జాలతనిలో**
**పుంస్త్వంబు లేకుండినన్**

మరోచోట కూడా జాషువా మహిళల పక్షాన నిలిచి మగవాళ్లని ఇలా ఎద్దేవా చేస్తాడు.

**పెండ్లి యాడిన భార్యల పిప్పిజేసి**
**తరుము చున్నవి పురుషభూతములు కొన్ని**
**స్త్రీత్వమిడి యట్టివాని శిక్షింపవోయి...** (కొత్త లోకము)

భగవంతుడికి జాషువా చేసిన ఈ వ్యంగ్య నివేదనలో వేదనాత్మక హాస్యం ధ్వనించడం లేదా?

జాషువా హాస్య శరాఘాతాలకు కొన్నిసార్లు పండితులు కోపగించుకున్న సందర్భాలు లేకపోలేదు. ఆచారాల మీద జాషువా అధిక్షేపధోరణికి ఆ రోజుల్లో సనాతనులు కొంత కినుక వహించారు. అలాంటిదే ఈ పద్యం...

**నిన్ను చూపమనుచు నేనర్చకుని వేడ**
**చూడమంచు గుడిని చూపినాడు**
**గుడికి బోయి జూడ గుండ్రాయివైనాడ**
**వెందుకిట్టులైతి వేద్పువచ్చె** (కొత్త లోకము)

**బ్రతికి యున్న సాయిబాబెన్నడు గాడు**
**చావకున్న వట్టి సాయిబయ్య**
**తిరుమలేశుడైన తెలియడీయర్థంబు**
**చావు బ్రతుకులోని సారమిదియ** (గబ్బిలము)

జాషువాది హాస్య ప్రవృత్తి ఉన్న హృదయం. ఒక్కోసారి సామాజిక మార్పులే ఆయన హాస్యానికి ప్రేరకాలవుతాయి. ఇరవయ్యో శతాబ్దపు ప్రారంభంలో ఆధునికతకీ, సంప్రదాయానికీ మధ్య సంఘర్షణ ఎదురైంది. ఎలా అయ్యిందో జాషువా *పిలక* ఖండికలో గట్టిగా పట్టుకున్నాడు. ఆనాటి యువకుల్లో కొందరు ఫ్యాషన్ కోసం హెయిర్ కటింగ్

చేసుకునేవారు. ఆచారం కోసం *పిలకను* కూడా అట్టేపెట్టు కొనేవారు. ఈ రెండింటికీ పొసగనితనం మీద జాషువా విసుర్లు వినండి.

**కుచ్చుల క్రాఫింగును గని**
**మచ్చర పడి పిలకజుట్టు మారుమొగంబై**
**కచ్చకు తలకావలి దరి**
**ముచ్చెన గంటలకు జారిముడి వేసికొనెన్**

**నేనైన నుండవలయున్**
**తానైన న్నిల్వవలయు తలమీద నటుల్**
**గానియెడ నుభయ కులములు**
**ఖూనీ గావలయు వట్టి గుండుండ వలెన్** (ఖం.కా.5)

జాషువా కవిత్వంలో *పొలిటికల్ సెటైర్* కూడా కనబడుతూ ఉంటుంది. అవకాశం దొరికినప్పుడల్లా రాజకీయ నాయకుల్ని ఎండగడుతూ ఉంటాడు. కొంతకాలం జాషువా ఎం.ఎల్.సి.గా ఉన్నాడు. అందువల్ల ఆయనకు అసెంబ్లీ తంతు ప్రత్యక్ష పరిచయం. ఆ రోజుల్లో ఎటువంటి అభ్యర్థులుండేవాళ్లో జాషువా పద్యం చదివితే మనకు నవ్వు రాకమానదు.

**చేతులెత్తుడన్న చెతులెత్తెడివారు**
**నిలుపుడన్న లేచి నిలుచువారు**
**చదువుకొన్నవారు చదువెరుంగనివారు**
**ఉభయ సభలలోను ఉందురచట**

జాషువాకి హాస్యం జీవితంలోంచి పుట్టింది. మంచి హాస్యం మన చుట్టూ ఉంటుందనటానికి ఆయన పద్యాలు చక్కటి ఉదాహరణలు. చదువు సంధ్యలు లేకుండా, ఏ పనీ పాట చేయకుండా, ఊరికే తిని కూర్చునే కొడుక్కి ఏదైనా పని అప్పచెప్పితే ఏం జరిగిందో చూడండి.

**జాబు పోస్టు జేసి సరగరమ్మని పల్క**
**వినయ ముట్టి పడగ స్వీకరించు**
**మరచినాడంచు మరునాడ కొనివచ్చి**
**చెక్కు చెదరకుండ చేతికిచ్చు** (ఖం.కా.5)

రేడియో మీద ఎన్నో ఛలోక్తులున్నాయి. ఆ రోజుల్లో రేడియో ఉండడం గొప్ప. అప్పోసప్పో చేసి దాన్ని కొనడం స్టేటస్ సింబల్‌గా భావించేవాళ్లు. ఆనాటి రేడియో కార్యక్రమాల మీద జాషువా గమ్మత్తైన కామెంట్ చేయడం గమనార్హం.

**నాల్గువందలిచ్చి నట్టిల్లు సగమిచ్చి**
**మెచ్చి చేతులార తెచ్చుకొంటి**
**రేడియో మెషీను చెడియా! దయచేసి**
**పాడకమ్మ ! చలిది పాతపాట**

ఏ రేడియోనైతే జాషువా ఆడిపోసుకున్నాడో అందులోనే కొంతకాలం కార్యక్రమ ప్రయోక్తగా ఉద్యోగం చేయడం ఒక చమత్కారం. పానుగంటి వారి *కంఠాభరణం* నాటకంలో అనుకుంటాను, *ఒక పాత్ర ఇలా ఉంటుంది, ఏమేవ్ కవులొస్తున్నారు కర్ర పట్రా* అని. తాము గొప్ప కవులమని విర్రవీగే సమకాలీన రచయితల మీద జాషువా నవ్వు పుట్టించే అక్షింతలు ఎంత అందంగా వేశాడో చూడండి.

**నా కవిత్వంబునందు రత్నములు గలవు**
**వాని బెకలించి చూపెడు వాడు లేడు**
**కాలమిట్లున్నదని మొనగాడు వోలె**
**పలుకు కవిగాడ ! యేటికీ స్వాతిశయము?**
**ఏవీయా రతనంబులు**
**నీవే పెకలించి చూపి నీ యింటికి గొం**
**పోవోయి ! యట్లొనర్పగ**
**నీ వలనన్ గాదో ! యింక నీల్గెదవేలా?**

అప్పటి సమకాలీన భావకవుల మీద జాషువా విసిరిన విసుర్లు ఇప్పటి అత్యాధునిక కవులకు కూడా వర్తిస్తాయి. అంతెందుకు? రకరకాల ఇజాల పేర పాశ్చాత్య ఫ్యాషన్ల మోజులో పడి వచన కవిత్వంలో ప్రయోగాలు చేస్తున్న పద్ధతి మీద జాషువ నిరసన ప్రకటించాడు.

*ఈ బిత్తల తోకబీకుడు కవిత్వపు ఫక్కిననాదరించెదన్* అని తిట్టినా అందులో చేదు హాస్యం లేకపోలేదు. కవిత్వ ప్రస్తాన వచ్చింది, కాబట్టి జాషువా ఎప్పుడూ సుకవుల పక్షమే వహించాడు.

ఎవడు సుఖించెనో తెలుపుమా
కవితా కళ నభ్యసించి....

అని సానుభూతి వ్యక్తం చేస్తాడు. *కవిగాడి బ్రతుకు శ్రీరామ రామ* అంటూ *ఈ బిరుదముల్ ఈ కాలి పెండారముల్ దుప్పట్లక్కర తీర్చునా? సుకవులెందున్ మందభాగ్యుల్ గదా!* అని మథనపడ్డాడు. ఈ మథనలోనూ ఒక మందహాసం లేకపోలేదు. అసలు కవిగా పుట్టడమే ఒక శాపం అంటాడు జాషువా. అంతేకాదు అందులోనూ పద్యం రాయడం ఎంత కష్టమో, ఎన్ని తిప్పలు పడాలో జాషువా చెప్పిన తీరు చూస్తే మనం నవ్వు ఆపుకోలేం.

**గణ బాధ రవ్వంత గడచి ముందుకు సాగ**
**తగ్గవో ! యని యతిస్థానమురుము**
**యతిని మచ్చిక జేసి యడుగు ముందుకు సాగ**
**ప్రాసంబు కుత్తుక బట్టి నిలుపు**
**ప్రాసవేదన దాటి పయనంబు సాగింప**
**భావంబు పొసగకిబ్బంది పెట్టు**
**భావంబు పొసగించి పద్యంబు ముగియింప**
**రసలక్ష్మి కినిసి మారాము సేయు**
**ఇట్టి ప్రతిబంధకంబుల నెల్ల గడచి**
**గట్టుకెక్కుదమన్న వ్యాకరణశాస్త్ర**
**మాదరింపదు శబ్దమర్యాదగాన**
**రాక; కవిగాని బ్రదుకు శ్రీరామరామ**

పద్య నిర్మాణంలో ఇన్ని పరేషాన్లు (కష్టాలు) ఉన్నాయి. గనకే ఆధునికులు ఈ చాకిరీ నుంచి సుఖంగా తప్పించుకున్నారు. ఫ్రీ వే (Free way) లాంటి ఫ్రీ వెర్స్ (Free verse) ను ఎంచుకున్నారు. ఇన్ని కష్టాలు పడి పద్యం రాయడమంటే మాటలా? మజాకా? జాషువా చెప్పాడు గనుక పద్యకవుల కష్టం గుర్తించి అభినందించి కరచాలనం చేయవలసిందే!

జాషువాలో అవధాన లక్షణాలు అంతర్లీనంగా దాగున్నాయి. తిరుపతి వేంకట కవులు, కొప్పరపు సోదర కవులు ప్రభావం చిన్నప్పుడు ఆయన మీద బలంగా ఉండేది.

బాల్యంలో చేసిన అవధాన సాధన పెద్దయ్యాక కవిగా ఆయనకి మరింత బలోపేతుణ్ణి చేసింది. జంట కవులుగా పేర్లు కుదరలేదు గానీ బాల్యమిత్రులైన దీపాల పిచ్చయ్య శాస్త్రికీ, గుర్రం జాషువాకీ జోడీ కుదిరి వుంటే దేశంలో గొప్ప అవధానులుగా వీళ్ళ కీర్తి దీప్తివంతమయి ఉండేది. తెలిసిన పద్యమైనా మళ్ళీ ఒకసారి చదువుకొని మనాసార నవ్వుకుందాం!

**నా పేరు ముందు నిల్పం**
**పాపం బదియేమొ జాషువా పిచ్చులగున్**
**నా పేరు చివర నిల్చిన**
**శాపం బిడినట్లు పిచ్చ జాష్వాలయ్యెన్**

దీపాల పిచ్చయ్య శాస్త్రి, జాషువాలది అపురూప స్నేహం. ఇద్దరూ వినుకొండలో కలిసి చదువుకున్నారు. చిన్నప్పుడు పిచ్చయ్య శాస్త్రి పిలకతో ఆడుకునే తుంటరితనం జాషువాలో పెద్దయ్యాక కూడా పోలేదు. ఇద్దరూ ఎంతో ప్రసిద్ధులైనా అవకాశం దొరికినప్పుడల్లా జాషువా, పిచ్చయ్య శాస్త్రిగారి పిలకను ప్రేమగా పలకరించేవాడట!

కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు, నవయుగ కవిచక్రవర్తి జాషువా గారు ఇద్దరు ఒకే సంవత్సరం, ఒకే నెలలో పుట్టారు. పైగా అది మన్మథ నామ సంవత్సరం. విశ్వనాథ వారు 1895 సెప్టెంబర్ 9న జన్మించారు. ఇద్దరు వారి వారి రంగాలలో తిరుగులేని స్థానం సంపాదించు కున్నారు. ఎవరి పట్టు వారిదే. ఇద్దరూ ఎప్పుడైనా సాహిత్య సభల్లో ఎదురుపడితే ఒకరిమీద ఒకరు విసుర్లు వేసుకొనేవారట! అలాంటి సందర్భాల్లో జాషువా గారిదే పైచేయిగా ఉండేది. ఒక పర్యాయం మద్రాసులో కవి సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఆనాటి గొప్ప గొప్ప కవులంతా అందులో పాల్గొన్నారు. దువ్వూరి రామిరెడ్డి, గుఱ్ఱం జాషువాలిద్దరు మంచి స్నేహితులు. దవ్వూరి వారి డైరీల్లో కూడా జాషువా కనిపిస్తాడు. తరచూ ఇద్దరు ప్రక్కప్రక్కనే కూర్చొనేవారు. ఆ రోజు కూడా *ఉభయకవిమిత్రులు* ఒక్కచోటనే ఆసీనులయ్యారు. ఆ ఇద్దరిని చూసిన విశ్వనాథ వారు లోపల ఉడుక్కుంటూ *ఆహా ! పిట్టలు రెండూ ఒకే చోటికి చేరాయే!* అని ఛలోక్తి విసిరాడు. వెంటనే జాషువ *ఈ కిరాతకుడి కన్ను ఇక్కడ కూడా పడిందన్నమాట* అని ధ్వని గర్భితంగా బదులిచ్చాడు. అసలు విషయమేమిటంటే దువ్వూరి, జాషువాలిద్దరూ *కవికోకిలలు*. విశ్వనాథవారు అప్పుడే శ్రీమద్రామాయణ కల్పవృక్షం కావ్యం వ్రాసి ముగించారు. వాల్మీకి రామాయణం వ్రాయకముందు

బోయవాడు కదా! పిట్టలను కొట్టేవాడు. ఆ ఘట్టం గుర్తుకు వచ్చేలా జాషువ ఎదురు జావాబు చెప్పడం *కిరాతకుడి*లోని విశేషం.

అలాగే మరో సందర్భంలో ఒక సాహిత్య సభ అనంతరం విశ్వనాథ, జాషువాలిద్దరూ భోజనం చేసి చేతులు కడుక్కున్నారు. చేతులు తుడుచుకోవడానికి జాషువ గారు జేబులో చేయి పెట్టి రుమాలు (కర్చీఫ్) తీస్తుండగా అది కాస్తా కిందపడింది. ఎప్పటినుంచో జాషువ ఉపకులం తెలుసుకుందామనుకున్న ఉబలాటం విశ్వనాథ వారికుండేది. ఇదే మంచి అవకాశం అనుకున్న విశ్వనాథ వారు జాషువ గారు మీరు'మాల'? అని చేయి కిందికి చూపించారు. జాషువా బ్రేవుమని త్రేనుస్తూ అవును మాదిగా! అన్నాడు. ఇద్దరికీ విషయం అర్థమైంది. కడుపు నిండుగా ఉంది కాబట్టి తృప్తిగా నవ్వుకొన్నారు.

మరో సందర్భంలో *ఆంధ్ర సారస్వత పరిషత్తు* హైదరాబాద్‌లో మాన్యులు బెజవాడ గోపాలరెడ్డి, దేవులపల్లి రామానుజరావుగార్ల ఆధ్వర్యంలో విశ్వనాథవారికి, జాషువా గారికి ఒకే వేదిక మీద సన్మానం ఏర్పాటు చేశారు. ఆ రోజు విశ్వనాథ వారు ఎందుకో ధుమధుమ లాడుతున్నారు. ముందు విశ్వనాథవారిని ఘనంగా సత్కరించారు. ఆయన ప్రతిస్పందనలో ఏమైతేనేమి? కార్యకర్తలు ఇన్నాళ్ళకు గుర్రాన్ని, గాడిదను ఒకే గాటన కట్టి సన్మానించారని తన సహజ ధోరణిలో వ్యంగ్యోక్తులు విసిరారు. ఆ తరువాత జాషువా గారు సన్మానాంతరం తాపీగా ప్రతిస్పందిస్తూ గుఱ్ఱం ఎప్పటినుంచో సిద్ధంగా ఉంది, గాడిద కోసమే ఇన్నాళ్ళు చూశారు. అది దొరికింది కాబట్టి ఒక గాటన కట్టి సన్మానించారని సమయోచితంగా చమత్కరించేసరికి సభంతా నవ్వులతో, కరతాళధ్వనులతో దద్దరిల్లింది.

జాషువ తన చీకటి జీవితంలో నవ్వుల దీపాల్ని వెలిగించుకున్నాడు. అవమానాల్ని హాస్యంగా మలుచు కున్నాడు. అదే ఆయన విజయ రహస్యం. జాషువా హాస్యానికి ఒక సామాజిక ప్రయోజనం ఉంది. చార్లీ చాప్లిన్ తన చిత్రాల ద్వారా సాధించింది కూడా ఇదే. గొప్ప కళాకారులందరూ గొప్ప హాస్యాన్ని పండించినవారే...

(గుర్రం జాషువ 117వ జయంతి...) మి

## సామినేని ముద్దు నరసింనాయుడు

***మిసిమి*** అక్టోబరు సంచికలో గాంధీ నుండి సామాన్యుడి వరకు అన్ని పేజీలు అమోఘమ్. సెప్టెంబరు సంచికలో విశిష్టవ్యక్తి శీర్షికలో సామినేని ముద్దు నరసింనాయుడు గారిని చూచి చాలా ఆనందం కలిగింది. సామినేని వారు తెలుగు, సంస్కృతాలతో పాటు ఆంగ్లంలో కూడా ప్రవీణులు. 1853 నాటికి ఫస్ట్‌క్లాస్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేటుగా ఎదిగారు. 1847–1852 మధ్యకాలంలో మచిలీపట్నం నుండి వెలువడే *'హితవాది'* పత్రికలో ప్రమేయాల పేరుతో ముద్దు నరసింహనాయుడు గారు కొన్ని వ్యాసాలు రాశారు. వాటిని సంకలనం చేసి *'హితసూచని'* పేరుతో 1862లో అచ్చయింది. అందులో *విద్య, వైద్య, సువర్ణ, మనుష్యేతర జంతుసంజ్ఞా, రక్షఃప్రభృతి, మంత్ర, పరోక్షాది జ్ఞాన, వివాహ* ప్రమేయాలని మొత్తం ఎనిమిది వ్యాసాలు ఉన్నాయి. ప్రమేయం అనేది వ్యాసానికి మొదటిపేరని, ముద్దు నరసింహనాయుడుగారు తొలి తెలుగు వ్యాస రచయిత అని సాహిత్యకారులు భావిస్తున్నారు. స్థూలంగా ప్రమేయం అంటే విషయం అని అర్థం చెప్పవచ్చు. ప్రయాణ జ్ఞానానికి, యదార్థ జ్ఞానానికి సంబంధించిన విషయ సంగ్రహంగా ప్రమేయాల గురించి చెప్పవచ్చును. ***మిసిమి*** సంపాదకులకు ధన్యవాదాలు.

**(పోతం జానకమ్మ అనే విదుషీమణి తన భర్తతో ఇంగ్లండు వెళ్ళి వచ్చి 1874 ఫిబ్రవరి 'ఆంధ్ర భాషా సంజీవని' మాసపత్రికలో విదేశీయాత్ర గురించి ఒక వ్యాసం రచించారని కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రిగారు 'ఆర్య మత బోధిని' 1913 సెప్టెంబరు సంచికలో రాశారు. బహుశా ప్రథమాంధ్ర వ్యాస రచయిత్రి పోతం జానకమ్మగారే కావచ్చు!)**

**– మువ్వల సుబ్బరామయ్య, విజయవాడ.**

# రెండు భాషల వెండితెర పండితుడు
## అక్కినేని లక్ష్మీవరప్రసాద్

పెద్ద రైతుకుటుంబం, నేనాటే చదువుకోలేదు గాని కాడిగట్టి పొలందున్నాను. అయితే 1929 ఆఖరు దినాలలో మా కుటుంబం ఆర్థికపరిస్థితులు విషమించి తలవంపులుగా యెంచబడే పని జరిగింది. మా నాయనగారు దివాళా పిటీషన్ పెట్టవలసివచ్చింది. దానిమీద సంతకం పెట్టేసి, ఆ రాత్రే నూరు రూపాయలు తీసుకుని, నా భార్యా బిడ్డలకు సైతం చెప్పకుండా బొంబాయి బయలుదేరాను. నాకు బాగా జ్ఞాపకం; నేను యిల్లు విడిచినది 1929లో, బొంబాయి చేరింది 1930లో.

బొంబాయిచేరి దాదర్‌లో ఒక హోటల్లో మకాం పెట్టాను. నాకంతా అయోమయం. ఎవరితోనూ మాట్లాడటానికి లేదు. నాకు వచ్చిన ఇంగ్లీషు బహుకొద్ది, హిందూస్థానీ, మరాఠీ భాషలు అసలేరావు. నా దుస్థితి కనిపెట్టి యెవడో నా పెట్టెలో వున్న డబ్బు కొట్టేసి 20 రూపాయలు మాత్రం వదిలేశాడు. ఎందుకో నాకప్పుడర్థంకాలేదు. తరువాత నేను ఒక సినిమా కంపెనీకి మేనేజరుగా వుండగా ఈ మనిషే నా దగ్గరికి వేషం కోసంవచ్చి, నన్నుచూసి ఆశ్చర్యపడి, *ఇంకా నువ్విక్కడే వున్నావా? నీ తిరుగు రైలుచార్జీకి 20 రూపాయలు ఉంచానే?* అన్నాడు. నా సంగతి వాడెరగడు. ఇంటికి ఉత్తరం ముక్క రాయకుండా, నా ఆచోకీ నా భార్యాబిడ్డలకు తెలియకుండా నేను బొంబాయిలో 21 మాసాలు గడిపాను. తిరిగి నా వార్తలు మావాళ్లకూ, వాళ్ళవార్తలు నాకూ తెలిసేలోగా నా కుమార్తె చనిపోవటం కూడా జరిగింది...

బొంబాయిలో దిగిన కొత్తలో రోజూ కోహినూరు సినిమాకు వెళ్లి గేటుదగ్గర నిలబడి లోపలికి చాలాసేపు ఆశగాచూసి హోటలుకు తిరిగి వచ్చేవాణ్ణి. కాని దగ్గరవున్నది 20 రూపాయలు. ఎంతకాలం వస్తాయి? హోటలువాడు నాకు ఉద్వాసన చెప్పాడు. **ఈ విధంగా వీధిలో నిలబడిన నాకు ఒక దర్జీవాడు ఆశ్రయమిచ్చాడు.** నా పెట్టె ఆ దర్జీకొట్టులో వుంచాను. రాత్రివేళ కొట్టులో పడుకునేవాణ్ణి. తెల్లవారి లేచి కొట్టంతా శుభ్రంగా ఊడ్చేవాణ్ణి. నాకు సినిమాల్లో ప్రవేశించాలని వుందని తెలిసి ఈ దర్జీవాడే నాకు వీనస్ పిక్చర్స్‌లో పని యిప్పించాడు. పేరుకు నెలజీతం 15 రూపాయలు. కాని, ఈ జీతం డబ్బుల మొహం నేనెన్నడూ చూసిన పాపాన పోలేదు. ఈ వీనస్ పిక్చర్స్‌వారు చిత్రమే తీయలేదు.



అక్కినేని లక్ష్మీవరప్రసాద్

అయినా ఒక ఉపకారం జరిగింది. ఆ రోజుల్లో మిస్ మోతీ అని ఒక సినిమాతార వుండేది. ఈమె సోదరుడు ధారీలాల్ అనేవాడు వీనస్ పిక్చర్స్‌లో వుండేవాడు. ఇతను నాకు గ్రాంట్‌రోడ్డులో వుండే కార్నివాల్‌లో పని యిప్పించాడు. రాత్రుల్లో అక్కడపనిచేసి, కార్నివాల్ ముగిసిన తరువాత రెండు గంటలవేళ... బస్సులూ, ట్రాములూ వుండవు... నాలుగైదు మైళ్ళు దాదరుకు నడిచి దర్జీ దుకాణం చేరి, అక్కడ కాస్సేపు పడుకుని, మళ్ళీ 6 గంటలకు లేచి కొట్టు శుభ్రంచేసి, రైలుమీద శాంటాక్రుజ్‌లో వీనస్ పిక్చర్స్‌కు హాజరయ్యేవాణ్ణి. కార్నివాల్ వాళ్ళు నాకు రోజూ రూపాయిన్నర ఇచ్చేవారు. దీనితోనే నాఖర్చులన్నీ సరిపెట్టుకునేవాణ్ణి. 3,4, నెలలు గడిచాక వీనస్ పిక్చర్స్ దివాళాతీసింది.

తరవాత అఖ్తర్ నవాజ్‌కు చెందిన ఇండియా పిక్చర్స్‌లో చేరి *స్టార్ ఆఫ్ ది ఈస్ట్* అనే మూకీ చిత్రంలో చిల్లర వేషం వేశాను. ఆ రోజుల్లో చిల్లరనటులచేత వెట్టిచాకిరీ చేయించేవారు. ఎక్కడికైనా పోతే సామాన్లు మొయ్యాలి. రిఫ్లెక్టర్లు మొయ్యాలి. వట్టి కూలిపని. ఒకసారి అఖ్తర్ నవాజ్ షూటింగుకని మమ్మల్ని యెక్కడో మారుమూల స్థలానికి తీసుకుపోయాడు. రైలుస్టేషనుకు 15 మైళ్ళదూరాన ఒక రహదారి బంగాళాలో మకాంచేశాం. దగ్గిర డబ్బులేదోయేమో అఖ్తర్ నవాజ్ రాత్రికి రాత్రే మాకెవరికీ చెప్పకుండా పరారీ అయినాడు. మాపాట్లు పరమాత్ముడికెరుక. రెండు రోజులు యెవరికీ తిండిలేదు. ఆ తరువాత 15 మైళ్ళు నడిచి స్టేషనుకుచేరి, చావుతప్పి కన్నులొట్టబోయి, యెట్లాగో బొంబాయి వచ్చిపడ్డాం.

ఆ తరువాత ఆర్దేషిర్ ఇరాని కింద *ఇంపీరియల్ ఫిలింకం*పెనీలో నెలకు ముప్ఫైరూపాయల జీతంమీద నటుడుగా చేరాను. ఈ *ఇంపీరియల్ ఫిలింకం*పెనీలో దాదాపు రెండేళ్లున్నాను. **ఈ కాలంలోనే వీరు మొట్టమొదటి భారతీయటాకీ చిత్రం *ఆలం ఆరా* తీశారు.** ఇందులో నేను చిల్లర వేషాలు వేశాను. నేను *ఇంపీరియల్* లో ఉండగానే నాకు హెచ్.ఎం రెడ్డిగారి పరిచయం కూడా అయింది. ఆయన అక్కడికి వచ్చి *కాళిదాస్* అనే చిన్న టాకీ చిత్రం హిందీలో తీశారు. ఇందులో నేను పురోహితుడి పాత్ర ధరించాను.

1933లో కాబోలు ఇంపీరియల్ కంపెనీలో ఉద్యోగులను తగ్గించారు. దాంతో నేను వీధిలో వచ్చిపడ్డాను. నా నిరుద్యోగానికి తెరమరుగులాగా కృష్ణాసినిమాలో డోర్‌కీపర్ పని దొరికింది. ఈ పనిచేస్తూనే హెచ్.ఎం.రెడ్డిగారి *భక్త ప్రహ్లాద* లో చండమార్కుని వేషమూ, *సావిత్రి*లో సత్యవంతుడి వేషమూ వేశాను.

అనంతరం రెడ్డిగారు దాదర్‌లోని విజయా సినీటోన్‌లో *సీతాస్వయంవర్* అనే హిందీచిత్రాన్ని డైరెక్టు చెయ్యటానికి కుదిరాను. ఆ చిత్రంలో నేను వేషం వేశాను. చిత్రం పూర్తికాక పూర్వమే కంపెనీ వారికి రెడ్డిగారికి ఏవో విభేదాలు ఏర్పడి ఆయన వెళ్ళిపోయారు. నేనుమాత్రం చిత్రం పూర్తి అయినదాకా కంపెనీలో ఉండి, తరువాత ఆ కంపెనీకి రిప్రజెంటేటివ్‌గాకుదిరి, ఆ చిత్రం తాలూకు టిన్నులు పట్టుకొని బొంబాయిరాష్ట్రమంతటా తిరిగాను. తరువాత నేనా కంపెనీకి ఆఫీసుమేనేజరు కూడా అయినాను. అయితే కొద్దిరోజులకే ఈ కంపెనీ రద్దయింది.

ఇక్కడి నుంచి నేను న్యూ ఈరా పిక్చర్స్‌కు వెళ్లాను. దాని ప్రొప్రయిటరు రజనీకాంత పాండ్యా, ఈయన తర్వాత బొంబాయి శ్రీసౌండ్ స్టూడియోస్‌కు అధిపతి. న్యూ ఈరా వారు అప్పుడు తీయనున్న *మత్స్యగంధి (భీష్మ ప్రతిజ్ఞ)* చిత్రానికి నన్ను ప్రొడక్షన్ మేనేజరుగా నియమించారు. ఈ చిత్రం పూర్తికాగానే రేణుకాపిక్చర్స్ (దాదర్)లో చేరాను. ఈ కంపెనీ వారు ఒక కెమెరా, సౌండ్‌ట్రక్ కొని చిత్రాలు తీయబోతున్నారు. ఈ కంపెనీకి నేను మేనేజరుగానూ, అసిస్టెంటు కెమెరామాన్‌గాను కుదిరాను. 1937లో జమ్నాదాస్ కపాడియావద్ద *స్త్రీ* అనే చిత్రానికి కెమెరాపని చేశాను. నాకు అసిస్టెంటు డైరెక్టర్ అవకాశాన్ని మొదటగా ఇచ్చిన వాడు గజన్‌ఫరాలీ షా. ఇతను భయంకరుడు. కోపం వచ్చినప్పుడల్లా పిస్తోలు తీసేవాడు. (అతనికి పిస్తోలు లైసెన్స్ ఉండేది.) అతనికింద ఎవరూ అసిస్టెంటుగా పనిచెయ్యలేక పోయేవారు. కాని నేను అతనికింద పనిచేసినంతకాలం అతనితో నాకు ఏ పేచీ రాలేదు. తర్వాత గజన్‌ఫరాలీ షా అనే ఆయన పాకిస్తాను మంత్రిగావున్నట్టున్నది. ఈయనే ఆయనేమో నాకు తెలియదు.

ఒక కంపెనీ అని లేకుండా దొరికినచోటనల్లా చిల్లర వేషాలు వేస్తూ బొంబాయిలో మరి రెండేళ్లు గడిపిన అనంతరం 1940 లో హెచ్. ఎమ్. రెడ్డిగారు నన్ను మద్రాసుకు తీసుకొచ్చారు. ఆయనకు సహాయంగా ఉంటూ *సత్యమే జయం, తెనాలిరామకృష్ణ* చిత్రాలలో వేషాలు కూడా వేశాను.

తిరిగి 1942లో తాండ్ర సుబ్రహ్మణ్యంగారు *కష్టజీవి* తీయటానికి బొంబాయి బయలుదేరితే దాన్ని డైరెక్టు చేయటానికి నేనూ వెంటవెళ్ళాను. ఈ చిత్రం మూడురీళ్ళు పూర్తి అయినాక ఆగిపోయింది. నేను గీతాంజలి పిక్చర్స్‌కు అసిస్టెంటు డైరెక్టరుగా చేరి *సవాల్* అనే చిత్రానికి పని చేశాను. ఇందులో ముంతాజ్ శాంతీ, ఉల్లాస్ ప్రధాన పాత్రలు ధరించారు. దీని తరువాత ముంతాజ్ శాంతీ భర్త వల్లీ సాహెబ్ *లేడీ డాక్టర్* డైరెక్షనుకు కుదిరినప్పుడు నేనాయనకు అసిస్టెంటుగా పనిచేశాను.

తరువాత డైరెక్టర్ యూసుఫ్ నన్ను అసిస్టెంటుగా తీసుకున్నాడు. *దర్బాన్, నేక్ పర్వీన్* చిత్రాలు తీశాము. కుమార్ తీసిన *దేవల్* చిత్రానికి స్క్రిప్టు రాశాను. ఇంతలో పృథ్వీరాజ్‌కపూర్ *పృథ్వీథియేటర్స్* పెట్టి నాటకాలాడ నారంభించాడు. మొదట *శకుంతల* ఆడాడు. తరవాత *దీవార్.* ఈ రెండు నాటకాలలోనూ నేను అనేక చిన్నపాత్రలు ధరించాను.

1945 ఆగస్టులో, *గృహప్రవేశం* చిత్రం డైరెక్టు చేయటానికి మద్రాసువచ్చి ఇక్కడి సినిమా ప్రపంచంలో ఒక డైరెక్టరుగా స్థిరపడిపోయాను. ఏతావాతా చెప్పవచ్చిందేమంటే నేను పడ్డ కష్టాలన్నీ బొంబాయిలోనే పడ్డాను. బొప్పెలన్నీ అక్కడే తగిలాయి. కాని నేర్చుకోవలసిందంతా కూడా అక్కడే నేర్చుకున్నాను. బొంబాయి ముఖ్యంగా నాకు ఓపిక నేర్పింది. ఏమైనా సాధించాలంటే ఎంతో ఓపిక అవసరం. ముఖ్యంగా ఈ సినిమా లైనులో తొందరపాటువల్ల ఏమీకాదు.

* * *




**'కినిమా' మొట్టమొదటి సినిమా పత్రిక,**
**ముఖచిత్రంగా ఎన్.టి.రామారావు (చంద్రహారం)**

హెచ్.ఎమ్.రెడ్డిగారు అప్పుడు మద్రాసులో *గృహలక్ష్మి* అనే పిక్చర్ తీశారు. వాహినీ పిక్చర్ బ్రాండ్‌లో, ఆయనెట్లా తెలుసుకున్నాడో నా ఎడ్రసు తెలుసుకొని నువ్వు రావలసింది, నీకు ఏదైనా పని చూపిస్తాను అంటే మద్రాసు వచ్చాను. అప్పుడు ఆయన నన్ను తనకి అసిస్టెంటుగా పెట్టుకున్నారు. ఆయన తీసే పిక్చర్ *సత్యమే జయం*లో హీరోగా వేషం ఇచ్చారు. దాని తర్వాత *తెనాలి రామకృష్ణ* తీసి ఒకరకంగా లైనులో పడ్డాం. కాని ఈలోగా జపాను బాంబింగు ఏదో జరిగింది. మళ్ళీ అంతా విడిపోయారు. రెడ్డిగారు పూనా లేదా మరెక్కడికో వెళ్ళిపోయారు. నేను మళ్ళా మన ప్రాంతం వచ్చాను.

తాండ్ర సుబ్రహ్మణ్యంగారని ఒకాయన ఉండేవారు. ఆయనేదో నాటకాలు రాసినట్లున్నారు. ఏదో పిక్చరుకు కూడా రాసినట్లున్నారు. *కష్టజీవి* అనే పిక్చరు తీయాలి. బొంబాయిలో తీయాలి. మీరు బొంబాయిలో ఉన్నారు కనుక మీరు తప్పకుండా రావాలని కోరారు. అలా మళ్ళీ బొంబాయి వెళ్ళాను. అది 1943వ సంవత్సరం అనుకుంటాను. అప్పటికే క్విట్ ఇండియా హడావుడి అదీ వచ్చింది. సరే అక్కడ ఆయన రెండు రీళ్ళు పిక్చర్ తీసిన తర్వాత అది కొనసాగలేదు. ఆయన తిరిగి వచ్చేశారు. అప్పుడు జంపన కూడా మాతోబాటే ఉన్నాడను కుంటాను. అక్కడే నాకు పాత స్నేహితులు మళ్ళీ కనబడితే వాళ్ళతో జాయినయి అసిస్టెంటు డైరెక్టర్ దావల్లీ సాయి, ముంతాజు శాంత వాళ్ళు తీసే పిక్చర్లలో *సవాల్, లేడీ డాక్టర్* అనే రెండు మూడు పిక్చర్లలో పని చేశాను. పనులు లేక వున్నాను. *పృథ్వీ థియేటర్స్* అని అప్పుడే మొదలు పెట్టారు. వాళ్ళు శకుంతల *నాటకం, దీవార్* నాటకం వేస్తూ ఉండేవారు. నాకు పరిచయం ఉంది కనుక వెళ్ళి అడిగితే దానిదేముంది రా అన్నారు. సరే రోజూ అక్కడ నైట్ డ్యూటీ ఎక్కువగా ఉండేది. పగలు అక్కడా ఇక్కడా పనిచేస్తూ ఉండేవారు. తర్వాత కొన్ని హిందీ పిక్చర్సులో అసిస్టెంటు డైరెక్టరుగా పనిచేస్తూ ఉండగా 1945లో అనుకుంటాను. అక్కడే సారథీ ఫిలిమ్స్ తరఫున మన కోవెలమూడి ప్రకాశ్‌రావు ఇంకా కొందరు బొంబాయి వచ్చారు. నేను వారిని కలుసుకున్నాను. వారు అప్పుడు ఏదో పిక్చరు ప్లాన్ చేస్తున్నారు. గోపీచంద్ రైటరు. మీరు రండి గోపిచంద్‌కి అసిస్టు చేద్దురుగాని, ఆయన డైరెక్టరుగా కొత్త అని చెప్పారు. తప్పకుండా వస్తానని చెప్పాను. 45లో అనుకుంటాను మద్రాసు వచ్చాను. గోపీచంద్‌గారు, నేను స్టోరీ విషయంలో, హీరో విషయంలో ఎవరా అనుకున్నాం. వాళ్ళు నా పాత పిక్చర్ *సత్యమే జయం* కూడా చూసి *ఎందుకండీ మీరే వేయండి ఫర్వాలేదు బాగానే ఉంటుంది* అన్నారు, సరేలే అన్నాను. మాటల సందర్భంలో గోపీచంద్ ఏమనుకున్నారో ఏమో, *వద్దు ప్రసాదూ! నువ్వే డైరెక్ట్ చేయి నాయనా, నేను రైటర్‌గా ఉంటాను ఈ పిక్చరుకి* అని అన్నారు. అలా *గృహప్రవేశా*నికి నేను హీరోని, డైరెక్టరుని అయ్యాను. ఆ పిక్చరు ప్రజలకి ఏదో తమాషాగా, కొత్త టెక్నిక్‌గాను, బొంబాయి టైపులో ఉందనుకొని బాగానే యిష్ట పడ్డారు. అలా ఫస్టు డైరెక్టరుగా కెరీర్ మొదలయింది. అప్పుడే గూడవల్లి రామబ్రహ్మం *గృహప్రవేశం* రషెస్ చూశారు. ఆయన *పల్నాటి యుద్ధం* ఎర్లీ పోర్షన్ తీశారు. ఆయనకి వంట్లో అంత బాగుంటడం లేదు. ఆయన ఏమనుకున్నారో ఏమో *నాయనా! పల్నాటి యుద్ధం నువ్వే డైరెక్టు చేయి. నాకు ఆరోగ్యం అంతగా బాగుండటం* లేదు అన్నారు ఒక రోజున. సరే అలా ఈ *గృహప్రవేశం* తీస్తూ ఉండగానే *పల్నాటియుద్ధం*

ప్రారంభించారు. *పల్నాటియుద్ధం* అవుతుండగానే కోవెలమూడి ప్రకాశరావు *ద్రోహి* ఫిలిం ప్లాను చేసి అందులో కూడా నన్ను వేషం వేయమన్నారు, డైరెక్టు చేయమన్నారు. అందులో ప్రకాశరావు హీరో, లక్ష్మీరాజ్యం, వరలక్ష్మి నటించారు. ఆయన కూడా ప్రేమగా, ఆప్యాయంగా చూశారు. కలిసిమెలిసి చేశాం. *ద్రోహి* పిక్చర్ చాలా బాగా వచ్చింది. అందర్నీ ఆకర్షించింది. అలా అక్కడ్నించీ ప్రారంభమయింది మద్రాసులో... సరే తర్వాత *వాహినీ*లో చేరటం, తర్వాత *షావుకారు... సంసారం*తో పాటుగా, తమిళ పిక్చర్స్ కూడా చేశాను. 1954లోనో ఎప్పుడో స్వంతంగా ఫిలిం తీయాలని ఉద్దేశం కల్గింది.

లక్ష్మి ప్రొడక్షన్స్ అని సంస్థ పేరు పెట్టి *ఇలవేల్పు* అని తీశాను. నాకు వంట్లో బాగుండక ప్రకృతి ఆశ్రమానికి వెళ్ళి ఉపవాసాలు ఉండి చాలా నీరసంగా ఉండేవాణ్ణి. నా దగ్గర అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఉండేవాడు యోగానంద్. అతన్ని పిలిచి *నాయనా! నువ్వే డెరెక్ట్ చేయి, నేనుచూస్తూ ఉంటాను* అని *ఇలవేల్పు* పిక్చర్ తీశాం. ప్రజలు బాగానే ఆదరించారు. దాని తర్వాత ఉద్దేశం కల్గింది ఈ పిక్చరునే హిందీలో ఎందుకు తీయకూడదు అని. డిస్ట్రిబ్యూటర్లు కూడా ప్రోత్సహించారు. వెనుక వుండే పాత పరిచయంవలన పృథ్వీరాజ్‌నీ, రాజ్‌కపూర్‌నీ కలుసుకోవటం జరిగింది. వాళ్ళు చాలా సంతోషించారు, చాలా కాలం తర్వాత మళ్ళీ వచ్చానని. రాజ్‌కపూర్‌ని రిక్వెస్టు చేసి ఆయనను నాగేశ్వరరావు వేసిన వేషం వేయమని మీనాకుమారిని, అంజలీదేవి వేషం వేయమని *శారద* అని ఫస్టు పిక్చర్ హిందీలో తీశాం. దానికి కూడా మంచి పేరు వచ్చింది. దాని తర్వాత వరుసగా ఛోటీ బెహన్, ససురాల్, చాలా పిక్చర్లు.. పదాహారు పిక్చర్ల వరకు తీశాం. అన్నీ బాగానే పోయాయి.

*(1952 కినిమా మొదటి సంచికలో అక్కినేని లక్ష్మీవరప్రసాద్ వ్రాసిన 'డైరెక్టరుగిరీకి ఉపోద్ఘాతం' కొంత, 1982లో మద్రాసులో పన్నాల సుబ్రహ్మణ్య భట్టుతో 'మాటామంతి'లో వారి మాటలు కొన్ని...)* మి





మిసిమి
మాసపత్రిక

చందాదారులుగా చేర్పించండి

**బహుమతి**

పొందండి!

**మీ** ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవే కదా. మీకు ప్రియమైన వారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యం కదా.

వీరందరికీ మీరు *మిసిమి* ని బహుమానంగా నెల నెలా పంపవచ్చు. మీరూ ఒక బహుమతిని పొందవచ్చు. మీరు కోరిన గ్రంథాలయానికి, లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం **మిసిమి**కి చందా **₹240** పంపండి (వారి పూర్తి చిరునామాతో).

ప్రక్కన వున్న ఆస్కార్ వైల్డ్ (De Profundis) అనువాద పుస్తకాన్ని మీకు బహుమతిగా పంపిస్తాం. మీరు ఇచ్చిన చిరునామాకు నెల నెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని పలకరించినట్లే – మంచి సారస్వతంతో...

*(ప్రస్తుత చందాదారులు, మరో సంవత్సరము చందా పొడిగించినా ఈ పుస్తకం పొందగలరు.)*




మీ చందా *మిసిమి* పేర ఈ క్రింది చిరునామాకు పంపండి

మిసిమి
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
e-magazine: www.kinige.com/misimi

# తూర్పుగాలి
# కొరియా కవిత్వం

– *ముకుంద రామారావు*



కొరియా కవిత్వం కొన్ని శతాబ్దాల పాటు పాటల్లోనే ఉండిపోయింది. మౌఖికంగా ప్రచారంలో ఉన్నా రాతలోకి రాలేకపోయింది. దానికి కారణం కొర్యో సామ్రాజ్యంలో (918–1392) చక్రవర్తులకు కవిత్వ వాసన పడలేదు. వారిని పొగడ్తలతో ముంచెత్తే పాటలు మాత్రం పాడించుకునే వారు. ఆ తరువాత ఛోజెన్ సామ్రాజ్యంలో (1392–1910), అనేకుల చేతుల్లో ఆ పాటలు, లేదా కవిత్వం అనేక విధాల సవరణలకు కత్తిరింపులకు లోనై అప్పటి కవిత్వం చాలా వరకూ అదృశ్యమైంది. కొరియాకు తనదంటూ లిపి వచ్చేవరకూ కవిత్వాన్ని సేకరించాలనిగానీ, ముందు తరాలకోసం భద్రపర్చాలనిగానీ (చైనా జపాను దేశాల్లా) ఎటువంటి ప్రయత్నమూ పెద్దగా జరగలేదు.

లిపి వచ్చాక, సేకరించబడ్డ పాటలే కొర్యో పాటలుగా మిగిలాయి. అవీ 12 నుండి 15వ శతాబ్దం మధ్య భాగానికి చెందినవి. ఆ పాటల రచయితలు ఎక్కువ అనామకులే. చాలావరకు పల్లవితో సాగే గొలుసుపాటలు. వాటిల్లో (దాదాపు 72 వరకూ) చెప్పుకోదగ్గ కవితల్లో *ఆకుపచ్చ కొండ పాట, ఋతువుల మీద గేయగీతాలు, ప్యోంగ్యాంగ్ పాట, గంట దాని శబ్దాల పాట, నువ్వెళ్తావా? గుడారాన్ని కప్పిన వసంతం* మొదలైనవి.

ఇవి కూడా కొన్ని కొరియాలిపిలోను, కొన్ని హియాంగ్ఛల్ లిపి (కొరియా భాష చైనా లిపి)లో, కొన్ని చైనా లిపిలోను ఉన్నాయి. వాటిల్లో ముఖ్యమైన ఇతివృత్తాలు – ఇష్టులైన వారిని కీర్తిస్తూ రాసినవి. కానీ వాటిని రాజుకోసమన్నట్టు వాడుకునేవారు. ప్రియతముల్ని కోల్పోయిన ప్రేమికులకు, మద్యం దివ్యౌషదం అని చెప్పబడ్డవి. జరగకూడనిదేదో జరిగితే తప్ప ప్రేమ నశించదని, తిరిగొచ్చిన ప్రేమికులు, వెదుర కుటీరాన్ని వారి శృంగారమండపాలుగా మార్చేస్తారని ఉన్నవీ ఉన్నాయి.

కొర్యో రాజులు మంగోలియన్ స్త్రీలను వివాహం చేసుకునేవారు. వారి భార్యలతోపాటు అక్కడి సంగీతకారుల్ని, గాయకుల్ని కూడా తెచ్చుకునేవారు. రాజదర్బారుల్లో వారు మంగోలియన్ సంగీతాన్ని, పాటల్ని పాడి వినిపించే వారు. కొరియా పాటమీద కూడా అది ప్రభావం చూపింది. కావల్సిన విధంగా మంగోలియన్ పాటల్ని మార్చి కొరియాకు అనుకూలంగా పాడుకున్నవీ ఉన్నాయి. ఆ పాటలు అశ్లీలం అని కొందరు కొట్టిపారేసినా, సామ్రాజ్యాలు మారినా, వాటిల్లో సంగీతం, సాహిత్యం నిలదొక్కుకున్నాయి.

ఎవరు పాడుతున్నది, ఎక్కడ, ఎందుకు అన్నది, పాట పల్లవి సూచిస్తూనే ఉంటుంది. కొర్యో పాటలు రెండు రూపాల్లో కనిపిస్తాయి. ఒకటి సోగ్యో (జనప్రియమైన పాటలు), రెండు క్యోంగిచెక (నాలుగవ ఆరవ పంక్తులు 'వి' శబ్దంతో మొదలవుతాయి. ఎక్కువగా పండితులు వాడినవి) పద్ధతి పాటలు. ప్రేమ పాటలన్నీ జానపదుల పాటలే.

**ఋతువుల మీద గేయ గీతాలు:**

13 ఖండికల 65 పంక్తుల, పొగడ్త, ఫిర్యాదులతో కూడిన గేయ కావ్యం. ఒక్కో ఖండికలోను నాలుగు పంక్తులు, ఖండికల మధ్య ఒక పంక్తి పల్లవి. పూర్తి గేయానికి, మొదటి ఖండిక ఒక భూమిక మాత్రమే, తతిమా 12 ఖండికలు 12 నెలల్ని దృష్టిలో పెట్టుకుని ఉన్నవి. ఇప్పటికీ ఈ పాటలు అంతే ప్రాచుర్యంలో ఉన్నాయి.

**ఒక చేతిలో ధర్మం / మరొక చేతిలో సంతోషంతో**
**దేవుళ్లారా రండి, రండి / ధర్మంగా సంతోషంగా** – మొదటి ఖండిక

**నా మద్యం, రోగాల్ని మానిపే మూలికలతో**
**ఇంద్రధనుస్సు విందులో / తాగడానికి నీకు అర్పిస్తున్నాను–**
**నువ్వు వెయ్యేళ్లు జీవించుగాక** – ఆరవ ఖండిక

ముకుంద రామారావు, ఫోన్ : 9908347273

**ఎగిరే మహాసర్పాల పాటలు :**

చోసెన్ సామ్రాజ్యంలో ఎక్కువ కీర్తిప్రతిష్ఠల్ని ఆర్జించిన చక్రవర్తి సెజోంగ్ (1397–1450). రాజుల కొలువుల్లో చేరేందుకు (చైనాలో లానే) 1438లో, పరీక్ష పద్ధతుల్ని ప్రవేశ పెట్టడమే కాకుండా, కొరియాకు, అక్షరాల్ని కనుగొన్నవాడు కూడా. సాహిత్య వ్యాప్తికోసం సాహిత్యకారులతో ఒక ప్రత్యేక బృందాన్ని తయారు చేసుకుని, వారి సాహిత్య పిపాస తీర్చుకుందుకు, ఎక్కడికైనా వారిని పంపేవాడు. సహజంగానే అతని కాలంలో అనేక సుప్రతిష్ఠిత గ్రంథాలు వెలువడ్డాయి. 1445–1447 ప్రాంతంలో, అలా వచ్చినదే *ఎగిరే మహాసర్పాల పాటలు. అక్చాంగ్* (పాటలకోసం పదాలు) రూపంలో రాసిన ప్రసిద్ధ కావ్యం. ఇవి ఆ చక్రవర్తుల నలుగురు పూర్వీకుల్ని, మొదటి రాజు, మూడవ రాజుని కీర్తిస్తూ సాగిన కావ్యం. కొరియా అక్షరాలతో రాసిన మొదటి కావ్యం. చరిత్ర, కవిత్వం కలగలిసిన 125 ఆశ్వాసాలతో మొత్తం 248 కవితలున్న కావ్యమిది. సెజోంగ్ చక్రవర్తి ఆదేశానుసారం ఈ కావ్యాన్ని రచించినవారు, ఆ సామ్రాజ్యంలోని సాహిత్య బృందంలోని పండితులు.

**లోతుగా వేళ్లూనిన చెట్టు/వీచేగాలులు మధ్య దృఢంగా ఉంది**
**దాని పూలు ప్రశస్తం / దాని పండ్లు పుష్కలం**

– రెండవ ఆశ్వాసంలోని నాలుగు పాదాల మొదటి పద్యం

ఇలా 2–124 ఆశ్వాసాల్లో, ప్రతి పద్యం 18 నుండి 30 మాత్రలతో కొన్ని, మరి కొన్ని 24 నుండి 28 మాత్రలతోను ఉంటాయి. మొదటి ఆశ్వాసం ఒక పంక్తి, 125వ ఆశ్వాసం 10 పంక్తులది.

**ఈ కావ్యంలో ఇతివృత్తాలివి :**

చోసెన్ సామ్రాజ్యంలోని ఆరు మహాసర్పాలనబడే నలుగురు పూర్వీకులు, మొదటి మూడవ చక్రవర్తులను అనేక విధాలుగా కీర్తించడం – రాజనీతిజ్ఞులైన చక్రవర్తులు, విదేశ ఆక్రమణల నుండి దేశాన్ని కాపాడారని, శాంతిని వ్యవస్థని నెలకొలిపారని, దైవ విధేయుడిగా, దేశ భవితవ్యం కోసం, ఆవశ్యత మేరకు సైనికుడిలా ధైర్యంగా నిలబడ్డారని, పరిపాలకులుగా జ్ఞాన సముపార్జనని ప్రోత్సహిస్తూ, ప్రేమ, సామరస్యపూర్వకంగా నడుచుకున్నారని, సింహాసనం భద్రత, పరిపాలకుల దైవభక్తి, ప్రజలపట్ల అంకితభావాల మీదే ఆధారపడ్డాయని తెలుసుకున్నవారని–

చిన్సాలో పట్టభద్రుడయాక సొంగ్ నన్ (1493–1582), చుంగ్ జోంగ్, మియోంగ్ జోంగ్ రాజుల దగ్గర పనిచేశారు. దొరికిన మూడు కవితలూ ఆ రాజులు ఎంతగానో మెచ్చుకున్నారు.

**నేను పదేళ్లు గడిపాను / నా గడ్డి కుటీరం కోసం**
**ఇప్పుడు గాలులు ఆక్రమించాయి సగం**
**మిగతాది చంద్రుడు నిండుతున్నాడు.**
**అయ్యో నిన్ను లోనికి ఎలా రమ్మనను**
**కానీయ్ బయటే నిన్ను ఆహ్వానిస్తాను.**

**కవయిత్రుల కవిత్వం :**

చెజోన్ సామ్రాజ్యం (1392–1910) లో, వినోదాన్ని కలగజేసే నిమ్నజాతి స్త్రీలు తప్ప, తతిమా స్త్రీలందరూ కేవలం ఇంటికే పరిమితం చేయబడ్డారు. పురుషాధిపత్యం పూర్తిగా కొనసాగింది. చదువు జ్ఞాన సముపార్జనలో కూడా అదే. పురుషులకోసమే ఏర్పర్చిన కన్ ఫ్యూజియస్ సిద్ధాంతాలు, స్త్రీలు పాటించాల్సిందే. చదువుకున్న, లేదా తెలివైన సృజనాత్మకత ఉన్న స్త్రీలు, ఆ కుటుంబంలో సమస్యల్ని సృష్టించేవారుగా, దురదృష్టవంతులుగా భావించబడ్డారు.

ఎన్ని ఇక్కట్లున్నా పండితుల కుంటుంబంలో స్త్రీలు, సోదరుల ద్వారానో, తండ్రి ద్వారానో ప్రభావితులై చదువుకున్న వారు లేక పోలేదు. అలాంటి అరుదైన స్త్రీలలో, హ్వాంగ్ చిన్ ఈ (1506–1544) ఒకరు, మరొకరు హో సన్సోర్హాన్ (1563–1589). హోంగ్నంగ్ (1567–1608), మైయాంగ్ ఓక్ (16 వ శతాబ్దం) కూడా అద్భుతమైన కవిత్వం రాశారు.

హ్వాంగ్ చిన్ కొరియా కవయిత్రుల్లో నిష్ణాతురాలు. అనేక మంది అభిమానులు. ప్రేమ కవిత్వం ఎక్కువగా రాసినా తాత్త్విక చింతనతో ఉన్నవే అవి.

**నీ వేగానికి మురిసిపోకు/పరిగెడుతున్న ఓ ఆకుపచ్చ నీలం కొండ వాగూ**
**విశాల సముద్రాన్ని నువ్వొకసారి చేరుకున్నాక / తిరిగిరాలేవు నువ్విక**
**ఖాళీ కొండల్ని చంద్రకాంతి నింపుతున్నపుడు**
**ఇక్కడే ఉండిపోయి ఎందుకు విశ్రాంతి తీసుకోవు?**

రాజకీయంగా సాహిత్యపరంగా తిరుగుబాటుదారుడుగా ముద్రపడ్డ హోక్యూన్ అక్క, హో నన్సోర్హాన్. (ముఖ్యమైన కవితలు: *ఒక స్త్రీ దుఃఖం, నా సోదరుడు హగోక్ కోసం, నా పిల్లల శోకం, ఒక బీద స్త్రీ*) తండ్రితో బాటు ఆమె ముగ్గురు సోదరులు కూడా బాగా చదువుకున్న పండితులు. గుర్తింపు ఉన్న కుటుంబానికి చెందిన కిం సోంగ్నిప్‌తో వివాహం

జరిగింది. కానీ భర్తకు ఏ గుర్తింపూ లేదు. ఒక కొడుకు, కూతురు. ఆమె కంటే ముందే చనిపోయారు. అనేక ఆంక్షలు ఇబ్బందుల మధ్య బతకాల్సొచ్చేది. పెళ్లయిన స్త్రీలు మొదటి మూడు సంవత్సరాలు మూగవారుగాను, తరువాత మూడు సంవత్సరాలు చెవిటివారుగాను, ఆ తరువాత మరో మూడు సంవత్సరాలు గుడ్డివారుగా ఉన్నప్పుడే కుటుంబానికి వారు సరిగ్గా సరిపోయే స్త్రీలని, కొరియాలో అప్పట్లో చెప్పుకోదగ్గ సామెతుండేది. విధేయత గల కోడలుగా, భార్యగా అనేక కష్టాలు చవిచూసింది. అలా ఆటుపోట్ల మూలంగా, ఎందరు ప్రతిభావంతులైన స్త్రీలు, ఎంత నష్టపోయారో లెక్కలేదు. అయినా హో నన్సోర్హ్యాన్ మీద ఇవేవీ పనిచేయలేదు. ఆమె కవిత్వం అన్ని అడ్డంకుల్నీ అధికమించింది. ఆమె జీవితమే దుఃఖమయం కాబట్టి, ఆమె కవిత్వం దుఃఖపూరితం కాకుండా ఎలా ఉంటుంది. ఆమె తన స్థితిని ఇలా రాసుకుంది.

**నిన్న కాక మొన్ననే నేను యవ్వనవతిని**
**కానీ ఈ రోజుకే అప్పుడే ముసలిదాన్నవుతున్నాను**
**ఆనందంగా గడిచిన నా యవ్వనపు రోజుల్ని**
**తలుచుకుని ఏమి లాభం?**

ఏ సౌఖ్యమూ లేని వైవాహిక జీవతంతో పాటు, విషపూరిత రాజకీయాల మూలాన ధ్వంసమైన తండ్రి, అన్నయ్యల జీవితాలు, తన పిల్లల మరణాలు ఆమెను మరింత కృంగదీశాయి. ఆమె కవిత్వం స్వీయ బాధల మూలాన ఎక్కువ దుఃఖపూరితమైనా, కొన్ని కవితలు ఇతర స్త్రీల బాగోగుల్ని పట్టించుకున్నవీ ఉన్నాయి.

***ఒక బీద స్త్రీ :***

విశ్రాంతి తీసుకోకుండా రాత్రంతా ఆమె నేతపని చేస్తూనే ఉంది.

**మగ్గం చేస్తున్న శబ్దం ఒంటరిదైంది / పొర్లిస్తూ నేస్తున్న మగ్గమ్మీది పట్టుబట్ట**
**పూర్తయ్యాక ఎవరెవరి దుస్తులవుతాయో / లోహపు కత్తెరని పట్టుకున్న ఆమె వేళ్లన్నీ**
**రాత్రి చల్లదనానికి బిగుసుకుపోయి**
**ఇతరులకోసం పెళ్లి బట్టలు ఆమె తయారు చేస్తుంది.**

సంవత్సరాల తరబడి ఒంటరిగా అదే గదిలో ఉంటూ ఆమె 27 ఏళ్లకే ఆమె చనిపోయింది. ఒక గదినిండా ఉన్న ఆమె కవితలన్నింటినీ ఆమె మరణానికి ముందే కాల్చేసింది. ఆమె సోదరులు భద్రపరచిన కవితలే మిగిలాయి.

**యూన్ సోండో** (1587–1671) కవిత్వం – (ముఖ్యమైన కవితలు: *దూరం చేసే చీకటి, కొండల్లో కొత్తపాటలు, నిరుత్సాహ ప్రయాణం, జాలర్ల పంచాంగం*). కవి, సంగీతకారుడు, రాజకీయవాదైన యూన్ సోండో సిజో (15 వ శతాబ్దంలో రూపొందించ బడ్డ 3 పంక్తుల కవిత) రూపంలో ప్రావీణ్యుడైన ప్రముఖ కవి. విభిన్న మానసికావస్థ, వివిధ పద్ధతులు, అసమానమైన శైలి, తాజా గొంతుతో ప్రతి కవిత అలరారుతుంది.

**వాళ్ళంటారు మేఘాల రంగు నాణ్యమైనదని**
**కానీ అవి తరచు నల్లబడతాయి**
**వాళ్ళంటారు గాలులు శబ్దం స్పష్టమని**
**కానీ అవి తరచు వీచటం మానేస్తాయి**
**నీరొక్కటే మరి యెడతెగనిది ప్రశస్తమైనది** – (కొండల్లో కొత్తపాటలు)

యూన్ నలభయి కవితలు సిజో కవిత్వ పద్ధతికి భిన్నంగా నాలుగు రుతువుల్ని వర్ణిస్తూ రాసింది. ఒక్కో కవిత 5 పంక్తులది. మొదటి పంక్తి, మూడవ పంక్తి తరువాత వచ్చే పంక్తులు, పల్లవిగానో, అనుపల్లవిగానో వాడబడ్డాయి. సాధారణంగా, ఇందులో చాలా వరకు కవితల మాత్రల పద్ధతి ఇది (3-4-3-4, 4-4, 3-4-3-4, 3-3-3, 3-4-3-4). ప్రకృతిని చూస్తూ పరవశించి రాసిన కవితలు, ప్రకృతి పట్ల యూన్ గాఢప్రేమని తెలియజేస్తుంది.

**జాలరి పాటలు, చేపల వేటని మరిపించి**
**నా కల్పనాశక్తిని మేల్కొలుపుతుంది** – వసంత ఋతువు, 5

**భుజంమీద బరువుకి / నా గుండెని అరవకుండా ఆపలేను**
– గ్రీష్మ ఋతువు, 1

**నేను గేలం వేస్తానులే, గానీ**
**అభిలాషతో నిండిన నా ఉత్సాహం చాలు** – శరదృతువు, 4

**గడ్డి చొక్కా, టోపీతో, ఖాళీ పడవలో నేను కూర్చుంటాను**
**నా గుండె వేగంగా కొట్టుకుంటుంది** – హేమంత ఋతువు, 7

మరో సిజో కవి ఎవరూ యూన్ లా రాయలేదు. అన్ని ఋతువులకూ సరిపోయే కవి యూన్. 1652 లో హ్యోజోంగ్ చక్రవర్తి ఆజ్ఞ మేరకు రాజధానికి వచ్చినా, యూన్ రాజకీయ శత్రువులు అతనిని దూషించడం నిందించడం మూలాన వెనక్కి తెరిగి వెళ్లాల్సి వచ్చినపుడు రాసిందే *నిరుత్సాహ ప్రయాణం.*

***విశ్వసనీయ భార్య గానం*** (దీర్ఘ కవిత)

ఈ కవిత రాసిన మూలకవి ఎవరో తెలియదు. 1754ది గా భావించింది మూలమైతే, పాడే పద్ధతిలో షిన్ చాహ్యో తిరగ రాసింది (1812–1884) మధ్య. 1911 లో ఇది

మరింత ఆధునీక రించబడింది. ముఖ్యమైన ఇతివృత్తమల్లా – బతికున్న లేదా మరణించిన, ఒకే పురుషునికి స్త్రీ సేవచేయాలి. ఒకరికొకరు విశ్వాసపాత్రులైన దంపతులకు దైవాశీస్సులుంటాయి. నిరంతర ప్రయత్నం. నమ్మకంతో సామాజిక అన్యాయం తొలగిపోతుంది.

ఇది నాలుగు భాగాలుగా విభజించబడింది. మొదటి భాగంలో (ఇదే పెద్దది) వసంత సౌరభం అత్యంత అందగత్తె. నాయకుడ్ని కలవడం, అతనితో వివాహం, ఆనందంగా జీవితం గడపడం వర్ణించబడింది. రెండవ భాగంలో నాయకుడు తనతండ్రి మూలాన వసంత సౌరభాన్ని వదిలి తండ్రి దగ్గరకు పోవడం, వారిద్దరి మధ్య సంబంధాలు చెడటం, బాధలు, మూడవ భాగంలో వసంతం సౌరభం, అందానికి ఆకర్షితుడై అక్కడి అధిపతి తనను ప్రేమించమని ఆమెను వేధించడం, ఆమె తిరస్కారాన్ని తట్టుకోలేక ఆమెను నిర్బంధించి హింసించడం, అయినా ఆమెలో మార్పు రాకపోవడం, నాలుగవ భాగంలో, నాయకుడు అతని పట్ల ఆమె ప్రేమ స్వచ్ఛమైందని గ్రహించి, ఆమెని స్వీకరించడం, వారిద్దరూ చివరివరకూ ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలతో ఆనందంగా గడపడం అభివర్ణించబడింది.

ఈ కావ్యంలో చైనా నుండి ప్రవేశించిన, కన్ ఫ్యూసియస్, బౌద్ధ సిద్ధాంతాల ఆచరణలు అడుగడుగునా కనిపిస్తాయి. అక్కడి అధిపతి ఆమెను తెడ్డుతో కొట్టిన 25 దెబ్బలకు, ఒక్కో దెబ్బకు ఒక్కో కవిత చెబుతుంది. ఆమె తన విధేయతని రెండవ కవితలో ఇలా చెబుతుంది.

**ఇద్దరు భార్యలు విశ్వసనీయులు / ఇద్దరు భర్తలు కాదు**
**నా శరీరానికి తగిలిన దెబ్బలకు / నేను శాశ్వతంగా మరణించినా**
**నేనెప్పుడూ నా స్వామిని మరచిపోను**

ఈ కథాకావ్యంలో ప్రేమకావ్యం కావడం అద్భుతంగా సంగీత బాణీలు సమకూరడంతో, కొరియాలోని గ్రామ గ్రామాల్లో సైతం ఇప్పటికీ పాడుకుంటారు.

**ఆధునిక కవిత్వారంభం:**

*నీ నిశ్శబ్దం లేదా ప్రేమ నిశ్శబ్దం* – హాయోంగ్ యోంగ్ వున్ (1879–1944) కవి, రచయిత, జపాన్‌కు వ్యతిరేకంగా, కొరియా స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడు, బౌద్ధ నాయకుడు ఈ కావ్య రచయిత. అనేక నవలలతో పాటు, బౌద్ధం మీద ప్రసిద్ధ గ్రంథాలు రాశారు. ఎనభై ఎనిమిది కవితలున్న ఈ కావ్యం, సర్వదా సందిగ్ధమైన ఎవరో 'నీ' కు లేదా 'ప్రేమ'ను ఉద్దేశించి రాసింది. 1905లో జపాను, కొరియాని ఆక్రమించి, 1910 లో కొరియా రాజుని అపహరించి, అతనితో కొరియాని జపాన్‌కు అనుకూలంగా రాయించుకున్న నేపథ్యంలో వచ్చిన రచనలు హాయాంగ్ యోంగ్ వున్ వి. అయినా *నీ నిశ్శబ్దం* కావ్యం ఆధునికతని సంతరించుకుంది. టాగూరుతో పాటు, బ్లేక్, డాంటే లాంటి ఇతర కవుల ప్రభావంతో ఈ కావ్యం మార్మిక అనుభవంతో అలరారుతుంది. అలాగే ఆధ్యాత్మిక ధార్మిక భావాలతో శక్తివంతమైనదిగా కనిపిస్తుంది. ప్రేమలో, ఈ కావ్యంలోని ఇష్టులు బోధిసత్వుని ఆదర్శం, సంపూర్ణునిలో ప్రేమ, జీవకారుణ్యం, మోక్షంకోసం చేసే పనిపట్ల నిబద్ధత వగైరా అన్నీ, ప్రసిద్ధ కొరియన్ కవి సోంగ్ ఉక్ ప్రకారం – *నీ నిశ్శబ్దం* కవిత్వం, రాబోయే కవులకు సంప్రదాయాన్ని నిలబెట్టుకుందుకు, భవిష్యత్తుని ఎదుర్కొనేందుకు ఎంతగానో పనికొస్తుందని భావించారు.

ఈ కావ్యానికి రాసిన ముందుమాటల్లో కవి, ఈ కావ్య ఉద్దేశాన్ని స్పష్టంగానే రాసుకున్నారు. ప్రేమ స్వేచ్ఛ అయితే, నువ్వు స్వేచ్ఛువి కూడా. కానీ నువ్వు నిస్సహాయుడివి కావా, బిగ్గరగా వినిపించే స్వేచ్ఛపేరుతో బంధింపబడలేదా? నీకు ప్రేమ ఉందని నువ్వంటావు. నీకు కూడానా అయితే అది నీ నీడ. *చీకటి పడుతున్న బహిరంగ ప్రదేశంలో తమ ఇంటి దారిని తెలుసుకోలేకపోతున్న సాధువుల కోసం, నేనీ కవితలు రాస్తున్నాను* అని. నా పాటలు అన్న కవితల్లో మరింత స్పష్టపర్చడం చూస్తాం. అయినా ధార్మిక రాజకీయమైన నిర్దిష్టమైన ప్రయోజనం కోసం, ఉద్దేశపూర్వంగా రాసిన కావ్యంగా ఇది కనిపిస్తుంది.

**విధేయత:**

**వాళ్లు స్వేచ్ఛని ప్రేమిస్తారని ఇతరులంటారు.**
**నేను విధేయతను ఎక్కువగా ఇష్టపడతాను.**
**నాకు స్వేచ్ఛ అంటే తెలియక కాదు,**
**కానీ నీకు విధేయుడుగా ఉండాలని కోరుకుంటాను**
**విధేయతతో స్వేచ్ఛ, కంటే తీయన అది నా ఆనందం.**
**కానీ నేను వేరొకనికి విధేయుడిగా**
**ఉండమని నువ్వు అడుగితే నేనది చేయలేను,**
**ఎందుకంటే వేరొకనికి విధేయుడవడమంటే**
**నీకు అవిధేయుడు కావడం.**

**పడవ ప్రయాణికుడు:**

**నేను పడవని / నువ్వు ప్రయాణికుడివి**
**మట్టి కాళ్లతో నువ్వు నా మీద అడుగులేస్తావు నిన్ను**
**నిన్ను హత్తుకుని ఏరు దాటిస్తాను**
**నిన్ను హత్తుకున్నపుడు, / లోతున్నా లేకపోయినా,**
**ఉధృతంగా పారుతున్న ఏరున్నా నేను దాటగలను.**
**నువ్వు రానప్పుడు, / చీకటినుండి వేకువ వరకూ**
**శీతగాలుల్నీ మంచుతడినీ, / వర్షాన్నీ లెక్కచేయక,**
**నేను ఎదురు చూస్తుంటాను.**
**ఏరు దాటాక నన్ను చూడనైనా చూడకుండా**
**ముందుకు సాగిపోతావు / అయినా బాధలేదు,**
**ఇప్పుడో అప్పుడో నువ్వొస్తావు / నేను ముసలవుతున్నా,**
**రోజులతరబడి నీకోసం ఎదురు చూస్తాను**
**నేను పడవని / నువ్వు ప్రయాణికుడివి**

ఉత్తర కొరియాకు చెందిన యూన్ టొంగ్జు (1917–1945)చ టోయోలో చదువుకున్నాడు. స్వాతంత్ర్య పోరాటంలో చురుకుగా పాల్గొన్నందుకు జపానులో నిర్బంధించ బడ్డారు. స్వాతంత్ర్యం పొందిన ఆర్నెల్ల ముందు మరణించారు. 1950లో యూన్ రాసిన కవితలన్నీ పుస్తక రూపంలో వచ్చి అందర్నీ ఆకట్టుకున్నాయి.

**చెట్లు:** **చెట్లు నాట్యం చేస్తే / గాలి వీస్తుంది**
**విశ్రాంతి తీసుకుంటే / గాలి నిద్రిస్తుంది.**

కిం ఛిన (1941–) మోక్పోలో జన్మించిన కిం, వ్యంగాస్త్రాలు సంధించడంలో దిట్ట. రాజ్య వ్యతిరేక కార్యకలాపాలకు గాను జైలు పాలయ్యారు.

**అంతర్భాగం:** **ముక్కుకు సూటిగా ఉండటం మంచిదే అయినా**
**రూఢిగా మాత్రం కాదు / కవిత్వంలా**
**దాని సమస్త చీకటిలో చీకటినే రాస్తూ**
**చీకటిని సవరిస్తూ / ఎలిగోలా రాస్తూ**
**సూర్యకాంతిని తిట్టుకుంటా**

**కంగ్ ఉంగ్యో :** (1945–) సియోల్‌లో ఆంగ్లం అభ్యసించింది. సున్నితంగా రాయడమే ఆమె నిజమైన బలం.

**స్త్రీ:** **సముద్రాన్ని నెత్తిన పెట్టుకుని / ఆమె ప్రతి రోజూ వస్తుంది**
**తాజా చేపలు, చేపలని / సూర్యకాంతిలా రోదిస్తుంది**
**కాస్తయినా గాలి లేకున్నా / చిన్న అలల్లా ముడుతలు**
**ఉరిమే మేఘాలతో నిండిని చేతులు / ఎప్పుడవి వర్షిస్తాయి**
**ఎప్పుడవి వర్షిస్తాయి / ఆమె స్థిరమైన పిరుదులు**
**పొర్లుతున్న అలలు / చీకటి కంటే వేగంగా**
**పక్షి కంటే తేలికగా /సుందరంగా ఎంతో మనోహరంగా**
**ఆమె సూర్యుని పక్కన అంగలు వేస్తుంది**

కిం ఓక్ (1895–?) సాహిత్యాన్ని జపాను, టోక్యోలో చదువుకున్న కవి, అనువాదకుడు, పాత్రికేయుడు. ప్రఖ్యాత కొరియా కవి కిం సోవోల్ ఇతని విద్యార్థి. అతని కవితల్ని సంకలనపర్చిన వారు కూడా.

**రాలే పూలు:**

**పూలు ఎందుకు లక్ష్యపెట్టాలి /**
**గాలి ఏమి ప్రయత్నం చేస్తోంది?**
**సమయం వచ్చినప్పుడు, బలాత్కరించకుండా**
**అవే రాలతాయని వాటికీ బాగా తెలుసు**
**ఏ చెట్టుకీ పూవులు ఇక లేవు / ఆకులే మిగిలాయి**
**అయినా దేని మూలాన అసంతృప్తితో**
**గాలి ఇంకా బలవంతపెడుతోంది –**
**రాలుతున్న పూలు, ఆ హేతువు కోసం**
**ఎవరినీ నిందించడం లేదు / బదులుగా నాట్యం చేస్తున్నాయి**
**ఆనందంగా గాలిలో అల్లల్లాడుతూ –**

కిం సోవోల్ (1902–1934) ఈ శతాబ్దపు ప్రముఖ జానపవద కవి. అనేక కవితలకు సంగీతం సమకూర్చబడింది. ఉత్తర కొరియాలో జన్మించి, టోకియో జపానులో చదువుకున్న, కిం 10 కవిత్వ సంపుటాలు వెలువడ్డాయి. జీవితంలోని ఒడిదుడుకుల్ని తట్టుకోలేక 1934 లో ఆత్మహత్య చేసుకున్నారు. భార్యకు రాసిన ప్రేమ కవితలు కూడా అంతే ప్రాచుర్యం పొందాయి.

**కొరియాలో ముఖ్యమైన నాలుగు కవిత్వ రూపాలు :**

**హియంగ్గా (దేశీయ పాటలు)** – (935–1392) మధ్య కాలంలో వాడుకలో ఉన్న పద్ధతి. నాలుగు, ఎనిమిది, లేదా పది పంక్తుల కవితలు, బౌద్ధ భిక్షువులు ఎక్కువగా వాడారు.

**పైయోల్గోక్ (*ప్రత్యేకమైన పాటలు*) లేదా చంగ్గా (*దీర్ఘ కవితలు*):**

కోర్యో సామ్రాజ్యంలో ఎక్కువగా వాడుకలో ఉన్నది. కిసేయింగులుగా పిలవబడే వినోదాన్ని కలిగించే స్త్రీలు ఆనంద విషాదాల్ని నిర్భయంగా శక్తివంతంగా, సంగీత వాయిద్యాల సాయంతో పాడిన పాటలు.

**సిజో (వర్తమాన మాధుర్యాలు):**

(1392–1910) మధ్య ఎక్కువ కాలం మన గలిగిన ప్రక్రియ. మూడు పంక్తుల, ఒక్కో పంక్తిలో పద్నాలుగు నుండి పదహారు మాత్రలు, ప్రతి పంక్తిలో నాలుగు మాత్రల పదాలు ఎక్కువ. కన్ ఫ్యూషియన్ నైతిక మూల్యాలు, ప్రకృతి, ప్రేమ

మీద రాసిన కవితలు, మొదటి పంక్తి విషయాన్ని ప్రతిపాదిస్తుంది. రెండవ పంక్తి దాన్ని విశదీకరిస్తుంది. మూడవ పంక్తి మెలిక లేదా సంకల్పాన్ని తెలియజేస్తుంది. 18వ శతాబ్దం నుండి హంగుల్ (కొరియా భాషలో) సిజో కవిత్వం రావడం మొదలవడంతో జనసామాన్యానికి ఈ రకమైన కవిత్వం దగ్గరైంది. ఈ కాలం చివరలో (19వ శతాబ్దం) ఇది ససోల్ సిజో (వివరణాత్మక సిజో)గా రూపాంతరం చెందింది. ఇది సామాన్య జనాన్ని చేరి అతి సాధారణ సంఘటనలైన అవినీతి, వ్యాపారం కూడా అందులో చేరాయి. అయితే భాషలో మాధుర్యం స్థానంలో ధ్వన్యనుకరణతో యాస అశ్లీలత కూడా వచ్చి చేరింది.

**కస (చరణాలు):**

ఇది కూడా దాదాపు సిజో కాలంలోనే ఉన్నా అంత ప్రాచుర్యం పొందలేదు. చైనా లయాత్మక కవిత్వ ప్రభావం ఈ రూపం మీద ఎక్కువ. ఇవి కాక కొద్దికాలమే ప్రాచుర్యంలో ఉన్న 14వ శతాబ్దంలో కైయోంగ్గి, 15వ శతాబ్దంలో అక్చాంగ్ (పాటలకోసం పదాలు) కూడా ఉన్నాయి.

**నా స్నేహితులెవరో తెలుసుకోవాలనుందా నీకు?**
**నీరు, శిల, దేవదారు, వెదురు**
**తూరుపు కొండలనుంచి లేచే చంద్రుడు కూడా నా మంచి మిత్రుడే**
**అంతకంటే ఎవరికైనా ఏమి కావాలి**
**తెల్లకొంగల నుంచి ప్రశస్త శక్తుల వరకూ**
**శాశ్వత మిత్రులైన ఈ అయిదుగురుకంటే**

కొరియా సాహిత్యంలో దేవదారు, వెదురు, చేమంతి, ధైర్యం, విశ్వాసం, ఎటువంటి పరిస్థితుల్లోనైనా, లొంగని తనాన్ని సూచిస్తుంది. శప్తాల పూలు జీవితపు అశాశ్వత తత్త్వాన్ని, రేగు పూలు సున్నితమైనా శాశ్వతాన్ని, కమలం బౌద్ధుల జీవిత స్వచ్ఛతని, శిల స్థిరత్వాన్ని, బొంతకాకులు చెడు శకునాల్ని సూచిస్తాయి.

1980 ప్రాంతం నుండే కొరియా కవిత్వం ప్రపంచ భాషల్లోకి అనువాదం కాబడుతోంది. ఇప్పటికీ కొరియాలో కవిత్వానికి అంతే ఆదరణ ఉంది. ఒక్క దక్షిణ కొరియాలోనే ప్రతీ ఏటా 200 వరకూ కవిత్వ సంకలనాలు వెలువడుతున్నాయి. అవి 1000 నుండి 2000 వరకూ అమ్ముడు పోతున్నాయంటే ఆశ్చర్యమే కదూ!

కొరియోలో, కొగుర్యో సామ్రాజ్యం ముగ్గురు చక్రవర్తుల పరిపాలనలో క్రీ.శ. 660 వరకూ కొనసాగింది. ఆ తరువాత ఐక్య షిల్లా సామ్రాజ్యం (668-935); కోర్యో సామ్రాజ్యం (935-1392); ఛోసాన్ సామ్రాజ్యం (1392-1910) ఉన్నాయి. కొరియోలో రెండు కవిత్వ సంప్రదాయాలున్నాయి.

**హన్షి (చైనా అక్షరాలతో కొరియా కవుల కవిత్వం) :**

స్వీయ కృషి, వైయక్తిక క్రమశిక్షణ కోసం, చదివి ఆలోచించదగ్గవి. 2. స్వభాషా కవిత్వం అవి తప్పకుండా పాటలే. వినోదం, ఉల్లాసం కోసం మద్యం, సంగీతం, నాట్యంతో పాడి వినదగ్గవి. షిల్లా సామ్రాజ్యానికి ముందే కవిత్వం ఉంది. అధికారం, ప్రత్యేకాధికారం కొరియోలో వారసత్వం ద్వారా సంక్రమించేది. ఐశ్వర్యం కంటే, రక్తసంబంధం ఎక్కువ పనిచేసేది. యాంగ్బన్ వంశంలో జన్మించిన పురుషులకే అలా సమాజంలో ఉన్నత పదవులు లభించేవి. సాంఘిక సైనిక ఉద్యోగాలలో కూడా చిల్లిగవ్వ లేకపోయినా సరే, చేతితో మరో పని ఈ వంశం వారు చేయడం వారి ఆత్మగౌరవానికి భంగంగా భావించేవారు. చైనాలానే ప్రభుత్వ పదవులకు పరీక్షల్లో ఉత్తీర్ణులైతేనే నియమించబడే ప్రక్రియ క్రీ.శ. 958 నుండి కొరియాలో మొదలైంది. అది 1894 వరకూ కొనాసాగింది.

వ్యాకరణ పరంగా కొరియా భాష చైనా భాషకు పూర్తి భిన్నం. అయినా చైనా భాషనే అధికారిక కార్యకలాపాలకు వాడేవారు. 15వ శతాబ్దంలో, రాసే కొరియా భాష (మాట్లాడుకునే భాష కొన్ని వేల సంవత్సరాలుగా ఉంది) ఈ సామ్రాజ్యంలో సెజోంగ్ చక్రవర్తి హంగుల్ ను కనుగొన్నా, 19వ శతాబ్దం వరకూ, చైనా భాషనే కొనసాగింది.

ఫలితంగా చైనా పదాలు అనేకం, కొరియా భాషలోకి చొచ్చుకుపోయాయి. కన్ ఫ్యూషియన్ ప్రభావం మూలాన, వస్తువు సాంఘిక మానవ పరిస్థితులకు సంబంధించిందైనా, చాలా కవితల్లో భావన ప్రకృతినుండి తీసుకున్నదే. బీదరికం, అవినీతి, కట్టుబాట్ల మూలాన, ఎదిరించిన ఎవరైనా బహిష్కరణకు లేదా శిక్షకు గురయేవారు. బహిష్కరణలో కవిత్వం చదువుకుంటూ రాసు కుంటూ కాలం గడిపేవారు.



మి

## పరిశోధించని ప్రపంచం:

# కొరియా కవిత్వం

**అ**ది పారిస్ దగ్గరలో, ఫ్రాన్స్ చక్రవర్తి లూయీ XIV విశ్రాంతికోసం తరచూ వస్తుండే ఛాంబోర్డు రాజప్రాసాదం (Chateau de Chambord). విశాలమైన హాళ్ళు, వరండాలు, పాలరాతి మెట్లు, మెరిసే దీపాలగుత్తులు– ఇవన్నీ కూడా మొన్న జూన్ 2న, మళ్ళీ ఊపిరిపీల్చుకున్నాయి. అక్కడ కిం హయాసూన్ (Kim Hyesoon), హ్వాంగ్ జీ యూ (Hwang Ji-u) క్వాక్ హియో హ్వాన్ (Kwak Hyo-Hwan), కాంగ్ జియాంగ్ (Kang Jeong) – అనే కొరియా దేశపు కవులు తమ కవిత్వాన్ని చదివి వినిపించారు.

తెలియని భాష, పరిచయం లేని ఛందస్సు లయబద్ధంగా ఆ రాజప్రాసాదంలో మారుమ్రోగుతుంటే, వైన్ గ్లాసుల గలలలో, చిరుదీపాల గుత్తుల మిలమిలలో, ఇంతవరకూ *పరిశోధించని ప్రపంచం, కొరియా కవిత్వం* వీనుల విందు చేసింది.

ఈ సందర్భాన్ని నిజం చేసింది ఫ్రెంచ్ సాహిత్య పత్రిక *పోశి* (Poesie), ప్రత్యేక కొరియన్ కవిత్వం, అది కూడా ఇరవై ఏడు మంది కవులు తమ జీవితసారాన్ని కవితారూపంలో అందించిన సాహిత్యాన్ని ప్రచురించింది. అందులో కొన్ని మీ ముందుంచుతున్నాము.

1. హ్యాంగా : "సిల్లా డైనాస్టి (C 668-935) హ్యాంగా అంటే దేశీయగీతాలు. వీటిని సంప్రదాయ కవులు అంగీకరించరు. అయినా 668 నుంచి ఈ సంప్రదాయ పద్ధతి చైనా భాషలాంటి కొరియా అక్షరాల్లో ఉన్నా, ఇవి మాత్రం కొరియా ప్రజల ఆత్మనే ప్రతిధ్వనిస్తాయి" అని పీటర్ లీ (Peter H, Lee) ముందుమాటల్లో రాశారు. "ఇప్పుడు ఈ కొత్త ప్రపంచం, కొత్త కవిత్వం, సముద్రాలు, దేశసరిహద్దులు దాటి మన ముందుకొచ్చింది. భాషా భేదం మూలంగా, ఈ కవితలు అనువాదాలైనా, పూర్తిగా అర్థం చేసుకోవటం కష్టమైన పనే కాని ఆ కవితల్లోని సాంద్రత, చైతన్యం, ఉద్వేగం తప్పనిసరిగా మనకనుభవంలోకి వస్తుంది" అని డి గై (De Guy) అన్నారు.



కిం హయాసూన్
(Kim Hyesoon)



హ్వాంగ్ జీ యూ
(Hwang Ji-u)

కొరియన్ కవితలు ఆంగ్లము, జర్మన్, ఫ్రెంచ్, స్పానిష్, రష్యన్, అరబిక్ మొదలైన భాషల్లోకి అనువాదం చేయబడ్డాయి.

I

ఈదురు గాలులు నన్ను తరుముతుంటే
లోలోన కుళ్ళిపోతున్నా,
చేతులు, కాళ్ళు అన్ని దిక్కుల్లో
కరిగిపోతున్నాయి,
తల గిర్రున తిరిగిపోతోంది.
అరె! ఎవరో నా లోలోకి చూసి పారిపోతున్నారు?
నా పాదాలు కనబడటం లేదు!
అంతలోనే గాలిలోకి తేలిపోతూ
కొండకోనల్లో తిరుగుతున్నాయి?!
అరె! ఎవరో నా లోలోకి చూసి పారిపోతున్నారు?

II

చాలా దూరం, చాలా ఎత్తు చేరా,
కానీ అక్కడున్నది క్షణకాలమే.
ఇప్పటి వరకు సుదూరంగా కనిపించిన శిఖరాన్ని
నేను అందుకోనే లేదు.
ఈ జీవిత శిఖరాన్ని ఎప్పుడో ఒక్కసారి చేరుకుంటా.
నేను కాకపోతే ఈ రాళ్ళదారిన ఎవరు నడుస్తారు?
నా మోకాళ్ళు చీరుకు పోయాయి,
అప్పుడే ఈ మూర్ఖపు ప్రయాణం మానేశా.
లోకం ఈ కొండ లోయలో, నిశ్శబ్దంగా నిద్రపోతోంది,
అది చూసి మళ్ళీ నేను కూలబడ్డాను, ఒరిగిపోయా.

1

**వోల్మియోంగ్ (C 742-765) (సిల్ల డైనాస్టీ):**

చావు బ్రతుకుల
గతుకుల దారి,
నువ్వు బిక్కు బిక్కుమంటూ
నిశ్శబ్దంగా వెళ్లి పోయావు !
ఎటుపోతున్నామో మనకు తెలియదు –
చెల్లా చెదురై పడిపోతాం
ఒకే చెట్టు ఆకులైనా
శిశిరంలో రాలిపోవా?
ఈ దారిని శుభ్రపరుస్తా..
పవిత్రంగా నిన్ను కలిసే వరకు.

*– చనిపోయిన తన సోదరి స్మృతికి రాసిన కవిత.*

2

మబ్బుల దారిలో
కదిలి పోతున్న చందమామ,
ఆ మబ్బుల కోసమే పరుగెడుతోంది
**ఇరో** నదిలో, ఒకప్పుడు
**కిపా** తన ముఖాన్ని చూస్తూ నిలబడ్డాడు.
ఆ గులకరాళ్ళలో అతని
మనసు లోతుల్ని వెతుకుతా,
కిపా ! నీవు నిలువెత్తు చెట్టువి –
ఈ మంచు, ఈ చలి నీకో లెక్కా!

*– కిపా వీరుని కోసం, చు ఉండమ్ (C 742-765)*

3

***కొర్యోపాటలు:** కొర్యో డైనాస్టీ (C 918-1392) :*

*“ఇవన్నీ జానపదుల సంగీతపరమైన పాటలు. పదహారవ శతాబ్దం వరకూ ఈ సంగీత జానపద గీతాలు కొరియా ప్రజల నోళ్ళల్లో నానాయి. తరువాత సంగీతపరంగా నేటికీ వీటిని పాడుకుంటున్నారు. సంగీత సాహిత్యాలను జోడించి వాటిని అక్షరబద్ధం చేసారు”. పీటర్ హెచ్ లీ, ఆయన పరిచయ వాక్యాలలో...*

**గంటల పాట:**

ముత్యాలు రాళ్ళపాలవుతాయి,
ముత్యాలు రాలిపోతాయి
ఆ దారం తెగిపోతుందా?
నీ నుంచి వెయ్యేళ్ళు దూరమైనా
నిన్ను వెయ్యి సంవత్సరాలు వదిలి పోయినా
నా మనసు మారదు గదా?

4

**పచ్చని పర్వతం :**

ఇక్కడే వుందాం – ఇలాగే బ్రతుకుదాం
ఈ పచ్చని కొండమీద
ఈ అడవి ద్రాక్ష, ఈ వామ్ పళ్ళు తింటూ
వీటితోనే ఈ పర్వతం మీద ఉండిపోదాం,
యెల్లి, యెల్లి, ఎల్లా సియాంగ్, ఎల్లారి ఎల్లా!

5

అరవండి, అరవండి పక్షుల్లారా!
కళ్లు తెరిచి అరవండి పక్షుల్లారా
మీకంటే ఎక్కువ దుఃఖంలో వున్నా,
నిద్రలేచి ఏడుస్తున్నా
యెల్లి, యెల్లి, ఎల్లా సియాంగ్, ఎల్లారి ఎల్లా!

6

**ఋతువుల పాట:**

అక్టోబరులో ఆం!
నేను చీలిపోయిన చెర్రీని
ఒకసారి కొమ్మ విరిగి పోతే
ఎలా, ఎవరు అతికిస్తారు?
ఆం టాంగ్, టాంగ్, టారీ!

7

నవంబరు రాత్రిలో ఆం
మట్టిలో పడివున్నా
ఓ దుప్పటి మాత్రం వుంది
ఎంత ఒంటరిని ఈ రాత్రి నీవు లేకుండా!
ఆం టాంగ్, టాంగ్, టారీ!

8

డిసెంబరులో ఆయులా నేను
కారపుచెక్క పుల్లలను
నీ ముందుంచా

ఓ అపరిచిత అతిథిని, నీ కోసం,
ఆం టాంగ్, టాంగ్, టారీ!

*సీజో, సాజోల్ సీజో (జోసెన్ డైనాస్టీ 1392) : "సీజో అనేది సామాన్య ప్రతీక మూడువరసల పాటకి 18వ శతాబ్దంలో ఎక్కువగా వాడుకలో వున్న సంగీత సాహిత్యం. ఇది ఎక్కువగా సామాన్య ప్రజల నాలుక మీదే సాగి తరువాత కొరియా కవిత్వానికి ఒక రూపాన్నిచ్చిన సాధనం. ప్రజలనోళ్ళ నుంచి మూడు శతాబ్దాల తరువాత అక్షరబద్ధం కాబడింది." పీటర్ లీ ముందు మాటల్లో...*

9

***హ్వాంగ్ చినీ : (C 1506–1544)***

ఈ చలి రాత్రి నడ్డివిరుస్తా
నా రజాయిలో మడిచి ముడిచేస్తా.
మళ్లీ నా చెలి వచ్చినప్పుడే
బయటకు తీస్తా!

10

***ప్రిన్స్, ఇంప్ యాంగ్ :** (1622–1658)*

ఈదురు గాలులకు వంగిన చెట్టును
ఎగతాళి చేయకు...
వసంతంలోని పూలు అలాగే
వుండిపోతాయా?
గాలి ఈల వేసినపుడు
మంచు పూలు కురిసినపుడు
నువ్వు నన్ను పిలుస్తావు కదా!

11

***ఈ ఛోంగ్‌బో :** (1693–1766) (సాసోల్ సిజో)*

హోయింగ్‌లో నా ప్రియుడు
కుమ్‌సాంగ్ చెట్టులా నిలబడితే,
వేరులాంటి నా శరీరంతో రెండు, మూడు నెలల్లోనే
సీతాకోక చిలుక చుట్టూ సాలీడు దారంలా..
చుట్టుకుంటూ, మెల్లగా, ఒదులుగా, గట్టిగా
పై పైకి పాకుతూ, అసలు
ఖాళీ లేకుండా కమ్మేస్తా –
రాత్రనకా, పగలనకా
నీ చుట్టూ తిరుగుతూ, పెరుగుతూ అల్లుకుపోతా!
చలికాలపు తీవ్రత, పొడిగాలి
వాన, మంచూ ఇవేవీ మనల్ని విడదీయలేవు కదా!

* * *

*ఇరవయ్యో శతాబ్దంలో కొరియా కవుల్లో ప్రముఖులు కిం సోవోల్. (ఇరవైఅయిదేళ్ళకే కవితా సంపుటి ప్రచురించాడు.) "ఆయన విషాద గీతాలు, సంప్రదాయ శైలిలో ఛందోబద్ధంగా, వ్యక్తీకరణలో కొరియా జీవితాన్ని, భావోద్వేగాన్ని తెలియజెప్తాయి" డేవిడ్ మెకాన్ తన ముందు మాటలో అన్నారు.*

*కిం సోవోల్ కవిత **మూగ ప్రేమ** చాలా ఖ్యాతి గాంచినది.*

12

నేనంటే విసుగు తో
నీవు వెళ్ళిపోతుంటే–
నిశ్శబ్దంగానే నిన్ను వెళ్లనిస్తా.
యాంగ్ బయాన్‌లో
యాక్ పర్వత సానువుల నుంచి
అజలీస్ పూలన్నీ ఏరుకొచ్చి
నీ దారిలో పరుస్తా.
ఒక్కొక్క అడుగు ఆ పూల దారిలో
మెత్తగా వెయ్యి, నీవు వెళ్ళి పోతుంటే,
నేను చనిపోతున్నా
ఒక్క కన్నీటి బొట్టు కూడా రాల్చనులే!

13

**చాలా కాలం తరువాత :**

చాలా కాలం తరువాత
నా కోసం వెతుకుతావా?
నిన్ను మర్చిపోయానని చెపుతాలే,
నీ మదిలో నన్ను నిందిస్తే,
ఆం నీవు కనబడకపోతే
నేను మర్చిపోయానంటా.
ఇంకా నన్ను ఈసడిస్తే
నిన్ను నమ్మనులే, అందుకే మర్చిపోయానంటా.
నిన్ను అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ మరవలేక,
ముందు కాలంలో మర్చిపోతాలే!

14

**వేడికోలు :**

నీ పేరు ముక్కలయ్యి
నీ పేరు శూన్యంలో కలిసి
నీ పేరు సమాధానం రాక
నీ పేరును నేను చనిపోయే వరకూ
పిలుస్తూనే ఉంటా!

15

నీ కోసం నా గుండెల్లో
ఏ గూడు కట్టానో
చెప్పే లోపుగా వెళ్లిపోయావే,
ప్రియా! ఓ ప్రియతమా!

16

దిగిపోయే పొద్దు పడమటి దిక్కును మండిస్తోంది,
లేళ్ళ గుంపు దీనంగా ఏడుస్తుంటే
నీ పేరే ఎలుగెత్తి పిలుస్తా
ఈ కొండ కొన నుంచి....

17

గుండె గొంతులో కొట్టాడుతుంటే
దుఃఖంతో నిన్ను పిలుస్తూనే ఉంటా!
నా పిలుపు నిశ్శబ్ద శూన్యంలో కలిసిపోతుంది
ఈ నేల, నింగి మధ్యలో...
చివరి శ్వాస వరకూ నిన్నే పిలుస్తా!
ఒక వేళ నేను శిలగా మారినా
నీ పేరే కలవరిస్తా
ప్రియతమా! ప్రియతమా!

18

**చనిపోయే వరకూ బ్రతికే వుంటాం:**

ఎన్ని సార్లనుకున్నా
ఎందుకు బ్రతుకుతున్నానని
అమాయకంగానే, ఈ జీవితం
సెలయేరులా సాగరంలో కలిసిపోతుంది.
పని ఒత్తిడిలో నేనేమీ నలిగిపోను
మనిషి బ్రతుకుతాడు, చనిపోతాడు
అయినా కాసేపు ఆగి, ఏమిటిదంతా అనుకుంటా,
లేత ఎండలో పుట్టకట్టుకునే
చీమలాగా నేను బ్రతుకుతా,
బ్రతుకంటే ప్రేమతోనే.
దేనిగురించి బాధ?
మనిషి బ్రతుకుతాడు, చనిపోతాడు అంతేకదా!

* * *

పాక్ తూ జిన్ 1916 మార్చి 10న అన్‌సాంగ్‌లో జన్మించాడు. "ఈయన పేరు పొందిన కాలీగ్రాఫర్, మంచి శిల్పి కూడా. ఈయన పర్వతాలు, నదులు, సముద్రాలు, నక్షత్రాలు, సూర్యచంద్రులను ఆశావహంగా పిలుస్తూ కొత్త జీవితం కోసం కవిత్వాన్ని ఒలికించాడు" అంటూ పీటర్ లీ తన ముందు మాటలో అన్నారు.

19

**మరణమా :**

కత్తిమొన నా వంకే చూస్తోంది
పాత్రలోని విషం నా గొంతులోకి జారాలి
నిన్ను నేను కౌగలించుకోవాలి
మండే గుండెను నీ కోసం తెరిచి
అంతా హరాయించుకోవాలి.
ఈ నేల చివరినుంచి స్వర్గారోహణ చేయాలి.
ఒక్క సూర్యుడు, ఒక్క చంద్రుడూ
శాశ్వతంగా వెలుగు తుంటారు.
అనంత కాలం ప్రవహించే ఈ నది...
నా పాదాలు రాటుదేలి రాయిలా
ఈ నగ్న శరీరం నీ దెబ్బలన్నీ ఓర్చుకుంటుంది
నా సమాధి చుట్టూ పూలు పూసే వరకే...

20

ఆ ఒంటరి దీవిలో, అక్కడే ఉండు
సూర్యుడు దిగిపోయినా, చంద్రుడు కనపడకపోయినా
అక్కడే ఉండు,
గాలి ఊళలు వేసినా, వాన కురుస్తున్నా
పగలంతా అలలతో ఊసులాడు
ఆ చుక్కలన్నిటినీ లెక్కపెట్టుకో

గడ్డి కాయలు తిను, మంచు బిందువులతో గొంతు
తడుపుకో
పూలరేకులతో నీ ఒళ్లు కప్పుకో
నీ పేరు తడి ఇసుకలో రాయి.
అక్కడే ఎదురు చూస్తుండు,
ఆ ఒంటరి దీవిలో ఎదురు చూస్తుండు.
నా పలుకులన్నీ గాలిలో తేలివస్తాయి
వాటిని అర్థం లేవని కొట్టివేయకు
సముద్రాలన్నీ దాటి నీకు ఆనందాన్ని తెస్తా,
నా భుజాలపై ఈ రెక్కలు చూడు
నా శరీరంలోని భాగాలన్నీ కరిగి
రెక్కలై పెరుగుతున్నాయి.
వస్తాను! వస్తాను! అక్కడే ఉండు
ఆ ఉదయం కోసం వేచి ఉండు.

21

**నా బొమ్మ :**

దొర్లే రాళ్లు కొడుతున్నాయి
గాలి లోని ధూళి నన్ను కుడుతోంది.
అలలు పొంగుతూ నన్ను ముంచుతున్నాయి
ఈ అనంతకాలం, ఈ సూర్యరశ్మి నన్ను
తాడిస్తుంటే
ఈ చంద్రకిరణాలు నా మీద పడుతుంటే
ఈ చీకటి రాత్రి నన్ను పడదోస్తుంటే,
ఈ నక్షత్రధూళి కుడుతుంటే
ఆc, తేలి తూలి పడుతున్న పూలు
పూలరేకులు నన్ను కప్పివేస్తున్నాయి
గాలులు ఊపిరాడనియ్యటం లేదు,
ఓ జల్లు, ఓ వాన నన్ను తడిపేస్తోంది
మంచుపూలు, చల్లగాలి, మంచుతుఫాను
వడగళ్లు నన్ను అతలాకుతలం చేస్తుంటే
కోపంతో ఉడికిపోతున్నా
ఆందోళన, ఒంటరితనం నన్ను నలిపేస్తున్నాయి
నిరాశ నిలబడనివ్వదు .....
అబ్బే ఇదికాదు,
ప్రేమ నన్ను కాటేస్తుంటే
అంతులేని వేదనలో,
అనంతమైన నిరీక్షణలో
తృష్ణతో తునాతునకలై
నా చైతన్యం, నా ధర్మం, నిజాయితీ
ఇవే నన్ను చీల్చి వేస్తుంటే
సత్యం, శాంతి, స్వేచ్ఛ నన్ను ధ్వంసం చేస్తున్నాయి,
ఇంకా, శాశ్వత సౌందర్యం, కళా,
నన్ను నాశనం చేస్తున్నాయి.
నజరత్ జీసస్ క్రీస్తు... తండ్రీ!
నీ వాక్కు నన్ను ముక్కలు చేస్తున్నదే...

* * *

కొరియా కవి, 79 ఏళ్ళ కో యున్ (Ko Un), పేరు ఇప్పటికి నాలుగుసార్లు నోబుల్ బహుమతికి నామినేట్ చేయబడింది. ప్రచురించబడ్డ 140 సంపుటాల్లో 50 సంపుటాలు కవిత్వానివే. కొరియా భాష కాదని జపాను భాష అప్పటి ప్రభుత్వ ఒత్తిడితో నేర్చుకున్నారు. అయినా కొరియాని పొరుగువారి నుండి నేర్చుకోగలిగారు.



**కో యున్** (Ko Un)

మారి పోయి బాణాలుగా
దూసుకు పోదాం,
గాలిని చీల్చుకుంటూ దూసుకు పోదాం.
తిరోగమనం లేకుండా
తిరిగి రాకుండా
బాధతో కుళ్ళిపోతూ అక్కడే వుండి పోదాం...



**జీరీ పర్వతం:**

ఆ మంచు పర్వతాన్ని చూసినప్పుడు
నా రక్తం ఉడికి పోతుంది,
ఆ హరిత వనాన్ని చూసినప్పుడు
నా కోపం రగిలి పోతుంది,
ఆ వెదురు కింద, ఆ పర్వత లోయలో
ఇంకా, నెత్తుటి ఏరులున్నాయి,
వేగంగా పరిగెత్తి పొగులుతుంది
ఆ పచ్చికలోనే
కొండచరియ చుట్టూ తిరుగుతూనే ఉంది.
అబ్బా! అంత తెల్లటి జెండా గుడ్డ
నా కళ్లు మండిస్తోంది.

IV

తుప్పు పట్టిన కొడవలి లాంటి పేదరికంలో
ఇన్నాళ్లూ కూరుకుపోయా, కుమిలిపోయా,
మళ్ళీ వస్తామని, ఒట్టి మాటలు చెప్పి
ఒదిలి పోయారు...
ఇంకా, గుండెలు పొగులుతూనే వున్నాయి.
గడ్డ కట్టిన చలికాలం,
వెన్నాడుతున్న శబ్దాలు
సెలయేరులాగ దూకి
మళ్ళీ తిరిగి వచ్చింది
ఇది పాతపాటే
ఆ మంచుకొండను చూసినప్పుడు
నా నెత్తురు ఉడికి పోతుంది
ఆ వెదురు వనాన్ని చూసినప్పుడు
నా కోపం రగిలి పోతుంది...

నా గుండెలో సుడులు తిరుగుతూనే ఉంది
ఓ జీరీ పర్వతమా! ఓ జీరీ పర్వతమా!

V

ఎవరు చీల్చగలరు ఈ క్షితిజాన్ని?
నేలకూ, నింగికీ నడుమ రేఖ కనపడుతోందా?
ఈ రాత్రి నీరూ, నెత్తురు కలిసిపారు తోంది
అక్కడ నుంచేనా?
ఎవరు చీల్చారు ఈ కనురెప్పను?
నా లోలోతుల ఖాళీకి-
బాహిరాంతర, అగాధానికి గుర్తులు
ఈ రాత్రి అంతా కన్నీరు కురుస్తూనే ఉంది
ఆ ఖాళీ నుంచే
ఎవరు చీల్చారు? ఎవరు చీల్చారు? ఈ కనురెప్పలను!

**- అశ్వినికుమార్ కె**



**కొరియాలోని జీరీ పర్వతం**

# కర్ణాటకం - హిందూస్థానీ

- *నండూరి పార్థసారథి*

ప్రపంచ సాహిత్యంలో ప్రతి విషయానికీ, ప్రతి కళకీ ఎన్నో పార్శ్వాలుంటాయి. సంగీత కళకూ ఎన్నో పార్శ్వాలు వున్నాయి. సంగీత కళాకారులైనా, పరిశోధకులైనా, ఆరాధకులైనా ఏదో ఒక పార్శ్వం పైన, లేదా కొన్ని పార్శ్వాల పైన ప్రత్యేక ఆసక్తి కలిగివుంటారు. వాటిని గురించే మాట్లాడతారు. వాటిని గురించే కృషి చేస్తారు. అంటే, మిగిలిన పార్శ్వాలపై వారికి చిన్న చూపు వున్నదనుకోడానికి వీల్లేదు. వాటికి సంబంధించిన, అవసరమైన యోగ్యతలు వారికి లేక పోయి వుండవచ్చు. ఎవరైనా గాని తమకు తెలిసినవాటిని గురించే, తెలుసు ననుకుంటున్నవాటిని గురించే - మాట్లాడడం ఉత్తమం. తెలియని వాటి గురించి తెలియదని స్పష్టంగా ఒప్పుకోవడం కూడా అవసరం. తనకు తెలియకపోయినా అవతలివాడికి మాత్రం ఏం తెలిసి వుంటుందిలే అని దబాయించడం మంచిది కాదు. అవతలి వాడికి ఏది తెలియదని మనకు కచ్చితంగా తెలుసో దాని మీదనే ఛాలెంజ్ చేయాలనుకుంటే అవతలివాడూ అలాగే మనకు తెలియని విషయంపై ఛాలెంజ్ చేసే ప్రమాదం వుంది. అందుచేత మనకు సంగీతం గురించిగాని, మరే విషయం గురించిగాని సమస్తం తెలిసినట్లుగా నటించడం ప్రమాదకరం.

ఆకెళ్ళ వారి లేఖకు ప్రతిస్పందనగా నేను చెప్పదలచుకున్నదానికి ఇది ఉపోద్ఘాతం.

* * *

2001లో *సంగీత స్వరరాగసుధ* అనే గ్రంథాన్నీ, *స్వర కల్పనము, రాగాలాపనములు* గల తొమ్మిది ఆడియో కేసెట్లను కలిపి ఒక సెట్‌గా ఆకెళ్ళవారు విడుదల చేశారు. విద్యార్థులకు తేలికగా బోధించ గలిగేందుకు తాను రూపొందించిన స్వరలిపి పద్ధతిని ఆయన తన గ్రంథంలో వివరించారు. అది ఒక గొప్ప పరిశోధన కృషి. దాదాపు 40 సంవత్సరాల నిరంతర సాధనఫలం అది. అందులో ఆయన కైశికి నిషాద గమక విశ్లేషణ అనే శీర్షిక క్రింద కర్ణాటక సంగీతంలో కైశికి నిషాదం 21 రకాలుగా (ఛాయా భేదాలతో) ప్రయోగింపబడుతున్నదని స్వరలిపితో వివరించారు. కాగా, మళ్ళీ కొద్ది నెలల క్రితం జూలై 22 వ తేది మేము - *మిసిమి, నండూరి ఆర్ట్స్* - నిర్వహించిన సోదాహరణ ప్రసంగ కార్యక్రమంలో ఆయన 27 రకాలను పాడి వినిపించారు. ఆ కార్యక్రమమంతటినీ వీడియో రికార్డింగ్ చేశాము. *కైశికి నిషాదా*నికి అన్ని ఛాయలు ప్రపంచంలోని మరే సంగీత పద్ధతిలోనూ లేవని ఆయన ఘంటాపథంగా చెప్పారు. అంతకుముందు *మిసిమి* మే 2012 సంచికలో ఆయన ఈ *కైశికి నిషాదం* హిందూస్థానీ సంగీతంలో ఎన్ని రకాలుగా ప్రయోగింప బడుతున్నదో చెప్పగలరా? అని ప్రశ్నించారు. నేను - ఆ రకాలను పట్టుకొని లెక్కబెట్టి చెప్పలేనుగాని హిందూస్థానీలో కూడా ఇటువంటివి వుండే వుంటాయనీ, విలాయత్‌ఖాన్ గారి కొన్ని రికార్డింగ్‌లను వినిపిస్తాననీ, వాటిలోని సూక్ష్మ శ్రుతులను ఆయన ఎంత అద్భుతంగా ప్రయోగించారో గమనించవచ్చుననీ నా సమాధానంలో చెప్పాను. కైశికి నిషాదం గురించి ఆకెళ్ళవారు చెప్పిన విషయాలను కర్ణాటక విద్వాంసులలో మరెవ్వరూ చెప్పలేదు. అది ఆయన సొంత పరిశోధన. ఆయన మాత్రమే ఎందుకు చెప్పగలిగారు అంటే ఆ విషయంపై ఆయన ప్రత్యేక దృష్టి పెట్టారన్నమాట. అంటే అదొక పార్శ్వం. అందరూ అన్ని పార్శ్వాలపై దృష్టి కేంద్రీకరించలేరు. తాను సమస్త సంగీత విషయాలపైనా అథారిటీ అని ఆకెళ్ళవారు చెప్పుకోగలరా? ఎవరు ఏ పార్శ్వం పై కృషి చేసినా అది గొప్ప విషయమే.

ఆకెళ్ళవారు తమ లేఖలలో తాను *తాళశాస్త్ర విషయంలో కొంచెం ఎక్కువ లోతుకు దిగవలసి వచ్చిందిలెండి* అన్నారు. చాలా గొప్ప విషయం. ఇంకా లోతుకు సాగరగర్భం అట్టడుగు దాకా దిగడం అవసరం. అక్కడే అనర్ఘరత్నాలు దొరుకుతాయి. రత్నాకరం అంటే సముద్రం. సంగీత రత్నాకరం అంటే సంగీత సముద్రం. అందులో దొరికే అన్ని రకాల రత్నాలను ఎవరూ అన్వేషించలేరు, పైకి తీయలేరు. ఆకెళ్ళవారూ తీయలేరు. అన్నింటినీ తీయడానికి ఒక జీవితకాలం చాలదు. ఎంత మేరకు సాధించగలిగినా గొప్పే. నేను మరికొన్ని పార్శ్వాలపై దృష్టి పెట్టాను. సంగీతానికి సంబంధించి నాకున్న యోగ్యత చాలా తక్కువ. ఒకానొక చిన్న పరిధిలో నా శక్తి మేరకు పరిశోధన చేయాలని తంటాలు పడుతున్నాను. ఎందుకంటే నేను కచేరీ విద్వాంసుడిని కాను. ఎప్పుడో నలభైయేళ్ళ క్రిందట కొద్ది సంవత్సరాలు నేర్చుకొని సాధన సాగక ఆగిపోయి, నేను సాధించలేక పోయినదాన్ని - నా సితార్‌తో సహా- నా

కుమారుడికి అప్పగించాను. ఒక రకంగా నా సాధనను అతడి ద్వారా కొనసాగిస్తున్నాను. నా మనోధర్మానికి అతడు ప్రతీక. నా దిక్సూచి విలాయత్‌గారు. ఆయనతో గంటల తరబడి మాట్లాడే అవకాశం నాకు లభించింది. నా కుమారుడిని ఆయన చేతుల్లో పెట్టాను. ప్రపంచంలోని ప్రధాన సంగీత పద్ధతులన్నింటోనూ వేల వేల గంటల సంగీతాన్ని విన్నాను; సేకరించాను; వాటిని గురించి చదివాను; సోదాహరణ ప్రసంగాలు విన్నాను. ఆలోచించాను. నా సొంత ఫిలాసఫీని ఏర్పరచుకున్నాను. సంగీతానికి సంబంధించి ఇవీ నా యోగ్యతలు.

అయితే, నేను హిందూస్థానీ సంగీతం తరఫున వాదించడానికి, ఇతర సంగీత పద్ధతులను నిరసించడానికి వకాల్తా పుచ్చుకున్నట్లుగా ఆకెళ్ళవారు భావిస్తే అది చాలా పొరబాటు. ఇది హిందూస్థానీ సంగీత లక్షణం, ఇది కర్ణాటక సంగీత లక్షణం అని 'స్థూలంగా' చెప్పవచ్చుగాని, హిందూస్థానీలో ఎన్నో ఘరానాలు, కర్ణాటక సంగీతంలో ఎన్నో 'బాణీలు' వున్నాయన్న సంగతి మరచిపోకూడదు. ఘరానాలలో, బాణీలలో దేని ప్రాధాన్యాలు దానికి వున్నాయి. (వాటిని గురించి రాయడం కూడా నా ప్రణాళికలో భాగం). వాటిని గురించి ఎన్నో పరిశోధనలు, విశ్లేషణలు జరిగాయి. ప్రతి ఘరానాకి, ప్రతిబాణీకి కొన్ని ప్లస్ పాయింట్లు, కొన్ని మైనస్ పాయింట్లు వుంటాయి. ఎవరి ప్రాధాన్యాలు వారికి యింపు. ఒకరికి గోంగూర పచ్చడి యిష్టం. ఇంకొకరికి ఆవకాయ యిష్టం. ఆవకాయ కంటే గోంగూర ఏ విధంగా గొప్ప? అని ఛాలెంజ్ చేయడంలో అర్థం వుంటుందా?

ఇదంతా 'విషయాంతరం', 'అప్రస్తుతం' కాదు. ఎందుకంటే– *కైశికి నిషాదం* పై కార్యక్రమంలో చిట్టచివర ప్రశ్నోత్తరాల సందర్భంలో ఆకెళ్ళవారు *మిఠాయి గురించి ఎలా వర్ణిస్తాము? తింటేనే తీపి తెలుస్తుంది* అన్నారు. *అనేక రకాల మిఠాయిలలో ఒక్కొక్క దానికి ఒక్కొక్క ప్రత్యేకమైన రుచి వుంటుంది కదా* అని అన్నప్పుడు ఆయన నిజమేనని అంగీకరించారు. పదేళ్ళ క్రిందట కైశికి నిషాదంలో 21 రకాలు చెప్పారు. ఇప్పుడు 27 రకాలు చెబుతున్నారు. *ఇంకా కొన్నాళ్ళకు ఇంకా కొన్ని రకాలను కనుగొనే అవకాశం వుంది కదా?* అంటే నిజమేనన్నారు. *ఇదంతా మనోధర్మానికి సంబంధించిన విషయమే కదా అంటే అదీ నిజమేనని* ఆయన ఒప్పుకున్నారు. దీన్ని బట్టి మరో మహావిద్వాంసుడు మరో స్వరం గురించి పరిశోధించి అందులో కైశికి నిషాదం కంటే ఎక్కువ రకాలున్నాయని పాడి వినిపించే అవకాశం లేకపోలేదు కదా! ఇలా కొత్త కొత్త పరిశోధనలు వెలుగులోకి వచ్చినప్పుడల్లా శాస్త్రం మారిపోయిందటామా? ***మిసిమి*** సెప్టెంబరు సంచికలో నేను శాస్త్రీయ సంగీతాన్ని నదీ ప్రవాహంతో పోల్చినది ఈ దృష్టితోనే.

* * *

హైదరాబాద్ పొలిమేరలు దాటి పోకుండా ప్రపంచం మొత్తం మీద ఇంత గొప్పనగరం ఇంకోటి లేదని అనడం సమంజసమేనా? కర్ణాటక సంగీతంలోని కొన్ని ప్రత్యేక లక్షణాలు ఇతర సంగీతాలలో లేకపోవచ్చు. అలాగే ఇతర సంగీత పద్ధతులలోని కొన్ని ప్రత్యేక లక్షణాలు కర్ణాటక సంగీతంలోనూ లేకపోవచ్చు. అందుకే అన్ని రకాల సంగీతం శ్రద్ధగా విందాం, తులనాత్మకంగా పరిశీలిద్దాం, నోట్సు తీసుకుందాం.

*కైశికి నిషాదానికి 27 రకాల ఛాయలుండగా యిదే స్వరానికి హిందుస్థానీ సంగీతంలో గల వివిధ ఛాయలను నేను తెలుసుకోగోరితే చివరకు నేను చెప్పిన 27 రకాలను మాత్రమే ప్రదర్శించడం జరిగింది కాని హిందూస్థానీ సంగీత ఛాయలు మాత్రం తెలియనే లేదు* నాకు అన్నారు, ఆకెళ్ళవారు తమ లేఖలో. ఆ రోజు ఆ కార్యక్రమం మూడు గంటల పైగా జరిగింది. అది ప్రత్యేకంగా *కైశికి నిషాదం* కోసం నిర్వహించ బడింది. అయినా, ఆ విషయం కంటే విద్యార్థులకు బోధన పద్ధతులను గురించి ఆయన ఎక్కువ సేపు ప్రసంగించారు. చివరలో ప్రశ్నోత్తరాలకు కొంత సమయం పోయింది. కాగా, *కైశికి నిషాదం* పై ప్రదర్శన జరిగింది కొద్దిసేపే. అంతా రికార్డయి సిద్ధంగా వుంది. విద్యార్థులకు బోధన పద్ధతి గొప్ప అంశమే. కాని, దాని గురించి మరొక రోజు ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటుచేసుకోవచ్చు. ఇక హిందూస్థానీ సంగీతంలో ఏ స్వరానికి ఎన్ని ఛాయా భేదాలున్నాయో నేనైతే లెక్కబెట్టి చెప్పలేను కాని ఆయన లెక్కబెట్టుకోడానికి వీలుగా విలాయత్ ఖాన్ రికార్డింగ్‌లు వినిపించడానికి నేను ఎప్పుడూ సిద్ధమే. కాని, నా సంగీత భాండాగారం నా యింట్లో ఉంది. సి.డి.లు, సి.డి ప్లేయర్లు ఆడిటోరియంకు తీసుకొచ్చి వినిపించే సౌకర్యంలేదు. నా సంగీత భాండాగారాన్ని బార్లా తెరిచి పెడతాను. ఆకెళ్ళవారైనా, మరెవరైనా వచ్చి వినవచ్చు. నిజానికి వారు వచ్చి వింటామని కూడా చెప్పారు. ఎవరొచ్చినా, ఎన్నిసార్లు వచ్చినా వీనులు విందు చేస్తాను. హిందూస్థానీ సంగీతం పట్ల తనకు దురభిప్రాయం ఏమీ

లేదని నన్ను ఒప్పించటానికి కాబోలు రషీద్ ఖాన్ గానం తనను పరవశింప జేసిందనీ, అది విన్నాక యింకేదీ వినాలని పించలేదనీ ఆయన అన్నారు. రషీద్ ఖాన్ గానానికే అంతగా పరవశించి పోతే బడేగులాం అలీ ఖాన్, అమీర్ ఖాన్, విలాయత్ ఖాన్, బిస్మిల్లా ఖాన్ వంటి వారి సంగీతానికి యింకెంత పరవశించి పోతారు? 1960 దశకంలో బడే గులాం సాహెబ్ కలకత్తాలో చేసిన ఒక సోదాహరణ ప్రసంగంలో శ్రుతులను పాడి వినిపించిన రికార్డింగ్ విని తీరాలి. మద్రాస్ మ్యూజిక్ అకాడమీ వేదికపై జి.ఎన్. బి వంటి *సంగీతకళానిధి* ఎందుకు ఖాన్ సాహెబ్‌కు సాష్టాంగనమస్కారం చేశారో అప్పుడు తెలుస్తుంది.

ఆకెళ్ళవారు తమ లేఖ మొదటి పేరాలోనే.... *రత్నాకరం నుంచి దూరంగా జరిగినది హిందూస్థానీ సంగీతమా లేక కర్ణాటక సంగీతమా అనే సందిగ్ధాన్ని మొట్టమొదటి పేరాలో ఎందుకైనా మంచిదనే ఉద్దేశ్యంతో ప్రారంభించినా గాని మిగిలిన వ్యాసంలో ముఖ్యంగా కర్ణాటక సంగీతమే బాగా దూరంగా జరిగిందనే భావన ప్రస్ఫుటంగా గలిగేటట్లుగా శ్రుతుల గురించీ, స్వరాల గురించీ, రాగ సమయాల గురించీ, ఋతువుల గురించీ, రసాల గురించీ, రాగాలాపనలో స్థాయిల గురించీ, లయల గురించీ, విస్తారంగానే వ్రాసి చివరకు సామాన్య విషయంలోకి జారి పోవడం జరిగినది* అని రాశారు– ఆ విషయాలేవో పనికి రానివైనట్లు. కాలం, మార్గం, క్రియ, అంగము మొదలైన తాళాధ్యాయ విషయాలు ఆయనకి ఎంతముఖ్యమో నాకు రాగ భావాలు, రాగ సౌందర్యాలు, అంత ముఖ్యం. ఆయన అధ్యయన విషయాల పట్ల నాకు అపారగౌరవం వుంది. నేను సాధించ లేనిది ఎవరైనా సాధిస్తే, నాకు లేని జ్ఞానం ఎవరికైనా వుంటే వారిని నేను ఆరాధిస్తాను. కాని, నాకు కొన్ని నిశ్చితాభిప్రాయాలున్నాయి. తాళ పాండిత్య ప్రదర్శన కోసం రాగాన్ని బలిచేయడాన్ని నేను సహించలేను. నిబద్ధగానంలో తాళం రాగానికి ఒదిగే వుండాలి.

కచేరీలో గానాన్ని తబ్లా, మృదంగ విద్వాంసులు మింగేయడానికి ప్రయత్నిస్తే శ్రోతలు వాకౌట్ చేయడం ఖాయం. తనియావర్తంలో, లయ వాద్యకచేరీలో ఎవరెంత విజృంభించినా ఇబ్బంది లేదు. సౌందర్య దృష్టి, రాగభావంపై దృష్టి, రసావిష్కరణ, ఔచిత్యవంతమైన గమకాల ప్రయోగం– ఇవిలేని సంగీత పాండిత్య ప్రదర్శన స్వరాల రుబ్బుడు తప్ప మరేమీ కాదని నా విశ్వాసం. ఆకెళ్ళవారు చివరి పేరాలో *ఏ సంగీతం ఏ పక్కకి ఎంతదూరం ఎప్పుడు జరిగిందనే వాదం కంటే* అంటూ రాశారు. అంటే సంగీత చారిత్రక పరిశోధన శుద్ధదండగ అన్నమాట! హిస్టరీ, ఆర్కియాలజీ అంతా దండగ అన్నమాట! రత్నాకర అనంతర పరిణామాల గురించి ఇప్పటికి వంద సంవత్సరాలుగా చర్చ జరుగుతున్నది. వాటిని పట్టించుకోకూడ దనుకున్నప్పుడు. *మా దాంట్లో ఇన్ని ఛాయా భేదాలున్నాయి. మీ దాంట్లో ఎన్ని వున్నాయో చెప్పండి చూద్దాం* అని నిగ్గదీయడం దేనికి? విద్యార్థులకు సరళ పద్ధతిలో బోధన గురించి గొప్ప కృషి చేస్తున్న ఆకెళ్ళవారు దీనిపైనే దృష్టి కేంద్రీకరించి తనకు ఆసక్తిలేని రసాలు, భావాలు, అందాలు, ఔచిత్యాలు వగైరాల గురించి పట్టించుకోకుండా వుంటే మంచిది.

ఆకెళ్ళవారు మరోపేరాలో *యీ సంగీత విషయాలను అనుమాన రహితంగా, నిర్దిష్టంగా బోధించే విద్యాలయాలు గాని, విశ్వవిద్యాలయాలుగాని, వాటిలో బాధ్యతతో బోధించే అధ్యాపకులుగాని కనుచూపుమేరలో కానరాకపోవడం మన భారత జాతి దురదృష్టమనే చెప్పాలి* అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కాని, కీ.శే. విష్ణునారాయణ్ భాత్ఖండేగారు చేసిన కృషి సంగతి ఆయనకి తెలియదో, జ్ఞాపకం లేదో! ఇప్పుడు సరిగ్గా ఆకెళ్ళవారు ఆవేదన చెందినట్లుగానే వందేళ్ళ క్రిందట భాత్ఖండేగారు ఆవేదన చెందారు. హిందూస్థానీ సంగీత సర్వస్వం అనదగిన *హిందూస్థానీ సంగీత పద్ధతి* అనే 2500 పేజీల గ్రంథాన్ని మరాఠీ భాషలో నాలుగు సంపుటాల్లో ఆయన వెలువరించారు. విద్యార్థులకు సరళ పద్ధతిలో ప్రణాళికా బద్ధంగా సంగీత విద్యాబోధన చేయడం కోసం ఆయన మనదేశంలో బహుశా ప్రప్రథమంగా – స్వరలిపిని రూపొందించారు. వివిధ ఘరానాలకు చెందిన ముస్లిం ఉస్తాదులు తరతరాలుగా తమ కుటుంబ గుప్తనిధులుగా కాపాడుకొంటూ వస్తున్న కొన్ని వేల ఖయాల్ రచనలను ఆయన ఎన్నో ఉపాయాలతో సేకరించి వాటిని హిందీలో *క్రమిక్ పుస్తకమాల* పేరుతో ఆరు సంపుటాలలో ప్రచురించారు. దేశమంతటా పర్యటించి ఎన్నో గ్రంథాలయాలలోని ప్రాచీన *తాళపత్ర గ్రంథాల*ను పరిశీలించి ఉత్తర, దక్షిణ సంగీత పద్ధతుల తులనాత్మక అధ్యయనం చేశారు. ఉత్తర భారతంలో మూడు ముఖ్యనగరాలలో సంగీత కళాశాలలను నెలకొల్పజేశారు. అఖిల భారత సంగీత సమ్మేళనాలు నిర్వహించారు. దేశంలోని విశ్వవిద్యాలయాలు గాని, అకాడమీలుగాని, రాజాస్థానాలుగాని, చేయని, చేయలేక పోయిన గొప్ప కృషి భాత్ఖండే ఒక్కడు– ఒకే ఒక్కడు – చేశాడు.

ఎల్.పి రికార్డులు, సి.డి లు, డి.వి.డి లు లేని కాలంలో, ముద్రణ సౌకర్యాలు కూడా అంతగా లేని కాలంలో ఆయన ఆ పనులు చేశారు. అప్పటికింకా మద్రాస్ మ్యూజిక్ అకాడమీ ఆవిర్భవించలేదు.

* * *

కర్ణాటక సంగీతంలో తాళానికి ప్రాధాన్యం వుందనీ, హిందూస్థానీలో లయను మాత్రమే పాటిస్తున్నారనీ ఆకెళ్ళవారు అన్నారు. ఖయాల్‌ను దృష్టిలో పెట్టుకొని ఆయన ఈ మాట అని వుంటారు. అంతమేరకు అది నిజమే. కాని, హిందూస్థానీ సంగీతమంటే ఖయాల్ మాత్రవే కాదన్న సంగతి గుర్తుంచుకోవాలి– ధ్రుపద్ కూడా వుంది. ధ్రుపద్ గానంలో తాళానికి చాలా ప్రాధాన్యం వుంది. ధ్రుపద్ గానం చాలావరకు కర్ణాటక సంగీతంలోని రాగం – తానం – పల్లవిని పోలి వుంటుంది. ఇప్పుడు ఆ రెండూ ప్రాభవం కోల్పోయాయి. అందుకు కారణాలూ యించుమించు ఒకే విధంగా కనిపిస్తాయి. (ధ్రుపద్, ఖయాల్ గాన పద్ధతుల గురించి ***మిసిమి*** జూన్ 2012 సంచికలో వివరంగానే రాశాను. ఇప్పుడు అదంతా ఏకరువు పెట్టడం అనవసరం.)

ఆకెళ్ళ వారన్నట్లు కర్ణాటక సంగీతంలో తాళానికి ప్రాధాన్యం వున్నట్లే హిందూస్థానీ (ఖయాల్)లో స్వరానికి, రాగభావానికి ప్రాధాన్యం ఎక్కువ. ఖయాల్ ఆలాప్ (బోల్ ఆలాప్) అరగంటసేపు పాడితే, సితార్‌పై ఒక రాగాన్ని గంటసేపు వాయిస్తే *అంతసేపు దేనికి వాయిస్తారు?* అంటారు కర్ణాటక సంగీత శ్రోతలు. కర్ణాటకులు గంటలో అరడజను కృతులు పాడతారు. ఇది ప్రాంతీయమైన అభిరుచులు, సంప్రదాయాలు, అలవాట్లు, ప్రాధాన్యాలకు సంబంధించిన విషయమేగాని దీన్ని శాస్త్రానికి ముడి పెట్టడం తగదు. శాస్త్రంలో ఒక రాగాన్ని గంటసేపు పాడకూడదనిగాని, గంటలో అరడజను కృతులు పాడాలని గాని వుండదు.

గత వంద సంవత్సరాలలో దక్షిణ భారతంలో– అందునా కర్ణాటక సంగీతానికి కేంద్రస్థానమైన మద్రాసులో – హిందూస్థానీ సంగీతానికి ఆదరణ అంతకంతకు పెరుగుతున్నది. కాని, ఉత్తర భారతంలో కర్ణాటక సంగీతానికి అలా, అంతగా ఆదరణ పెరగడంలేదు. విదేశాలలోనూ అంతే. శ్వేత జాతీయులకు హిందూస్థానీ అయినా, కర్ణాటక సంగీతమైనా రెండూ విదేశీ సంగీతాలే కదా! వారు హిందూస్థానీని ఆస్వాదించి నట్లుగా కర్ణాటక సంగీతాన్ని ఎందుకు ఆస్వాదించలేక పోతున్నారు? కర్ణాటక సంగీతం ప్రధానంగా నిబద్ధ సంగీతం కావడం, హిందూస్థానీ సంగీతం ప్రధానంగా అనిబద్ధగానం కావడం దీనికి ప్రధాన కారణం కావచ్చు. మరీ ముఖ్యంగా హిందూస్థానీ వాద్య సంగీతం దాదాపు పూర్తిగా మనోధర్మసంగీతం. ఇందులో కళాకారుని ఊహా స్వాతంత్ర్యానికి అవధులుండవు. ఆ సంగతి అటుంచండి – త్యాగరాజస్వామి కీర్తనలని ఆయన ఉద్దేశించిన విధంగా పాడుతన్నవారెంతమంది? అసలున్నారా? ఆయన కృతులలోని రాగభావాన్ని, సాహిత్యభావాన్ని సమతూకంలో ఆవిష్కరిస్తున్న వారెందరు? త్యాగరాజు ఇలాగే కసరత్తులాగా పాడే వాడా? ఆయన గానపద్ధతి గురించి ఒక్కరూ రాయరేం? ఆయన పోయి 165 సంవత్సరాలు మాత్రమే అయింది. ఇందులో సగం కాలంలోని గానపద్ధతి మనకు గ్రామఫోన్ రికార్డుల ద్వారా, కేసెట్లు, సిడిల ద్వారా తెలుస్తున్నది. ఏ పుస్తకంలో చూసినా ఆయన్ని గురించిన కట్టుకథలూ, పిట్టకథలే. మనకు మహిమల మీద వున్న ఆసక్తి చారిత్రక వాస్తవాల మీద లేదు. తాన్‌సేన్, హరిదాస్‌ల విషయంలోనూ అంతే. తాన్‌సేన్ సంగీతంతో రాళ్ళు కరిగించాడనో, వర్షాలు కురిపించాడనో, దీపాలు వెలిగించాడనో రాస్తే చదివి పరవశిస్తాం. వారి గాన పద్ధతిపై పరిశోధన మాత్రం మనకు అక్కర్లేదు. పాశ్చాత్య సంగీత పరిశోధకులకు వాస్తవాలు ముఖ్యం. బహుశా అందుకే వాళ్ళ సంగీతానికి రాళ్ళు కరగవు, వర్షాలు కురవవు.

మన సంగీత బోధనలో స్వరాలను, తాళాలను సాధన చేయిస్తున్నారు సరే. రాగ సౌందర్యాన్ని ఆస్వాదించడం గురించి, రాగ భావాన్ని ఆవిష్కరించడం గురించి ఎందుకు బోధించరు? నా లాంటి వాడు దీని గురించి మాట్లాడితే ఇదేదో పనికిరాని విషయంగా తీసిపారేస్తారా? ఏ కళాసాధనకైనా టెక్నిక్ చాలా ముఖ్యం. కళాసాధన నిర్మాణానికి అదే పునాది. సంగీతానికైనా అంతే, స్వరాలు, శ్రుతులు, గమకాలు, మూర్ఛనలు, మేలకర్తలు, వాది, సంవాది – ఇవన్నీ సంగీత సామగ్రి. వీటిని ఎలా ఉపయోగించుకోవాలో తెలియనివాడు శాస్త్రీయ సంగీతం గానం చేయలేడు. ఇందులో ప్రావీణ్యం సాధించిన తర్వాత మనోధర్మం అనే దశ ఒకటి వుంది. అది పుస్తకాలుగాని, గురువులుగాని నేర్పగలిగినది కాదు. సాధకుడు తన వ్యక్తిగత సంస్కారంతో, ప్రతిభతో సాధించుకోవలసినది.

ఏది శాస్త్రం? ఏది మనోధర్మం ? వీటిని గరించి నా అభిప్రాయాలు మరో వ్యాసంలో... మి

# గోసంగి ఛాయలు

- కొలకలూరి మధుజ్యోతి

'గోసంగి' తెలుగు దేశంలో తెలంగాణా ప్రాంతాలలో ఉన్న ఒక సంచార దళిత కులం. అల్పసంఖ్యాక కులం, నిరక్షరాస్యత అధికం. అక్షరాస్యత అత్యల్పం. వీరిని గోసిక, గోసికోళ్ళు, గోసంగోళ్ళు, గోష్ఠికలు అని అంటారు. పశు పోషకులుగా, ఆ మాంసం అమ్ముకొనే వారుగా భావించ బడ్డారు. ఉర్దూ పదం 'ఘోష్' నుంచి వచ్చింది గోసంగి. ఘోష్ అంటే మాంసం అని అర్థం. గ్రామాల్లో ఈ మాంసాన్ని అమ్మేవారు కనుక ఆ పదం క్రమంగా గోసిక, గోసికోళ్ళు అయి గోసంగి అయింది. గోసిక, గోసికోళ్ళు అనిపించు కోవటం కంటే గోసంగి అన్నదే వారికి ఇష్టం అయిన పిలుపు అంటాడు కె.ఎస్.సింగ్.

*వీరు గోసంవారని, గోసికెవారని, గుడెసెల వారు, శారకాండ్లు, కాటి పాపల, భౌరూపుల, చాలసంతువారుగా వ్యవహరిస్తారు* అంటారు. గనిశెట్టి రాములు (*చీకటి బ్రతుకుల్లో* గోసంగిలు పు.6) ఈ పేర్లు వారి జీవికతో ముడిపడి ఉన్నట్టే ఉన్నాయి. నిరక్షరాస్యతతో కొట్టుమిట్టుతున్నది. ఈ జాతి. యాచనతో సంపాదించిందంతా తాగుడుకు తగవులకు ఖర్చై పోతుంది.

వీరు మాదిగలకు యాచకులని (Mendicants) అని Thurston అన్నా మాలకులస్థుకు కాని, మాదిగకులస్థులకు కాని కారు అంటాడు కె.ఎస్.సింగ్ *(The Scheduled Castes, P.no.567)*. వీరెక్కువగా కరీంనగర్, నిజామాబాద్, వరంగల్‌లో ఉన్నారు. వీరు స్వతహాగా దేశదిమ్మరులు.

సాధారణంగా గ్రామసేవకులుగా (సర్కారి పని) చెరువులకు కాపలా దారులుగా నీరుకట్టేవారుగా ఉన్నట్టు, వారికి జీతం ఇచ్చినట్టు కె.ఎస్.సింగ్ (1993లో బుక్ వచ్చింది) కాని వాస్తవంలో ఇది కొంత భిన్నంగా ఉంది. వారి ప్రధాన వృత్తిగా యాచకత్వాన్ని పేర్కొంటున్నారు ఈ కులం వారు. *భిక్షాటనమే జీవిత ప్రధాన మార్గంగా ఎన్నుకొని గ్రామాల్లో జీవించసాగారు. వీరు జీవనోపాధికై తంబూర* ***రామాయణం, మహాభారతం, బొబ్బిలి యుద్ధం, జగదేకవీరుని కథ, కాంబోజ రాజు, బాలనాగమ్మ, నెర్రహూల*** *వంటి బుర్రకథలు చెపుతూ కొందరు, మరి కొందరు గొల్లవారిని అడుగుకొనుటకై మల్లయ్య మందగొల్ల కథలను చెప్పుకుంటూ తమ జీవితాన్ని (చీకటి బ్రతుకుల్లో గోసంగిలు, పు.6) గడుపుతున్నారు* అంటాడు గనిశెట్టి రాములు. ఇటీవల గత ఇరవై, ముప్పై ఏళ్ళుగా (పు.7) వారు స్థిర నివాసం ఏర్పర్చుకొన్నారు కాని, తత్పూర్వం వీరు దేశదిమ్మరులు. వీరు యాచించే గ్రామాలను వాళ్ళూ వాళ్ళ పిల్లలూ పంచుకొని మరీ యాచిస్తారు. వారికి సహాయంగా స్త్రీలు ఈత కమ్మలతో చాపలు అల్లుతారు.

గోసంగి జనాభా సంఖ్య తక్కువగా ఉంది. వారి జీవన శైలి కె.ఎస్.సింగ్. చెప్పిన దాని నుంచి గనిశెట్టి రాములు చెప్తున్నది భిన్నం అవుతూ ఉంది. గనిశెట్టి రాములు చూపిన చిత్రాలు, చేసిన రచన, వీరి జీవితాన్ని కొంత లోతుగా చూసింది. వీరిని గూర్చిన జీవితం. సంస్కృతి, సాహిత్యం దాదాపు లేవు. ప్రపంచానికి తెలియదు.

1. తెలుగు సాహిత్యంలో ప్రాచీనంలో కానీ, ఆధునికంలో కానీ, దళిత సాహిత్యంలో కానీ గోసంగి జీవితం లేదు. ప్రాచీనంలో శ్రీ కృష్ణదేవరాయలు రాసిన ఆముక్త మాల్యదలో ఓ గోసంగి కథ ఉంది. శతాబ్దాలుగా ఆ కథ మరోపేరుతో మరో కులానికి ఖ్యాతిని ఆపాదిస్తూ వచ్చింది. శ్రీ కృష్ణదేవరాయలు గోసంగిని మహాత్మా అని సంబోధించిన శ్రీ కృష్ణదేవరాయల విశాల దృష్టి తర్వాత కాలంలో కనిపించకపోగా, సంకుచితమయి పోయింది. ఆ కథలో గోసంగి, ఎంతో భక్తుడు పరోపకారి. తన

గానమృతంతో భగవంతుడిని, సేవించి అనంతమైన పుణ్యాన్ని మూటగట్టు కున్నాడు. రాక్షసుడు, ఆయన పుణ్యాన్ని ఇవ్వమన్నాడు. పుణ్యంలో పాతిక శాతమైనా ఇవ్వమని దీనంగా అభ్యర్థించాడు. కనీసం ఆనాటి పాటలలో చివరి గీతాన్నైనా ఇచ్చి శాపాన్ని పోగొట్టమని పాదాలపై పడి వేడుకొన్నాడు. దానికి అంగీకరించిన గోసంగి ఆ బ్రహ్మరాక్షసి వికృత రూపాన్ని పోగొట్టాడు. రాక్షస రూపాన్ని పోగొట్టుకొన్న వ్యక్తి సోమశర్మ అనే ఆయనకు భక్తి బ్రాహ్మణుడు. ఆలయ పరిసరాలలోకి కూడా ప్రవేశం నిషేధింపబడిన ఓ గోసంకి కథ మాల దాసరి కథగా ప్రచారంలో స్థిరపడింది.

గోసంగిని మన పూర్వులు, మాల వారి గానూ మాదిగ వారి గానూ పరిగణించారే తప్ప అది ఒక అస్తిత్వం ఉన్నకులంగా గుర్తించలేదు.

**గోసంగి (సం. గోహింసక) మాదిగ వాడు.**

**సీ.... గోసంగి మాదిగ గూబరి యన, మాతంగుడగు**

*ఆం.భా. 2.289*

**క... సంగీత ఫలంబున గో సంగీ సగమైన దయ పాసగ నీవే....**

*ఆము 6.64, ద్వి. హరిశ్చ ఉ 157/పం*

అంటూ గోసంగికి మాదిగవాడనే అర్థానిస్తూ, రెండు ప్రయోగాలను శ్రీ సూర్య నారాయాంధ్ర నిఘంటువులో చూపాడు. కె.యస్.సింగ్ చెప్పిన పశు పోషకులనే మాటకు, సంబంధం ఉండేట్టు గో హింసకులనే అర్థాన్ని నిఘంటువు ఇచ్చింది. అంతే కాదు గోసంగి అనే కులం మాదిగ కులానికి భిన్నం కాదనే భావన, గోసంగి అంటే మాదిగే అనే భావన, ఈ అర్థంలో కనిపిస్తుంది.

2. గోసంగి - మాలవాడు.

**కం. ఓరోరి రాచవాడా, రారా నా వెంట దిరుగురా గోసంగివై,**
**పోరాడి మాదలిచ్చెద గోరా నీయప్పు దీర్చుకోరా పెలుచన్**

*- హరిశ్చ*

అంటూ *శబ్దరత్నాకరం* అర్థాన్ని ప్రయోగాన్ని ఇచ్చింది. నా వెంట తిరుగురా అనటంలో గోసంగి కులజుల సంచారత్వాన్ని చెప్పకనే చెప్పినట్టు అయ్యింది. ప్రయోగంలో కుల స్పృహ ఉన్నట్టు తెలుస్తుంది. దాని అర్థం ఇచ్చేటపుడు మాల కుల వ్యక్తి అనే అర్థాన్నిచ్చారు.

3. గోసంగి (రూ. గోసంగి) 1. చర్మకార జాతికి చెందిన వాడు. 2. సన్యాసి గోసంగి (రూ. గోసంగి); 3. మాదిగవాడు, గూబరి-ద్వి. హరిశ్చ ఉ. 1571 ఆమా 6.64; 4. ఆకతాయి, గురుభార్యను అపహరించినవాడు, 4. సన్యాసి, 5. పనికిమాలినవాడు.

అనే అర్థాలను వ్యుత్పత్తికోశం ఇచ్చింది. చర్మకార జాతి అన్నా మాదిగజాతి అన్నా ఒకటే. మాదిగ అనే భావనే అర్థం ఇవ్వటంలో ఉంది. గోసంగి పదాన్ని దూషణకు వాడటం ఉంది. మిగిలిన అర్థాల విషయంలో బాగానే ఉన్నా కుల విషయంలో మాత్రం మార్పు జరిగింది.

గోసంగి అంటే మాల లేదా మాదిగ అనే భావన ఈ అర్థాలలో కనిపిస్తుంది.

దళిత కులాల పట్ల సదభిప్రాయం, సదవగాహన లేని సమాజం దళిత కులాలన్నిటిని ఒక గాటకు కట్టేయటం జరిగింది. దళిత సమాజాలలోకి కన్ను సారించేంతటి వెసులుబాటుకాని, దళిత జీవితాలను గూర్చి అవగాహన చేసుకొనేంతటి సాన్నిహిత్యం కాని, అసలు వారికి కూడా ఒక క్రమత, సంస్కృతి కలిగిన జీవితం ఉంటుందని తెలుసుకొనేంతటి అవసరం లేని సమాజం, దళితులంటే మాలో మాదిగో అని మాత్రమే భావించింది. అది నేటి సమాజ చైతన్య నేపథ్యంలో మహాద్రోహంగా, అపరాధంగా భావించబడుతూ ఉంది.

ఆముక్తమాల్యదలోని గోసంగి కథ మాలదాసరి కథ కావటం ఈ స్థితినే చెబుతుంది. ఈ విమర్శలనే ఎదుర్కొంటూ ఉంది.

సమాజంలో తమ అస్తిత్వ గుర్తింపును నేటికీ వెతుక్కొనే కులం, సాహిత్యంలో కనిపించే తమ అస్తిత్వానికి తాము ప్రతినిధులుగా గుర్తింపబడక పోవటం సామాజిక చారిత్రక సాహిత్య నేపథ్యాల చేదు వాస్తవం.

ఈ అంతాన్ని గుర్తిస్తూ ప్రకటిస్తూ శ్రీ కృష్ణదేవరాయల పంచశతాబ్ది ఉత్సవాల సందర్భాన్ని పురస్కరించుకొని *గోసంగి*కి జరిగిన శతాబ్దాల ద్రోహాన్ని కంటి ముందుకు జ్ఞాన చక్షువు ముందుకు తెస్తూ గోసంగి అనే దళిత దీర్ఘ కావ్యాన్ని దళితకవి రచయిత ఎండ్లూరి సుధాకర్ వెలువర్చాడు.

***మిగతా 65వ పుటలో...***



# నెహ్రూ తో చాప్లిన్

ముందుగా ఆ ప్రదేశాన్ని చూసినప్పుడు – అది మాకు అందుబాటులో వుంటుందనుకోలేదు. మా ఆదాయం, అంత విశాలమైన నివాస స్థలాన్ని కొని ఉపయోగించటానికి సరిపోతుందనీ అనుకోలేదు.

కాని దాని యజమాని మాకు అతను ఆశించే ఖరీదు చెప్పినప్పుడు మాత్రమే మేము ఆ ఎస్టేటును తీసుకోవటానికి నిర్ణయించుకున్నాము.

ఆ విధంగా స్విట్జర్లాండ్‌లో కోర్సియర్ అనే వూరిలో నివసించటానికి ఏర్పాట్లు చేసుకున్నాను. ఆ వూరి జనాభా 1350 మాత్రమే!

తరువాత దాదాపు సంవత్సరకాలం పట్టింది – నా అమెరికన్ ఆస్తులన్నీ అమ్మి సొమ్ము చేసుకోవటానికి. ఈ లోపు పిల్లలు కోర్సియర్ వూరి బడిలోనే చదువు సాగించారు. మొదట్లో ఫ్రెంచి నేర్చుకోవటానికి కొంచెం ఇబ్బందిపడినా – తరువాత చాలా బాగా అలవాటుపడి ధారాళంగా మాట్లాడడం – చదవటం నేర్చారు. స్విస్ వాతావరణానికి, పరిసరాలకీ బాగా అలవాటుపడి సర్దుకుపోయాము.

అమెరికాతో వున్న అన్ని సంబంధాలూ మెల్లగా వదిలించుకోవాలని ప్రయత్నించి – నా రీ ఎంట్రీ పర్మిట్ అమెరికా కాన్సుల్ ఆఫీసులో ఇచ్చివేశాను. "ఏమిటి, మీరు తిరిగి అమెరికా వెళ్లరా చార్లీ?" అన్నాడు అధికారి. 'లేదండీ! మళ్లీ వెళ్లి, ఆ తతంగం అంతా నడిపే వయసు మీరిపోయింది!" అన్నాను.

'సరే – మీరెప్పుడైనా అమెరికా వెళ్లవచ్చు – మామూలు వీసాతో' అని ప్రోత్సాహించాడు – 'నేను స్విట్జర్లాండులోనే స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నాను' అన్నాను.

తరువాత ఊనా తన అమెరికా పౌరసత్వాన్ని వదులుకోవటానికి నిర్ణయించుకుంది. దానికోసం లండన్‌లోని అమెరికన్ ఎంబసీకి వెళ్లాము. దాదాపు గంటపైగా పట్టవచ్చు అన్నారు. నాకు చాలా కోపం – (బహుశా ఇది చాలాకాలంగా నాలో అణిగివుందేమో) వచ్చింది.

"ఏమిటీ నాన్‌సెన్సు – ఊనా, పద నీతో నేను వస్తాను" అని గట్టిగా అన్నాను. ఇంతలో అక్కడి గది తలుపు తెరుచుకుంది. "హలో చార్లీ – లోపలికి రండి" అని పిలిచాడు.

అప్పుడు ఆయన "అమెరికా పౌరసత్వం వదులుకునే వ్యక్తి సరైన మానసిక స్థితిలో వున్నారని మేము నిర్ధారించుకోవాలి కదా" అన్నాడు ఎంతో సౌమ్యంగా. అప్పుడు నాకు అర్థమయ్యింది, దీనిలో వున్న సమస్య. ముందుగా కేకలు పెట్టినందుకు సిగ్గుపడ్డాను.

'మిమ్మల్ని డెన్వర్ థియేటర్లో చూశాను' అని అధికారి అన్నప్పుడు ఇంకా కరిగిపోయాను. అప్పటిరోజులు, ఆ సమయం గురించీ ఆప్యాయంగా కబుర్లు చెప్పుకున్నాం. తరువాత వీడ్కోలు చెప్పి విచారంగానే బైటకు వచ్చాం.

లండన్‌లో అప్పుడప్పుడూ స్నేహితులు కలిసేవాళ్లు. పాత, కొత్త స్నేహితుల్ని కలిసినపుడు ఎంతో హాయిగా అన్పించేది. అలాంటి ఒకసారి – మాకు వచ్చిన సమాచారం కృశ్చేవ్, బుల్గానిన్ మమ్మల్ని కలవాలనుకుంటున్నారని! అదీ సోవియట్ ఎంబసీ – క్లారిడ్జ్ హోటల్ – రిసెప్షన్‌లో!

మేము అక్కడికి చేరే సమయానికి, అక్కడి లాబీ అతిథులతో క్రిక్కిరిసి పోయింది. ఆ జనంలోనుంచి మెల్లగా దారి చేసుకుని మేము వెళ్తున్నాం. రెండో ప్రక్కనుంచి కృశ్చేవ్, బుల్గానిన్ మాలాగే ఇబ్బందిపడుతున్నారు. వీలుకాక తిరిగి వెళ్లిపోతుంటే ఎస్కార్ట్ 'కృశ్చేవ్ – చాప్లిన్ వచ్చారు' అన్నాడు. ఒక్కసారిగా వారి ముఖాలు వెలిగిపోయినట్లు అనిపించింది.

ఎలాగైతే మేము కలిసి ప్రక్క గదిలోకి వెళ్లి గట్టిగా నిట్టూర్చాము. కృశ్చేవ్ 'మీ సినిమాలు చాలా ఇష్టం' అన్నప్పుడు, ఏమీ మాట్లాడలేకపోయాను. వోడ్కా ఇచ్చారు, అది నాకు కారంగా అన్పించినా ఊనాకి బాగా నచ్చింది.

నేను కృశ్చేవ్‌ని బాగా అభినందించాను, ప్రపంచ శాంతికి ఆయన చేసే కృషి చాలా సహాయంగా వుంటుందని – అంతలో అమెరికన్ రిపోర్టర్ 'సర్ – మీ అబ్బాయి రాత్రి బాగా సరదా చేశారని విన్నాము' అన్నాడు. కృశ్చేవ్ నవ్వి "నా కొడుకు చాలా బాధ్యతగల విద్యార్థి. ఇంజనీర్ కావాలని చదువుతున్నాడు అప్పుడపుడు ఆటవిడుపు తీసుకుంటాడు" అన్నాడు.

అంతలో హెరాల్డ్ స్టాసెన్ వచ్చారని కబురు వచ్చింది. కృశ్చేవ్ నా వంక చూసి 'మీకు అభ్యంతరం లేదుగా, ఆయన అమెరికన్' అన్నారు నవ్వుతూ. తలుపు తీసుకుని స్టాసెన్, భార్యతోపాటు, గ్రోమికో దంపతులు వచ్చారు. వారితో కృశ్చేవ్ గదిమూలకు వెళ్లి సంప్రదింపులు జరుపుతున్నారు.

నేను శ్రీమతి గ్రోమికోను అడిగాను, "మీరు రష్యా వెళ్తున్నారా?" అని. 'లేదు – అమెరికా వెళ్తున్నానని' చెప్పింది.

అప్పుడు నేను "అసలు అమెరికా, న్యూయార్కు, పసిఫిక్ తీరాలలో లేదు – అమెరికా – నార్త్ డకోటా – సౌత్ డకోటా, మినియాపొలిస్, ఇలా మధ్య అమెరికా ప్రజలే మంచివారు' అన్నాను.

"అవును మీరు సరిగ్గా చెప్పారు" అంది గ్రోమికో భార్య నవ్వుతూ. ఇంతలో కృశ్చేవ్ మేము వెళ్లటానికి లేచామని మా దగ్గరకు వచ్చారు. మాతో కరచాలం చేసి వీడ్కోలు చెప్పారు – అంతకు పూర్వమే ఫోటోలు తీసారు కూడా!

ఆ మర్నాటి సాయంత్రం – నేనూ ఊనా ఇద్దరమే హోటల్ 'గ్రిల్'లో భోజనం చేస్తున్నాము. అక్కడే సర్ చర్చిల్ లేడీ చర్చిల్, వున్నారు. వారు వచ్చి మా టేబుల్ దగ్గర నిలబడ్డారు! 1913 నుంచి నేను సర్ చర్చిల్‌ని కలవనే లేదు – 'లైమ్‌లైట్' లండన్‌లో విడుదలయిన తర్వాత నాకు యు.ఎ. ఆఫీసు నుంచి కబురు వచ్చింది. సర్ చర్చిల్ నా సినిమా చూడాలనుకుంటున్నారు. ప్రత్యేక ప్రదర్శనకు అనుమతి కోరుతూ. ఎంతో ఆనందంగా అంగీకారం తెలిపాను. తరువాత కొన్ని రోజులకు నాకు చక్కని వుత్తరం వచ్చింది. తమకు సినిమా బాగా నచ్చిందని అభినందిస్తూ.

ఇదిగో ఇప్పుడు ఆ గొప్పవ్యక్తి మా ముందు నిలబడి 'బాగున్నారా' అన్నారు. ఆ పలకరింపులో ఏదో ప్రత్యేకత వున్నట్ల నిపించింది. నేను వెంటనే లేచి నిలబడి నా భార్యను ఊనాని పరిచయం చేశాను. తరువాత ఊనా గదిలోకి వెళ్లిపోయింది. నేను 'మీతో కలిసి కాఫీ తాగవచ్చా' అని అడిగాను. వారితో వారు కూర్చున్నచోటుకు వెళ్లాను. లేడీ చర్చిల్ "మీరు కృశ్చేవ్‌ని కలవటం వార్తాపత్రికలలో చూశాము" అన్నారు. సర్ చర్చిల్ "నాకు కృశ్చేవ్‌తో ఎప్పుడూ ఇబ్బంది కలగలేదు" అన్నారు. ఈ సంభాషణ జరుగుతున్నంతసేపు సర్ చర్చిల్ మనసులో ఏదో వున్నట్లు అన్పిస్తోంది. అవును 1913 సంవత్సరం నుంచి చాలాకాలం గడిచిపోయింది. ఎన్నో సంఘటనలు జరిగినాయి. ఆయన ఇంగ్లాండును తన రాజకీయ చతురతతోనే కాపాడారు. కాని ఆయన ఫుల్టన్‌లో చేసిన ప్రసంగం, ఆయన వాడిన 'ఐరన్ కర్టెన్' పదం – ప్రచ్ఛన్న యుద్ధాన్ని మరింతగా జటిలం చేసిందనే అనుకుంటాను. మళ్లీ సంభాషణ 'లైమ్‌లైట్' మీదకే వచ్చింది. "మీకు రెండేళ్ల క్రితం వుత్తరం రాశానే, మీ సినిమా బాగుందని అభినందిస్తూ" అని అన్నారు. "ఆ వుత్తరం చేరిందా" అని అడిగారు. "ఆఁ – చేరింది" అన్నాను. "మరి జవాబు రాయలేదు?" అన్నారు. నేను "మీరు సమాధానం కోసం చూస్తారని అనుకోలేదు" అన్నాను క్షమించమన్నట్లు.

ఆయన అంతటితో ఆగలేదు – "అది అమర్యాద అనుకున్నాను" అన్నారు. "అయ్యో – అలాంటిదేమీ లేదండీ" అన్నాను.

"ఏమయినా మీ సినిమాలు చూసి చాలా ఆనందిస్తాను – ఎప్పుడూ" అన్నారు. నాకు చాలా ఆనందం కలిగింది.



ఇందిర, చాప్లిన్, నెహ్రూ

అంత ప్రముఖ వ్యక్తి ఇలాంటి చిన్న విషయం కూడా రెండేళ్లు గుర్తుంచుకుని మరీ అడిగారంటే.

"నేనింకా వుంది, బ్రిటిష్ సామ్రాజ్యం అంతరించి పోవటం చూడటానికి కాదు" అన్నారు. దీనిలో చాలా నిజాయితీ వుంది - ఇప్పటి పరిస్థితులు చూస్తుంటే. ఈ అంతరించిపోవటం దేనివలన? అది రాజకీయంగా కాదు - తిరుగుబాట్ల వలన కాదు - కమ్యూనిస్టుల ప్రచారం వలనా కాదు - రాళ్లు విసురుకోవటం - లేదా కుస్తీపోటీల వలనా కాదు - మరి?

**దీనికి ముఖ్యకారణం: అంతర్జాతీయ ప్రచారకర్తలు, రేడియో, టెలివిజన్ ఇంకా సినిమాలు, కారులు - యంత్రాలు, శాస్త్రపరమైన ఆవిష్కరణలు, ప్రసార సాధనాల వేగం-ఇవీ-ఇవే ముఖ్య కారణాలు సామ్రాజ్యాలు అంతరించి పోవటానికీ, ప్రపంచ రీతిలో మార్పురావటానికీ!**

స్విట్జర్లాండ్ తిరిగి రాగానే, నెహ్రూ దగ్గరనుంచి వుత్తరం వచ్చింది. దానితోపాటు లేడీ మౌంట్‌బాటెన్ పరిచయ లేఖ కూడా వుంది. నాకూ, నెహ్రూకు చాలా సామ్యాలు వున్నట్లు రాసింది ఆమె. నెహ్రూ కోర్సియర్ మీదుగా ప్రయాణం చేస్తున్నారు - నన్ను కలవాలని అనుకుంటున్నారని, నెహ్రూ - తన రాయబారుల, వార్షిక సమావేశాన్ని 'లూసెర్న్'లో జరుపుతున్నారని, నెహ్రూ నన్ను లాసెర్న్ రమ్మని రాశారు. ఆ రాత్రి అక్కడ గడిపి వుదయం కోర్సియిర్లో దింపుతారని కూడా ఉంది. ఆ విధంగా లూసెర్న్ వెళ్లాను.

నెహ్రూను చూసి ఆశ్చర్యపోయాను ఆయనకూడా నాలాగానే 'చిన్న'గా వున్నారు. ఆయనతోపాటు ఇందిర కూడా వుంది. చాలా అందంగా, ఆకర్షణీయంగా, నెమ్మదిగా వుంది!



చౌ ఎన్ లై తో చాప్లిన్

నెహ్రూ నాకు బాగా నచ్చారు. చాలా ఉత్సాహంగా, సున్నితంగా, తెలివిగా కనిపించాడు. చాలా జాగరూకతతో వున్నాడు. గొప్ప ఆలోచనా పరుడు. ముందు కొంత బెట్టుగానే వున్నా -



కారులో ప్రయాణం మొదలవగానే ఎంతో వుత్సాహంగా - ప్రపంచ రాజకీయాలు మాట్లాడాడు. నేను ఎన్నో విషయాలు అడిగాను. "ఇప్పుడు ఇండియాను ఏ వైపు నడివిస్తున్నారు? సిద్ధాంతపరంగా సోషలిజమా లేక?"

"అదేమీ లేదు అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం - పంచవర్ష ప్రణాళిక ప్రారంభించాము" అని ఎంతో విశ్వాసంతో చెప్పారు. ఆయన మాట్లాడుతూనే వున్నారు. ఆయన డ్రైవరు 70 మైళ్లు వేగంతో కారు నడుపుతున్నాడు. ఆ సన్నని రోడ్లమీద, మలుపుల్లో బ్రేకులు వేస్తూ - నాకు చాలా ఆందోళన కలిగింది. కాని నెహ్రూకు ఇదేమీ పట్టలేదు - చాలా తాపీగా ఉత్సాహంగా మాట్లాడుతున్నాడు.

ఒక కూడలి దగ్గర ఆగాము. అక్కడ ఇందిరాగాంధీ వచ్చి కలవాలి వెనక కారులో. అప్పుడు ఊపిరి పీల్చుకున్నాను. ఆయన కూతురు రాగానే అంతటి నాయకుడు ఒక తండ్రిలా 'అమ్మా జాగ్రత్త' అంటూ ఆమెను పొదివి పట్టుకుని వీడ్కోలు చెప్పారు! కాని 'నాన్నా జాగ్రత్త సుమా' అని ఆమె అంటే మరింత బాగుండేదేమో.

* * *

అప్పుడు కొరియా యుద్ధం జరుగుతున్నదేమో - ప్రపంచం చాలా చిక్కుల్లో వున్నట్లుంది - ప్రమాదపుటంచుల్లో కూడా. సరిగ్గా అదే సమయంలో చైనా రాయబార కార్యాలయం నుంచి కబురు వచ్చింది. 'సిటీ లైట్సు' సినిమాను చౌఎన్-లై కోసం జెనీవాలో ప్రదర్శన ఏర్పాటుకు అనుమతి అడుగుతూ! అక్కడే ప్రపంచ శాంతి భవిష్యత్తు నిర్ణయం జరగబోతోంది.

ఆ మర్నాడు చైనా ప్రధాని మమ్మల్ని విందుకు ఆహ్వానించాడు. మేము జెనీవా బయలుదేరేముందు ఆయన కార్యదర్శి ఫోన్‌చేసి 'బహుశా ప్రధాని రావటం ఆలస్యం కావచ్చు. చాలా ముఖ్యమైన సమావేశంలో వున్నారు" అని సమాచారం ఇచ్చారు. కాని మేము చేరే సమయానికి ఆయన



మెట్లమీద నిలబడి మాకు ఆహ్వానం పలకటం ఆశ్చర్యం కలిగించింది!

మిగతా ప్రపంచంలాగానే నేను ఎంతో ఆందోళనతో వున్నాను. ఆయన జెనీవా వచ్చిన పని ఏమయింది? ప్రపంచ శాంతి సంగతి ఏమిటి? అలాగే అడిగాను కూడా.

ఆయన నా భుజంమీద చేయివేసి, "అంతా బాగానే జరిగింది, అయిదు నిమిషాల క్రితమే" అన్నారు నవ్వుతూ.

నేను చాలా కథలు వినియున్నాను - చైనా కమ్యూనిస్టులు - 1930లో చైనా అడవుల్లోకి తరిమి వేయబడ్డారు అని. తర్వాత మావోసేటుంగ్ ఆధ్వర్యంలో అందరూ సంఘటితమై పీకింగ్ వైపు పెద్ద సంఖ్యలో కవాతులో వచ్చారని. వారితో చైనా సైన్యం, చైనా ప్రజలూ అందరూ చేరారని. వీరికి 60 కోట్ల చైనా ప్రజల మద్దతు వుందని!

ఆ రాత్రి చౌ ఎన్ లై మాకు ఆ కథంతా చాలా మనసుకు హత్తుకునేలా చెప్పారు. మావో విజయాన్ని వర్ణించారు - చైనా ప్రజల స్వాగతం - పెద్ద ఎత్తైన సభా మండపాన్ని నిర్మించారని - మావో వెనకనుంచి ఎక్కుతుంటే ముందుగా ఆయన తల కనపడగానే అక్కడ చెలరేగిన కోలాహలం - కరతాళ ధ్వనులు కేకలు - పెరిగి పెరిగి పోయింది. మావో పూర్తిగా దృష్టిలోకి రాగానే ఇక అంతులేని కోలాహలం చెలరేగింది. మావో పూర్తిగా మండపం పైకి వచ్చి అశేష జనావాహిని చూసి ఒక్కసారిగా ముఖాన్ని చేతుల్తో కప్పుకుని ఏడ్చాడని!

చైనాలో చౌ-ఎన్‌లై మావోతో పాటు ఏ విధంగా కష్టసుఖాలు పంచుకున్నాడో - ఇప్పుడు ఇంత ప్రశాంతంగా నవ్వుతూ మాట్లాడగలగటం ఎంత గొప్ప విషయం!

"నేను షాంగై వచ్చాను 1936"లో అన్నాను. "అది మేము ఇంకా 'మార్చి' మొదలుపెట్టకముందు!"

"ఇప్పుడు మీరు ఇక ఎంతో దూరం ప్రయాణం చేయవలసిన అవసరం లేదేమో?" అన్నాను నవ్వుతూ.

విందులో చైనా షాంపేన్ తాగాము (ఒకమాదిరిగా వుంది) చాలాసార్లు 'చీర్సు' కొట్టాము (రష్యన్లు కూడా ఇంతే!) చైనా ప్రజల శ్రేయస్సుకోసం - ప్రపంచ ప్రజల శ్రేయస్సుకోసం మేము 'చీర్స్' అనుకున్నాం.

**...త్వరలో విడుదల కాబోతున్న**
***చార్లీ చాప్లిన్ (నాకథ)*** గ్రంథం నుంచి...

మి





# కూచిపూడి నృత్య భారతి

– పసుమర్తి శేషబాబు

నేను కృష్ణాజిల్లా కూచిపూడిలో 1962లో జన్మించాను. నా పేరు పసుమర్తి శేషబాబు. పసుమర్తి వేణుగోపాల కృష్ణశర్మ, రాధమ్మ దంపతుల జ్యేష్ఠ పుత్రుణ్ణి. నాకు ఇద్దరు తమ్ముళ్ళు, ఒక అక్క ఉన్నారు. మా తమ్ముళ్ళిద్దరూ నాట్యాచార్యులు గానే స్థిరపడ్డారు. నా భార్య రాజేశ్వరి. ఆమె నిమ్మగడ్డ శివరామబ్రహ్మ సిద్ధాంతి ప్రసిద్ధ పంచాగకర్త, వారి మనుమరాలు.

నాకు ముగ్గురు ఆడపిల్లలు, పెద్దమ్మాయి వయోలిన్‌లో నిష్ణాతురాలు. రెండవ అమ్మాయి పాడుతుంది. మూడవ అమ్మాయి సంగీతనాట్యాలలో డిప్లొమా పూర్తి చేసింది. నేను చిన్నతనం నుండి మా వంశపారంపర్యంగా వస్తున్న విద్యను మా తండ్రిగారి వద్దే అభ్యసించాను. యక్షగానంలో వారికి వారే సాటి. అటువంటి సమర్థవంతమైన సూత్రధారుణ్ణి ఈ రోజులలో మనం చూడలేము. వారి వద్ద మేము యక్షగాన సంప్రదాయం నేర్చుకొని వాటిల్లోని దరువులను విడిగా వ్యస్తనృత్యాంశాలుగా ప్రదర్శించే వాళ్ళం.

అలా 1970 ప్రాంతాల నుండి దాదాపు 10 సం॥లు ప్రదర్శనలిచ్చాము. మా ముందు తరం కళాకారులైన మహంకాళి మోహన్, చింతా ఆదినారాయణ శర్మ, వేదాంతం మాచేశ్వరరావు వంటివారు *తాండవనృత్యకరీగజానన* అంశం చేసేటపుడు, కాగడాలు పట్టుకుంటూ తెరను పట్టుకుంటూ వారిని వేదికపైకి తీసుకురావడం, లోనికి తీసుకువెళ్ళడం వంటివి చేసేవాళ్ళు, అంటే పారిపార్శ్వకులుగా వుండేవాళ్ళం.

ఆ తరువాత 1985 జూన్ 20 నాడు కూచిపూడి నృత్య భారతి అని నాట్యాలయం స్థాపించాను. ఇప్పటి వరకు దాదాపు ఆరు వందల యాభైకి పైగా విద్యార్థులు నావద్ద శిక్షణపొందారు. వారిలో ఉద్యోగరీత్యా పైచదువుల రీత్యా విదేశాలకు వెళ్ళిపోయినవారు, మినహాయిస్తే ఈ రంగంలో ఇరవై మంది వరకు స్థిరపడి ఉన్నారు. పెద్దల నుంచి అనాదిగా వస్తున్న అభ్యాసపద్ధతిలోనే ఒక ఒరవడిని సృష్టించారు మా గురువులు. అభ్యాసం చేస్తున్న తరుణంలోనేమాలోని సృజనాత్మకతను ప్రోత్సహించేవారు.

మానాన్నగారు విద్యార్థిదశలో ఉన్నపుడు వారి గురువులైన చింతా వెంకటరామయ్యగారు, వేదాంతం లక్ష్మీనారాయణశాస్త్రి గారు నాన్న గారికి ఒక పరీక్షపెట్టారట! కటకాముఖహస్తం, చిలుక హస్తం, పద్మకోసం, ఈ మూడింటినీ ఉపయోగిస్తూ వేరే హస్తాలేవీ వాడకుండా ఏదైనా కొత్తగా నృత్యకల్పన చేయగలవా? అన్నప్పుడు నాన్నగారు సిద్ధమౌతున్న తరుణంలో ఏదో చెయ్యడం కాదు భైరవి రాగంలోని గీతం, ధ్రువతాళం, దానిని చేయమని అడిగారట. అప్పుడు నాన్నగారు ఆ గీతాన్ని ఒకసారి నెమరు వేసుకొని 10 నిముషాల వ్యవధిలోనే చేసి చూపారట. అప్పుడు వాళ్ళిద్దరూ శిష్యుని ప్రతిభకు మిక్కిలి సంతోషించి, ఆశీర్వదించారట.

ఆ సన్నివేశాన్ని మాకు చెప్పి నువ్వైతే ఎలా చేస్తావురా అని నన్నడిగినప్పుడు "నాన్నగారూ! నేను ఆనందభైరవి రాగంలోని గీతాన్ని ఎంచుకుని చేస్తాను. మీ ఆశీర్వాదంతో నా శాయశక్తులా ప్రయత్నం చేస్తాను. ఐతే మధ్యలో మీరు ఏమీ ప్రశ్నించవద్దు" అని చెప్పి నృత్యపరికల్పన చేయడం జరిగింది. దానికి నాన్నగారు చాలా సంతోషించారు.

1977లో మచిలీపట్నం సద్గురు సంగీతనృత్య పాఠశాలలో ఏలేశ్వరరావు నాగేశ్వరశర్మ క్రింద సహనాట్యా చార్యుడిగా పనిచేసే రోజులలో సంగీత విద్వాంసులు ఏలేశ్వరపు విష్ణుమూర్తి నన్ను పిలిచి "పెద్దవాళ్ళందరూ తమ శక్తికొలది ఇప్పటి వరకు నాట్యవిద్యను వృద్ధి చేసుకుంటూ వచ్చారు. మీ తరంలో మీ వంతు వచ్చింది" అని, శ్రీరాగంలోని త్యాగరాజస్వామి వారి *పంచరత్నకీర్తన ఎందరో*

*మహానుభావులు* నన్ను నృత్యరచన చేయమన్నారు. నాకు చాలా భయంవేసింది. అయినా మా పెద్దల స్ఫూర్తితో దానిని తయారుచేశాను. అది బాగానే విజయవంతమైంది. అక్కడ ఇలా చేయాలి అని కొన్ని సూచనలనిచ్చారు.

తరువాత 1979లో నేను నాగార్జునసాగర్‌కు మకాం మార్చి అక్కడ 'గౌతమ్ బాల విహార్'లో రెండు సంవత్సరముల పాటు నాట్యాచార్యుడిగా పనిచేశాను. ఆ తర్వాత సూర్యాపేటలో 'విజయభాను కళాసమితి' అని నాట్యసంస్థ అది అప్పట్లో నృత్య అకాడమీ అని ఉండేది దాని అనుబంధ సంస్థగా ఈ కళాసమితి ఉండేది. దానికి గ్రాంట్ అదీ వచ్చేది. అప్పట్లో మాకు జీతం రూ. 800/- ఇచ్చేవారు. అప్పుడు నేను ముడుంబై సీతారామాచార్యుల వద్ద కొన్ని వర్ణాలు, *సింగారించుకొని* అనే సురటి రాగంలోని త్యాగరాజ స్వామి వారి కీర్తన మొదలైనవి నేర్చుకున్నాను. వారు అప్పట్లో సినిమాల్లో ఘంటసాల వెంకటేశ్వరరావు వద్ద పాడేవారు. ఆ తరువాత నేను హైదరాబాద్ వచ్చి స్థిరపడి నా సంగీత విద్యకు సానపెట్టుకోవడానికై గురువర్యులు తంపెళ్ళ సూర్యనారాయణ వద్ద శిష్యరికం చేశాను.

వారు సుమతీకౌశల్ నృత్య ప్రదర్శనలకు గాత్ర సహకారం అందించేటపుడు ఎంత మధురంగా ఉండేదో వారి సంగీత ప్రతిభ, గాత్రం! అందుకే వాటి కాకర్షితుణ్ణై వారి దగ్గర చేరి కొన్ని మెళకువలు నేర్చుకోవడం జరిగింది. శాస్త్రీయమైన దృక్పథంలో గురువుగారి బాటలోనడుస్తూ మా తండ్రి గారి బాణీని జోడించి నా సంగీతయానం సాగించాను.

ఆ తరువాత 'సాంబశివా' అనే ఖమాస్ రాగంలోని స్వరజతి, హంసధ్వని రాగంలోని స్వరజతి, శ్యామశాస్త్రుల వారి కామాక్షీ భైరవిరాగ స్వరజతి, మైసూర్ వాసుదేవాచార్య విరచిత *'బ్రోచేవారెవరురా'* అనే కీర్తన *'ప్రక్కల నిలబడి'* అనే త్యాగరాజ కీర్తన *'క్షీరసాగర శయనా'* అనే మరొక త్యాగరాజ కీర్తన ఇంకా *'ఒకపరికొకపరి వయ్యారమై',* కదిరి నృసింహుడు *'కంబమున వెడలె', 'అప్పనివరప్రసాది అన్నమయ్య'* వంటి అన్నమాచార్య కీర్తనలు, మునిపల్లె సుబ్రహ్మణ్య కవి విరచిత ఆధ్యాత్మరామాయణ కీర్తనలు *'నమశ్శివాయతే నమోభవాయ', 'రాముని సకల గుణాభిరాముని'* వంటి కీర్తనలు, *'జయజయరమానాథ'* వంటి నారాయణతీర్థుల వారి తరంగాలు ఇత్యాది వ్యస్తనృత్యాంశా లెన్నో రూపకల్పనచేసి, దాదాపు 400 మందికి పైగా విద్యార్థులను ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలల్లో నిర్వహించు పరీక్షలకు పంపాను. వారిలో వేదాంత రాఘవ కూడా ఉన్నాడు. ఇంకా నూతి బ్రదర్స్ అని, ఇపుడు తిరుపతి మ్యూజిక్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్న డా॥ ఎస్. ఉషారాణి ఇత్యాదులెందరినో అలా పరీక్షలకు పంపాను. ఆ తరువాత మనకు చరిత్రలో యక్షగానం అంటూ మొదట దొరికినది అంటే అది *సుగ్రీవ విజయమే!* దీని కర్త కందుకూరి రుద్రకవి. ఆ తొట్టతొలి యక్షగానాన్ని జ్ఞానపీఠ అవార్డ్ గ్రహీత డా॥సి. నారాయణరెడ్డి సంకలనం చేయగా, వారి పర్యవేక్షణలో 1996లో ఆంధ్ర సారస్వత కళాపరిషత్తులో కూర్చుని సంగీతాన్ని కూర్చాను.

అదీ యక్షగాన బాణీలో, అలా చేసి దానిని ప్రస్తుతం సినిమారంగంలో 'నిహాల్' పేరుతో నేపథ్యగాయకుడుగా స్థిరపడిన కె.వి. శ్రీనివాస్‌తో పాడించడం జరిగింది. ఇక నృత్య దర్శకత్వం మా బావగారు చింతా ఆదినారాయణశర్మ చేశారు. ఇందులో కళాకృష్ణ, సుధాకర్, వెంకట్ (అర్ధనారీశ్వర) ఇత్యాదులు పాల్గొన్నారు.

ఆ తర్వాత *వందే దేవం వినాయకం* అనే నృత్య రూపకాన్ని చేశాను. దీనికి రచన వట్లూరు శ్రీనివాసాచార్యులు, సంగీతం నృత్యం నేనే! దీనిని 1994లో చేయడం జరిగింది. ఇక *శ్రీ ఖండస్థాణువు భక్తశబరి* అనే బ్నిం రచన చేసిన నృత్యరూపకం, ఇది 1996లో. 2000 సం॥లో *కిరాతార్జునీయం, శ్రావణలక్ష్మి* అనే నృత్యరూపకాలు చేశాను. వీటిరచన డా॥ వేదాంతం రామలింగశాస్త్రి. *గంగావతరణం* అనే రూపకం జంధ్యాల జయకృష్ణ బాపూజీ వ్రాసినది తీసుకుని నృత్య దర్శకత్వం వహించి సికింద్రాబాద్ గణపతి ఆలయంలో ప్రదర్శించాము. ఇది 2006 ఆ తరువాత *శివపదం* అనే రూపకం మూడు భాగాలుగా చేశాను.

మొదటి భాగం 2007లో హరిహరకళా భవన్‌లో, 2008లో రెండవభాగం రవీంద్రభారతిలో చేశాము. వీటి రచన సమన్వయ సరస్వతి శ్రీసామవేదం షణ్ముఖశర్మ, వారి రచనలకు సంగీతం చేయడం, నృత్యంకూర్చడం నా అదృష్టంగా భావిస్తున్నాను. మూడవ భాగాన్ని 2011లో ఫిబ్రవరి 7వ తేదీన హరిహర కళాభవన్‌లో సమర్పించ బోతున్నాం. ఇంతకు ముందు మా పూర్వులు చేయించే *గోపికా కృష్ణ*ను కూడా మరల నేను తయారు చేశాను. అలాగే నేను కూచిపూడిలో చదువుకొనే రోజులలో మా సిద్ధేంద్ర ఓరియంటల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులైన ముక్తి



నూతలపాటి సుబ్బారావుచే రచింపబడిన *రాధా వంశీధర విలాసం* అనే నృత్యరూపకాన్ని కూడా తయారుచేశాను. మరియు నేను *రుక్మిణీకల్యాణం* అనే రూపకాన్ని తయారు చేస్తున్నాను. వీటన్నిటికీ నాకు చేదోడు వాదోడుగా ఉంటూ, నాకు సహాయకురాలిగా మా మూడో అమ్మాయి సాయిదీపిక నిలబడేది.

ఇవి గాక మా చిన్నతనంలో మా నాన్నగారు దర్శకత్వం వహించిన 'పార్వతీ పరిణయం' యక్షగానం. దీని రచయిత శ్రీ దండిభొట్ల వెంకటశాస్త్రి. వీరి మనుమడు ఇప్పుడు కేంద్రీయ విశ్వ విద్యాలయంలో నృత్యవిభాగంలో సంగీత కారుడిగా, గాయకులుగా పనిచేస్తున్నారు. వారు కేవలం సంగీతంలోనే గాక నృత్యసంగీతంలో అందెవేసిన చేయి అని చెప్పాలి. అంతే గాక పద్మభూషణ్ డా॥ వెంపటి చిన్న సత్యం నృత్యరూపకాలలో దాదాపు అన్నిటినీ పాడినటువంటి వ్యక్తి, సంగీతపులోతు బరువు తెలుసుకున్న వ్యక్తి అతనే చి॥ డి.ఎస్.వి. శాస్త్రి, మా నాన్నగారి శిష్యుడే! మరి అతని యొక్క తాతగారంటే ఇంకా ఎలా ఉంటారు చెప్పండి! వారు వడాలి గ్రామం నుంచి కూచిపూడి వచ్చి 'నా రచనకు మీరు సంగీతం నృత్యం సమకూర్చాలి' అని ఛలోక్తులుగా మా నాన్నతో మాట్లాడటం మా చెవులలో ఇప్పటికీ వినపడుతూనే ఉన్నాయి.

అలా మా నాన్న ప్రథమంగా చేసిన ఆ యక్షగానాన్ని ఆ తరువాత వేదాంతం రాధేశ్యాం, నేను, భాగవతుల సేతురాం వంటి వాళ్ళం చేస్తూనే ఉన్నాము. అలాగే *కుశలవచరితం* అనే రామనాటకాన్ని, ఆ రోజులలో ఐదు రోజులు ప్రదర్శించే యక్షగానాన్ని కాలాను గుణంగా దాదాపు 3 గంటల నుండి గంటన్నర వరకు కుదించి చేశాము. ఇందులో ప్రతి పాత్ర ప్రవేశం ముందూ నిష్క్రమణ అయ్యాక సంధివచనాలుండేవి. అవన్నీ ఈనాడు చూపలేము కదా! అంత సమయం ఈనాటి ప్రేక్షకులకు లేదు.

ఇందులో వాచకాభినయం ఎక్కువున్నా నేను దానిని కుదించి శాస్త్ర బద్ధంగా చేయడం జరిగింది. అలాగే సంప్రదాయ యక్షగానమైన *భక్త ప్రహ్లాదను, భామాకలాపాన్ని, గొల్లకలాపాన్ని* ఈనాడు ప్రచారంలోకి తెచ్చాము. ఇక మా నాన్నగారు 2000 సం॥లో అనుకుంటా, సెంట్రల్ యూనివర్సిటీలో *శశిరేఖాపరిణయం* యక్షగానం శిక్షణా తరగతులు నిర్వహించినపుడు వారికి సహాయకుడిగా నేను పనిచేశాను.

అలాగే వారు తెలుగు విశ్వవిద్యాలయంలో *ఉషా పరిణయం* బోధించినపుడు కూడా సహాయకుడిగా ఉన్నాను. తరువాత సాంస్కృతిక శాఖ వారి ఆధ్వర్యంలో కూచిపూడి నాట్యశిక్షణాశిబిరం బోయిన వెంకటేశ్వరరావు కాలంలో నిర్వహించగా దానిలోనూ నాన్నగారి ప్రక్కన సహాయకుడిగా నిలిచాను. అలా సంప్రదాయ యక్షగానాలు చేసేటప్పుడు పాత సంప్రదాయ పరంపరనే కొనసాగించాను గానీ, నాదంటూ ప్రత్యేక అంశాలను, బాణీని నేను చొప్పించ లేదు. ఎందుకంటే ఆ పరంపర అలా కొనసాగించడమే నా అభీష్టం. పైగా నేనంత పెద్దవాణ్ణికాదు.

ఐతే నాదంటూ స్వయంగా చేసుకొనే సందర్భాలలోనే తప్ప ప్రయోగాలు చేయడంగానీ, కొత్త పంథాలలో వెళ్ళడం గానీ పూర్వుల బాణీలో జోక్యం చేసుకోను. ఆ సంప్రదాయాన్ని అలాగే ఉంచి, నృత్య రూపకాలు నవ్యరీతిలో చేసుకుంటూ రెండింటినీ సమన్వయ పరచుకుంటూ గురువులు చూపిన మార్గంలోనే నడుస్తున్నాను.

**గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః**
**గురసాక్షాత్ పరబ్రహ్మా తస్మైశ్రీ గురువేనమః**

పాటిబండ్ల ఆనందరావు

# పడమటి గాలి

– మిసిమి


ఆనందరావు

తెలుగులో నాటకాలు సంస్కృత నాటకానికి ప్రతీకలు కావు. అవి స్టేజి, తెరలు, మైకు మున్నగు ఆధునిక హంగులను ఉపయోగించుకున్న పాశ్చాత్య నాటకాలకు అనుకరణలు. పార్శీ నాటక కంపెనీలు, సురభివారి వల్ల ఈ తరహా శైలి ప్రజలలోనికి చొచ్చుకొని పోయింది.

తెలుగు నాటక రంగంలో అత్యంత విజయవంతమైనవి పౌరాణిక నాటకాలయిన *పాండవోద్యోగ విజయాలు, గయోపాఖ్యానం, సత్యహరిశ్చంద్ర* లాంటివి. ఇందులో నటనకంటే రాగయుక్తంగా పాడే పద్య పఠనానికే ప్రాధాన్యత. ఆ తరువాత కాలంలో ఎక్కువగా ప్రదర్శన లివ్వబడ్డ సాంఘిక నాటకం సుంకర సత్యన్నారాయణ వ్రాసిన *మా భూమి*. ఆ కాలంలోనే వచ్చిన మరో ప్రజాదరణ పొందిన నాటకం సుబ్బిశెట్టి ఆల్ ఇన్ ఆల్ గా ఉన్న *చింతామణి*. ఆ తరువాత కాలంలో అంతా తానై నడిపిన నాగభూషణం *రక్త కన్నీరు*. ఇవి వందలాది ప్రదర్శనలకు నోచుకొని బహుళ జనాదరణ పొందాయి. అలా అనేక నాటకాలు వచ్చాయి. ఈ మధ్యకాలంలో క్లాస్, మాస్ తేడా లేకుండా గొప్ప ప్రజాదరణకు నోచుకున్న నాటకం – ***పడమటి గాలి***. సాంఘిక ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజల మనస్సులోకి సూటిగా దూసుకుపోయేలా తయారు కాబడ్డ ఈ నాటకం నాంది ప్రస్థావన నుండి చివరి వరకూ ఉత్కంఠతో సాగిపోతుంది.

**నాంది:** ఎక్కడో కొన్ని వేల మైళ్ల దూరంలో, సముద్రాల కవతల... ఓ బహుళ జాతి కంపెనీ మెదడులో కొత్త వ్యాపారపు ఆలోచన మెరిసింది. భారతదేశంలోని మారుమూల పల్లెతల్లి గుండె చప్పుడు మారింది. చేను చెంప చెమ్మగిల్లింది.

**ప్రస్తావన:** ఆర్థిక విధానం సరళీకృతమౌతుంది. ప్రపంచీ కరణలో దళారి భూతం బలిసి పోతూంది. మాఫియా నీడలో మాదక ద్రవ్యాల విజృంభణ కొనసాగుతూంది. మీడియా విస్ఫోటనం జెంది, విష సంస్కృతిని వెదజల్లి, పట్టణాన్ని కబళించి, పల్లె పైకి పంజావిప్పింది. స్పీడ్ మనీ, యీజీ మనీ, విలాస జీవిత లాలస మనిషిని పిచ్చివాడ్ని చేస్తున్నయ్. ప్రేమానురాగాల ముద్దగా వుండ వలసిన మనిషి కలుషితమై, వికృతత్వాన్ని పొందుతున్నాడు. మానవ సంబంధాలు విచ్ఛిన్నమౌతున్నయ్. సహజత్వం, సౌందర్యం, సంస్కృతి ధ్వంసమై పోయి పల్లె పరాయీకరణ జెందుతూంది.

ఈ నేపథ్యంలో మట్టితోను, చెట్టుతోను సజీవ సంబంధాన్నేర్పరుచుకున్న ఓ మట్టి మనిషి తన వ్యక్తిత్వాన్నీ, అస్తిత్వాన్నీ నిలుపుకోవాలనుకున్నాడు. కథా నేపథ్యం ఒక పల్లెటూరు. అది ఇప్పుడిప్పుడే పట్టణ వాసనలు ఒంటబట్టించు కుంటుంది.

కథాంశం లోకి వెళ్తే... బహుళ జాతి సంస్థ ఒకటి ప్రభుత్వ అనుమతితో ఒంగోలు సమీప గ్రామంలో భూమి సేకరించి కంపెనీ నిర్మాణం చేపట్టాలనుకుంటుంది. రంగన్న రాజకీయ నాయకుడు, అతడు భూమి సేకరణకు పూనుకుని రంగనాయకులు అను ఆసామిని, ఒంగోలు సమీప గ్రామంలోని మరో ఆసామిని కోడిపెంట అంజయ్య దగ్గరకు పంపి విషయాన్ని తెలియజెప్పి రహస్యంగా ఉంచాల్సిందిగా కోరుతాడు. రంగనాయకులు కార్యాన్ని నెరవేర్చి భూసేకరణ వల్ల కలిగే ప్రయోజనాలు, దక్కే ప్రతిఫలం వివరాలు అందిస్తాడు. విషయం అర్థం చేసుకున్న అంజయ్య తన పని చేయడం ప్రారంభిస్తాడు. రంగనాయకులు నిర్దేశించిన భూమిలో నాలుగు ఎకరాలు మినహా మిగిలినదే తనది కావడం వల్ల అంజయ్య సంతోషిస్తాడు.

అంజయ్య మాయోడును ఉపయోగించి రాంకోటి అను రైతు యొక్క నాలుగు ఎకరాల భూమిని సొంతం చేసుకోవడానికి ప్రయత్నం చేస్తాడు. ప్రాణాల మీదకొచ్చినా భూమిని అమ్మకూడదనే తాతల కాలం నాటి మాటకు విలువనిచ్చే రైతు రాంకోటి. భూమిని అమ్మమని రాంకోటిని మాయోడు అడుగుతాడు. ఆగ్రహించిన రాంకోటి చేతిలో దెబ్బలు తిని బయటపడతాడు. రాంకోటి కొడుకు రాంపండును మాయోడు మాయ మాటలతో చేరదీసి తండ్రికి

దూరం చేస్తాడు. నిజా నిజాలు గ్రహించని రాంపండు తండ్రికి దూరమై ఆర్థికంగా మానసికంగా దెబ్బతింటాడు. చివరికి తండ్రిని చంపైనా ఆర్థిక ఇబ్బందుల నుంచి తప్పించుకోవాలనే స్థితికి వస్తాడు. తరువాత పశ్చాత్తాప పడి తల్లిదండ్రులకు ముఖం చూపలేక భార్యాబిడ్డలను వారికి అప్పగించి వేరే ఊరు వెళ్ళిపోతాడు. పురిటిబిడ్డను చారెడు విత్తనాలను లచ్చిందేవి చేతికందిస్తే, రాంకోటి *"లచ్చిందేవి ఈ దిబ్బ మీదికి కొత్తనెత్తురొచ్చింది. నా ఒంట్లో కొత్త సత్తువొచ్చింది. ఉక్కు ముక్కలలా నా రెక్కలుండాయి. నా పక్కన నువ్వుండావు, నాకోడలుంది, ఎయ్యిమంది పెట్టు నా మనవడుండాడు. నా పిడికిట్లో విత్తనాలుండాయ్. మళ్ళీ మట్టిని మొలిపిస్తా",* అంటూ పిడికిలి బిగించిన రాంకోటి మాటలతో నాటకం ఆశావాహంగా ముగుస్తుంది. (అది రచయిత ఆకాంక్షగానే అనిపిస్తుంది) బరువెక్కిన గుండెతో ప్రేక్షకులు బయటకు వస్తారు.

అయితే రా.వి. శాస్త్రి కథలా, కన్యాశుల్కంలా మరికొన్ని క్లాసిక్స్‌లా ఇది అసంపూర్ణంగా ముగిసిందనిపిస్తుంది.

సాంఘిక ప్రయోజనాన్ని ఆశించి సందేశమిచ్చే నాటకాలలో ఎక్కువ మంది పాత్రధారులు ఉపన్యాస ధోరణిలో సంభాషణలు చెబుతూ ఉంటారు. ఇందులో అలా కాక పల్లెటూరి వారి మాట తీరుతో జీవన వాఖ్యానం అన్యాపదేశంగా చెప్పబడింది.

పల్లెటూర్లలో మనుష్యులను పేర్లతోగాక మారుపేర్లతో పిలవడం అలవాటు. అవి ఆ వ్యక్తుల ప్రత్యేకతను చాటుతాయి. 'ఒంటేలోడు' బట్టలలో ఒంటేలు పోసుకుంటాడని వాడికా పేరు వచ్చింది. ఎప్పుడూ కఱ్ఱ పట్టుకుని తిరిగే మరొకడు వున్నాడు. అతని పేరు కఱ్ఱోడు. నటి శ్రీదేవిని పెండ్లి చేసుకోవాలనే ఒక వెర్రి బాగులోడున్నాడు, వాడి పేరు శ్రీదేవి మొగుడు. క్రమేపీ అది మొగుడయింది. అలానే కోడి పెంటంజయ్య, మాయలోడు లాంటి పాత్రలు. ఇటువంటి పాత్రలతో కథ సాగుతుంది.

రంగనాథం లాంటి ఆశావాదులు, కోడి పెంటంజయ్య లాంటి అవకాశవాదులు, కల్లబొల్లి కబుర్లతో ప్రజలను బోల్తా కొట్టించి తమ పబ్బం గడుపుకునే గోముఖవ్యాఘ్రం లాంటి మాయలోడు లాంటి పాత్రలను, వాటి స్వభావాలను, మాటతీరును ఎంతో సహజంగా రచయిత ఒడిసి పట్టుకున్నాడు. ఎన్నో పాత్రల చుట్టూ కథ నడిచినా ఎక్కడా సాగదీసినట్లుండదు. సుదీర్ఘమైన ఈ కథను అర్థవంతంగా పూసగుచ్చినట్లు చెప్పడంలో ప్రేక్షకుడు గందరగోళానికి గురి కాకపోవడం రచన గొప్పతనం.

ఇందులోని అన్ని పాత్రలలోనూ అసంపూర్ణత్వముంది. మొత్తం నాటకానికే ప్రోటోగనిష్టయిన రామకోటిలో కూడా లోపాలు కనపడతాయి. అతనిలో అతికోపం, భార్యపై చెయ్యి చేసుకోవటం లాంటి లక్షణాలున్నాయి.

27-12-1999లో తాతా లక్ష్మీప్రసాద్ కళ్యాణ మండపం ఒంగోలులో మొదటి ప్రదర్శన జరిగింది. 15-3-2008లో రవీంద్రభారతిలో స్పందనా థియేటర్సు వారి ఆధ్వర్యంలో వందవ ప్రదర్శన జరిగింది. ఈ నాటకం వంద ప్రదర్శనలు ముగించుకున్న సందర్భంగా ఈ నాటక ప్రదర్శనను ఆపు చేయాలనుకున్నారు ఆనందరావు. దానికి ప్రజామోదం లేకపోవటంతో తిరిగి రెండు సంవత్సరాల అనంతరం ఈ నాటకాన్ని ఒక గంట కాలపు నిడివి తగ్గించి ప్రదర్శించే ప్రయత్నం జరిగింది. అయితే దాని కోసం కొన్ని సన్నివేశాలను తొలగించి కుదించబడి ప్రదర్శించబడింది. ఈ మార్పును అంతకు ముందు మొత్తం నాటకాన్ని చూసినవారు హర్షించలేకపోయారు. ఎంతో ముఖ్యమైన విషయం లోపించినట్టు ఉండటంతో ఇది తిరిగి పూర్తిగా ప్రదర్శించే ప్రయత్నంలో ఉన్నారు ఆనందరావు. ఈ నాటకం **ఆటా** (అమెరికా తెలుగు అసోసియేషన్) నిర్వహించిన జాతీయస్థాయి నాటక పోటీలో ప్రథమ బహుమతి పొందింది.

ఎందరో నాటక కళావిమర్శకులు, ప్రయోక్తలు దీనిని, ఈ ప్రదర్శన చూసి చకితులయినారు. *పడమటి గాలి* భావి నాటక రంగానికి ఒక ఆశాకిరణం, గుండెలను బరువెక్కించే కథాసంవిధానం. మనలో మనల్ని చూపించి, మాయ



*'పడమటి గాలి'* లో ఒక దృశ్యం

మవుతున్న మనిషితనాన్ని బయటపెడ్తూ, ఇందులో ఏ సన్నివేశాన్ని చూసినా నేటి సమాజమే మన కళ్ళముందు కదులాడుతుంది. పాటలు, డాన్సులు లేకుండా – నిరంతరాయంగా సాగిన కథాక్రమం. అలరించిన నేపథ్యసంగీతం, రాంగాలంకరణ – గం॥ 7.30 ల॥కు నాటకం మొదలయితే అది ముగిసేసరికి 12 గంటలు కావచ్చినా–ఎవరూ కదలకుండా చూడ గలగటం, అంతసేపు నాటకం ఆడటం విచిత్రమైతే, ప్రేక్షకులు చూడటం మరొక వింత. ఇది ఆధునిక నాటకరంగం ఆదరణ కోల్పోలేదన్న విషయాన్ని చెప్పనే చెబుతుంది. తెలుగు నాటకం తన చిరునామా వెదుక్కుంటున్న ఈ దశలో ఇదొక సాహసం. నిడివి ఎక్కువగా వున్న నాటకానికి జాతీయస్థాయిలో ప్రదర్శనార్హత ఉండదనే అపోహను పక్కకు నెట్టిందీనాటకం.

వ్యామోహాలు, జల్సాలతో ఇంటిని గుల్లచేసుకునే మిడిమిడి కుటుంబాల కథ, ఒక ఊరికథ, ఒక రాష్ట్రం కథ, మొత్తంగా చెప్పాలంటే ఒక దేశం కథ. మన రాష్ట్రంలో వ్యవసాయ ఆధారిత గ్రామాలన్నిటికీ ఇది వర్తిస్తుంది. గ్రామసీమలలో నాటక ప్రదర్శనను సాయంత్రం 5 గంటలకే మొదలు పెట్టేవారు.

నాటకం రివర్స్ బాణీలో సాగుతుంది. మొదటి సన్నివేశం సూర్యాస్తమయంతో ఇప్పుడు సమయం ఐదు కావస్తుంది అన్న కన్యాశుల్కపు మొదటి వాక్యం గుర్తుకు తెస్తూ ప్రారంభమయి, చివరి సన్నివేశం సూర్యోదయంతో ప్రారంభించి, మట్టిని మొలకింప చేస్తానని రైతు రాంకోటి ప్రతిన బూనటంతో నాటకం ముగుస్తుంది. నాటకంలో విషాదం అంతర్లీనంగా ఉన్నా – చివరక్లైమాక్స్ వరకూ విలన్ పాత్రధారులెవ్వరూ మరణించక పోవటం వాస్తవికతకు దగ్గరగా వుంది.

యార్లగడ్డ బుచ్చయ్య చౌదరి, రజిత మూర్తి, కె.ఎస్.డి. సాయి వంటి సీనియర్ కళాకారులతో పాటు ఔత్సాహిక యువనటులు ఈ నాటకాన్ని అద్భుతంగా పండించారు. మహిళా నటీమణుల్లో జె. పద్మావతి, పద్మారెడ్డి, సుజాత, ప్రభావతి, సరోజ, జ్యోతిలు వీరంతా ఎక్కువకాలం ఇందులో నటించిన నటీనటులు.

30 మంది నటీనటులు, టెక్నీషియన్లతో కలిసి 70 మందితో ఏ మాత్రం ప్రాంప్టింగ్ లేకుండా నాటకం సాగుతుంది. స్టేజి లైటింగ్, సంగీతం మనోజ్ఞంగా ఉన్నాయి.

ఇందులో నటిస్తున్న – ఒక కళాకారిణి కాకినాడలో రోడ్డు ప్రమాదానికి గురై, ఆ గాయాలతోనే బొబ్బిలిలో నటించటం ఒక విశేషం. నటులలో అనేక మంది ప్రభుత్వాధికారులు స్వచ్ఛందంగా పాల్గొని మెప్పించటం మరొకెత్తు. నిక్కరు నుంచి సఫారి స్థాయి, బీడి నుంచి కింగ్‌సైజ్ సిగరెట్టు స్థాయికి ఎదిగిన మాయోడు కన్యాశుల్కంలో గిరీశం తరువాత వచ్చిన ఒక సజీవ పాత్ర.

మట్టికి మనిషికి ఉన్న పేగుబంధమే ఈ కథావస్తువు.

దేశంలో పరివర్తన రావాలి మనందరిలో అంతర్గతంగా అది చేరుకోవాలని చెప్పిన నాటకం. డైలాగులలో వ్యంగ్యం ఉంది. సహజత్వం ఉంది. అవి నవ్విస్తాయి. కానీ కథా కథనం కంట తడిపెట్టిస్తుంది. మట్టిని నమ్ముకున్న రైతు నష్టపోతున్నాడు. మనవే కాదు ఎవరూ ఏమీ చేయలేకపోతున్నాం– తప్పును సరిదిద్దలేక పోతున్నాం. **ప్రజలుగా మన నిర్లిప్తత నిర్లక్ష్యతే ఈ నాటకంలోని అసలు విషాదం.** మన్ను తిన్న పాములా ముడుచుకుపోయిన మనలోని మానవత్వాన్ని ఈ నాటకం తట్టి లేపుతుంది, రంగస్థలంలోని సమస్త అంగాలను సూక్ష్మంగా అధ్యయనం చేసి ఆకళింపు చేసుకున్నవాడు పాటిబండ్ల. నాటకంలో సార్వకాలీనత ఉంది. మనల్ని గ్రామీణ ప్రాంతానికి తీసుకొనిపోతుంది.

352 శబ్దాలను ఈ నాటకంలో వినిపించారు. మేఘాలు ఏకం కావటం, ఉరుములు, వర్షం కురవటం, బావిలో మనిషి పడినప్పుడు వచ్చే శబ్దం, సూర్యోదయం లాంటి సన్నివేశాలు దృశ్య ప్రదర్శన ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలతో ముంచివేస్తుంది.

పన్నెండేళ్ళపాటు *పడమటి గాలి* నాటక బృందంలో ఒక పాత్రధారిగా ఉండటం అదృష్టమంటారు డి.బలరామయ్య, ఐ.ఎ.ఎస్. ఈ హోదావున్న ఆఫీసరు నాటకంలో నటించట మేమిటని చీఫ్ సెక్రటరీ ఆక్షేపించినా, మరో సీనియర్ అధికారి గట్టిగా వాదించి అనుమతి తెప్పించారు.

రైతుల ఆత్మహత్యలకు ఇది పరిష్కారమన్నారు. నూతన మిలినీయంలో తెలుగు నాటకరంగానికి మంచి రోజులొచ్చాయని ఎందరో ప్రయోక్తలు కొనియాడారు. 'శతాబ్ది మొదట్లో ***కన్యాశుల్కం,*** శతాబ్ది ముగింపులో **పడమటి గాలి**' అన్నారు నాగభైరవ కోటేశ్వర రావు.

పద్య నాటకాలను ఆ మాత్రమే ప్రజలు టికెట్టు కొని చూస్తారు. మిగిలినవి వారికి ఆ ఆదరణ లేదన్న అపప్రథ *పడమటి గాలి* వీచిన విజృంభణలో తేలిపోయింది.

*పడమటి గాలి* నిడివి పావుగంట విరామంతో కలిసి నాలుగున్నర గంటలు. ఇప్పటికి లక్షన్నర మంది ప్రేక్షకులు చూశారు. అనంతపురం, నిజామాబాద్ జిల్లాలలో ప్రజలు జాతరకు వెళ్లినట్లు దీనిని చూడటానికి రావడం వింతకాదు వాస్తవిక సంఘటన.

వంద ప్రదర్శనలు జరిగిన తరువాత, రెండేళ్ల విరామానంతరం ఏప్రిల్ 13,14,15 తేదీల్లో సాయంత్రం 7 గంటలకు *పడమటి గాలి* నాటకాన్ని తిరిగి ప్రదర్శించారు.

నటీనటులు ఎందరు మారినా తెలుగింటి గ్రామీణ ప్రాంతపు ఆప్యాయతలు, అనుబంధాలు, మాటపట్టింపులు, ఆవేశాలను ఎంతో ఉన్నతంగా అభినయించారు. గ్రామీణ ప్రాంతాల్లో నమ్ముకున్న మట్టికోసం రైతన్నలు ఎలాంటి త్యాగాలను చేస్తున్నది హృదయం ద్రవించేలా ప్రదర్శించారు.

ఇందులో నాటకంలో సంభాషణాపరమైన అవాచ్యాలు కొన్ని దొర్లాయని కొందరు భావించవచ్చు. అయితే ఆ సంభాషణలో ఉన్నది జీవభాషని మనం మరువరాదు. వాళ్ళ జీవితాన్ని ప్రేమించగలిగితే ఆ భాషపట్ల మనకు గౌరవం కలుగుతుంది. ఆ పాత్రలు అలా మాట్లాడక పోతేనే అనౌచిత్యం అవుతుంది. It is by the Telugu to the Telugu, for the Telugu in Telugu.

కొత్తగా వస్తున్న మల్టీనేషనల్ కంపెనీల ఆశాపూరిత ఆక్రమణలు వారిని అడ్డం పెట్టుకొని హైదరాబాదు వారి పావలావాటా, ఢిల్లీవారి పావలా వాటాలుగా ఎవరి మట్టుకు వారే స్వామికార్యం, స్వకార్యం చేసుకొంటూ ప్రజాస్వామ్యాన్ని భ్రష్టు పట్టించటందీని నేపథ్యం.



*'పడమటి గాలి'* నాటకంలో మట్టిని మొలకింప చేస్తానని రైతు రాంకోటి ప్రతిన బూనుతున్న దృశ్యం

ఈ విషయాలన్నీ ప్రజలకు తెలుసు. కానీ పిల్లిమెడలో గంట ఎవరు కడతారు? తాము కాక మరెవరయినా గంట కడితే సంతోషిస్తారు. ఆ బాధ్యత ఆనందరావు చేపట్టాడు. అందుకు ఆయనను అభినందిద్దాం.



బలరామ్మయ ఐ.ఎ.యస్. మాయోడు పాత్రలో...

* * *

**పాటిబండ్ల ఆనందరావు అరవై సంవత్సరాల క్రితం ప్రకాశం జిల్లా, టంగుటూరి మండలం, మల్లవరప్పాడులో జన్మించారు. వీరి రచనలలో *నిషిద్ధాక్షరికి* 1986లో తెలుగు విజ్ఞాన పీఠం వారి ప్రథమ బహుమతి లభించింది. 1991లో కళాసాగర్ వారు తెలుగు నాటక రచయిత పురస్కారం, 1997లో విశ్వశాంతి, జాషువా కళాపీఠం అవార్డు, ఉండేల విజ్ఞాన కళాపీఠం వారిచే 1998లో ఉత్తమ నాటక రచయిత అవార్డు, విజయవాడ వారి సుంకర వాసిరెడ్డి అవార్డు వీరు ప్రధానంగా పొందిన గౌరవాలు. *దర్పణం, సహారా, కాదు సుమా కల, నీతి చంద్రిక* లాంటి ఇతర రచనలతో పాటు కొన్ని రేడియో నాటకాలు, కొన్ని సినిమాలకు కథారచనలు చేశారు. *ఆనందరావు మాటల్లో...***

నాటకం అనేది కేవలం ముగ్గురు జడ్జీల కోసం కాదు, *ప్రజలకోసం, ప్రజలలో మార్పుకోసం, ప్రజలలో చైతన్యం తీసుకురావటం కోసం* అన్న చిన్నపాటి తర్కమే ఈ నాటక రచనకు కారణం. నేనెప్పుడూ నా నాటకంలో ఆర్టిస్టులు నటిస్తున్నారని అనుకోలేదు. మా అన్న, తమ్ముడు, చెల్లి, అక్క, బాబాయి ఇలా అంతా నాటకం కోసం నాతో కలిసి జీవిస్తున్నారు. తెలుగు నాటక రచనకు అందరూ అనుకునేటంత దుర్దశ ప్రాప్తించలేదు. రచనకు, ప్రదర్శనకు మధ్య అగాధం ఉంది. దాన్ని పూడ్చటం అవసరం. ప్రాచీన నాటకాలలో *మృచ్ఛకటిక* నాకిష్టం. ఎంతకాలం తరువాత చదివినా, ఎంతమాత్రం మార్పుని కోరని రచన ఏదో అదే ఉత్తమ రచన.

ప్రదర్శన ఎప్పుడూ సరియైన సమయంలోనే ప్రదర్శింపబడేది. మొట్టమొదటి ప్రదర్శనప్పుడు మాత్రం రెండు గంటలు ఆలస్యంగా మొదలయింది, కారణం అప్పుడు వచ్చిన భారీవర్షం. ఆ వర్షానికి పందిరంతా కూలిపోయింది. తిరిగి వేసుకోవటంలో ఆలస్యం. నే నెప్పుడు నా నాటకాలను పోటీలకు పంపలేదు. కారణం నాకు వాటిమీద నమ్మకం లేకపోవడం. 2009వ సంవత్సరంలో ఈ నాటకం 100 ప్రదర్శనలు పూర్తిచేసుకున్న సందర్భంలో దీని ప్రదర్శనను నిలుపుచేద్దామనుకొన్నాను. కొన్ని సంవత్సరాలు ఆపేము కూడా. కొన్నిసార్లు దానిని ఒక గంట తగ్గించి ప్రదర్శించాము. ప్రదర్శనకాలం మొత్తం గం॥ల 4.30 ని.లు., అయితే ఆ ప్రయోగం చాలా విమర్శలకు గురైంది. అనేక మందికి ఈ కుదింపు నచ్చలేదు.

అనంతపురంలో నా నాటక ప్రదర్శన చాలాబాగా సాగింది. దానికి కారణం అప్పుడు అక్కడ వున్న కలెక్టర్ అనూరాధగారు. వారిచ్చిన ప్రోత్సాహం మరువలేనిది. కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంటుకు చెందిన డిప్యూటీ కమీషనర్లు ఎన్. రమేష్ బాబు, రవీంద్రగార్లు నాకు చాలా ప్రోత్సాహాన్నిచ్చారు. సుమారు 11 జిల్లాలలో ఆ జిల్లా కలెక్టర్లు ఈ నాటక ప్రదర్శనపై ప్రత్యేక శ్రద్ధ కనపరచారు. ఐ.ఏ.యస్ ఆఫీసరయిన బలరామయ్యగారు నాటకంలో మొదట్లో మాయలోడు పాత్రను, ఆ తరువాత రాంకోటి పాత్రను పోషించారు. ఒక ఎమ్మెల్యే ప్రమేయంతో ఈ నాటకంపై అసెంబ్లీలో చర్చజరిగింది.

ఒక నాటకం వెయ్యడానికి సుమారు 3 లక్షల వరకూ ఖర్చు అవుతుంది. ఐతే ఎక్కువ ప్రదర్శనలిస్తే ఆఖర్చు చాలా తగ్గుతుంది. ఉదాహరణకు: ఐదురోజులు వరుసగా వేస్తే ఐదు లక్షలు మాత్రమే ఖర్చవుతుంది. బెంగుళూరు, ఢిల్లీలలో ఈ నాటక ప్రదర్శన జరిగింది. అమెరికాలో *ఆట* వారు ఈ నాటకంపై ప్రత్యేక ప్రశంసలు కురిపించారు. అయితే ఈ నాటకం ఎప్పుడూ విదేశాలలో ప్రదర్శించ బడలేదు.

నాది రైతు కూలీ కుటుంబ నేపథ్యం. చిన్నప్పుడు నేను చెయ్యని కూలిపనంటూ ఉండేదికాదు. పనిలో మాతండ్రికి చేదోడు వాదోడుగా ఉండేవాడిని. బడిలో చదువు చాలా ఆలస్యంగా మొదలయింది. నేను మొట్టమొదట సారిగా బడికి వెళ్ళినపుడు నాకు పిల్లలందరితోబాటుగా కాక కొంచెం దూరంలో గోనెపట్టావేసి కూర్చోబెట్టేవారు. వారు అంటరానితనం పాటిస్తున్నారని నాకు అప్పుడు తెలియదు. మా మాష్టారు వెలగపూడి కోదండరామయ్యగారు. వారు బ్రాహ్మలు. మొదటి ఆరునెలల్లో వారు నన్ను పట్టించుకునేవారు కాదు. మా పాఠశాలలో పైతరగతిలో చదివే ఒక విద్యార్థి నాకు పాఠాలు చెప్పేవాడు. చదువులో నేను చూపిస్తున్న శ్రద్ధతో మాష్టారు నన్ను దగ్గరకి తీసారు. ఒక్కోసారి వారింటికి తీసుకువెళ్ళి నాకు వారింటిలో తయారయిన వంటకం ఉప్మాలాంటివి తినిపించేవారు. అయితే ఇది ఎవరూ చూడకుండా ఉండేలా జాగ్రత్త పడేవారు. వారు గొప్ప మాష్టారే కాదు గొప్ప రంగస్థల నటులు కూడా. 4, 5 తరగతి చదువుతున్న విద్యార్థులతో *కన్యాశుల్కం, వరవిక్రయం* లాంటి నాటకాలలో కొన్ని అంకాలను నాటకంగా ప్రదర్శించేవారు. నేను నేర్చుకున్న విద్యంతా వారు పెట్టిన భిక్షే. వారు సంస్కృతంలోని శ్లోకాలకు, తెలుగు పద్యాలకు తాత్పర్యం చెప్పేవారు. మాకు సంస్కృత సమాసభూయిష్టమయిన తెలుగులో డిక్టేషన్ ఇచ్చేవారు. దానివల్లనే నా భాష శుభ్రపడింది.

తప్పులు లేకుండా అందమైన దస్తూరిలో వ్రాస్తానని నేనంటే చాలా ఇష్టపడేవారు. ఇలా చిన్నతనం నుంచీ నాకు నాటకాలంటే ఇష్టమేర్పడడానికి ఆయనే కారణం. కాలేజిలో చదువుతున్నపుడు చదువులో భాగంగానే షేక్స్‌పియర్ చదవటం జరిగింది. అది అంతవరకే. నాపై ఏవిధమైన ఇంగ్లీషు రచనల, రచయితల ప్రమేయంలేదు. ఇంగ్లీషు అందరిలానే చదువుకున్నాను తప్ప ప్రత్యేకత ఏమీలేదు. చిన్నతనంలో మార్క్స్ నాపై ప్రభావం చూపకపోలేదు. కానీ అది మరింత ఎక్కువగా లేదు. *చారిత్రక పురుషుల్లో నాకు గౌతమ బుద్ధుడంటే ప్రత్యేక అభిమానం.* నేను నాస్తికుణ్ణి. దీనిపై ఎవరి ప్రభావమూ లేదు. ఎవరో చెప్పి, ఏదో చదివి నేను నాస్తికుణ్ణి కాలేదు. చిన్న తనం నుంచి నా ఆలోచన అలానే సాగింది.

మా నాటకానికి టెక్నిక్ గానీ, స్టేజిమేకప్ గానీ, స్టేజిపై వేసే సెట్టులు ఇవన్నీ సురభి నాటక కంపెనీ సహకారంతో జరిగింది. నాటకంలో వర్షం చూపించటం ఎక్కువ మందిని ఆకర్షించింది. ఇందులోని పాత్రలన్నీ నిజజీవితంలో నుంచి తీసుకున్నవే. ఎటొచ్చీ పూర్తిగా యథాతథంగా కాదు. కొందరు వ్యక్తుల సమూహ స్వభావం ఒక్క వ్యక్తిలో చేర్చడం జరిగింది.

ఈ నాటకం ఖర్చు, ఆదాయ విషయాలలో నేనెప్పుడూ పద్దు రాసుకోలేదు. కానీ మొత్తం మీద ఒక విషయం చెప్పగలను. నాకు నష్టం కలగలేదు. ❁

# బాల వాఙ్మయం

- న్యాయపతి రాఘవరావు

తెనుగు బాలసాహిత్యం యొక్క పూర్వచరిత్రను గురించి నేను ఇప్పుడు ఇక్కడ విపులంగా చెప్పదలచుకోలేదు. ఎందుకంటే, అసలు పూర్వ చరిత్ర అంటే ఏమీ అట్టేలేదు గనుక.

నన్నయ తిక్కనాది కవుల రోజుల్లో తెనుగు భాషలో గొప్ప కావ్యాలు రచింపబడినవే గాని బాలల కొరకు ప్రత్యేకంగా వ్రాయబడిన రచనలేవీ కనబడవు. కాని అంతకు పూర్వమే, ఈ రచనలన్నిటికీ *బాలవాఙ్మయం* పుట్టిందని నా మనవి. ఆంధ్రావనిలో తెనుగు బాలల పుట్టుకతోనే *బాలవాఙ్మయం* పుట్టిందని చెప్పవచ్చును. ఏ తల్లో తన ముద్దు బిడ్డను ఉయ్యాలలో ఊపుతూ, కూనిరాగాలు తీస్తూ - *లాలి బంగారుబొమ్మ - లాలి మాయమ్మా* అంటూ ఒక జోలపాట అప్రయత్నంగా పాడి వుంటుంది.

ఏడుస్తూ వున్న పాపాయిని ఎత్తుకొని ఒక తల్లి - *ఏడవకు ఏడవకు వెర్రినా తండ్రీ ఏడుస్తే నీకళ్ళ నీలాలు కారూ* అనిన్నీ, ఇంకా ఏడుపు మానకుంటే ఆకాశం వేపు చూపి -

చందమామ రావే - రావే చందమామా
చందమామా రావే - జాబిల్లిరావే
కొండెక్కి రావే - కోటిపూలు తేవే
బండెక్కి రావే - బంతిపూలు తేవే

అంటూ లాలనగా ఒక గేయాన్ని పాడి ఉంటుంది.

ఈ విధంగా లాలిపాటలను, జలపాటలను మన తెలుగు తల్లులే కవితను అల్లి మొట్టమొదటి బాలవాఙ్మయాన్ని సృషించారేమో!

బాలలు పెరగ్గానే వారి వయస్సుకి అనుగుణంగా ఆటపాటలు కూడా మనకి తరతరాలుగా వచ్చాయి.

చమ్మచక్క - చారడేసి మొగ్గ
అట్టుపోయంగ-ఆరగించంగ - ఇంకా
విశాఖపట్నం వీశెడు బెల్లం
నీకో పదలం నాకో పదలం
పదలం పదలం పదలం
కళింగపట్నం కాసుల పేరూ
నీకో పేరూ నాకో పేరూ
భీమునిపట్నం బిందెల జోడూ
నీకో జోడూ నాకో జోడూ

ఇలాగ ఆడపిల్లలు ఆ రోజుల్లో పాడుకుంటూ, ఆడుకుంటూ ఉండేవారు.

కొంతకాలానికి మొగలాయి రాజ్యం వచ్చిన తరువాత మనకి రూపాయ్‌లూ, సీపాయ్‌లూ వచ్చాక,

గూట్లో రూపాయ్ - నీ మొగుడు సీపాయ్
సీపాయ్ సీపాయ్ సీపాయ్ - వంటి పాటలు వచ్చాయి.

తమాషాగా హాస్యానికి -

బాబా బావా పన్నీరు
బావను పట్టుకు తన్నేరు
నులకా మంచం వేశారు
నూరు గుద్దులు గుద్దేరు

ఇటువంటి రసవంతమయిన పాటలు మన *బాలవాఙ్మయా*నికి అముద్రితంగా వచ్చాయి. ఈ సాహిత్యం ఫలానావారు రచించారని నిదర్శనాలు కనబడవు. కాని కవితా దృష్టితో చూస్తే ప్రతి ఆటపాటలోనూ, పల్లెపదంలోనూ తెలుగు భాషలోని తియ్యదనాన్నీ, యతిప్రాసల అందాన్ని ఈ గేయరచనలో చూడగలుగుతున్నాం. వేటూరి ప్రభాకరశాస్త్రి యీ పాత పాటలను కొన్ని సేకరించి తమ *బాల భాష* లో ఉపోద్ఘాతముగా ఇలా వ్రాస్తున్నారు.

*ఉన్నత కవితా వాహినికి బాలవాఙ్మయము ఆటపట్టని చెప్పవచ్చును.*

*ఆంధ్రభాషకు సహజాలంకారమైన యతిప్రాసములు, సంగీతచ్ఛాయ, బాలరచనములందు గానవచ్చుచున్నవి. అట్టి రచనములను బాలకులు పాలమీగడ చవితో జదువగలరు. ఈ ఇంపు నెరుగక పోవుటచే నిప్పటి బాల పాఠ్య గ్రంథ రచనలు–*

*ఇదిగో ఆవు; ఇది మంచి ఆవు; ఇది పాలు ఇచ్చును;*

*దీని పాలు తెల్లగా నుండును; ఆవుకు నాలుగు కాళ్ళు ఉండును; ఇత్యాది పొల్లు మాటలతో పాఠము లల్లి బాలకుల విసిగించు చున్నారు.*

వేటూరి వారి వ్యాఖ్య ముమ్మాటికీ నిజమనిపిస్తోంది. మహమ్మదీయ యుగంలో ప్రారంభమయిన చీకటి, బ్రిటిష యుగంలో బాగా నలుదిశలా వ్యాపించింది. మన బాలలు ఆనాటి అవసరాలను బట్టి –

*ఇదిగో ఆవు; దీనికి నాలుగు కాళ్ళున్నవి; దీని పాలు తెల్లగా వుండును.* అని నేర్చుకోవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనినే *వాచక సాహిత్య యుగం* అని చెప్పవచ్చును.

ఈ కాలంలో గేయరూపంలో వచ్చిన *శతక సాహిత్యం* తప్పిస్తే బాలల కొరకు ఇతర రచనలు కనిపించవు. ఈ శతకాలనే బాలలు కంఠస్థము చేస్తూ వుండేవారు. 1847లో *పెద్దబాలశిక్ష.* దాని తరువాత ఒక 100 సంవత్సరాలకు 1946లో మాగంటి బాపినీడు *తెలుగు తల్లి,* ఆ తరువాత మరో పదేళ్ళకు మహమ్మద్ ఖాసింఖాన్ *బాల విజ్ఞాన సర్వస్వము* ప్రచురింపబడినది.

చింతా దీక్షితులుగారు *తెలుగు తల్లి*కి వ్రాసిన తొలిపలుకులు ఇక్కడ అప్రస్తుతము కాదు. వారు ఇలా వ్రాశారు.

*తెలుగు పిల్లల్లారా! ఇంతవరకు (1946) మీరు చదువుకోవడానికి సరియైన పుస్తకాలు అట్టే తెలుగులో లేవు. మీరు చదువుతున్న వాచకాలు మీ పుస్తకాలు అనుకుంటారేమో! కావుసుమండీ! అవి గవర్నమెంటువారి కోసం అదో భాషలో వ్రాసిన పుస్తకాలు. పాపం మీ చేత బలవంతంగా చదివిస్తున్నారు. వాటిలో ఏ కొద్దిగానో మంచివి కూడా వుండవచ్చు. మీ కోసం మొన్న మొన్నటి వరకూ ఒక పత్రికకూడా లేదు...* అంటూ వ్రాశారు.

బాల సాహిత్యానికి పిల్లల పత్రికలు చేసిన సేవ తరువాత ప్రస్తావిస్తాను. అంతకు పూర్వమే, అంటే మొట్టమొదటి పిల్లల పత్రిక 1945లో ప్రచురించబడక పూర్వమే, కొందరు కవులు బాలలకోసం గేయాలు రచించారు.

వేంకట పార్వతీశకవులు *బాలగీతాలు* వ్రాసి ప్రకటించారు. కవి కొండలవారు *చిట్టికైత, చదువుల దుత్త* మొదలుగాగల గేయ రచనల సంపుటి ప్రకటించారు. టేకుమళ్ళ కామేశ్వరరావుగారు *మిణుగురు పురుగులు, పాలపిట్ట* లో మంచి గేయాలు వ్రాశాడు. గిడుగు సీతాపతి బాలలకోసం *రైలుబండి పాట, ఈగ–సాలీడు, చిలుకమ్మ పెళ్ళి* మొదలగు గేయాలూ, గేయకథలు వ్రాసి వాచకాల్లో ప్రచురించారు. వీరి గేయాలు బాలలు ఇష్టంగా పాడుకుంటున్నారు.

ఉదాహరణకు : *ఈగా–సాలీడు* సంవాదం యీ విధంగా సాగింది.

సాలీడు :
ఈగమ్మ ఈగమ్మ ఇంట్లోకి వస్తావా
ఈ ఇంటి చిత్రాలూ ఎచటైనా జూచావా
సుడిమేడ మెట్టెక్కి చుట్టూ తిరుగుతూ వచ్చి
సొగసైన గదిలోని చోద్యాలు చూస్తావా?
అప్పుడు ఈగ :
అబ్బబ్బ! నే రాను ! అబ్బబ్బ నే రాను
సాలెపురుగుల మేడ–చావ చంపెడు మేడ
ఎగిరి వెళ్ళిన వారు – దిగలేదు నీ మేడ
మేడ నెక్కగ నేల – చావు కోరడమేల?
ఇలాగ నడుస్తుంది.

అసలు బాలల మనస్తత్త్వాలు పూర్తిగా గ్రహించి బాలలకు అందుబాటులో వుండే సాహిత్యాన్ని సృష్టించినవారు చింతా దీక్షితులు. వారు బాలలో నొకబాలయై లక్క పిడతలతో ఆడారు; కథలు అల్లి చెప్పారు. వారి *సూరి–సీతీ–వెంకీ* ప్రతి ఇంట్లోనూ ఉన్నారని పిస్తుంది. తెలుగులో మొట్టమొదటి బాలల నవల *లీలాసుందరి* దీక్షితులుగారే రచించారు. వారి *లక్క పిడతల*లోని పాటలు చాల మంది బాలలు ఇంటింటా పాడుకుంటారు. ఎంతటి పెద్ద విషయాన్నైనా బాలలకు తేలికగా అందజేయగలమని నిరూపించడానికి వారి *హనుమంతుని తోక* ఒక నిదర్శనము. ఈ గేయంలో వారు రామాయణ కథనంతా ఎంతో రసవంతంగా చిత్రించారు. వీరి రచనలు కూడా చాలా కాలం వరకూ వాచక *పుస్తకాలలోనూ, భారతి, గృహలక్ష్మి* పత్రికల్లోనూ ప్రచురిత మగుతూ వచ్చాయి.

**బాల సాహిత్యం–పత్రికలు :**

బాల సాహిత్య ప్రచారానికి ఎక్కువగా సహకరించినవి పత్రికలు. 1884లో మదరాసు నుండి వెలువడిన *జనవినోదిని* అనే పత్రికలో Some amusing rhymes of Ditties for girls అని పూర్వకాలపు ఆటలు ప్రచురించారు. ఈ శతాబ్దం ప్రారంభంలో బాల వాఙ్మయానికి కొద్దో గొప్పో దోహదం

ఇచ్చిన పత్రికలు *గృహలక్ష్మి, భారతి* కాని 1945లో ***బాల*** పత్రిక వచ్చేవరకూ పిల్లలకోసం ప్రత్యేకంగా ప్రచురింపబడిన పత్రిక అంటూ లేదు. ***బాల,*** బాల ప్రపంచంలో ఒక నూతన చైతన్యం కలిగించిందని చెప్పక తప్పదు. *బాల* తెలుగు బాలలో నొక బాలయై వాళ్ళతో నేస్తం కట్టింది; కొత్త కథలు చెప్పిది; పాటలు పాడించింది; నాటకాలు ఆడింది; బొమ్మలతో కథలు చెప్పింది; వింతలూ, వినోదాలు, విజ్ఞాన విషయాలు చేకూర్చింది. పొడుపు కథలూ చిక్కు ప్రశ్నలూ వేసింది. *బాల* బాల సాహిత్యంలో నూతన పోకడలకు దారి చూపింది.

*బాల* పుట్టిన తరువాత బాలకు ఎందరో చెల్లెళ్ళూ, తమ్ముళ్ళూ పుట్టారు. *చందమామ, బాబు, పాపాయి, బాలవినోదం, బాలబంధు, పొట్టిబావ, తాత, జాబిల్లి, బాలప్రభ, బాలమిత్ర, బొమ్మరిల్లు, బాలానందం* – ఇలాగ ఒక డజనుకుపైగా మనకి పిల్లల పత్రికలు వచ్చాయి. ఒక్కొక్క పత్రిక ఒక్కొక్క విధంగా సేవచేస్తూ వచ్చింది. చాలా పత్రికలకు బాలారిష్టాలు తప్పలేదు. కాని బాల సాహిత్యాన్ని కంటికి మెదడుగా ఇంపుగా బాలల చేతులలో పెట్టి, బాల సాహిత్యంలో అభిరుచిని కలుగచేసినవి *బాల, చందమామ* అని చెప్పాలి. అయితే పాశ్చాత్య దేశాలలో ప్రచురింపబడుచున్న పిల్లల పత్రికలను చూస్తే మనం ఇంకా ఎంత వెనుకబడి వున్నామో తెలుస్తుంది. రంగులూ హంగులూ అటుంచి అసలు పిల్లల పత్రికలలో మనం వాడుతున్న భాషకూడా ఎంతవరకు పిల్లలకు అర్థం అవుతుందో కూడా చూడాలి.




బాల పత్రికల సంపాదకులకు, రచయితలకు ఒక చిన్న ఉదాహరణ: ఒక పిల్లల పత్రికలో ప్రచురితమైన యీ వాక్యాలు చూడండి: *ప్రపంచ విజేతగా సుప్రతిష్ఠితుడౌదామన్న కాంక్షతో పురోగమించిన గ్రీకు దేశాధిపతి అలెగ్జాండరు భారతభూమిలో పురుషోత్తమునితో ప్రతిఘటించి, పరాజితుడై తిరోగమించారు.*

ఇది చదువుతూ వుంటే, క్లాసులో వాచక పుస్తకం చదువుతున్నట్టుంది గాని, పిల్లల పత్రిక చదువుతున్నట్లు లేదు.

ఏది ఎలా వున్నా, మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి పిల్లల పత్రికలు వెలవడ్డాక బాల సాహిత్యానికి మంచి రోజులు వచ్చాయనే చెప్పాలి. పాత బాల పత్రికలు తిరగేస్తే అందులో చింతా దీక్షితులు, పాలంకి రామచంద్రమూర్తి, అడపా రామకృష్ణా రావు, కవికొండల వెంకటరావు, వేలూరి శివరామ శాస్త్రి, రజని, శ్రీవాస్తవ, జనమంచి, శ్రీశ్రీ, ఆరుద్ర, వసంతరావు వెకంటరావు, ముళ్లపూడి వెంకటరమణ మున్నగు వారి రచనలు: బాపూ, బుజ్జాయి, వడ్డాది పాపయ్య మున్నగు చిత్రకారుల బొమ్మలు కనపడతాయి. పిల్లల పత్రికలను బాలలు ఎంతో ఉత్సాహంతో చదవడం చూచి, ఇదివరలో బాలసాహిత్యాన్ని ప్రచురించుటకు భయపడ్డ పుస్తక వ్యాపారస్తులు ముందుకువచ్చి రచయితలను ప్రోత్సహించి రకరకాల పుస్తకాలను ప్రచురించారు.

*బాల గేయాలు, గేయ కథలు, బాల రామాయణాలు, బాల భారతాలు, బాల భాగవతాలు, బాల కాశీమజిలీ కథలు, బాల కృష్ణలీలలు, బాల హితోపదేశ కథలు, బాల ప్రపంచ కథలు, బాల నాటికలు, బొమ్మల కథలు, విజ్ఞాన కథలు, జీవిత కథలు* బాల ప్రపంచంలో వెల్లివిరిశాయి.

**గేయ రచనలు :**

బాలలకోసం చక్కని గేయ రచనలు వ్రాసిన వారిలో వేంకట పార్వతీశ కవులు, గిడుగు వేంకట సీతాపతి, చింతా దీక్షితులు, రజనీ కాంతరావు, బి.వి.నరసింహారావు, దాశరథి, నారాయణ రెడ్డి, రాఘవ రావు, కవిరావు, అలపర్తి వెంకటసుబ్బారావు, నార్ల చిరంజీవి, ముళ్ళపూడి వెంకటరమణ, వేజండ్ల సాంబశివ రావు, పైడిపాటి సుబ్బరామయ్య, ఎల్లోరా మున్నగువారి పేర్లు చప్పున స్ఫురిస్తాయి.

ఈ గేయ రచనలు పరిశీలించి చూస్తే వృత్తాలు, తేటగీతలు, ఆట వెలదుల రూపంతో వచ్చినవి బాలలను ఎక్కువగా ఆకర్షించినట్లు, కనపడదు. తాళ లయబద్ధంగా

పాడుకునేందుకు వీలుగా వున్న గేయాలు, గేయకథలు బాలల మన్ననలను పొందగలిగాయి.

జేజి మామయ్య (రజని) వ్రాసిన ఈ పాట వినండి :

ఆటలు ఆడి పాటలు పాడి – అలసి వచ్చానే
తియ్యాతియ్యని తాయిలమేదో – తెచ్చి పెట్టమ్మా

కుక్కాపిల్లా తోకాడిస్తూ గుమ్మా మెక్కింది
పిల్లీ పిల్లా కళ్ళూమూసి పీటా ఎక్కింది
కడుపూలోని కాకిపిల్లా గంతులేస్తోంది
తియ్యాతియ్యని తాయిలమేదో తెచ్చి పెట్టమ్మా

ఇటువంటి గేయాలన్నీ చేర్చి రజనీ కాంతరావు ఒక చక్కని బాల గేయాలసంపుటి ప్రకటించారు.

బి.వి. నరసింహారావు *పాలబడి పాటలు, బాలరసాలు* లో తియ్యని నిమ్మ తొనలు బోలెడు దొరకుతాయి.

జూలుగుఱ్ఱ మొక్కటుంది
చాలు నా కింకేమి వద్దు
జీను వేసి కళ్ళెముంచి
నేను స్వారి చేతు దాని — *ఇదొకటి.*

పాపా పాపా నాన్నొస్తారు
పళ్ళూ బిళ్ళలు కొనితెస్తారు
అల్లరి మానితే అన్నీ నీకే
అల్లరి చేస్తే అన్నీ నాకే — *ఇదొకటి.*

ఇటువంటివి నరసింహారావు ఎన్నో గేయాలు వ్రాసి బాల సాహిత్యానికి ఎంతో సేవ చేశారు.

**గేయ కథలు :**

గేయాలన్నా గేయ కథలు బాలలకు ఇష్టం. బాలగేయ కథలను వ్రాసిన వారిలో కవిరావు, అలపర్తి, ముళ్ళపూడి మొదలగు వారి రచనలు వ్యాప్తంగా వున్నవి. కవిరావు బొమ్మరిల్లు, ఇతర గేయ కథల సంపుటములను చక్కగా అచ్చొత్తించి అందజేశారు. వీరు రవీంద్రుని గేయాలను కూడా అనువదించి *నెలవంక*ను ప్రచురించారు.

గేయకథలను వ్రాసిన వారిలో చాలామంది వాడుకలో వున్న నీతి కథలను, యుక్తి కథలను కథా వస్తువుగా తీసికొని గేయ రూపంలో వ్రాశారు.

కొందరి రచనలలో అక్కడక్కడ బాలలు చదువకూడని కథలూ, నీతులూ కూడా పొరపాటున ప్రచురింపబడుతున్నాయి. బాల సాహిత్యంలో కథా వస్తువు చాలా ముఖ్యమయినది. ఒకానొక గేయ కథలో యీ నీతిని ప్రబోధిస్తూ పడింది.

నీకు తోచిన రంగు – నీవు వేయక యున్న
మాటిమాటికి రంగు మార్చుచుండక యున్న
జగతిలో నీవింక జీవించుటే సున్న.

కథా వస్తువు ఎటువంటిదైనా, అంటే ఎంతక్లిష్టమైనదైనా, బాలలకు అర్థమయ్యేటట్లు చెప్పవచ్చును అని నిరూపించడానికి వసంతరావు వెంకటరావు స్పుట్నిక్ వంటి గేయం చంద్రుని గురించి వ్రాశారు.

**ఈ సైన్సు పాట వినండి :**

చందమామ చందమామ చందమామ
మందగమన మెందుకోయి చందమామ
భూగోళము నుండి పుట్టి
భూమిచుట్టు తిరుగుచుండి
భూగోళపు చీకట్లను
పోగొట్టగ వెన్నెలిచ్చు ॥చం॥
నీలో గాలైన లేదు
నీలో నీరైన లేదు
నీలో తిండైన లేదు
నీలో నిప్పయిన లేదు
నీ లోకంలో బ్రతుకుట
కాధారం బేమి లేదు
తీరా నిను చేరిన ఏ
తీరున జీవింపగలమొ ॥చం॥
అగ్గిపుల్ల వెలిగించిన
భగ్గున మంటలు రావట
ఎంత గొంతు చించుకున్న
సుంతయు వినిపించదట ॥చం॥

కృష్ణశాస్త్రి, దాశరథి, నారాయణ రెడ్డి, శ్రీశ్రీగారు కూడా బాలలకు గేయాలు, గేయ కథలు వ్రాశారు. కొన్ని మచ్చు తునకలు అప్రస్తుతము కాదనుకుంటాను.

**కృష్ణశాస్త్రి *వినాయకుడి మీద* వ్రాసిన పాట :**

బలే ఎలకు సవారీ – ఎలా ఎక్కుతావు
చలో అంటు ప్రతీ ఇంట ఎలా తిరుగుతావు
ఎదీ మాకు చూపించు – ఏనుగు మొగము
ఎదీ చంద్రవంక వంటి ఏకదంతము
ఇదే వచ్చె నీ గుర్రం – ఎలా ఎక్కుతావో
కదల్నీని బొజ్జ నీవు – కదం తొక్కుతావో
తినాలంటె కజాయాలు – తియ్యని అప్పాలు
బనాయించి పోవచ్చు – పంచదార పాలు
క్షణం వుండు మా ఇంట్లో అదే కోటివేలు
ధనాలొద్దు, వరాలొద్దు, దయవుంటే చాలు.
సరేగాని, వినాయకా – చదువు సంధ్యలుంటాయ్
మరీ మరీ పనులుంటై – మంచి ఆటలుంటాయ్
మరోసారి మనవులివే – మాకు అడ్డురాకు
భరాయించుకోలేము – పసివాళ్ళం బాబు.
ఫలం ఇచ్చుకుంటాము – పత్తి రిచ్చుకుంటాము.
తలోపూలు కాళ్ళకాడ – దాఖలు చేస్తామూ
అలాకాదు తెమ్మంటే – అమ్మనడిగి తెస్తాం
పొలోమంటు పరిగెత్తి – బోలెడు ఉండ్రాళ్లు.

**శ్రీశ్రీ కప్పవైద్యుడు గేయం :**

అనగా అనగా ఒక కప్ప / అది తానొక గొప్ప
వైద్యుడని భావించింది. / వైద్యం చేస్తానని చాటించింది
అడవికి వెళ్లిందా కప్ప / అమాంతంగా ఒక గొప్ప
వైద్యుడైనట్టు తన మెప్పు / చాటింది బెక బెక డప్పు

ఇలాగ ఆ కథ అంత్యానుప్రాసతో సాగుతుంది.

తెలంగాణ రచయితల సంఘం వారు ప్రచురించిన *చిరుగజ్జెలు,* అనే పుస్తకంలో నారాయణ రెడ్డి *తోట తల్లి* గేయ నాటిక ఇలా నడిచింది.

అదుగదుగో తోట తల్లి / మనపాలిటి పాలవెల్లి
రమ్మని పిలిచెను గదరా / రామూ సోమూ పదరా –

**రాము :**

తమ్ములార మనమంతా / తప్పక వెళ్ళాలిరా
ఆటలతో పాటలతో / పూటలు గడపాలిరా

**సోము :**

ముందు ముందుగా దాగుడు / మూతలె ఆడాలిరా
పిమ్మట పాటలతో తల / దిమ్మను వీడాలిరా!

**ఇలా నడిచింది కథ :**

దాశరథి గారి *వెన్నెల మడుగులు* ఇలా ప్రారంభమవుతుంది:

మడుగులు మడుగులు – వెన్నెల మడుగులు
మెత్తని చుక్కలు ఎత్తిన గొడుగులు
కలువ పూవులకు విలువలు గూర్చిన
కర్పూరంతో కలసిన తొడుగులు –
జలధరం అనే రౌడి కుఱ్ఱాడు ప్రవేశించి –
అరె పిల్లలూ! ఇరే పిల్లలూ
ఒహో పిల్లలూ ఆహో పిల్లలూ
కన్నులు గానక వెన్నెలతోటి
ఎన్నినాళ్ళుగా ఆడేస్తున్నా రొహో...!
ఇదీ వరస.

**కథలూ – నవలలూ – నాటికలూ :**

బాల వాఙ్మయంలో గేయాలకంటే కథల పుస్తకాలే ఎక్కువగా ప్రచురింపబడినాయి. ఈ కథలలో అనువాదాలు ఎక్కువ. సొంత రచనలు తక్కువ. *కాశీ మజిలీలు, పేదరాశి పెద్దమ్మ కథలే* కాక, *విజ్ఞాన కథలు, సంస్కృత కథలు, బైబిలు కథలు, పంచతంత్ర కథలు, మహాపురుషుల జీవిత కథలు* ఇలా ఎన్నో రకాల శీర్షికలతో కథలు ప్రచురింపబడినాయి.

ఈ కథలు ప్రచురించడంలో ఎక్కువగా తెలంగాణాలో ఆంధ్ర సారస్వత పరిషత్తువారూ, కోస్తా జిల్లాలలో ఆదర్శ గ్రంథ మండలి, దేశి కవితా మండలి, సకల సాహితీ, బాల సాహితీ, బాల విజ్ఞాన విపంచిలాంటి సంస్థలు పాల్గొన్నాయి. రాయలసీమలో రాయులు కంపెనీ, బాల సరస్వతీ బుక్‌డిపోవారు కూడా బాల సాహిత్యాన్ని ప్రచురించారు. విశాలాంధ్ర, నవోదయ, దాచేపల్లి, కాళహస్తి, ఉమా పబ్లికేషన్సు మొదలగు సంస్థలు కూడా బాల సాహిత్య ప్రచురణకు పూనుకున్నాయి.

పాశ్చాత్య దేశాల్లో పిల్లల పుస్తకాలు రంగు రంగుల బొమ్మలతో, చక్కని అచ్చుతో ప్రచురిస్తారు. బొమ్మలతో కూర్చబడిన కథల పుస్తకాలు బాలలను ఎక్కువగా ఆకర్షిస్తాయి. ఈ బొమ్మల కథలు పుస్తకాలు మన తెలుగు సాహిత్యంలో చాల తక్కువగా కనిపిస్తున్నాయి. బుజ్జాయి పబ్లికేషన్సు వారు యీ పనికి పూనుకొని కొన్ని పుస్తకాలు ప్రచురించారు. చక్కని రేఖా చిత్రాలు వ్రాసే యువకులు మనకి ఇంకా కావాలి.




ఆంధ్ర వారపత్రికలో పడిన నరసింహమూర్తిగారు బొమ్మల పంచతంత్ర కథలవంటి పుస్తకాలు కూడా కావాలి. యువ చిత్రకారుడు బాపూ కూడా బొమ్మల కథలను కొన్ని సృష్టించాడు. బాలలకు శాస్త్ర విజ్ఞాన విషయాలు సులభంగా బోధపడేటట్టు వాడుక భాషలో ఇటీవలనే విస్సా అప్పారావు గారు ఖగోళ విజ్ఞానం గురించి *ఆకాశం* అనే చక్కని పుస్తకం ప్రచురించారు. వేమరాజు భానుమూర్తి కూడా సైన్సు కథలు బోలెడు ప్రచురించారు.

**నవలలు**

బాల సాహిత్యంలో నవలా రచన కూడా ఆధునిక సాహిత్యంలో ఒక విభాగంగా వెలిసింది.

చింతా దీక్షితులుతో ప్రారంభమైన బాల నవలా రచన కె.సభా, పాలంకి రామచంద్రమూర్తి, నార్ల చిరంజీవి, శ్రీవాత్సవ, రావి కొండలరావు, కనకమేడల మొదలగు వారి చేతుల్లో పెరుగుతూ వచ్చింది. చింతా దీక్షితులు *లీలా సుందరి, శంపాలత, గోపి–మోహినీ,* కే. సభా *చంద్రం, మత్స్యకన్యలు,* చిరంజీవి *మందార మాల,* పాలంకి వారి *చిటుకప్ప* రావి వారి *దాసు,* కనకమేడల వారి *అన్నదమ్ములు,* శ్రీవాత్సవ వారి *జల్తారు జాబిల్లి,* పిల్లల్ని ఎక్కువగా ఆకర్షించినట్లు తెలుస్తోంది.

**నాటికలు**

తెలుగు బాలల కొరకు నాటకములు, నాటికలు వ్రాసినవారు బహుతక్కువ. ఆకాశవాణి వివిధ కేంద్రాలలో పిల్లల కార్యక్రమములలో ప్రసార నిమిత్తము రేడియో అన్నయ్య, అక్కయ్యలు, సుభ, శ్రీవాత్సవ, పాలంకి, ఏడిద మొదలగువారు రచించిన రేడియో నాటికలే చాలా వరకు రంగస్థలముపై ప్రదర్శనకు అనుగుణ్యంగా మార్పులు చేసి ప్రచురణమైనాయి.

బాల సాహిత్య ప్రసారానికి ఆకాశవాణి మదరాసు, హైదరాబాదు, విజయవాడ కేంద్రాలు ఎంతో దోహదమిస్తున్నాయి. బాల గేయాలు, కథలు, రూపకాలు, రేడియో విజ్ఞాన యాత్రలు వ్రాయించి బాల వాఙ్మయంలో బాలలకు అభిరుచిని కలుగజేస్తున్నాయి. అంతే కాకుండా బాల జానపద గేయాలను, పాత కథలను, పాటలను సేకరించి, టేపు రికార్డు చేసిరేడియో గ్రంథాలయాన్ని సృష్టిస్తున్నాయి. అముద్రిత రేడియో నాటికలు వందల కొలది రేడియో కేంద్రాలలో ఉన్నాయి.

బాలల కొరకు రేడియో నాటికలేకాక విడిగా రంగస్థల నాటికలు కొన్ని కె.సభా, ఇల్లిందల సరస్వతీదేవి వ్రాసి ప్రచురించారు. కృష్ణకవి బాలకృష్ణుని లీలలు నాటికలుగా వ్రాశారేకాని అవి చదువుకునేందుకే బాగున్నాయి.

ఇప్పటివరకు ప్రచురింపబడిన నాటికలు 12,13 ఏళ్ళ వయస్సు పైబడ్డ బాలబాలికల కొరకే అనిపిస్తుంది. చిన్నారి బాలలకు ప్రదర్శనయోగ్యంగా Ballet వంటి మూకీలు మనకి ఇంకా కావాలి. రామాయణం, మహాభారతం, మొదలయిన కథలను చక్కని గేయ నాటికలుగా చిన్నారి పిల్లలచేత వేయించవచ్చును. అంతేకాదు, పంచతంత్రములోని హితోపదేశ కథలు చిట్టి బాలలకు వేషాలు వేయించి ప్రదర్శించ వచ్చును. అట్టి నాటికలలో చెప్పుకోతగినవి *పిల్లి మెడలో గంట, అపాయంలో ఉపాయం.*

**బాలసాహిత్యం – ప్రభుత్వం**

*నేటి బాలలే రేపటి పౌరులు* అని గుర్తించి మన ప్రభుత్వం బాల సాహిత్యాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర స్థాయిలోనూ, తెలుగు భాషా సమితి ద్వారానూ, కొన్ని బహుమతులను ఏటేటా ఇస్తోంది. బాల రచయితల కార్ఖానా అని ఒక బడినిపెట్టి రచనలను పురుగొల్పింది. కాని యీ ప్రయత్నాలు చాలవు. బాలసాహిత్యం ఎక్కువగా, రసవంతంగా సర్వాంగ సుందరంగా వెలువడాలంటే దానికి ఒక సమగ్ర పథకం కావాలి. మి

# బాల నాటకరంగం

మొదటి ప్రపంచ యుద్ధం ముగిశాక కొన్ని నాటక సమాజాలు పిల్లలచేత *కృష్ణలీలలూ, ప్రహ్లాద* మొదలైన నాటకాలు వేయిస్తూ వచ్చారు. గుంటూరు బాలమిత్ర సభ, కాకినాడ యంగ్‌మెన్సు హ్యాపీక్లబ్బు, చిత్తూరు రామ విలాస సభ పిల్లల చేత నాటకాలాడించడం నాకెరుక. సూరిబాబూ, రఘురామయ్య మొదలైన నటులు మొదట్లో బాల నటులుగా పేరు తెచ్చుకున్నవారే. నేడు పేరుగన్న భానుమతి మొదలగు కొందరు సినీ తారలు మొదట బాలనటీమణులుగా అనుభవం సంపాదించిన వారే.

ఆ విధంగా కొన్ని నాటక సమాజాలు బాల నటులను తమ అవసరాలకు ఉపయోగించడం బాల నాటకరంగ చరిత్రలో ఒక ఘట్టం అని చెప్పాలి. రెండవ ప్రపంచ యుద్ధం 1945లో ముగిసింది. 1947లో మనకు స్వరాజ్యం వచ్చింది. ఆ సంవత్సరములోనే మదరాసులో బాలల విజ్ఞాన వినోద వికాసములను పెంపొందించేందుకు పుట్టింది ఒక సంస్థ. అదే *ఆంధ్ర బాలానంద సంఘము.*

ఈ సంఘ నిర్వాహకులే పిల్లల కొరకు ప్రత్యేకంగా నాటికలు వ్రాయించి, వాటి ప్రదర్శనలకు అవకాశాలు కల్పించారు. ప్రతి దసరా ఉత్సవాలలోను పిల్లలకు నాటికల పోటీలు నిర్వహించి, ఉత్తమ రచనలకూ, నటులకూ, ప్రదర్శలకూ బహుమతులు ఇస్తూ వచ్చారు. *ఆంధ్ర దేశంలో బాల నాటకరంగ కళ* అనే ఉద్యమానికి ప్రప్రథమంగా కృషి చేసినది ఆంధ్ర బాలనంద సంఘమే అని చెప్పాలి. ఈ సంఘ కార్యకర్తలు తెలుగు జిల్లాల్లో పర్యటించి *బాలానంద సంఘముల* స్థాపనతో పాటు ఈ ఉద్యమానికి కూడా దారి చూపారు. వారి *బాల* పత్రిక కూడా ఈ ఉద్యమానికి ఎంతో దోహదం చేసింది. పిల్లల నాటికలనూ, ఫోటో చిత్రాలనూ, వార్తలనూ ప్రచురించి ప్రోత్సహించింది *బాల.*

*ఆంధ్ర బాలానంద సంఘము* 1952లో మదరాసు లోనూ, 1953లో కర్నూలులోనూ, 1955లో గుంటూరు లోనూ, 1957లో హైదరబాదు లోనూ నిర్వహించిన బాల మహా సభలలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధి వర్గాలు ఆ సందర్భములో రాష్ట్రస్థాయిలో ఏర్పరిచిన సాంస్కృతిక కార్యక్రమములలో పాల్గొని బాల నాటక రంగము యొక్క ప్రాముఖ్యతనూ, ఆవశ్యకతనూ వెల్లడిపరచారు. బాలల నాటక ప్రదర్శనలు బాగుండాలంటే, వారికి ప్రత్యేకంగా అన్ని హంగులతో కూడిన ఒక రంగస్థలం అవసరం. ప్రత్యేక నాటికలు అవసరం అన్న విషయం గుర్తించ బడింది. పిల్లల కొరకు నాటికలు రచించడం అనుకున్నంత తేలిక పనికాదు. పిల్లల నాటికలు అంటూ అమ్ముడుపోతున్న నాటికల్లో స్టేజిమీద నటించుటకు అనువుగా ఉన్నవి బహు తక్కువ. వ్యాపార దృష్టితో కాకుండా పిల్లలు చూచుటకు యోగ్యంగా వుండే కథావస్తువుతోనూ స్టేజిమీద ప్రదర్శించేందుకు అనువుగా ఉండే నాటికలను ప్రదర్శించే ఔత్సాహికులు కూడా కావాలి.

గుంటూరు *బాలానంద కేంద్రం* వారు అనుభవం మీద *గంగిరెద్దు* మొదలగు నాటికలను వ్రాయించి ప్రదర్శించారు. హైదరాబాదులో కూడా *ఆంధ్ర బాలానంద సంఘం* వారు యీ కృషిని సాగిస్తున్నారు. ఇటీవల పిల్లల కొరకు ప్రత్యేకంగా నాటికలు వ్రాసి ప్రదర్శించిన వారిలో జమ్మలమడక పూర్ణచంద్ర రావు, చెరుకుమిల్లి భాస్కర రావుగారలను ఎన్నుకోవాలి. ఆకాశవాణి పిల్లల ప్రోగ్రాంలలో ఆది నుంచీ అనేక రకాల నాటికలు ప్రసారం అవుతూ వున్నాయి.

కౌండిన్య, రేడియో అన్నయ్య, అక్కయ్య, తాతయ్య, శ్రీవాత్సవ, ఏడిద, జనమంచి మొదలైనవారు రచించిన నాటికలలో కొన్నిటిని కొలది మార్పులతో బాలానంద సంఘాలు స్టేజిపై ప్రదర్శించారు. వీటిలో *బూరెల మూకుడు, ఇంటి మందు, జబ్బు కుదిరింపు, శ్రావణ భాద్రపదాలు, సిండ్రిల్లా, పిల్లిమెడలో గంట, మెట్టెక్కితే, మహిషాసురమర్ధని, గ్రాంథిక శాస్త్రి, పొట్టిబావ–చిట్టి మరదలు* ఘనత వహించాయి.

బాలబాలికల శ్రేయస్సుకు, సాంస్కృతిక వికాసములకు తన జీవితమును అంకితము చేసిన విద్యావేత్త, కళావిదుడు, రచయిత రాఘవరావు (1905–84). 1939లో ఆలిండియా రేడియోలో పిల్లల ప్రోగ్రాముల నిర్వాహకుడుగా ఆయన

చేరారు. ఈ ఉద్యోగ నిర్వహణలోనే బాలల వికాసానికి ఒక సంస్థను రూపొందించాలనే ఆశయం ఆయనకు కలిగింది. సతీమణి కామేశ్వరితో కలిసి *బాలానంద సంఘాని* కి 1940లోనే ఆయన పునాదులు వేశారు.

రేడియోలో బాలల కార్యక్రమాలు, *బాల* పత్రిక, బాలానంద సంఘాల ద్వారా వారిరువురు చేసిన కృషి అవిస్మరణీయమైనది. రాఘవరావు రేడియో అన్నయ్యగాను, కామేశ్వరి రేడియో అక్కయ్యగాను సుప్రసిద్ధులయ్యారు. మన ఊహల్లో అపూర్వమయిన వాతావరణాన్ని కల్పించడమే కాకుండా ఆ కల్పనలో ఏనాడూ *హృదయం* వదలని అపూర్వమయిన ప్రసారకర్త అన్నయ్యగారు. ఆయన నాల్గయిదు తరాలకి అన్నయ్యగారు. ఆకాశవాణిలో బాలల కార్యక్రమాలకు రాఘవరావు దంపతులు మొత్తం 1000 స్క్రిప్టులు రూపొందించారు. వారు సృష్టించిన విశిష్ట పాత్రలలో *కొంటె క్రిష్టయ్య, తాతయ్య, మొద్దబ్బాయి, దొడ్డమ్మ, పొట్టిబావ – చిట్టి మరదలు* విశేష ఆదరాన్ని పొందాయి. మి

## అట్టమీది బొమ్మలు

**అట్టమీది బొమ్మలు –** *చిత్రకారిణి* : ఏలూరిపాటి అన్నపూర్ణ. యజ్ఞన్న శ్రీమతయిన ఈమె సహజ కళాకారిణి. ఆమె చిత్రాలలో ఎక్కడా ప్రసిద్ధి గాంచిన మరే చిత్రకారుని భావ వల్లరి కనిపించక పోవటం, సహజమైన ఆమె సృజనాత్మకతను మన ముందుంచుతాయి.



**ముఖచిత్రం –** శివపార్వతులు : 22" × 30" సైజులో కాన్‌సన్ కాగితంపై మిక్స్‌డ్ మీడియాతో గీసిన చిత్రమిది. శివపార్వతుల ఏకీకృత రూపమే అర్థనారీశ్వర మూర్తి. తన శరీరంలో అర్థభాగం తన పత్నియైన పార్వతికిచ్చి గౌరవించటం దీని కథాంశం. ఈ అర్ధనారీశ్వర మూర్తి చిత్రం అనేకమంది ప్రసిద్ధి పొందిన చిత్రకారులు తమ చిత్రాలలో, తమదైన శైలిలో స్పందించారు. నందలాల్ బోసు వేసిన చిత్రం ఎంతో ప్రసిద్ధమైంది.



**రెండవ అట్ట :** మయూరి : 18" × 24" సైజులో కాన్వాస్ వస్త్రంపై కోడిగుడ్డు వృత్తాకారంలో రూపొందించిన భావనాత్మక చిత్రకళ. ఇందులో చిత్రకారిణి స్త్రీ మూర్తిత్వాన్ని ప్రకృతి ఒడిలో సందర్శించటం గమనించవచ్చు. అక్రిలిక్ రంగులతో బాటుగా వెండి చమ్కీ, తెలుపురంగులు అక్కడక్కడా అద్దబడటంతో చిత్రానికి కొత్త సొగసులు వచ్చి చేరాయి.



**మూడవ అట్ట :** పద్మ రాగం : 24" × 30" సైజులో ఈ పెయింటింగ్ మిక్స్‌డ్ మీడియా అయిన అక్రిలిక్ చార్కోల్ తో వేయబడ్డది చార్‌కోల్ ఉపయోగించటంలో కాన్వాసు మీద కానవచ్చే టెక్స్‌చర్‌ను మనం గమనించ వచ్చు.



**నాలుగవ అట్ట :** మౌన గానం : 20" × 28" సైజులో మిక్స్‌డ్ చార్కోల్ తో కలిపిన అక్రిలిక్ చిత్రం. ఇదీ కాన్వాసుపైన చిత్రించినదే...

## నవనాథ సిద్ధ సారము

# తెలుగువారి వైద్య సంప్రదాయాలు

- కుర్రా జితేంద్రబాబు

ప్రపంచంలో ప్రతి దేశానికి తనదైన ఒక వాతావరణము, శీతోష్ణస్థితి ఉంటాయి. అలాగే రుగ్మత, రోగాలు కూడా. అలాగే ఎవరి వైద్య విధానాలు వారు అభివృద్ధి చేసుకున్నారు. మన విషయంలో, ఇక్కడి పరిసరాలలో లభ్యమయ్యే వృక్ష, ఖనిజ సంపదలను వినియోగిస్తూ ఆయుష్షును పెంచి, పోషించే వేదమే ఆయుర్వేదం. ఇది మానవ శరీరంలో గల పిత్త, వాత, కఫాలనాధారంగా, మన రుగ్మతలకు విరుగుడుగా తయారైన వైద్య విధానం.

క్రీ.పూ. 6వ శతాబ్దినుండి సుమారు క్రీ.శ. 18, 19వ శతాబ్దాల దాకా మన భారతదేశంలో అద్భుతమైన 'ఆయుర్వేద వైద్యవిధానం' వృద్ధి చెందింది.

చికిత్సకు వైద్యుడు, ఔషధాదిద్రవ్యాలు, పరిచారకుడు, రోగి అను నాలుగు అంగములున్నాయి. వీటినే పాదచతుష్టయం అంటారు.

అందొక్కొక్కదానికి నాలుగు సుగుణాలుండాలి.

వైద్యుడు వైద్యశాస్త్రంలో నిపుణుడిగా, గురువులవద్ద శాస్త్రబద్ధంగా వైద్య శాస్త్రమును అభ్యసించినవాడై, అనుభవం కలిగినవాడై, త్రికరణ శుద్ధిగా వైద్యవిధానం ప్రయోగించేవాడై ఉండాలి. పరిచారకుడు, రోగులయెడ ప్రేమగలవాడై, త్రికరణశుద్ధిగా సమర్థుడుగా, బుద్ధిమంతుడుగా ఉండాలి.

రోగి వైద్యము చేయించుకోగలిగిన వాడై, వైద్యుడు చెప్పినట్లు నడుచుకొనేవాడై, తన బాధలను, ఆహార విహారాదులన్నిటినీ వైద్యునికి తెలుపగలిగినవాడై, ఇంద్రియ నిగ్రహం కలవాడై, ధైర్యంకలవాడై ఉండాలి అని ప్రాచీన ఆయుర్వేద శాస్త్రంలో వైద్యశాస్త్ర నిర్వహణ గురించి తెలియజేశారు. ఏ వైద్య విధానమైనా ఈ సూత్రాలు పాటించినట్లయితే వైద్య శాస్త్రాన్ని శాస్త్రీయంగా రోగ నిరోధానికి ఉపయోగించవచ్చు-అని జాగ్రత్తలు చెప్పబడ్డాయి.

ఈ *నవనాథ సిద్ధసారము* అను గ్రంథం ఆయుర్వేదంలో తెలుగు వారి వైద్య సంప్రదాయానికి చెందినది. ఈ వైద్య సంప్రదాయంలో మూలికావైద్యం, సిద్ధవైద్యం అను రెండు విధానాలు ఉన్నాయి. మూలికా వైద్యం అనగా కషాయ, తైల, ఘృత, లేహ్య గుటిక, ఆసవ, అరిష్టరూపాలలో, ఔషధాలను ప్రయోగించు విధానం. సిద్ధవైద్యమనగా రస గంధకాది ఖనిజాలు, స్వర్ణ రజితాది లోహాలు, వజ్రముక్తాది రత్నాలు, వత్స నాభి మొదలగు విషములను శుద్ధి చేసి, వీటితో చేయు భస్మాలను, సింధూరాలను, ఖజ్జలీ ఔషధాలను ప్రయోగించి చేయు చికిత్సా విధానం. తెలుగువారి ఈ సిద్ధ వైద్య సంప్రదాయానికి సిద్ధ నాగార్జునుడు ఆద్యుడు. అతడు క్రీ.శ. తొమ్మిదో శతాబ్దిలో నాగార్జునకొండ పరిసర ప్రాంతమైన ఏలేశ్వరంలో అనేక రసాయనిక పరిశోధనలు చేసి, పాదరసంను కనుగొని ఆయుర్వేద వైద్యవిధానంలో రస శాస్త్రాన్ని (కెమిస్ట్రి) ప్రవేశపెట్టాడు.

రస, ఉపరసాలతో ఔషధాలు తయారు చేసేవారిని సిద్ధులని, ఆ వైద్యులను సిద్ధవైద్యులని లోక వ్యవహారం. ఈ సిద్ధవైద్య సంప్రదాయంలో గోరకనాథుడు, మస్త్యేంద్రనాథుడు, నాగార్జునుడు ముఖ్యులు, వాగ్భటుడు రచించిన *రసరత్న సముచ్చయంలో* ఇరవైయేడుగురు సిద్ధవైద్యులను పేర్కొనడం జరిగింది. వారు; ఆదియ. చంద్రసేన, లంకేశ, విశారద, కపాలీ, మత్త, మాండవ్య, భాస్కర, శూరసేన, రత్నకోశ, శంభు, సాత్విక, నరవాహన, ఇంద్రదత్తు, గోముఖ, కలంబి, వ్యాడి, నాగార్జున, సురానంద, నాగబోధి, యశోధన, ఖండ, కాపాలికా, బ్రహ్మ గోవింద, లంపక, హరి అను వారలు ఇరువదియేడుగురు రస సిద్ధులు.

ఈ నాథ సాంప్రదాయానికి చెందిన గురుపరంపరను వర్ణించు కావ్యమే గౌరన *నవనాథచరిత్రము*. నవనాథులలో

కుర్రా జితేంద్రబాబు, ఫోన్ : 9848882600

ఒకడైన నాగార్జునుడు మలయాళము, బర్బర, మగధ, ఆంధ్ర, చోళ ప్రాంతాలను దర్శించినట్లు ఈ *నవనాథచరిత్ర*లో పేర్కొనబడింది. సిద్ధ నాగార్జునుడు రచించిన గ్రంథాలలో *లోహ శాస్త్రము, రసరత్నాకరము, కచ్ఛపుటతంత్రము, ఆరోగ్యమంజరి, యోగసారము, రసేంద్రమంగళం, రతిశాస్త్రము, రసకచ్ఛ పుటము, సిద్ధ నాగార్జునీయము* ముఖ్యమైనవి. తెలుగువారి సిద్ధ వైద్య సంప్రదాయంలో *రసరత్నాకర* కర్త నిత్యనాథసిద్ధుడు ప్రసిద్ధుడు. తెలుగు ప్రాంతాల్లో *బసవరాజీయం, వైద్యచింతామణి* మొదలైన గ్రంథాలు వాడుకలోకి రాకముందు *రసత్నాకరాన్నే* ఆచరిస్తూ ఉండేవారు.

దీనిలో *రస, రసేంద్ర, రసాయన, వాద, మంత్రమనే* ఐదు ఖండాలు ఉన్నాయి. *ఈశ్వరోక్తరసార్ణవం, స్వచ్ఛంద నాథుని రసమంగళం, రసదీపిక*, వ్యాధుల్ని గురించి చెప్పిన సంహితాగ్రంథాలు; నాగార్జున, కాపాలిక చర్పట సిద్ధులు చెప్పిన రసతంత్ర విషయాలు, ఇతర రసగ్రంథాలు, సంహితలు బాహటం (వాగ్భటం) *సుశ్రుతం, వైద్యసారగ్రంథాలు*, అనేకమంది సిద్ధులు చెప్పిన ముఖ్య విషయాలు రసరత్నాకర రచన విషయంలో వాడుకున్నట్లు నిత్యనాథుడు పేర్కొన్నాడు.

రసముతో చేయు వైద్యము దేవ వైద్యమని, మూలికలతో చేయు వైద్యము మానుషమని, శస్త్రవైద్యము దాహకర్మ, రాక్షస వైద్యమని, మంత్రములచే చేయు చికిత్స సిద్ధ వైద్యమని పేర్కొన్నాడు.

తెలుగువారి వైద్య సంప్రదాయంలో వచ్చిన మరొక ప్రసిద్ధ గ్రంథం *'పరహిత సంహిత'* దీనిని శ్రీనాథ వైద్య పండితుడు రచించాడు.

ఇందులో మొదటి భాగం కాయ చికిత్స, రెండవ భాగం కౌమారతంత్రం, మూడు భూత విద్యాధికారం, నాలుగు శాలాక్య చికిత్సాధికారం, ఐదు సర్వశల్య చికిత్సాధికారం లేక శల్యతంత్రం, ఆరు విషచికిత్సాధికారం, ఏడు రసాయ నాధికారం, ఎనిమిది వాజీకరణాధికారం మొదలగు అధ్యాయాలు ఉన్నాయి.

ఈ పరహిత వంశస్థులు తెలుగువారు కావటమే కాకుండా, కొండవీటి రెడ్డిరాజుల పాలనాకాలంలో ఉన్నట్లు ఆధారాలు లభ్యమౌతున్నాయి. అనితల్లికలువచేరు శాసనం, పొన్నుపల్లి తామ్ర శాసనం పరహిత వంశాన్ని గూర్చిన అనేక విషయాలను తెలియజేస్తున్నాయి.

సిద్ధసంప్రదాయంకు చెందిందే మరొక గ్రంథం *'ప్రయోగరత్నావళి'*. దీనిని శ్రీకంఠ శివపండితుడనే తెలుగు శైశబ్రాహ్మణుడు రచించాడు. దీనిలో రత్నాలు, స్వర్ణాదిలోహాలు, కర్పూరం, అగరు, కుంకుమ కేసరం, కస్తూరి మొదలైన వాటి గుణాలను, దోషాలను పేర్కొనటం జరిగింది. ఇది అసమగ్రంగా లభించిన గ్రంథం.

మనకు లభ్యమయ్యే సమాచారం ప్రకారం తెలుగులో తొలివైద్య గ్రంథరచన అప్పనకవితోనే ప్రారంభమైంది. అందువలన తెలుగులో వైద్య సాహిత్యానికి ఇతడు ఆదికవి అని చెప్పవచ్చు.

15వ శతాబ్దివరకు తెలుగువారు వైద్యసాహిత్యాన్ని సంస్కృత భాషలోనే రచించారు. ఈ శతాబ్దినుండే తెలుగు వైద్య గ్రంథకర్తలు వైదిక, తాంత్రిక, వైద్య సంప్రదాయాలను కలిపి గ్రంథ రచన చేయడం ప్రారంభించారు.

1580-1590 మధ్యకాలంలో ఎలకూచి బాలసరస్వతి తన *'చంద్రికాపరిణయ'* గ్రంథంలో

**"చెలువుగఁ దెలుఁగు జేసితివామన పురాణ**
**బాహటాది మహాప్రబంధ చయము"**

అని పేర్కొన్నాడు. ఈ పద్యంవల్ల ఇతడు బాహటంను తెలుగు పద్య కావ్యంగా రచించినట్లు తెలుస్తున్నది. కాని లభ్యం కాలేదు. బాహటం అనగా వాగ్భటాచార్యుడు రచించిన *'అష్టాంగ హృదయ సంహిత'*. బాహటము పేరున మరొక్క గ్రంథం గౌరీపుత్ర కార్తికేయ విరచితంగా మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తకశాలలో ఉంది. ఈ గ్రంథంలో *నిదానయోగం, కషాయయోగం, పథ్యాపథ్యయోగం, తైలయోగం, ఘృతయోగం, లేహ్యావర్గయోగం, చూర్ణ వటికాయో గౌషధయోగం, రసయోగం* అనే తొమ్మిది అధ్యాయాలు ఉన్నాయి. బహుశా బాలసరస్వతి అనువదించిన గ్రంథం ఇదైనా కావచ్చు. ఇదే గ్రంథాలయంలో *'అష్టాంగ హృదయము'* అనే పేరుతో ఎలకూచి బాలసరస్వతి శిష్యుడైన చెండిలింగయా చార్యుడు రచించిన మరొక గ్రంథం కూడా ఉంది.

మరియొక తెలుగు కవి ఇంద్రగంటి వల్లభాచార్యుడు *'వైద్య చింతామణి'* అను గ్రంథాన్ని రచించాడు. ఇతడు విద్వద్వైద్యుడు, సకల పాండిత్య ప్రవీణుడు. ఈ గ్రంథంలో ముందుగా అష్టస్థాన పరీక్షలను తెలిపి, ఆ తర్వాత పంచలక్షణ

నిదానాన్ని వివరించాడు. ఈ గ్రంథారంభంలో శ్రీనాథుని, పార్వతీనాథుని స్తుతించటంవల్ల ఇతడు అద్వైత మతానికి చెందినవాడని భావించాలి.

మరొక తెలుగు వైద్యుడు కొట్టూరు బసవరాజు '*బసవరాజీయ*'మను వైద్య గ్రంథాన్ని రచించారు. ఇతడు అనేక ప్రాచీన వైద్య శాస్త్ర గ్రంథాలను పరిశీలించి, ఈ గ్రంథాన్ని రచించినట్లు ఈ గ్రంథంలో పేర్కొన్నాడు. అతను పేర్కొన్న గ్రంథాలలో ఆరు లేక ఏడు గ్రంథాలు మాత్రమే లభ్యమౌతున్నాయి. కొట్టూరి బసవరాజు పైన పేర్కొన్న జాబితాలో *మాధవకల్పం, కాశీఖండం, నిత్యనాధీయం* తదితర గ్రంథాలని ఉదాహరించడంవల్ల ఇతడు *చింతామణి* గ్రంథకర్తయైన ఇంద్రకంటి వల్లభాచార్యుని తర్వాతవాడని భావించవచ్చు. *బసవరాజీయం*లో శ్రీనాథుడు రచించిన *కాశీఖండం*ను ఉదాహరించాడు. ఈ పద్యాలు శ్రీనాథుని *కాశీఖండం*లో కాలజ్ఞానం కథా సందర్భంలో ఆసన్నమృత్యు లక్షణములను స్పష్టంగా వివరించాడు. *బసవరాజీయం*లో అష్టాస్థానపరీక్షలను గూర్చి వివరంగా తెలిపాడు. నాడీ పరీక్ష, జ్వరసన్నిపాత, పైత్యరోగ, శ్లేష్మరోగ, కాసరోగ నిదానాలను వివరించాడు. ఈ గ్రంథంలో బసవరాజు స్వతంత్రంగా రచించిన తెలుగు గద్య పద్యాలు నలభైనాలుగు శీర్షికల కింద సుమారు వందవరకు కలవు.

తెలుగువాడైన తుళ్ళూరి శరభరాజు రచించిన వైద్య గ్రంథం *శరభరాజీయం*. ఇతడు శృవత్సగోత్రుడు, వీరనార్యుని కుమారుడు, కాకతీయ ప్రతాపరుద్రుని ఆస్థానంలో పేరు గడించిన శివదేవయ్య వంశస్థుడు. ఇతడు *శరభరాజీయం*లో మూడు ఆశ్వాసములను మాత్రమే రచించి మరణించాడు. వైద్య గ్రంథములతో పాటు, ఇతర తెలుగు భాషా గ్రంథాలను కూడా శరభరాజు రచించారు.

మరొక తెలుగు వైద్యకారుడు లోలంబరాజు తన పేరున *లోలంబరాజీయం* అను వైద్య గ్రంథాన్ని రచించాడు. దీనినే *సద్వైద్య జీవనం* అని కూడా పిలుస్తారు. ఈ గ్రంథం శృంగారరస ప్రధాన కావ్యపద్ధతిలో కొనసాగింది. దీనిలో అన్నివ్యాధులకు సులభపద్ధతిలో చికిత్సలు తెలియజేశాడు. మరొక తెలుగు వైద్యుడు త్రిమల్లభట్టు *బృహద్యోగ తరంగిణి* అను వైద్య గ్రంథాన్ని రచించాడు.

నయనశేఖరుడను తెలుగు వైద్యుడు *యోగరత్నాకరము* అను గ్రంథాన్ని రచించారు. ఇది చికిత్సా గ్రంథాల్లో ఒకటి. దీనిలో శారీర, శల్య విషయాలు ఇతర విషయాలు అనేకం ప్రస్తావించబడ్డాయి. తెలుగువారు రచించిన ఇతర గ్రంథాలలో ధేనువకొండ కేశవకవి రచించిన *ప్రయోగ రత్నావళి* గూడా ముఖ్యమైన గ్రంథమే. ఇతడు జోగనామాత్యుని పుత్రుడు, ఈ గ్రంథం ఇంద్రగంటి వల్లభాచార్యుని వైద్య *చింతామణి*కి తెలుగు అనువాదం.

వైద్య *చింతామణి*కి వేంకటనరసమంత్రి కూడా తెలుగు అనువాదమును రచించాడు. పొలవర్తి గణేశ్వర కవి రచించిన *శరీరతత్త్వము* అను వైద్య గ్రంథము కూడా ప్రసిద్ధమైనదే. ఈ గ్రంథంలో అష్టాంగహృదయ శారీరస్థానానికి కొంత తెలుగు *పద్యానువాదము*, కొంతభాగము *భారతము*నుండి, మరికొంత భాగము *భోజరాజు చారుచర్య* నుండి సంస్కృత శ్లోకాలను ఉదాహరించుచు, తెలుగు పద్యాలను రచించాడు. *అష్టాంగహృదయము*లోని, *గర్భావక్రాంతిశారీరమున* గల శ్లోకములకు ఒక్కొక్క శ్లోకానికి, ఒక తెలుగు పద్యం రచించాడు. 12వ శతాబ్దినాటి *బసవపురాణం*లో వైద్య విషయ ప్రస్తావనలు ఎన్నో కలవు.

శిలాశాసనములలో కూడా వైద్య ప్రస్తావనలు అనేకం ఉన్నాయి. గుంటూరు జిల్లా మంగళగిరికి ఆరుమైళ్ళ దూరంలో ఉన్న మల్కాపురం గ్రామంలో గణపతి దేవుని కాలంలో వేయించిన ఒక శాసనంలో ప్రసూతారోగ్యశాలలు పోషించుట కును, వైద్యుని పోషణమునకును ప్రత్యేకముగా రెండేసి పుట్లు (రెండుపుట్ల విత్తనములు చల్లి పైరు చేయతగినంత విస్తీర్ణముగల 40 ఎకరముల) భూమిని ఇచ్చినట్లు చెప్పబడినది. ఈ శాసనం రచనా కాలం క్రీ.శ. 1261. కాకతి గణపతి రుద్రదేవులచ్చట రెండు గ్రామముల ఆదాయములో విశ్వేశ్వరాచార్యులొక శైవమతాన్ని ఆరోగ్య వైద్యశాలలను, ప్రసూతి వైద్యశాలను నిర్వహించుట కేర్పాటు చేసియున్నట్లు పై శిలాశాసనము వలన తెలియుచున్నది.

నల్గొండ జిల్లా భువనగిరి తాలూకా సైదాపురం గ్రామంలో చాళుక్యుల రెండో రాజు జయసింహుడు క్రీ.శ. 1034లో వేయించిన ఒక శాసనంలో 'వైద్యరత్నాకర', 'ప్రాణాచార్య', 'నరవైద్య' బిరుదులు పొందిన జైన వైద్యుడు అగ్గలయ్య జైన బస్తీలు కట్టించడానికి ముప్పనపల్లి గ్రామాన్ని ఆ గ్రామాధికారికి దానం చేసినట్లు పేర్కొనబడింది. ఇతడు సర్వశాస్త్ర పారంగతుడే కాక, శస్త్ర వైద్య నిపుణుడు, శస్త్ర చికిత్సలు చేస్తూ, ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను

బతికించడంలో సిద్ధహస్తుడు. ఇతనికి నరవైద్య అనే బిరుదు ఉంది. ద్రాక్షారామం భీమేశ్వరాలయంలో గొంకరాజు కులోత్తుంగ చోళుని తల అంటకడిగే కార్యంలో నిష్ణాతుడైన ప్రఖ్యాతిపొందిన ముద్దనాయకుడు భీమేశ్వరమహాదేవరు చేసిన దానశాసనం ఉన్నది. దీనివల్ల అభ్యంగన స్నానానికి ఉన్న ప్రాముఖ్యత తెలుస్తుంది. ద్రాక్షారామం భీమేశ్వరాలయంలోని కొన్ని ఇతర శాసనాలవల్ల కూడా వైద్యులవివరాలు తెలుస్తున్నాయి.

బాపట్ల శాసనం, నందలూరు శాసనంలలో కూడా వైద్యుల వివరాలు ఉన్నాయి. పాలకొల్లులోని క్షీరరామేశ్వర ఆంజనేయస్వామి గుడి శాసనంలోను, అహోబిలంలోని పాములేటి నరసింహస్వామి దేవాలయ శాసనంలోను, కృష్ణానది ఒడ్డునగల వెల్లటూరు గ్రామ శాసనంలోను ఆయుర్వేద వైద్య వివరాలు ఉన్నాయి.

కడప జిల్లా నందలూరు గ్రామంలోని సౌమ్యనాథస్వామి దేవాలయంలో ప్రాకారపురాళ్లమీద చెక్కిన శాసనములో ఇనుబోలు గ్రామవాసులగు వెలమలు, సాంక్రామిక వ్యాధులలో చేరిన మహామారీ జ్వరమను క్రూరవ్యాధిచే భయపడి పెరుంగండూరను గ్రామంలో గుడిసెలు వేసుకొని నివసించినట్లు తెలుస్తున్నది.

నెల్లూరు జిల్లా ఉదయగిరియందు క్రీ.శ. 1245-46 సంIIలలో నందిపాడునందు వేయించిన శాసనంలో సిద్దులగురించి పేర్కొనబడింది. వడిగల, సిద్ధ వ్యాళి, నాగార్జున, నాగబుద్ధ, కోరంటిక, కాదంబిక, కాదంబ, రత్నఘోష, విష్ణుగుప్త, చంద్రగుప్త, బాణా మొదలైనవారు పాదరసపు శాస్త్రమునందు (రసశాస్త్రమునందు) నిష్ణాతులని పేర్కొనబడింది.

సాహిత్యంలో వైద్యుల వర్ణన అనేక గ్రంథాల్లో పేర్కొనబడింది.

చంకన మందుల సంచి, తలపాగ, పంచ లోహము లతోఁ జేయబడిన యుంగరము, ఊర్ధ్వపుండ్రములు, కుడిచేతియందు కరక్కాయలు, సందిలియందు పుస్తకమును ధరించి మూలికలకొఱకు నాలుగువైపుల నన్వేషించుచు నాటి వైద్యులుండెడివారని *పరమయోగి విలాసము* నుడువు చున్నది.

తెలుగు ప్రాంతంలో జానపద వాఙ్మయంలోను వైద్య సంబంధి జానపద గేయాలు కొన్ని ప్రచారంలో ఉన్నాయి. వీటిని వైద్యపరంగా అర్థం చేసుకోవాల్సి ఉంది.

**చిన్నారి పొన్నారి - చిట్టి నా తల్లి**
**చుక్కల్లో చంద్రుడు - చూడవచ్చాడు**
**తెల్లవారొచ్చింది - కోడి కూసింది**
**చూచేటి అక్కల్లు - చూడ రారమ్మ**
**ఆడుకో రారమ్మ - అక్కల్లు మీరు**
**ఆడేటివారికి - అచ్చావుపాలు**
**పాడేటివారికి - పాలు పంచదార.**

తెల్లవారి లేవగానే పిల్లలు ఆడుకోవాలని, పాడు కోవాలని, ఆడినవారు వెచ్చని ఆవులపాలు తాగాలని, పాడినవారు పాలు పంచదార తాగాలని ఈ పదాలలోని విశేషం.

**హాయీ హాయీ - ఆపదలు గాయి**
**చిన్న వాంద్రను గాయి - శ్రీరంగశాయి**
**ఆడితే ముద్దయ్య - పాడితే ముద్దు**
**అందరికి అబ్బాయి - అల్లారుముద్దు**
**ఏకుల్ల రాటమ్ము - యింటి కందమ్ము**
**మా చిన్న అబ్బాయి - మాకు అందమ్ము**
**జోలల్లు పాడితే - బాలలకు నిద్ర**
**నాగస్వరం పాడితే - నాగులకు నిద్ర.**
**వానా! వానా! వల్లప్ప!**
**వాకిలి తిరుగూ చెల్లప్ప !**
**కొండమీది - గుండురాయి**
***కొక్కిరాయి - కాలువిరిగె**
**దానికేమి మందు ?**
**వేపాకు పసుపూ - వెల్లుల్లిపాయ**
**నూనె(మ్మబొట్టు)లో మడ్డి - నూటొక్క (ధార) సారి**
**పూయవోయి - నూరి**
**పూటకొక్క తూరి.**

పిల్లల వైద్యానికి సంబంధించి, ఆరోగ్యానికి సంబంధించి, *శ్రీకాళహస్తి మహత్మ్యం* అను గ్రంథంలో కొన్ని వివరాలు పేర్కొనబడ్డాయి. పసిపిల్లల శరీరానికి నలుగుపిండిని పట్టించి, వెచ్చని నీళ్ళతోడ స్నానమాడించి, మెత్తని తెల్లని వస్త్రములతో తడిపోవునట్లొత్తి, తన కాలి కంటుకొన్న మట్టితో బొట్టుపెట్టి, రెండుకన్నులయందు కాటుక పెట్టి, పాలిచ్చి, చిన్నగుడ్డల పక్కపై పరుండఁబెట్టి జోకొట్టి తల్లి నిద్రబుచ్చుతుంది. చట్టాముదముతో తలయంటును, గాలి, దయ్యములు, మున్నగునవి పాపల దగ్గరకుఁ జేరి 'కింకపోరు' పెట్టకుండఁగ ముసిడిచెట్టు పుల్లలు, మంచము దగ్గర నుంచెడివారు. దృష్టిదోషము తగులకుండఁగ పూసలను కాలికిగానీ, మెడకుఁ గాని కట్టెడివారు. ఉప్పు, వేపాకు నిప్పుపైన వేసి దృష్టి దోషమును నివారింప చేసేవారు.

* అల్లరిపిల్లవాడు

బాలెంత తాంబూలమును సేవించుటయు, వాతహరణార్థము వసకొమ్ముతో చేయబడిన పూసలను ధరించుట కలదు. ఈ విషయము *శ్రీకాళహస్తి మహాత్మ్యం* చెప్పబడింది.

తెలుగునాట కొండపల్లి నివాసి మల్లభట్టు రచించిన *బృహద్యోగతరంగిణి* అను గ్రంథం స్వతంత్రంగా రచించిన వైద్య గ్రంథం. ఇతడు సింగనభట్టు మనమడు వల్లభభట్టు కుమారుడు. శ్రీకంఠ పండితుడు రచించిన *హితోపదేశము* కంభంపాటి వేంకటభట్టు రచించిన *భిషక్సుధార్ణవము*, వీరకృష్ణుడు రచించిన *కాయచికిత్సలు*, సూరయకవి రచించిన *బాహట సారాదికము*, లోలంబరాజు రచించిన *లోలంబరాజీయము*, తాడేపల్లి పానకాలరాయుడు రచించిన *రసప్రదీపిక* కర్త తెలియని *శతశ్లోకి*తో పాటు మద్రాసు ప్రాచ్యలిఖిత భాండాగారములో అనేక వైద్యశాస్త్ర గ్రంథాలు కలవు.

ఈ గ్రంథాలలో ప్రధానంగా పేర్కొనదగిన గ్రంథం *నవనాథ సిద్ధసారము* ఈ గ్రంథాన్ని హరితస గోత్రుడు, భీమన, గురవమ్మల పుత్రుడైన రాయసం పేరయ్య రచించాడు. ఇతని ముత్తాత గజపతుల వద్ద సత్కారం పొందినట్లు ఈ గ్రంథారంభంలో పేర్కొన్నాడు. కటక్ పాలకుడైన కపిలేశ్వర గజపతి, తీర ప్రాంతం మొత్తంతో పాటు తెలంగాణలోని దేవరకొండ, రాచకొండ, కౌలాస మొదలగు దుర్గాలను, ఆ ప్రాంతాలను క్రీ.శ. 1457 ప్రాంతంలో జయించాడు. ఇతని తర్వాత ఇతని కుమారుడు హంవీరుడు, అతని కుమారుడు ప్రతాపరుద్ర గజపతి క్రీ.శ. 1538 వరకు తెలుగు ప్రాంతపు పాలకులుగా ఉన్నారు. ఈ గ్రంథానికి *నవనాథ సిద్ధసారమని, నవనాథ శుద్ధి ప్రదీపకయని, వైద్యసారమని* కూడా పేర్లు గలవు. ఈ కవి సంస్కృత భాషలో పాండిత్యము గలవాడైనప్పటికి, ఆనాటి తెలుగుప్రాంతపు వైద్యులకు, సంస్కృత భాషలో పాండిత్యము గలవాడైనప్పటికి, ఆనాటి తెలుగు ప్రాంతపు వైద్యులకు, సంస్కృత పరిజ్ఞానం తక్కువగా ఉండుటవల్ల తానీ గ్రంథమును తెలుగులో రచిస్తున్నట్లు...

గీ॥ సంస్కృతము నూటి కొకండైన చదువలేఁడు
తెనుఁగు నే నరుఁడైనను చదువఁగలడు
వైద్యగ్రంథంబు తెనిఁగించి వరుసతోడ
నాకు నిమ్మని పల్కె నేనప్పు డలరి.

అని ఈ గ్రంథంలో పేర్కొన్నాడు. ఇతడు కొండవీడుకి పశ్చిమానా ఉన్న 'ఇర్లపాడు' గ్రామ వాస్తవ్యుడని కూడా తెలిపాడు. ఈ గ్రంథంలో తెలుగు ప్రాంతపు వైద్య సంప్రదాయాలను వివరించడం జరిగింది.

ఈ *నవనాథ సిద్ధసార* గ్రంథమును వైద్యసారం పేరున గతంలో ఆచంట లక్ష్మీపతి 1926వ సంవత్సరంలో ప్రచురించాడు. ఆ ప్రచురణ కృష్ణాజల్లా పెదకళ్ళేపల్లి వాస్తవ్యుడైన శ్రీ వేటూరి సుందరశాస్త్రి 1884వ సంవత్సరంలో మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమునుండి సేకరించి, పరిష్కరించిన ప్రతి. మద్రాసునందలి ప్రా.పు.గల ఈ గ్రంథ ప్రతుల సంఖ్య 2469, 2470, 2471. మరికొన్ని ప్రతులు కూడా ఉన్నాయి. ఈ ప్రస్తుత ప్రతి *నవనాథ సిద్ధసారము* అను పేరున తిరుపతిలోని ప్రాచ్య పరిశోధన సంస్థ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పుస్తక భాండాగారములోని డి.నెం. 2468, ఆర్. నెం. 1467. ప్రతిని అనుసరించి, తయారు చేసిన ప్రతి.

తెలుగు ప్రాంతంలో వచ్చినటువంటి వైద్య గ్రంథాలను, తెలుగునాట వేయించిన శాసనాలను తెలుగువారి జానపద సాహిత్యాన్ని క్షుణ్ణంగా తులనాత్మక పరిశీలన చేసినప్పుడు మాత్రమే తెలుగువారి వైద్య సంప్రదాయాలు నేటి తరానికి తెలియగలవు. ఈ గ్రంథం తెలుగు ప్రాంత వైద్య సంప్రదాయాలను, ఆచారాలను, అర్థం చేసుకోవటానికి ఉపయోగపడుతుంది.

*(ఇటీవల కుర్రా జితేంద్రబాబు తాళపత్ర గ్రంథాల నుంచి పరిష్కరించి, ప్రచురించిన 'నవనాథ సిద్ధ సారము' గ్రంథమునకు వ్రాసిన ముందు మాటనుండి కొన్ని భాగాలు ఈ వ్యాసం. ఇది, గుంటూరు జిల్లా, కొండవీడు సమీప గ్రామమైన ఐర్లపాడు వాస్తవ్యుడు రాయసం పేరయ్య, క్రీ.శ. 1543 ప్రాంతంలో రచించిన తొలి తెలుగు వైద్య గ్రంథం.)*



# గోసంగి ఛాయలు *39వ పుట నుంచి...*

గోసంగి అనే పదానికి మాలదాసరిగా వేదం వేంకటరాయశాస్త్రి కల్పన చేయటాన్ని ఎత్తి చూపాడు.

**నేను ఏ ముత్తాటి పండ్ల రసం పీల్చుకున్నానో**
**ఏ పశువుల ఈరిగల్ని**
**ఏ పక్షుల కందనగాయల్ని కాల్చుకు తిన్నానో**
**ఏ ప్రబంధకవి చెప్పలేదు...... అంటూ** *(పు. 43)*

తన (గోసంగి) గురించి ఎవరూ చెప్పలేదని ఎండ్లూరి కులం ద్వారా బాధను వ్యక్తం చేశాడు.

**మా గోంగూర మాంసం తిన్నాడా**
**ఇంద్రుడు ఇంటి భోజనం విడిచిపెట్టాల్సిందే!**
**మా పెద్దింటి స్త్రీలు పెట్టే**
**లచ్చించారు రుచి చూశాడా**
**విష్ణుమూర్తి పాల కడలి విడిచి**
**మా కూర చట్టి తెచ్చుకోవాల్సిందే!**
**మా గోరోజన విద్య తెలుసుకున్నాడా**
**అపర ధన్వంతరి మా దారికి రావాల్సిందే!** *(పు. 41)*

అంటూ, ఆహార ప్రత్యేకతలను వారి జ్ఞానాన్ని పరిచయం చేశాడు.

**నీ స్వామివారి గుడిముందు**
**ఘడియలు ఘడియలు నిలబడి**
**కాలాన్ని కర్పూరంలా హారతిచ్చేవాణ్ణి**
**స్వామి వారి పాలకడలి చుట్టూ**
**నా ఆలోచనల నౌకలతో**
**ఏ అంటు భయంలేకుండా**
**భక్తి సముద్రంలో**
**స్వేచ్ఛగా విహరించేవాణ్ణి**

అంతటి భక్తి తత్పరుడైనందు వల్లనే గోసంగికి అనంతమైన నైర్మల్యం, నిష్కల్మషత ధైర్యం

**భయపడకుండా / బ్రహ్మరాక్షసి దగ్గరకు**
**నేను తప్ప మరెవ్వరు వెళ్ళగలరు?**
**బ్రాహ్మరాక్షసికి నేను భయపడలేదు గానీ**
**కులరాక్షసి దెబ్బకు కుంగిపోయాను.** *(పు. 48)*

*అంటూ వ్యథను చాటాడు.*

**కడిగిన గర్భాలయ మలినజలాన్ని / శూద్రులు పైనుంచి పోస్తుంటే**
**మోకాళ్లపై అందుకొని / తీర్థం సేవించి తలకంటుకుంటాడు**
**ఏవరైనా దయతలచి పిలిచి / చద్ది ప్రసాదం పై నుంచి పడవేస్తే**
**తలవంచుకొని భక్తితో / తంబురాతో అందుకుంటాడు**
**కన్నీళ్ళతో ప్రక్షాళనం చేసుకొని / కళ్లకద్దుకొని తింటాడు** *(పు. 43)*

అంటూ గోసంగి ధైర్యాన్ని, నాటి కల వివక్షతా వైపరీత్యాన్ని చాటాడు.

**మా గోసంగి స్త్రీలు / గొప్ప అందగత్తెలు కాకపోయినా**
**తరిగెడు వువ్వుల కొమ్మలవంటి వారు**
**మోదుగ పూల రతనాల రెమ్మల వంటివారు** *(పు. 27)*

అంటూ స్త్రీల అలంకరణను ఎండ్లూరి పేర్కొన్నాడు.

**తెల్లవారు ఝామునుంచి / మా ధ్యానం మండుటెండ దాకా**
**చాందాలిక మీటుకుంటూ / నీ గుడి బయటే నిలుచుంటాడు**
**గుండెలవిసేలా నీ సేవలో / మంగళ కైశికీ రాగానికి ప్రాణంపోసి**
**గొంతెత్తి సంకీర్తనలు పాడుకుంటాడు.** *(పు. 53)*

**గోసంగిది కీర్తన సేవ :**

భక్తి మార్గాలలో కీర్తనం ఒకటి, కీర్తనల ఆలాపన ద్వారా శ్రీమహావిష్ణువును, ఆముక్తమాల్యదలో గోసంగి సేవించేవాడు. *కొందరు బాల సంతుల వేషం (భుజాన కావడీ చేతిలో కందిలీ, గంట పట్టుకొని తెల్లవారు జామున) వేసుకొని గ్రామాల్లో ప్రతి ఇంటి వారిని నిద్రనుండి లేపుతూ, పాటలు పాడుతూ, భిక్షం అడుక్కొనేవారు* (పు. 6) అంటాడు గనిశెట్టి రాములు.

జీవికకై పాటలు పాడటం వీరి కుల జీవితంలో ఉంది. దానికి భక్తితో ముడిపడింది. గోసంగికి ఉన్న అద్భుతగాన మాధుర్యం కుల సంబంధంగా కూడా గుర్తించదగ్గది.

**ముగింపు :**

ఆముక్తమాల్యదలోని గోసంగి కథకు ఓ చారిత్రక, సాంఘిక సాంస్కృతిక అస్తిత్వం ఉందంటూ గోసంగి దళిత దీర్ఘ కావ్యాన్ని ఎండ్లూరి సుధాకర్ రాశాడు.

తెలంగాణా ప్రాంతానికి పరిమితమైన గోసంగి వ్యక్తుల ముఖతః వెలువడినప్పుడు వారి జీవితాలకు సంబంధించిన మరింత సంస్కృతీ వాస్తవాలు వెలికి వస్తాయి.

సమ సమాజ కాంక్ష కల్గినవారు అంబేద్కర్ స్ఫూర్తితో గోసంగి సంఘాన్ని స్థాపించి రిజిస్టరు చేశారు. మొదటి సమావేశం 14.1.1987న జరిగింది.

ఈ ఏర్పాటు, ఆత్మగౌరవంతో, ఆత్మవిశ్వాసంతో కూడిన సంస్కృతి దర్పణమైన సాహిత్యం వెలువడగలదనే ఆశను కల్పిస్తూ ఉంది. మి

# చెదిరిపోని పూలకారు

## కృష్ణ శాస్త్రి జ్ఞాపకాలు

- ప్రసాద వర్మ కామఋషి



**20వ** శతాబ్దపు తొలి దశాబ్దాల లో తెలుగు సాహిత్యం ఒక ఝంఝూ మారుతపు తాకిడికి గురి అయింది. అది తెలుగు సాహిత్యాన్ని ఊపిరి సలప నంతగా ఉధ్రూతలూపింది. ఆ ఝంఝూ మారుతం పేరు భావకవిత్వం. అనుభూతి ప్రధానమైనది భావ కవిత్వం, ప్రకృతి, ప్రణయం, ప్రేయసి, వేదన, విరహం, మధుమాసం లాంటివి భావకవితోపాసన లో బీజాక్షరాల వంటివి.

అంతర్ముఖత్వం, ఆత్మార్పణ, ఆరాధన, ఆత్మసౌందర్యం, ప్రకృతిప్రేమ, దుఃఖంలోనూ ఆనందాన్ని పొందేప్రయత్నం. మానవతా వాదం భావకవిత్వంలో కనిపించే ప్రముఖ లక్షణాలుగా పేర్కొనవచ్చును. అది ఆత్మాశ్రయ రీతిలో సాగితేనే దాని ఇంపూ సొంపూ సాక్షాత్కరిస్తాయి. ఈ కవితా ప్రక్రియను ఆరంభించిన ఆద్యులు గురజాడ, రాయప్రోలు, అబ్బూరి. కాని దాన్ని అనుసరించి పలవరించి పోషించి, పాలించి, తరించి యావదాంధ్ర దేశాన ప్రసరింప చేసిన తేజోమూర్తి కృష్ణశాస్త్రి. దానికి ఊపిరులద్ది, ఉత్సాహం నింపి, ఉద్యమం లా నడిపి, ఆంధ్ర కవిత్వ చరిత్రలో పడి కొట్టుకు పోక ఎంతో స్వతంత్రించిన ప్రయోగ శీలి. కృత్రిమ అలంకారాల భారంతో శబ్దచమత్కార శృంఖాలతో వంగిపోయిన ఆంధ్ర సరస్వతిని లేవనెత్తి సహజసౌందర్యాన్ని ఆవిష్కరించి, సహృదయ మనోరంజకంగా రూపురేఖలు మార్చి, కాస్మటిక్ చికిత్స చేసి పునర్జన్మ నిచ్చిన వారిలో కృష్ణశాస్త్రి ముఖ్యులు.

కృష్ణశాస్త్రి కవితావాణి ప్రగాఢ ఆత్మానుభూతి తో పాటు, పదలాలిత్యానికి, భావ సౌకుమార్యానికి, నాద మాధురికి నెలవు. అది ఒక రమణీయార్థ ప్రతిపాదక శబ్ద మంజూష. అందుకే ఆ రోజుల్లో ఆయన మాట కీర్తన మయ్యింది. మనకి నర్తన మయ్యింది. పూర్వ కవులు నానారాజ సందర్శనాలు చేసి సత్కారాలు, సన్మానాలు పొందినట్లు కృష్ణశాస్త్రి గారు పదేళ్ళ పాటు ఆంధ్రదేశ మంతటా పర్యటించి స్వీయ కవితలేగాక, ఇతర కవుల కవితలు, కావ్యాలు చదివి, సాహిత్యోపన్యాసాలు చేసి భావకవితా వ్యాప్తికి ఎనలేని దోహదం చేశారు. ఎందరెందరో ఆయన వేష భాషలను వ్యక్తిత్వాన్ని, వక్తృత్వాన్ని అనుకరించారు, అనుసరించారు. అనుయాయులయ్యారు.

"నా కవితల్లో నాన్నగారి లిరికల్ ఫెర్వర్, పెదనాన్న గారి జిగీ వచ్చాయి" అని వీరే చెప్పుకొన్నారు. ఈ సోదర కవుల శబ్దశక్తీ, అర్థ గాంభీర్యము కృష్ణశాస్త్రి కవితల్లో పలుమార్లు పలకరిస్తాయి. సంప్రదాయం నేపథ్యంగా ఉంటూ వచ్చింది. దాన్ని తృణీకరించలేదు. కాల గమనంలో వచ్చిన ఉద్యమాలన్నిటికి స్పందించి వాటిని తన రచనల్లో ప్రతిఫలించారు. హైస్కూలులో కూచి నరసింహంగారు, కాలేజీలో బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు గురువు లై వీరి భావనలను, భావిజీవితాన్ని ప్రభావితం చేశారు. అదే సమయంలో ప్రబలంగా ప్రాచుర్యం పొందుతున్న వ్యవహారిక భాషా, బ్రహ్మసమాజ ఉద్యమాలు కొత్త లోకాన్ని, కొత్త మార్గాన్ని చూపాయి. ఏకాంతసేవ పీఠికలో "నవ్య కవులకు స్వేచ్ఛ ప్రాణము. వీరు ప్రాణమైన కోల్పోవుదురు గాని శృంఖలములు ధరింపరు. వీరికి ప్రాణముకన్న గానము తీపు." అంటూ నవ్య కవుల హృదయాన్ని ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ వీరి కవితా వ్యక్తిత్వాల పట్ల కూడా అక్షరసత్యమే.

---

ప్రసాద వర్మ కామఋషి, ఫోన్ : 9441274034 (నవంబరు 1, కృష్ణశాస్త్రి జయంతి)

"నాడు భారత జాతిని, ఆంధ్రజాతిని ఊగించిన ఉద్యమాలు మూడు. ఒకటి- కాల్పనికోద్యమం, రెండు- రామమోహనరాయలు మానవోద్యమం, మూడు- భారత జాతీయోద్యమం." దేశవ్యాప్తంగా అన్ని భాషా సాహిత్యాల నేపథ్యంలోను ఈ ఉద్యమ ప్రభావమే కనిపిస్తుందంటారు- పాతిక సంవత్సరాల తెలుగు కవిత్వం అన్న వ్యాసంలో.

స్వాతంత్ర్యోద్యమ ప్రభావం భావకవితలోనూ ప్రస్ఫుటంగా దర్శనమిస్తున్న రోజులవి. గురజాడ *దేశమును ప్రేమించుమన్న*, రాయప్రోలు వారి *ఏదేశమేగినా ఎందుకాలిడినా* గీతలలాగే కృష్ణశాస్త్రి *'జయజయ ప్రియభారత జనయిత్రీ'* ఎంతో ఉత్తేజితం చేసింది. ఇప్పటికీ చేస్తూనే ఉంది.

*అన్వేషణ, ఊర్వశి, ప్రవాసం, కార్తికి, మహతి* వంటి కావ్యాలు, *అరుణరథం, శ్రీఆండాళ్, శ్రీముఖం, జమదగ్ని, శర్మిష్ఠ* వంటి నాటకాలు కవి పరంపర, కవితా ప్రశస్తి లాంటి వ్యాసాలు పరికిస్తే వీరి రచనలపై భారతీయ సంస్కృతి ప్రభావం ఎంతగా ఉన్నదో అర్థమవుతుంది. అసలు ఆయా రచనలకు పెట్టిన పేర్లు చూడగానే తెలుస్తుంది వీరికి ప్రాచీన సంస్కృతీ సాహిత్యాలపై గల ఆసక్తి ఎట్టిదో.

భగవంతుణ్ణి సమస్త ప్రకృతిలోను దర్శించ గలిగిన ఈశ్వరారాధకుడు కృష్ణశాస్త్రి. బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం నాయుడుగారి అంతే వాసియై బ్రహ్మసమాజ కార్యకర్త గా సేవలందించారు. అందులో అతి ప్రముఖ సేవ వందలాది భక్తి గీతాల రచన. ఈ గీతాలు తరువాత *మహతి, అమృతవీణ, కృష్ణరజని* వంటి సంపుటాలుగా వచ్చాయి. ఇవి తెలుగు సాహిత్యంలో వచ్చిన భక్తి గీతాలలో మణిపూసలు, మంచి ముత్యాలు!

వివిధ విశ్వాసాలకి ఆలంబనమైన విశ్వమానవ హృదయం ఆలపించిన భక్తి కావ్య సంపుటులు యివి. ఈ గీతాలలో కానవచ్చే సంగీత సాహిత్యాలను అద్భుతంగా సమ్మేళనం చేసే శిల్పవైభవం, గుండెలను చీల్చుకు వచ్చే ఆవేదనా, అచ్చెరువు గొల్పుతుంది. పరమాత్మ సన్నిధి కోసం రగిలే ఆరాటం ప్రతి పద్యంలోను ద్యోతకమవుతుంది. మనోవేదనయే మహత్వ సాధనగా ప్రభవించిన పూజా ప్రసూనాలు ఈ సంకలనాలు. మమ్మటుడు కావ్యప్రకాశములో నిర్వచించిన సద్యఃపర నిర్వృతి కలుగుట ఇట్టి కావ్యముల అనుశీలన వల్లనే కాబోలు. ఇంతా చేసి "నేనేదో భక్త కవినీ కాను, మీరనుకునేంత భక్తుణ్ణీ కాను. కొందరు అనుకునేంత దుర్మార్గుణ్ణీ కాను. ఎప్పుడో హృదయావేదన భరించ లేనప్పుడు కేక పెడతాను. అది కీర్తన అవుతుంది" అంటారు కృష్ణశాస్త్రి.

రచన చెయ్యటానికి అల్లసాని పెద్దన ఆశించిన తూగుటుయ్యల, రమణీప్రియదూతికలు, కప్పురంపు వీడెములు, వంటి హంగులు వీరికీ కావాలి. ఒక పాట రాయాలన్నా, కవిత రాయాలన్నా 'కృత్యాద్యవస్థ' కడు దీర్ఘము, కడు జటిలముగా ఉండే సందర్భాలనేకం. తేట తెనుగు మాటలను సానబట్టీ, నగిషీలుచెక్కీ, మెరుగుపెట్టీ, వాటిని కడు పొదుపుగా లలితంగా మధురంగా ప్రయోగించి, రసరమ్య పద బంధాలుగ బిగించి తెలుగు కవిత కొక నూతన 'కళ' నాపాదించిన కావ్యకళా ప్రపూర్ణులు కృష్ణశాస్త్రి. పదాలకు రంగూ రుచీ వాసనా ఉంటుందని వీరి ఉవాచ. "కీట్స్, షెల్లీ ల పదాలకూర్పు ఆంగ్ల కవిత్వానికి ఎటువంటి నూతన శోభ కూర్చిందో, తెలుగు కవిత్వ భాషకు ఈయన కృషి అటువంటిది" అని వైతాళికులు లో ముద్దుకృష్ణ గారు మురిపెంగా అన్న మాట అక్షరసత్యం.

ఇట్టి సుకుమార భావాల, లలిత మనోజ్ఞ శబ్దాల రహస్యం కృష్ణశాస్త్రికి తెలిసినంతగా మరెవరికీ తెలియదేమో! అందుకే బాలగంగాధర తిలక్ అంటాడు- కవిత్వమొక ఆల్కెమీ, దాని రహస్యం కాళిదాసుకు తెలుసు. పెద్దనకు తెలుసు, కృష్ణశాస్త్రికి తెలుసు అని. ఈ గణన కృష్ణశాస్త్రితో ఆగిపోయింది.

వీరికి మనిషి మీద గల మమకారం మాటలలో చెప్ప లేనిది. వారెక్కడికి వెళ్ళినా ఎవరింట్లో మకాం వేసినా మిత్ర బృందం చుట్టూ చేరేవారు. ఒక మహారాజు కొలువు తీర్చినట్లుండేది. మిత్రులతో సరస సల్లాపాలు, కావ్యగానాలు, విద్వద్గోష్ఠులు ఆయనకత్యంత యిష్టం.

బాలాంత్రపు రజనీకాంత రావుగారి మాటల్లో చెప్పాలంటే :"పునుగు అత్తరు సువాసనల జుబ్బా పయి తెలి వల్లె వాటు వ్రేల, ఇరువైపులకు వంపులెసగ కట్టిన పింజెలెసలారు ధోవతి పసలు మీర, చుట్టు గాయక కవి స్తుతమతులొప్పగ కొల్వుచేసెడి శిష్యకోటి చేర, హిమతోయ ఘనసార కమనీయ పరిమళాంచిత వితర్దిక సుఖాసీనుడగుచు నన్నపార్యాది నానా పురా కవినాథ శిల్ప తత్త్వవిచార కల్పనములు" చేస్తూ ఉండేవారు!

"నాకు కవిత్వం ప్రాణం, సంగీతం ప్రాణాధికం, ఈ రెండిటికన్న మనిషి మరీ యిష్టం."

"నేను హృదయవాదిని. నాకు వేదాంతం, తర్కం తలకెక్కవు. నన్ను ఎడారిలో కూచోపెట్టి వేయిపుస్తకాలు ఇస్తామన్నా వద్దు. ఒక్క పుస్తకమూ అక్కరలేదు. పనికి మాలిన వారు, చెడ్డవారు, వికార రూపులూ అయినా సరే – జనం మధ్య నన్ను పడేయండి. ఎంతకాలమైనా బతుకుతాను. మనుష్యులు లేకపోతే కాయిలా పడతాను."

''నా కవిత్వాన్ని మెచ్చుకోకపోతే నాకేం నన్ను ప్రేమించండి. నేను పోయాక నా కోసం కూడా మీ కళ్ళు రవంత తడిస్తే చాలు. నన్ను మరిచిపోకండి" – అన్నది వీరి ఫిలాసఫీ.

కవిత్వం ఎలా వస్తుంది అంటే వీరి వివరణ వినండి :

"కనపడని చెయ్యి ఏదో గళద్వారపు గడియ తీస్తే వస్తుంది."

"ఒక్కొక్క పాట అనుకోని అతిథిలా తలుపు తెరచుకొని ఎదట నిలబడుతుంది."

"మరొక పాట పుట్టలోనుండి పాములా కొంత కొంతగా పాకి వస్తుంది."

ఒక్కొక్క సారి గేయం అంతా తయారై, దానిలో ఒక పదం ఏ నెల్లాళ్ళకో వచ్చి సమగ్ర రూపం ధరిస్తుంది.

దేవులపల్లి తమ్మన శాస్త్రి, సీతమ్మ గారలకు ఇద్దరాడపిల్లల తరువాత మూడవ సంతానం వీరు. పెద తండ్రి సుబ్బరాయ శాస్త్రి గారికి అయిదుగురూ ఆడపిల్లలే కావటం తో ఈ దేవులపల్లి వంశాంకురం అల్లారు ముద్దుగా పెరిగి అమిత వాత్సల్యం రుచి చూశారు. తండ్రి పెద నాన్నలతో పుట్టిన ఊరైన చంద్రంపాలెం నుంచి కాలినడకన పిఠాపురం తరచు వస్తూపోతూ ఉండేవారట. ఒకసారి పిఠాపురం నుంచి వస్తూ దారిలో కాలక్షేపానికి వంద పద్యాలు చెప్పుకొన్నారట ఆ అన్నదమ్ములు. ఇంటికి చేరాక వాటిని గ్రంథస్తం చేద్దామని కూచునేసరికి కొన్ని పద్యాలు మరిచారు. ఆ మరిచిన పద్యాలను కృష్ణశాస్త్రి గారు చెప్పారట. చిన్నప్పటి ఈ అసాధారణ ధారణా శక్తి వీరికి 80 యేళ్ళు వచ్చినా తగ్గక నిలచిందట. ఏనభయ్యో పడిలో కూడా ముప్పై, నలభై వేల పద్యాలు వీరికి జ్ఞాపకముండేవని అంటారు.

కృష్ణశాస్త్రి గారి స్వరపేటికకు కేన్సర్ సోకటం వల్ల 1963లో ఆపరేషన్ చేసి తొలగించారు. ఆంధ్రదేశాన్ని తన కావ్య గానంతో ఉర్రూతలూగించిన మధురగళం మూగ పోవటం ఆయనకూ, ఆంధ్రా వనికీ ఒక విషాద ఘట్టం. అప్పుడు :

గూడు నిదరపోయినా గువ్వ మేలుకుంది.

గొంతు మూగపోయినా గుండె మేలుకుంది –

అని బాధను భావుకతగా మార్చుకున్న స్థితప్రజ్ఞులు శాస్త్రిగారు.

"నా మందిర గవాక్షం నుంచి తొలి అరుణ స్వర్ణకాంతి వచ్చి నా కళ్ళను తాకినప్పుడు కళ్ళు విప్పి స్వాగతం చెపుతాను.

వేకువ గాలి వ్రేళ్ళతో నా మొగం నిమిరినప్పుడు చిరునవ్వు నవ్వుతాను.

పెరటిలోంచి క్రొత్తగా విరిసిన విభాత సుమ పరిమళం వచ్చి పలుకరిస్తే ఔనని తలఊపుతాను. కాని నా గవాక్షం లోకి రవ్వంత ఒదిగిన మావి కొమ్మ చివర నిలచి 'కో' అన్న వనప్రియా రవానికి బదులు మాత్రం చెప్పలేను ఇక బదులు మాత్రం చెప్పలేను" అని డైరీలో రాసుకున్నారు.

స్వేచ్ఛ కోసం ఆరాట పడ్డ వాడు, మానవతకు నీరాజనాలర్పించిన వాడు, వేదనా సౌందర్య తపనలో తలమునకలైన వాడు, కన్నీరు హృదయ కలుషాన్ని కడగ గలదన్న వాడు, కవిగా పుట్టి, కవిత్వం కోసం బ్రతికిన వాడు కృష్ణశాస్త్రి. బ్రతికినంత కాలం ఆంధ్ర సాహిత్య లోకపు నీరాజనాలందుకొంటూ జీవయాత్ర సాగించి "మోయలేనింక లోకాల తీయదనము" అంటూ ఏ గంధర్వ లోక మధుర సుషమా సుధా గాన మంజువాటికో 1980 ఫిబ్రవరి 24న వెళ్ళి పోయారు! కొమ్మల గువ్వల గుసగుస మనటాన్ని, రెమ్మల గాలులు ఉసురుసురనటాన్ని, అలలు కొలనులో గలగల మనటాన్ని, దర్శించ గల హృదయమున్న ప్రతి వారికి కృష్ణశాస్త్రి కనిపిస్తూనే ఉంటాడు.

జయంతితే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః

నాస్తి తేషాం యశః కాయే జరా మరణజం భయమ్.



ప్రసాద వర్మ

# బుద్ధుడే ఎందుకు?

- కాలువ మల్లయ్య

అక్టోబర్ 2012 మిసిమి కమ్మతెమ్మెరలు శీర్షికలో డాక్టరు సంగనభట్ల నరసయ్యగారు రాసిన లేఖ చదివాను. బౌద్ధ భిక్షువులను గానుగలలో వేసి చంపారని నేను "బుద్ధం శరణం గచ్ఛామి" వ్యాసంలో రాసిన వాక్యానికి ఆధారాలు చూపమని నరసయ్యగారు ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ విషయం గురించి ఆధారాలు చూపమని నరసయ్యగారు రాయడం ఇది రెండవసారి. ఈ లేఖ చదివిన తర్వాత ఒక్క వాక్యంలో ఫలానా పుస్తకంలో ఈ విషయముంది అని రాసి ఊర్కుంటే సరిపోదని, అందుకుగల మూలాలు, చరిత్ర రాయాలనిపించి ఈ వ్యాసం రాస్తున్నాను.

మతాల పేరు మీద జరుగుతున్నదేంటో ఈ కాలంలో బుద్ధుడి అవసరమేమిటో తెలుపడానికి ఈ వ్యాసం రాయడం తప్పనిసరవుతుంది. ఎందుకంటే నరసయ్యగారు ఈ విషయం తెలియక ఆధారాలు తెలుపమని అడుగలేదు. తెలిసే నాతో చెప్పించాలని అడిగారు. ఎందుకంటే ఇదువరకొకసారి వ్యక్తిగతంగా కలుసుకున్నప్పుడు ఆ వాక్యం ఎక్కడ్నుంచి సేకరించానో చెప్పాను. అయినా మళ్ళీ అడుగుతున్నాడంటే ఆ విషయం అందరికీ తెలియాల్సిన అవసరముందని భావించడం వల్ల అయ్యుండొచ్చు. నేనావాక్యం రాయడానికి ఆధారం బొనిగెల రామారావు రాసిన 'ఆచార్య చంఢాల' అనే పుస్తకంలో ఉన్నట్లు చదివాను.

మతాలకోసం, సిద్ధాంతాలకోసం రక్తాన్ని ఏరులై పారిస్తున్న సంఘటనలు ఇప్పటికే జరుగుతుంటే ఆ కాలంలో అలా జరగలేదని చెప్పడానికి ఆధారాలు కావాలి కాని జరిగిందని చెప్పడానికి కాదు. పోగా మనం చరిత్రలో చదువుకున్న యుద్ధాలు, హింస చాలావరకు మత సంబంధమైనదిగానే ఉన్నట్లు అర్థం కావడం లేదా? ఈ మతమని కాకుండా దాదాపన్నీ మతాలు మతావలంబనకోసం హింసనే ఆశ్రయించాయి ఒక్క బౌద్ధం తప్ప.. ఎందుకంటే బౌద్ధం మతం కాదు. అదొక ధర్మం. దాన్ని మతంగా ఘనీభవింపజేయడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. మతాలు ఏర్పడినపుడు ప్రవక్తలు మతాన్ని అనుసరింప జేయడానికి హింసనాశ్రయించమని చెప్పి ఉండకపోవచ్చు కాని ఆచరణలో మాత్రం దాన్ని పెట్టలేకపోయారు. అది రాజుల, పాలకుల చేతుల్లోకి పోయిన తర్వాత తమ పాలన స్థిరపడటానికి తమ మతం స్థిరపరచుకోవడానికి అనేక యుద్ధాలు జరిగాయి. బౌద్ధాన్ని అనుసరించిన రాజులు మాత్రం తమ మతాన్ని ప్రబలం చేయడానికి యుద్ధాలు చేసిన దాఖలాలు ఎక్కడా లేవు. బౌద్ధసిద్ధాంతంలో, ధర్మంలో ఉన్న గొప్పతనం అది.

బుద్ధుడు బోధించిన సత్యం, అహింస, అత్యాశ(తృష్ణ) లేని జీవిత విధానంలో ఉన్న మానవాంశ ఎవరినీ అటువైపు పోనీయలేదు. పోతే బౌద్ధధర్మంలో ఉన్న అధికార లాలసత, సుఖలాలసతలేని జీవిత విధానం అధికారం కోసం మతాన్ని జోడించి హింసవైపు పయనించడానికి దోహదకారులు కాలేదు. బౌద్ధం ఎప్పుడూ ధనసంపాదన, అంతులేని భోగభాగ్యాలను జీవిత లక్ష్యాలుగా నిర్ణయించలేదు. మా దేవుళ్ళను పూజిస్తేనే మోక్షం దొరుకుతుందని చెప్పలేదు. ధనం, అధికారం, మోక్షం ప్రసక్తి లేనప్పుడు అది అవలంబింప జేయడానికి హింస ప్రసక్తి ఎక్కడుంటుంది? దాదాపు అన్ని మతాలను అనుసరించిన చక్రవర్తులు మతం కొరకు, రాజ్యం కొరకు యుద్ధాలను, రక్తపాతాలను సృష్టిస్తే అశోకుడిలాంటి బౌద్ధమతావలంబికులైన రాజులు మొత్తం యుద్ధాలనే త్యజించారు. ఈ విషయాలన్నింటినీ నిశితంగా పరిశీలిస్తే, చరిత్రను నిష్పాక్షికంగా అవగాహన చేసుకుంటే శాంతికాముకులైన బౌద్ధులను ఎవరు హింసించారో, ఎందుకు హింసించారో అవగాహన అవుతుంది.

క్రీ.పూ.ఆరవ శతాబ్దిలో ఏ నాగరికతలూ అంతగా అభివృద్ధి చెందని సమయంలో, అతి ప్రాచీన తాత్వికతగా చెప్పబడే గ్రీకు తాత్వికత కంటే కూడా ముందే గౌతమబుద్ధుడు

డాక్టరు కాలువ మల్లయ్య, ఫోన్ : 9849377578

మానవజాతికి దుఃఖ నివారణామార్గాన్ని చూపే తాత్వికతను ప్రపంచానికందించాడు. ఆ కాలానికి మాత్రమే కాదు ఏ కాలానికైనా సరిపోయే మానవాంశగల సిద్ధాంతాన్ని అందించాడు. మనిషికి దుఃఖకారణమైన 'తృష్ణ'ను జయించితేనే సుఖముంటుందన్నాడు. ప్రపంచమానవాళి శాంతి సౌఖ్యాలతో విలసిల్లాలంటే సత్యం, అహింసలను అనుసరించాలన్నాడు. ఎక్కడా దేవుని ప్రసక్తి తీసుకురాలేదు. అధికారలాలసత, ధనవ్యామోహం వదులుకుంటే దుఃఖం దానంతట అదే పారిపోతుందన్నాడు. చతురార్య సత్యాలను, అష్టాంగమార్గాన్ని జీవనమార్గాలుగా ఎన్నుకోవాలన్నాడు. బుద్ధుడు తాను చెప్పింది ధర్మమే తప్ప మతమని ఎక్కడా చెప్పలేదు. తాను చెప్పింది అనుసరించమని ఎవరినీ బలవంతం చేయలేదు. బలవంతం చేయమనీ చెప్పలేదు. ఏ మతాన్నీ విమర్శించలేదు. తాను చెప్పేదేదో చెప్పాడు.

ఆతడు కోరుకున్నది సర్వమానవ కళ్యాణం... జీవకారుణ్యం... అందుకే బౌద్ధధర్మం అందరినీ ఆకర్షించింది. తన ధర్మాన్ని ప్రచారం చేయడానికి ప్రజల భాష అయిన మాగధిని ఉపయోగించాడు. క్రీ.పూ. 3వ శతాబ్ది నుండి క్రీ.శ. 7వ శతాబ్ది వరకు భారతదేశంలో ఆసియా అంతటా బౌద్ధధర్మం మూడుపూవులు, ఆరుకాయలన్నట్లుగా వర్ధిల్లింది. దేశం శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లింది.

వెయ్యేండ్ల కాలం భారతదేశంలో బౌద్ధానికి స్వర్ణయుగంలాంటిదే. అప్పుడు రాజు నుండి కూలి వరకూ దాదాపు అందరూ బౌద్ధాన్ని అనుసరించారు. మౌర్య రాజులు, గుప్తరాజులు, ఆంధ్రశాతవాహనుల్లాంటి గొప్ప రాజ్యాలు అప్పుడు వర్ధిల్లాయి. మనువు లాంటి సిద్ధాంతకర్త క్రీ.శ. రెండవ శతాబ్ది ప్రాంతానికి చెందినవాడే అయినా బౌద్ధం వ్యాప్తి బాగా ఉన్నందువల్ల అవి అంతగా అమల్లోకి రాలేదు.

ఆ కాలంలో, ఆ తర్వాతికాలంలో మత ఘర్షణలు అంతగా ఉన్నట్లు కనబడదు. అప్పటికే కులాలలో స్థిరపడి ఉన్నా శూద్రులు, సేవకుల్నుంచి, బానిసల్నుంచి రాజులు రావడం బౌద్ధధర్మ ప్రభావం వల్లనే. మౌర్యులు శూద్రవంశ రాజులే... అప్పుడు వైదిక మతం దాదాపుగా తుడిచిపెట్టుకు పోయి నట్టయింది. వెయ్యేండ్లు భారతదేశాన్ని, ఆసియాఖండాన్ని ప్రభావితం చేసిన బౌద్ధం దేశం నుంచి ఎలా దూరమై పోయిందో, అందుకు కారణాలేంటో మనకు తెలియనివికావు. వెయ్యేండ్లు దేశాన్ని అవిచ్ఛిన్నంగా ఉంచిన బౌద్ధం దేశంలోంచి దూరంగా పోవడానికి ఎంత రక్తపాతం, హింస జరిగిందో చరిత్ర చదివితే తెలుస్తుంది. తాము చెప్పిన దైవభావాన్ని, వాదాన్ని, బ్రాహ్మణీయ భావజాల ఆధిపత్యాన్ని కాదన్న *వేణుడు* లాంటి రాజులను ఆతని కొడుకుతోనే చంపించిన మతాధిపతుల, మతాధిపతులు బౌద్ధులను గానుగల్లో వేసి చంపడానికి వెనుదీస్తారా? వర్ణాశ్రమ ధర్మాలను వ్యతిరేకించిన వాళ్ళను, హేతుబద్ధంగా ఆలోచించమన్న చార్వాకుల్లాంటి వాళ్ళను బహిష్కరించిన వాళ్ళు, దేశద్రోహులుగా చిత్రించిన వాళ్ళు తమ మత విశ్వాసాలకొరకు ఏదైనా చేస్తారు గదా!

తమకు నచ్చని వారిని రాక్షసులుగా చిత్రించి చంపించిన వైదిక వర్గం తమకు నచ్చని బౌద్ధులను చంపలేదనగలమా? ప్రశ్నించడం నేర్పినందుకే సోక్రటీసును విషమిచ్చి చంపినవాళ్ళు, దేవుని ఉనికిని ప్రశ్నించిన బౌద్ధులను ఎలా హింసించారో తెలియడం లేదా? శత్రువులన్న పేరు మీద, రాక్షసులముద్ర మీద బలిచక్రవర్తి లాంటి వాళ్ళను చంపించిన వర్గాలు మతం కోసం ఏమైనా చేస్తాయి కదా! ఎంతమందిని చంపితే అంత వీరుడుగా, శూరుడుగా, మహారాజుగా, చక్రవర్తిగా చెప్పబడే కథలను సృష్టించిన వాళ్ళు హింసకు వెనుకాడతారా.?

శంకరాచార్యుల ఆవిర్భావంతో మత పునరుద్ధరణ వాదం బలీయమై అది బౌద్ధుల నిర్మూలనగా పరిణామం చెందింది. వైదిక మత పునరుద్ధరణ జరిగితే జరిగి ఉండవచ్చు కాని రాక్షసులన్న పేరు మీద ద్రవిడులను ఎక్కువ మందిని చంపినవాడే గొప్పరాజుగా ఆర్యపుత్రుడుగా కథలు, గాథలు అల్లి ప్రచారం చేయడం వల్ల హింసాప్రవృత్తి పెరిగింది. పురాణాల సృష్టి అంతా దాదాపు ఆర్య, ద్రవిడ యుద్ధాల వల్లనే..

వైదిక వర్గాల వారు ఆర్యులయితే, శూద్ర పంచమ వర్గాల వారు ద్రవిడులుగా చిత్రింపబడ్డారు. ద్రవిడుల, పీడిత ప్రజల పక్షం వహించి అహింసాయుత, సత్యనిరతితో కూడిన జీవన మార్గాన్ని, దుఃఖ నివారణోపాయాన్ని కనుగొన్న మొట్టమొదటి ఆర్య తాత్వికుడు గౌతమబుద్ధుడు. ఆర్యుడై ఉండే, క్షత్రియుడై ఉండే దైవాన్ని, వర్ణాశ్రమ వ్యవస్థను ప్రశ్నించి పీడిత ప్రజల పక్షం వహించాడు కాబట్టే బుద్ధుడు

వైదిక వర్గాలకు కంటగింపయ్యాడు. బౌద్ధాన్ని దేశం నుంచి తరిమివేయడానికి హింసా మార్గాన్ని అనుసరించారు. అప్పట్నుంచే మతం కొరకు హింసామార్గాన్నిఅనుసరించడం, దండయాత్రలూ ప్రారంభమయ్యాయి.

మతాన్ని మూఢంగా అనుసరించేవారు, ఆ ఉన్మాదం తలకెక్కిన వారు ఎంతటి అఘాయిత్యాలకైనా పాల్పడుతారని చరిత్ర చెబుతుంది. ఇందులో భాగాలే బౌద్ధవిహారాలను, విగ్రహాలను ధ్వంసం చేసి వాటి స్థానంలో గుళ్ళు, మసీదులు కట్టడం లాంటివి. శైవులు, వైష్ణవులు ఒకర్నొకరు నరుక్కోవడం, గుళ్ళను కూలగొట్టి మసీదులు, మసీదులను కూలగొట్టి గుళ్ళు కట్టడం లాంటివి. మతం కొరకు డబ్బులు ఆశ చూపడం...చంపడం లాంటివి. చరిత్రలో మతం కొరకు ఎంతో రక్తపాతం జరిగిన విషయం తెలిసిందే.

మతాలు ఎందుకు పుట్టాయో కాని అవి హింసా యుతంగా మారిపోయాయి. మత తీవ్రవాదం ప్రపంచానికే ప్రమాద హేతువుగా మారింది. ఈ అన్ని హింసాయుత చర్యల్లో బౌద్ధం ప్రమేయం ఎక్కడా లేదు. బౌద్ధులు తమ ధర్మాన్ని చెప్పారే కాని ఎవరినీ అనుసరించమని బలవంతం చేయలేదు.

క్రీ.శ. ఏడవ శతాబ్దికి పూర్వంలా భారతదేశంలో బౌద్ధం ఉండి ఉంటే మనదేశంలోకి ఇస్లాం, క్రైస్తవమతాలు ఇంత వేగంతో వచ్చి ఉండేవి కావు. ఏడవ శతాబ్దివరకు దేశాన్ని ఐక్యంగా, అవిచ్ఛిన్నంగా ఉంచిన బౌద్ధం మటు మాయం కావడంతో రాజుల్లోని అనైక్యత, కుల మత భేదభావాలు, శైవ వైష్ణవ తగాదాలు, కులపీడన లాంటివన్నీ ఇతర మతాలకు, విదేశీ దండయాత్రలకు స్వాగతం పలికాయి.

శూద్ర, పీడిత కులాలకు చదువు నిరాకరించడం, గుడిప్రవేశం కూడా లేకపోవడంతో తమను గౌరవించే పాలకుల మతాల్లోకి వలసలు పెరిగాయి. తమకు చదువు, ఉపాధి, ప్రార్థనాలయాల్లోకి ప్రవేశం లభించి గౌరవం లభిస్తుంటే ఎవరైనా మతం మార్చుకోకుండా ఉంటారా?

దేశంలో బౌద్ధానికి అంత దెబ్బ తగిలి ఉండకపోతే పరిస్థితులు వేరుగా ఉండేవి. అందుకే గురజాడ భారత దేశంలోంచి ఎప్పుడయితే బౌద్ధం దూరమయిపోయిందో అప్పుడే మనదేశం మత విషయకంగా ఆత్మహత్య చేసుకుంది అన్నాడు. డాక్టరు బి.ఆర్. అంబేద్కర్ బౌద్ధంలో ఉన్న మానవాంశను చూసే అటువైపు మొగ్గాడు. ఒక్కసారి ప్రపంచవ్యాప్తంగా మతాలకోసం జరిగిన, జరుగుతున్న విధ్వంస కాండను, హింసను గమనిస్తే మత రహిత సమాజం యొక్క ఆవశ్యకతేంటో అర్థమవుతుంది.

అందుకే కారల్ మార్క్స్ మతం మత్తు మందు లాంటిదన్నాడు. కాని అతడు కూడా సమసమాజ స్థాపన కోసం, హింస (ఆయుధం) నే ఆశ్రయించాడు. రోజు రోజుకూ సమాజం హింసాత్మకంగా మారుతుంది. సుఖవాంఛ, అధికార లాలసత మనిషిని హింసాయుత చర్యలవైపు లాక్కు వెళ్తున్నాయి.

మార్క్స్ చెప్పిన ఆర్థిక సమానత్వం సాధ్యాసాధ్యాలు ఎట్లున్నా దాంతో ప్రపంచ సమస్యలకు పరిష్కారం లభించదు. హింసాయుతంగా మారిన ఈ సమాజంలో ఎవరూ నిజమైన సుఖాన్ని అనుభవించడం లేదు. అనుక్షణం ఒత్తిడి, అమానవీయ పోటీ, అభద్రతాభావం మనిషి బ్రతుకును దిన దిన గండంగా మారుస్తున్నాయి. ఇలాంటి సమయంలో మనం కులాలు, మతాలు, ప్రాంతాలు, దేశాలు, తెగలు అన్నిటికీ అతీతంగా బుద్ధుని దిక్కు చూడాల్సిన అవసరముంది.

బుద్ధుడు చెప్పిన దుఃఖ నివారణామార్గాల గూర్చి ఆలోచించాల్సిన అవసరమూ ఉంది. క్రీ.శ.ఏడవ శతాబ్ది తర్వాత భారతదేశం నుంచి బౌద్ధం పోయినట్టనిపించినా పోలేదు. ఆ భావజాలం ప్రపంచమంతటా, భారతదేశంలోనూ తన ప్రభావాన్ని చూపుతూనే ఉంది. అశోకుడి లాంటి రాజు, అంబేద్కర్ లాంటి మేధావులు కోరుకోవడం వల్ల అది అప్పట్లా వ్యాప్తి చెందకపోవచ్చు... చెందనట్టు కనిపించవచ్చు. కాని మానవజాతి కళ్యాణం గురించి ఆలోచించే ప్రతి మనిషి గుండెలోనూ బుద్ధుడున్నాడు.

ఇప్పుడు కూడా ప్రపంచజనాభాలోని మూడవవంతు జనం బౌద్ధాన్ని అనుసరించడమో, సమర్థించడమో జరుగు తుందని అంచనా. మిగతా రెండు వంతుల జనం కూడా బుద్ధున్ని అనుసరించి దుఃఖ రహిత ప్రపంచాన్ని ఆహ్వానించే సమయం దగ్గర్లోనే ఉంది. ప్రపంచ మానవాళి దుఃఖ నివారణోపాయాన్ని చెప్పిన మొట్టమొదటి మానవ తాత్వికుడు బుద్ధుడే మనకు శరణ్యం...

మి

# సాంకేతిక భాషగా తెలుగు

- అద్దంకి శ్రీనివాస్

**తెలుగుభాషా వినియోగం :**

తెలుగులో నూతనపదనిర్మాణం జరగవలసిన అవసరం ప్రధానంగా రెండు విధాలుగా కన్పిస్తుంది. తెలుగుభాషను వినియోగాన్ని వ్యవహారాన్ని బట్టి రెండు విధాలుగా విభజించవచ్చు.

1. శాస్త్ర సాంకేతిక భాషావినియోగం
2. సామాన్య భాషా వినియోగం.

ఈ రెండు విధాలయిన వినియోగాలలోనూ ఆంగ్లభాషా వ్యవహారం అధికం. వివిధశాస్త్ర విషయాలకు సంబంధించి ఆంగ్లభాషకు మారుగా తెలుగు భాషను ప్రవేశపెట్టడమంటే తెలుగుమాధ్యమంలో శాస్త్రవిషయాలను అందించడమే. ఇది ఒక ప్రక్రియ. దానికి ముందుగా పారిభాషికపదకోశాలు తయారుకావాలి.

ఇందులో భాగంగా వివిధ శాస్త్రాలకు సంబంధించిన పారిభాషికపదకోశాలు కూడా తెలుగులో వచ్చాయి. అయితే ఆంగ్లంలో ఉన్న సాంకేతిక పదజాలాన్ని ఆంధ్రీకరించినప్పుడు కొన్ని ఇబ్బందులు తప్పవు. ఇప్పటివరకూ జరిగిన పారిభాషికపదకల్పనలో తత్సమపదాలపాత్ర అధికమే. అయినా తప్పదు. ఆంగ్లంలో ఉన్న ఆయా పదాల భావాలకు అనుగుణంగా తెలుగులో తయారు చేసుకోవాలంటే తత్సమపదాలే మనకి ఎక్కువ శరణ్యం. తత్సమపద భూయిష్ఠమయిన యథాతథానువాదం కంటే ఆంగ్లపదాలే సులభంగా ఉంటాయనే వాదన ఒకటి ఉంది. దానికి సమాధానం ఎప్పుడూ శాస్త్రం శాస్త్రమే. అదెప్పుడూ సులభగ్రాహ్యం కాదు.

అందువల్ల తెలుగులోనికి చేసిన పారిభాషికపదాలను అలాగే తప్పక చదవాలి. ఇందులో ఎంతమాత్రమూ విప్రతిపత్తి లేదు. ఈ శాస్త్రగ్రంథాలలో తెలుగును పూర్తిస్థాయిలో వినియోగించడంలోనూ ఇబ్బందులున్నాయి.

**శాస్త్రవిషయాలలో తెలుగు భాషావినియోగం-కొన్ని ఇబ్బందులు:**

నేడు గణిత సామాన్య భౌతికరసాయనాది శాస్త్ర గ్రంథాల పాఠ్యాంశాలను తెలుగుమాధ్యమంలో తెలుగు పారిభాషిక పదాల వాడుకతోనే రాస్తున్నారు. పారిభాషిక పదాలను కల్పించిన తీరులో కొంత అస్పష్టత కన్పిస్తుంది. వాటిలో కొన్నింటిని ఇక్కడ ప్రస్తావించడం ద్వారా పాఠ్యగ్రంథరచనను మరింత స్పష్టం చేయాలన్నదే నా ఆశయం.

1. ఇప్పటికే వాడుకలో ఉన్న ప్రయోగాలపై కొత్త అనువాదాలను బలవంతంగా రుద్దడంవల్ల ప్రయోజనం ఉండదు.
   ఉదా: నేల, పరీక్ష అనే పదాల వాడుక Soil Examination అనే వాటికి ప్రత్యామ్నాయంగా అందరికీ ఆమోదయోగ్యాలు. వాటిని మళ్ళీ మృత్తిక, నికష అని ప్రయోగిస్తున్నారు. వీటివల్ల ప్రయోజనం లేదు.
2. Activity oriented – కర్తవ్యనిష్ఠ, Devotion to Duty – తంత్రణీయం వంటి అనువాదాలు పరిభాషాకల్పన ప్రయోజనాన్ని దెబ్బతీస్తాయి.
3. గణితశాస్త్రంలో Near a point, at a point అనే రెండింటికీ 'బిందువుదగ్గర' అని వాడుతున్నారు. సాధారణంగా ఇది సరిపోతుంది. కానీ కొన్ని సందర్భాలలో అస్సలు పొసగదు.
4. Engine, Machine కానీ ఈ రెంటికీ స్వభావంలో తేడా ఉంది. ఒక రూపంలో ఉన్న శక్తిని యాంత్రిక శక్తిగా మార్చేది Machine ఒక రూపంలో ఉన్న శక్తిని వేరే శక్తిగా మార్చేది Machine.
5. వివిధ శాస్త్రాలలోని పదాలను యథాతథంగా స్వీకరించేటప్పుడు కూడా కొన్ని ఇబ్బందులున్నాయి. ఉచ్చారణలోనూ లేఖనంలోనూ ఇవి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తాయి. ఉదాహరణకు గణిత శాస్త్ర పరిభాషలో ఉన్న Euler ను కొందరు యూలర్ అనీ కొందరు అయిలర్ అనీ రాస్తున్నారు. ఉచ్చారణను అనుసరించి లేఖన పద్ధతులను పాటించవలసి వచ్చినప్పుడు ఈ ఇబ్బంది తలెత్తుతుంది. అలాగే ఉపాధ్యాయవిద్యకు సంబంధించిన పరిభాషలోAlgae ని ఆల్గే. అల్జే అని ఉచ్చరిస్తున్నారు. ఈ రెంటిలో దేన్ని వాడాలి? అంటే ఇటువంటి సమస్యలు వచ్చినప్పుడు భిన్న ఉచ్చారణలను,

డాక్టరు అద్దంకి శ్రీనివాస్, ఫోన్ : 9848881838

లేఖన విధానాలను పరిశీలించి ఏదో ఒక రూపాన్ని గానీ లేదా అవసరాన్ని బట్టి రెండు రూపాలను గానీ మూల పదాన్ని అనుసరించి ప్రామాణీకరించవలసిన అవసరం ఉంది. అలా ప్రామాణికంగా చూపిన రూపాలనే రచయితలు పాఠ్యరచనలో ప్రయోగించాలి.

6. ఆంగ్లంలోని సాంకేతిక పదాలకు అనువాదాలు చక్కగా ఉంటే అవగాహన మెరుగవుతుంది.

ఉదా: Continuous function – అవిచ్ఛిన్న ప్రమేయం Necessary and sufficent condition – ఆవశ్యక పర్యాప్త నియమము

Evolutionary Socialism – పరిణామాత్మక సామ్యవాదం Surface Maps – భూతలపటాలు

7. ఒక పదానికి ఉన్న అర్థం వేరే అర్థంలో స్థిరపడినప్పుడు అనువాదం సమస్యై కూర్చుటుంది. ఉదాహరణకు Engineering అనే పదాన్ని తెలుగు లోనికి అనువాదం చేయాలంటే Civil అనే పదానికి నాగరకత కల, మంచి, మర్యాదగల అనే అర్థాలున్నాయి. ఈ అర్థంలో వాడడం కుదరదు. కాబట్టి 'భవన నిర్మాణరంగం' అనే అర్థంలోనే అనువదించవలసి ఉంటుంది.

8. మూలానికి దగ్గరగా ఉండాలనే ఆలోచన వల్ల కొన్ని అపప్రయోగాలను కూడా అనువాదంలో సృష్టించడం జరుగుతుంది. ఉదా: ప్రత్యేక గ్రేడ్లు, స్టేషనరీ అధికారులు, సీనియారిటీ పట్టిక, ఇటువంటివాటిలో వ్యవహారంలో బాగా కలిసిపోయిన అపశబ్దాలు కూడా ఉంటాయి. ఉదా: గర్భగుడి, అలా వ్యాప్తిలోనికి వచ్చిన వాటిని అలాగే ఉంచి కొత్తగా పదాలను కూర్చేటప్పుడు మాత్రం ఇటువంటి ప్రయోగాలను చేయకుండా జాగ్రత్త తీసుకోవాలి. కానీ ఇటువంటి ప్రయోగాలు అసంఖ్యాకంగా పత్రికలలోనూ పుస్తకాలలోనూ కన్పిస్తున్నాయి.

ఉదా: వార్షిక హెచ్చింపు, వార్షిక ఇంక్రిమెంట్లు సెమినార్ నిర్వాహకులు మొ. వీటివల్ల భాషకు ఉన్న సహజత్వం దెబ్బతింటుంది.

9. మూలభాషలో నుంచి ఒక పదానికి పరిభాషగా ఒక పదాన్ని తయారుచేసుకొన్నాక అందరూ అదే పదాన్ని కచ్చితంగా వాడాలిగానీ వాటికి పర్యాయపదాలను వెతక్కూడదు, వాడకూడదు. Hydrozen అనే పదంలో Hydro అనే పదానికి నీరు అనే అర్థం ఉంది కదా అని Waterzen అని అనలేం కదా!

ఉదా: Brain Storming అనే పదానికి ఉపాధ్యాయ విద్యావిషయక గ్రంథాలలో కొన్నిసార్లు మెదడును ముంచెత్తు అని కొన్నిసార్లు మేధాసంక్షోభం అనీ వాడుతున్నారు. ఇది పరిభాష అవసరాన్ని లక్ష్యాలను దెబ్బతీస్తుంది.

10. Retention-Stagnation; Curriculum - syllabus అనే పదాలలో మొదటిజంటకి నిలుపుదల, రెండవజంటకి పాఠ్యప్రణాళిక అనే అర్థాలను వాడుతున్నారు. కానీ వీటి అర్థాలలో భిన్న ఛాయలు ఉన్నాయి. Retention అంటే కనీసం 5 సంవత్సరాలపాటు విద్యార్థిని నిలపడం. Stagnation అంటే పరీక్షతప్పి అదే తరగతిలో నిలిచిపోవడం.

11. శాస్త్రసంబంధిత అంశాలను చక్కని పారిభాషికపదాలను కూర్చడం అంత తేలికయిన విషయంకాదు. అన్ని పదాలకు సులభగ్రాహ్యమయిన అనువాదాలు కుదరవు. అనువాదం చేసేటప్పుడే అర్థసందిగ్ధత ఏర్పడినప్పుడు ఆ పదాలకు సంబంధించిన ఆంగ్లమూలాలు కూడా ఇవ్వడం మంచిది. అలాకాక మూలరహితంగా పాఠ్యపుస్తకాలలో పారిభాషికపదాలను వాడితే అర్థం తెలీక విద్యార్థులు సందిగ్ధంలో పడతారు.

ఉదా: ఉపాధ్యాయ విద్యలో వాడే కొన్ని అర్థసందిగ్ధ కల పదకల్పనలు:

గెంతడానికి రోప్ – skipping rope; ప్రతిచయనం – sampling; నిష్పాదన – perfomance; అంశాలు – elements; పాఠశాల యంత్రాంగం – school plant; సుస్వరప్రసంగాలు – recitation

12. పారిభాషిక పదాలను కూర్చేటప్పుడు సంక్షిప్తత చాలా అవసరం. లక్ష్యంగా చూపించేది ఏకాక్షరంలో ఉండి దానిని గురించి చెప్పే పారిభాషికపదం దీర్ఘంగా ఉంటే దాని వల్ల ప్రయోజనం ఉండదు. ఉదా: ఆచార్య చేకూరి రామారావు 'రా పో తే కా' లను 'దీర్ఘైకస్వరాంతధాత్వాదేశరూపాలు' అని పరిభాషను కల్పించారు. తరువాత పరిభాషాసృష్టికి ఉండవలసిన కుదింపుని దృష్టిలో పెట్టుకొని వీటిని ఆదేశ క్రియలంటే సరిపోదా అనే అభిప్రాయాన్ని వ్యక్తం ఆయనే చేశారు.

*(భా. అం-పు-118)*

శాస్త్రవిషయాలకు సంబంధించి పాఠ్యపుస్తకాలు మాత్రమే తెలుగులో వస్తున్నాయి. కాని పరిశోధనాత్మకమయిన గ్రంథసముదాయం తెలుగులో రావడంలేదు. అలా రావాలంటే పి.జి స్థాయిలోనూ తెలుగుమాధ్యమంలో వివిధ శాస్త్రాల పఠనపాఠనాదులు జరగాలి. ఆంధ్రదేశంలో అన్ని శాస్త్రాలకు సంబంధించి డిగ్రీస్థాయిలో తెలుగు మాధ్యమం ఉంది. కానీ న్యాయశాస్త్ర అధ్యయనం విషయంలో డిగ్రీ స్థాయిలోనూ లేదు.

అది ప్రవేశపెట్టడం కష్టమా? అంటే కాదు. ఎందుకంటే కొన్ని రాష్ట్రాలలో మాతృభాషలోకి న్యాయవిద్య లభిస్తోంది. అంతే కాదు. బ్రిటీష్ హయాంలో దావాపత్రం, జవాబుపత్రం తెలుగులోనే ఉండేవి. జిల్లాస్థాయి న్యాయస్థానాలలో వాదోపవాదాలు కూడా తెలుగులోనే జరిగేవి. ఈ అంశాలన్నీ మనకి ఆదర్శం కావాలి. 300 సంవత్సరాలు ఫ్రెంచిభాష బ్రిటీష్ న్యాయస్థానాలలో ఉండటం వల్ల ఆంగ్లభాషలోనూ judge, summon, evidence, proof, petition, bail, వంటివి ప్రవేశించాయి. అందువల్ల మనం వ్యవహారంలో ఉపయోగించే భాషాపదాలే అనంతరకాలంలో వ్యాప్తిలోకి వస్తాయి. కాబట్టి తగిన పారిభాషికపదకోశాలను నిఘంటువులను నిర్మించడం ద్వారా శాస్త్రవిషయాలలో తెలుగువ్యాప్తిని అధికతరం చేయవచ్చు. దీనికి కావలసింది నూటికి నూరుపాళ్ళు చిత్తశుద్ధి మాత్రమే.

**సామాన్యభాషావినియోగం :**

నిత్యవ్యవహారంలో ప్రాథమిక పదజాలం తగ్గిపోతూ ఉంటుంది. దీనికి ప్రధాన కారణం భిన్నజాతుల సహజీవనం. సాధారణంగా ఆధిపత్యం చెలాయించే శక్తియుక్తులు ఉన్న జాతుల జీవనసరళి వెనుకబడిన జాతుల పై ప్రభావం చూపిస్తుంటుంది. వెనుకబడ్డ జాతులే ఆధిపత్యజాతులను అనుసరిస్తాయి. ఇందులో భాగంగానే సంస్కృతి సంప్రదాయాలతో పాటుగా భాషకూడా అధిక ప్రభావానికి లోనవుతుంది.

తెలుగు భాషను మొదట సంస్కృతం ఆ తర్వాత అరబిక్, ఇప్పుడు ఆంగ్లం ప్రభావితం చేస్తున్నాయి. విద్యా వ్యాపారాది రంగాలన్నీ ప్రపంచీకరణ ప్రభావానికి లోనైపోతున్నప్పుడు ప్రపంచంకూడా ఏకభాషా ప్రపంచం కావాలనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. కానీ మన జీవితానికి, సంస్కృతికి దగ్గరగా లేని భాషలో ఏ వ్యవహారమూ సమర్థవంతమూ పుష్టిమంతమూ కాదు. భిన్న సంస్కృతులను, భాషలను కబళించి ఒకే సంస్కృతి, ఒకే భాషా మిగిలిపోవడం నిజమయిన ఏకత్వం కాదు. భిన్న భాషలను సంస్కృతులను కాపాడుకోవలసిన అవసరం ఎంతో ఉంది.

ఇక మరొకవైపు అన్యభాషాపదాలు ఎన్ని ఎక్కువగా చేరితే భాషకు అంత శబ్దసంపద పెరుగుతుందనే అభిప్రాయం భాషాశాస్త్రవేత్తలలో ఉండేది. కానీ రాను రాను అది తప్పనే అభిప్రాయానికి రావలసివస్తోంది. ఎందుకంటే తెలుగుభాష లోనికి అన్యదేశ్యాలు ఎన్ని వచ్చినా నష్టం లేదు సరికదా భాషకు అది పుష్టినిస్తుంది. అయితే నేడు ఆంగ్లభాష వల్ల తెలుగులోని క్రియాప్రయోగాలు, వాక్యప్రయోగాలు దెబ్బతింటున్నాయి. ఈ రకమయిన నష్టం అంతకుముందు సంస్కృతం వల్లగానీ, అరబిక్ వల్లగానీ తెలుగుభాషకి ఎదురుకాలేదు. సంస్కృతి, అలవాట్లు, ఆంగ్లవిద్య మొదలయిన పరిణామాలవల్ల తెలుగుపదజాలం కూడా నిత్యవ్యవహారంలోంచి జారిపోతోంది. సామాన్య జనవ్యవహారం కూడా దీనికి అపవాదం కాదు.

శాస్త్రసాంకేతిక రంగాలకు సంబందించిన పదాల విషయంలో మూల భాషాపదాలను వాడడం సహజంగానే జరుగుతుంది. వీటికి కూడా తెలుగు పదాలను తయారుచేసుకోవచ్చు. సామాన్య వ్యవహారంలో అన్య భాషాపదాలను వాడవలసి వచ్చినప్పుడు తెలుగులో ఉన్న పదాలనే ఆయా అర్థాలకు సంబంధించిన వాటిని వ్యాప్తి చేయవచ్చు. లేకపోతే కొత్తపదాలను సృష్టించవచ్చు. అయితే తెలుగులో ఈ రెండింటికీ విరుద్ధంగా జరిగింది. కొత్తగా పరిచయమయిన వాటికి కొత్తపదాలను సృష్టించవచ్చు. అయితే తెలుగు ఈ రెండింటికీ విరుద్ధంగా జరిగింది. కొత్తగా పరిచయమయిన వాటికి కొత్త పదాలను సృష్టించకపోగా తెలుగులో ఉన్న పదాలకు బదులుగాకూడా ఆంగ్లపదాలనే వాడుతున్నారు. తెలుగులో మాట్లాడడాన్ని తక్కువగా భావించడం, పరిభాషను తయారుచేసుకోలేకపోవడం దీనికి కారణాలు.

బంధుత్వాలను తెలిపేందుకు నేడు ఆంగ్లాన్నే ఎక్కువ వాడుతున్నారు. ఆంటీ అనే పదం పిన్ని, చిన్నమ్మ, అత్త, పెద్దమ్మ మొదలైన పదాలను అంకుల్ అనే పదం బాబాయ్, చిన్నాన్న, మామ, పెద్దనాన్న మొదలైన పదాలను, బ్రదర్ అనే పదం అన్నదమ్ములను, కజిన్ అనే పదం అన్న, బావ మొదలయిన పదాలను మింగేశాయి. ఇక మమ్మీ డాడి, గ్రాండ్ మదర్ గ్రాండ్ ఫాదర్ వంటి పదాలు సరేసరి. నేటి తరానికి వారి

శరీరభాగాల పేర్లు పూర్తిగా తెలుగులో తెలీనే తెలియవు. అంగిలి, ఉల్లం, ఎమ్ము, కీలు, నరం, నెరిడె, మణికట్టు, మీగాలు, ముంజేయి, మునివేళ్ళూ, మూలగ లాంటి శరీరభాగాల పేర్లు తెలీదు.

ఆహారపుటలవాట్లు కూడా మారడంతో – చపాతీ, రోటీ, లడ్డూ, జిలేబీ, జాంగ్రీ, పూరీ, పుల్కా వంటి హిందూస్థానీ వంటకాలకు సంబంధించిన పదాలు; పిజ్జా, బర్గర్, సూప్ బ్రెడ్, బిస్కెట్ లాంటి ఆంగ్ల పదాలు వ్యాప్తిలోనికి వచ్చాయి. నిత్యవ్యవహారంలో ఉపయోగించే కూరల పేర్లు దినుసుల పేర్లు వస్తువులు, జంతువులు, కట్టడాలు, ఆటలు కాలం మొదలయిన వాటిని సూచించే పదాలు, సంఖ్యావాచకాలు, వస్త్రవిశేషాలు.... ఇలా చెప్పుకుంటూపోతే మానవజీవనంతో సంబంధం ఉన్న ప్రతి అంశంలోనూ తెలుగు పదాల్ని కుప్పలు కుప్పలుగా మనం నష్టపోతూనే ఉన్నాం.

తెలుగు భాషలోని పదాలు వాడుకలోంచి జారిపోవడానికి ఇతరకారణాలు కూడా ఉన్నాయి. ఉదా: గ్యాస్ స్టవ్ ఇదివరకు లేదు. పొయ్యి, కుంపటి వంటివే వాడుకలో ఉన్నాయి. గ్యాస్ స్టవ్ రాకతో పొయ్యి, కుంపటితో పాటుగా పొంత, గొట్టం, నుసి, పిడక, కచ్చిక వంటి పదాలెన్నో వ్యవహారంలోనించి జారిపోయాయి. అలవాట్లు మారినా నష్టం భాషకే. గ్యాస్ స్టవ్‌ను గాలికుంపటి అని తెలుగులోనికి అది ప్రవేశించినప్పుడే చేసుకొని ఉంటే కనీసం కుపంటి అనే పదమయినా మిగిలి ఉండేది. ప్రాచీనకాలపు పనిముట్ల వాడకంకూడా నేడు తగ్గింది. అందువల్ల ఆ పదాలు కూడా అందరికీ తెలియవు. ఇవే కాకుండా సామాన్యజనుల వ్యవహారంలో ఉన్న వివిధ రంగాలకు చెందిన పదాల స్థానంలోనూ ఆంగ్ల పదాలు వ్యాప్తిలోనికి వస్తున్నాయి.

వైద్యం, ఆరోగ్యం, న్యాయం, పరిపాలన, ఆర్థికం, సామాజికం, వ్యవసాయం, వృత్తులు, వ్యాపారాలు, విద్య వంటి రంగాలలోనూ అధికంగా ఆంగ్లభాషా పదాల వాడుక కన్పిస్తుంది. పాశ్చాత్య సంస్కృతి ప్రభావం వల్ల పాశ్చాత్యుల అలవాట్లు కూడా ఇక్కడికి దిగుమతి అవుతూనే ఉన్నాయి. దీని వల్ల కూడా పదజాలాన్ని కోల్పోవలసి వస్తుంది. ఉదాహరణకి షాపింగ్ మాల్ సంస్కృతి. తెలుగులో పదాలు ఉన్నప్పటికీ వీటిల్లో అన్నీ ఆంగ్లంలోనే రాస్తున్నారు. వాటివల్ల తెలుగుపదాలు మరుగున పడిపోతున్నాయి. ఇక నుడికారం సంగతి సరే సరి, నాడి కూడా దొరకదు. తామరతంపరగా వ్యాప్తిలోనికి వస్తున్న పదాలకు అడ్డుకట్టవేసే విధానం ఎప్పుడూ భాషా వ్యవహర్తలలోనే ఉంటుంది. వారు ఆయా వస్తువుల స్వరూపాన్ని బట్టి సహజంగా సులభంగా మూలానికి దగ్గరగా ఉండే పదాలు తయారుచేస్తారు. వాటిని గుర్తించి వ్యవహారంలోనికి తెచ్చేప్రయత్నం చేయాలి. ఏదయినా ఒకపదం చక్కగా అనువదింపబడితే అది తప్పకుండా సర్వజనామోదాన్ని పొందుతుంది. ఇది అలా ఉండనట్లయితే భాషను నష్టపోవడానికి మన పరభాషావ్యామోహం మాత్రం కారణం కాకూడదు.

జనవ్యవహారం చాలా పదునైనది. లంచమనే ఒక్కమాటకు 30కి పైగా వ్యవహారాలు తెలుగులో ఉన్నాయంటే సామాన్య వ్యవహర్త వాక్కులో ఎంతగొప్ప భాషా సృజన ఉందో అర్థమవుతుంది.

ఉదా. మొక్కుబడి, ముడుపు, చందా, తైలం మామూలు, దొంగకూడు, ఫలహారం, పైడబ్బు, బక్షీసు, నైవేద్యం, ఆమ్యామ్యా, చిల్లర, గీతం (జీతానికి నిందార్థ ద్యోతకం), ఎర, దక్షిణ, తడి, కండెన, బరువు, భోజ్యం, తిను, మింగు, దిగమింగు, బొక్కు, మెక్కు, మేయు, గతుకు, భోంచేయు, గుంజు, నూకు, దొబ్బు మొదలయినవి. ముఖ్యంగా తెలుగులో వాడడానికి అవకాశం ఉన్న సందర్భాలలోకూడా మనపత్రికల ఆంగ్లపదాలనే వాడుతున్నాయి.

ఉదా: Assembly – శాసనసభ, Court – న్యాయస్థానం, Organic farming – సేంద్రియ వ్యవసాయం, Water sheds – వాలుగట్లు, Check dam – వరదకట్ట.

పదకల్పనలోనూ పద బంధంలోనూ భాషా దురభిమానం కూడా పనికి రాదు. అచ్చంగా అచ్చతెలుగులోనే ఉండాలంటే అది సాధ్యం కాదు. సాధ్యమయినంత వరకూ అచ్చతెలుగుకే ప్రాధాన్యం ఇచ్చి అది కుదరని చోట తత్సమాలను వాడు కోవడం, అదీ సాధ్యం కాని సందర్భాలలో మూలభాషలోని పదాలనే వాడుకోవచ్చు.

అనివార్యమయిన సందర్భాలలోనే అన్య భాషాపదాలను వాడాలనే నియమం మాత్రం తప్పనిసరిగా పెట్టుకోవాలి. నవనాగరికుల మనిపించుకోవడానికో లేదా తెలుగులో మాట్లాడడం చిన్నతనంగా భావించడం వల్లనో అన్యభాషా పదాలను పనిగట్టుకొని వాడితే దానికి పెద్ద ఎత్తున మూల్యం చెల్లించవలసి వస్తుంది.

మి

# చదవండి...

- ఎన్నార్కె




❖ **లోకక్షేమ గాథలు :** ఈ పుస్తకంలోని కథలు సగానికి పైగా బౌద్ధ భావ వేదికను ఆధారంగా చేసుకొని అల్లబడినవి. మిగిలినవన్నీ బౌద్ధంలో కనిపించే వృత్తాంతాలే. ఆధ్యాత్మిక విషయాలను తెలియజేయటమే ఈ కథల ప్రధాన లక్ష్యం. న్యాయమైన, నీతివంతమైన జీవితం ఆనందంగా సాగుతాయని చెప్పక చెప్పే కథలు. బౌద్ధ మత అభిమానులే కాదు, పెద్దలు, పిల్లలు కూడా తప్పక చదవవలసిన కథలు. మానవ వ్యక్తిత్వ వికాసానికి ఈ కథలు దోహదం చేస్తాయి. ధర్మ దీపం ఫౌండేషన్ వారి ప్రచురణ.

*పేజీలు 140, వెల : ₹ 100, ప్రతులు కావలసినవారు ఫోన్: 040-27635654 లో సంప్రదించండి.*




❖ **ముంగిట ముత్యం:** సి.వేదవతి. అలనాడు యశోద అల్లరి చేసే కుమారుని సరిదిద్ది తల్లిగా అధికారమును నిరూపించుకుంటే ఈనాడు వాత్సల్యముతో ఆ శైశవ స్వామిని నేను అక్షర బద్ధుని కావించే సాహసం చేశాను అని చెప్పుకున్నారు రచయిత్రి. ఆమె రచనలో దైవతామూర్తి తెలుగింటి శిశువైనారు- ఈ పుస్తకానికి పేరు తగినట్లుగానే రచన సాగింది. కొన్ని గేయాలు పాడుకొనుటకు వీలుగానుండేటట్లు రచన సాగింది. దీనికి అందమైన ముఖచిత్రాన్ని వేసినవారు బాలి, లోపలి అక్షరశిల్పి శీలా వీర్రాజు.

*పేజీలు 100, వెల : ₹ 80/-, ప్రతులు కావలసినవారు ఫోన్: 23512770 లో సంప్రదించండి.*




❖ **దీపిక (పీఠికలు, సమీక్షలు):** రచయిత్రి సి.వేదవతి. ఇందులో 15 పీఠికలు, 6 సమీక్షలు వున్నాయి. రచయిత్రి సహజ కవయిత్రి కావటంతో వీటిలో కూడా సునిశిత మార్దవం తొంగి చూసింది. శ్రీకాంతశర్మగారన్నట్లు వేదవతిగారు తమ ఈ రచనాశైలి ద్వారా సత్యం బ్రూ-యాత్, ప్రియం బ్రూ యాత్, న బ్రూ యాత్ సత్యమప్రియమ్ అనే సూత్రాన్ని ఆచరించారు.

*పేజీలు 150, వెల : ₹ 90/-, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. ప్రతులకు, ఫోన్: 23512770 లో సంప్రదించండి.*




❖ **స్త్రీ అక్షరాలు - శిలాక్షరాలు :** రచన దేవరాజు మహారాజు. ఈ ప్రపంచపు గర్భాన్ని తనలో ధరించిన అనంతమైన స్త్రీ శక్తికి నివాళి ఈ రచన. సుమారు యాభై మూడు భారతీయ రచయిత్రుల విజయకేతనం. వారి వ్యక్తిత్వ వికాస పురోగమనం పై చేసిన రచనలు. చేయి తిరిగిన రచయిత కావటంతో వీరి గురించి సంక్షిప్తంగా చెప్పినా, సమగ్రంగా చెప్పినట్లనిపించేలా చెప్పారు.

*పేజీలు 150, వెల : ₹ 150, అన్ని బుక్ షాపుల్లో లభ్యం.*




❖ **రత్తి పాటలు :** యం.బి.జనార్థన రావు. కొనకళ్ళ మొక్కజొన్న తోటలో నందూరి వారి యెంకి పాటలు, కొద్దిగా దేవులపల్లి వారి భావలాలసను ఒడిసి పట్టుకొని తనదంటూ ఒక ప్రత్యేక శైలిలో రచన సాగించారు. పంతొమ్మిది వందల 50 దశకం తరువాత ఈ తరహా రచనలు రాలేదు. ఇప్పుడు ఈ రత్తిపాటలు చదువుతున్నపుడు దీనిలోని జానపద పలుకుబళ్ళతో శరీరానికి మలయమారుతం తాకినంత హాయిగా ఉంది.

*పేజీలు 48, వెల : ₹ 25, ప్రతులకు డోర్.నెం. 4-82, మధురానగర్, కాకినాడ -4 లో సంప్రదించండి.*




❖ **మరో చర్చ :** తెలుగు సాహిత్య విమర్శ పై విశ్లేషణ, రాచపాళెం చంద్రశేఖరరెడ్డి వ్రాసిన వ్యాస సంపుటి. 2006లో వచ్చిన చర్చ అన్న సంపుటికి కొనసాగింపుగా వచ్చిందీ పుస్తకం. తెలుగులో సాహిత్య విమర్శ వస్తున్నంతగా దానిమీద విశ్లేషణ జరగటంలేదు. విమర్శకులు వున్నట్లే విమర్శ, విమర్శకులు ఉండాలనే భావిస్తున్నారు వ్యాసకర్త. ఇది పుస్తకంలో వున్న కంటెంట్‌తో పోలిస్తే దీని వెల చాలా తక్కువని చెప్పాలి. పుస్తకం అట్ట మీద పేర్కొన్నట్లుగా సాహిత్య విద్యార్థులు, విమర్శకులు, విశ్లేషకులు, సమీక్షకులు తప్పక చదవవలసిన గ్రంథం అని దీనిని నొక్కి చెప్పవచ్చు. తెలుగు సాహితీ ప్రియులకిదొక భాండాగారం.

*పేజీలు 222, వెల : ₹100/-, ప్రతులు కావలసినవారు ఫోన్: 24744580 / 24735905లో సంప్రదించండి.*




❖ **అడ్డా :** శైలజామిత్ర వ్రాసిన 20 కథల పుస్తకం. జీవితం నిత్యం నిర్దిష్టంగా ఉండాలని భావించేవారిలో నేను ఒక దాన్ని. ఇంట్లోనే కాదు, బయట కూడా ఒక అబద్ధాన్ని సహించే మనస్తత్వం లేకపోవటం రచయిత్రిగా తనను ఈ స్థాయికి తీసుకువచ్చిందని రచయిత్రి బలంగా నమ్మడమేకాదు దాని ప్రభావం కథల్లో కనబడుతుంది. ఎవరైనా చనిపోయినపుడు జరిగే ఆస్తి పంపకాలు దానికోసం కొట్లాటలు సాగటం, ఎవరైనా చనిపోతే ఒక్కరైనా స్వచ్ఛంగా కన్నీరు పెట్టలేని సమాజాన్ని ఆమె నిరసించారు. ఆయన ఆమె రచనలలో నిండైన పోజిటివ్ దృక్పథం కనబడుతుంది. సామాజిక దృష్టిలో వ్రాయబడ్డ కథలవి.

*పేజీలు 160, వెల : ₹ 80/-, ప్రతులు కావలసినవారు ఫోన్: 9290900879 లో సంప్రదించండి.*




❖ **నివద్దిగ జెప్తుండ? :** 'గొంగటోళ్ళ గోసలు, అంబటోళ్ళ ఊసులు, ప్యాదాళ్ళ బాధలు', అంటూ ఈ గేయాలు తెలంగాణా మాండలీక మట్టి భాషలో తన సహజ అందాలను విరజిమ్మింది. రచయిత దంతోజు ఆశోకాచారికి తాను, తన చుట్టూ ఉన్నవారు మాటలాడే భాష మీద అధికారమెక్కువ. ఈ రచనలు చదువుతున్నపుడు ఒక గ్రామీణుడు మన ముందుకొచ్చి తన సాధక బాధలను చెప్పుకుంటున్నట్లుగా ఫీలవుతాము. తెలుగులోనే కాదు ఉర్దూపదాలు వాడటంలోనూ రచనలో సహజత్వం, స్వచ్ఛత ఉన్నాయి. రచనలో గొప్ప ఆర్తి ఉంది. హృదయాన్ని స్పర్శించి, స్పందింపజేసే గుణం ఉంది. రచయిత పేర్కొన్నట్లు ఇది చదువుతున్నపుడు నా కండ్ల ముంగలి కొచ్చింది.

*పేజీలు : 30, వెల: ₹30/-, ప్రతులు కావలసినవారు సెల్: 9291326146 లో సంప్రదించండి.*



❖ **'మో' బ్రతికిన క్షణాలు :** రచయిత డాక్టర్ డి. వెంకట్రావు. ఆగష్టు 3, 2012న జరిగిన **'మో'** స్మారకోపన్యాసం. Intimations After Death, అంటూ ఈ పదమూర్ఛనలు చనిపోయిన తరువాత చెప్పే మొదటి మాటలుగా పేర్కొన్నారు రచయిత. విజయవాడ సాహితీ మిత్రులు (మసీదు వీధి, అరండాల్ పేట) విజయవాడ వారి ప్రచురణ. 15 పేజీల వ్యాసమిది.

*పేజీలు 15, ప్రతులు కావలసినవారు ఫోన్: 9490634849 లో సంప్రదించండి.*




❖ **సౌందర్యలహరి :** ఇది శంకర భగవత్పాద విరచిత సంస్కృత రచనలకు అనుసరణ గేయ కృతి. రచయిత ఇంద్రగంటి భానుమూర్తి. పుస్తకంలోని ఎడమ చేతి వైపు నున్నపుటలో మూల సంస్కృత శ్లోకాన్నిస్తూ, కుడి చేతి వైపు పుటలో లలితకోమలమైన తమ అనుశీలనా వాణిని వినిపించారు రచయిత. భక్తిభావంతో చేసిన ఈ భగీరథ ప్రయత్నం సఫలమయిందని భావించవచ్చు. అరవింద భారతి ప్రచురణ. నవోదయలో లభ్యమవుతుంది.

*పేజీలు 50, వెల : ₹ 50/-, ఫోన్: 23232316 లో సంప్రదించండి.*



# కళ కళాకారుడు విమర్శకుడు

అందమైన వాటిని సృష్టించే వాడు కళాకారుడు!
కళ లక్ష్యం – కళను ప్రదర్శించి, కళాకారుని దాచిపెట్టటమే!
తన స్పందనలను, తన అనుభూతిని మరో విధంగా తర్జుమా చేసి, అందమైన కళా సృష్టికి కొత్త భాష్యం చెప్పేవాడు విమర్శకుడు. గొప్పది కాని, తప్పుదు విమర్శకాని – అది విమర్శకుని స్వీయచరిత్రే!
అందమైన వాటిలో వికృతాన్ని చూసే వారు – సౌందర్యాన్ని ఆస్వాదించలేని భ్రష్టులు!
సుందరమైన సృష్టిలో సౌందర్యాన్ని దర్శించగలిగిన వారు – సంస్కారవంతులు. వీరు ఆశావహులే!
సౌందర్యాన్ని సత్యదృష్టితో చూసేవారు ఉత్తములు!
నైతికమని, అనైతికమని పుస్తకాలు విడిగా వుండవు. పుస్తకం బాగా రాయబడిందా, చెత్తగా రాయబడిందా అనే చూడాలి!
ఈ శతాబ్దపు రుగ్మత, ఉన్నది ఉన్నట్లుగా చూడలేకపోవటం! అంతే! 'కాలిబాన్' తన ముఖాన్ని అద్దంలో చూడ లేడన్నట్లు.
ఈ శతాబ్దం 'రమణీయకతను' భరించలేదు – అదే కాలిబాన్ తన ముఖాన్ని చూడ నిష్టపడనట్లు!
మనిషి నైతిక జీవనం – కళకు, కళాకారునికి వస్తువు. కాని కళలో నైతికత, కళా మాధ్యమానికి అరకొర విధానమే.
ఏ కళాకారుడు – ఏదీ నిరూపించబూనడు. సత్యాన్ని కూడా నిరూపించాలి కదా!
ఏ కళాకారునికి నైతిక సానుభూతి వుండదు. అలాంటి సానుభూతి క్షమించరాని శైలీ విధానం!
ఏ కళాకారుడు స్తబ్దంగా వుండలేడు. తను వ్యక్తీకరించ దలిచింది అంతా ఏకరువు పెడతాడు.
ఆలోచన, పరిభాష ఈ రెండూ కళాసృష్టికి సాధనాలు.
ధర్మం, దుర్మార్గం, కళాకారునికి వస్తు పొది. కళా సృష్టికి రంగుల పొది.
స్వరూప దృష్టితో చూస్తే, అన్ని కళలూ– సంగీతంలో మేళవిస్తాయి.
స్వభావ దృష్టిలో – కళాకృతి, కళాకారుని నైపుణ్యంతో రూపు దిద్దుకుంటుంది.
కళ అంతా చిహ్నమే – అదీ ఉపరిభాగంలోనే! లోతులకు వెళ్ళదలచినవారు – తమ బాధలకు తామే బాధ్యులు!
కళ ప్రతిబింబించేది దర్శించే వాడినే. జీవితాన్ని కాదు.
ఏదైనా కళా సృష్టికి భిన్న భాష్యాలున్నాయంటే – అందులో కొత్తదనం, సంక్లిష్టత, సత్తా ఉన్నదన్న మాట!
విమర్శకులు అంగీకరించకపోతే, కళాకారుడు తన సృష్టితో మమేకమైనట్లే!
ఎవరైనా, ఏమైనా ఉపయోగపడేది తయారుచేసినపుడు మనం అతన్ని క్షమించవచ్చు, అతని సృష్టిని అతను పొగుడుకోనంతవరకు.
కళాకారుడు తన కళను గొప్పదని అంటే, ఆ ఒక్కమాట చాలు, అది పనికి రానిదని చెప్పటానికి!
కళ అంతా పనికి రానిదే....

*ది పిక్చర్ ఆఫ్ డోరియన్ గ్రే పుస్తకానికి ముందుమాటలు...*



*ఈ క్రింది పుస్తకాలు మీకు అవసరమయితే మాకు తెలియచేయండి. వాటి విలువకు తపాలా ద్వారా పంపిస్తాం.*

**I. మిసిమి ప్రచురణలు**

| | | ₹ |
|---|---|---|
| 1. | బాపు బొమ్మలు | 200.00 |
| 2. | మహాబౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు | 500.00 |
| 3. | బుద్ధుని దీర్ఘ సంభాషణలు – *ఎ.వి.రెడ్డి* | 200.00 |
| 4. | బుద్ధుని మధ్యమ సంభాషణలు–1 ” | 200.00 |
| 5. | బుద్ధుని మధ్యమ సంభాషణలు–2 ” | 200.00 |
| 6. | బుద్ధుని మధ్యమ సంభాషణలు–3 ” | 200.00 |
| 7 | ఆచార్య నాగార్జునుడు | 150.00 |
| 8. | దూర తీరాలలో... – *వి. అశ్వినికుమార్* | 60.00 |
| 9. | అమాహ ” | 60.00 |
| 10. | అంతర్వీక్షణం ” | 50.00 |
| 11. | సిద్ధార్థ ” | 50.00 |
| 12. | నాలో నేను ” | 30.00 |
| 13. | అగాధం ” | 75.00 |
| 14. | కథాంజలి–1 **– ఎస్సారె** | 80.00 |
| 15. | కథాంజలి–2 ” | 110.00 |
| 16. | THE THUNDERCLOUD ” | 120.00 |
| 17. | మిసిమి వ్యాసాలు – *నరిసెట్టి ఇన్నయ్య* | 125.00 |
| | **ఇతరములు** | |
| 18. | భట్టిప్రోలు కథలు | 150.00 |
| 19. | రెండు దశాబ్దాలు – కథ 1990–2009 | 150.00 |

**II. వేమన ఫౌండేషన్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | లోకకవి వేమన – *ఎమ్. కోదండ రామిరెడ్డి* | 100.00 |
| 2. | మన వేమన – *ఆరుద్ర* | 80.00 |
| 3. | వేమన – *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 4. | VEMANA - *V.R. Narla* | 50.00 |
| 5. | VEMANA - Through Western Eyes. - *V.R. Narla* | 50.00 |
| 6. | విశ్వకవి వేమన – *గుర్రం వెంకటరెడ్డి, పోచన రామిరెడ్డి* | 100.00 |
| 7. | పురాణ ప్రలాపం *(ప్రొ. హరిమోహన్ ఝా, అనువాదం: జె.లక్ష్మిరెడ్డి)* | 100.00 |
| 8. | THE FIRST POETICAL READER *(Walter Joyes and N.C. Sashacharloo)* | 50.00 |
| 9. | వేమన – *రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ* | 100.00 |
| 10. | వేమన ఉపదేశామృతం –*ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |

**III. ధర్మదీపం ఫౌండేషన్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | మహాపరిత్తం – *బోధ చైతన్య* | 100.00 |
| 2. | జాతక కథలు – *శివశంకర స్వామి* | 60.00 |
| 3. | బౌద్ధ దర్శనమ్ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : బి. గోవర్ధన్)* | 70.00 |
| 4. | మహామానవ బుద్ధ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : డా. జె. లక్ష్మిరెడ్డి)* | 75.00 |
| 5. | మిళిందపన్హ : ఉపమలు – *బోధ చైతన్య* | 75.00 |
| 6. | బ్రాహ్మణ, బౌద్ధ, హిందూ మతాలు – *అన్నపరెడ్డి బుద్ధఘోషుడు* | 40.00 |
| 7. | వర్ణవ్యవస్థా లేక మరణ వ్యవస్థా *(భదంత ఆనంద కౌసల్యాయన్; అనువాదం:జె.లక్ష్మి రెడ్డి)* | 50.00 |
| 8. | జయమంగళం – బొర్రా గోవర్ధన్ | 40.00 |
| 9. | బుద్ధుని చివరి రోజులు – *డాక్టరు ఈమని శివనాగిరెడ్డి* | 30.00 |
| 10. | భగవాన్ బుద్ధ *(ధర్మానంద కోశాంబి; అనువాదం: బొర్రా గోవర్ధన్)* | 150.00 |
| 11. | విపశ్యనా ధ్యానమార్గదర్శిని *(తియ్యగూర సీతారామిరెడ్డి & నందం శ్రీనివాసరావు)* | 50.00 |
| 12. | మిళింద ప్రశ్నలు – *బోధచైతన్య* | 150.00 |
| 13. | బౌద్ధ ధర్మదర్శిని *(భదంత ఆనంద కౌసల్యాయన్ – అనువాదం జె. లక్ష్మిరెడ్డి)* | 100.00 |
| 14. | ప్రజ్ఞాదీపిక *(తియ్యగూర సీతారామిరెడ్డి & నందం శ్రీనివాసరావు)* | 60.00 |
| 15. | శీలం–ధ్యానం – *బోధ చైతన్య* | 150.00 |
| 16. | లోకక్షేమగాథలు – *బోధ చైతన్య* | 75.00 |

**IV. ఆర్ట్స్ & లెటర్స్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | తెలుగా, ఆంధ్రమా? – వాగరి | 40.00 |
| 2. | యతిగీతం– స్వామి వివేకానంద (అనువాదం ; గజ్జెల మల్లారెడ్డి) | 50.00 |


మిసిమి
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020. Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in ; e-magazine : www.kinige.com/misimi

**మిసిమి** *విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!*

**మిసిమి** పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా ₹240/- తో పాటు పంపండి. బయటి **చెక్కులకు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు** అదనంగా ₹30/- కలపండి.

**1. పేరు :** ..........................................................................

**2. చిరునామా :**

ఇం.నెం. ..........................................................................

వీధి ..........................................................................

పేట ..........................................................................

ఊరు ..........................................................................

పిన్ ..........................................................................

సెల్ ..........................................................................

**3. సంతకం :** ..........................................................................

---

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |

---

చందాలు **మిసిమి** పేర ఈ క్రింది చిరునామాకు పంపించగలరు.

**మిసిమి** లో నూతన చందా దారులుగా చేరండి : **'సిద్ధార్థ' పుస్తకాన్ని బహుమతిగా పొందండి.**

అలాగే ఐదు సంవత్సరాలకు ₹1200 పంపండి అందమైన 2010 **మిసిమి** పుస్తకాల బైండు అందుకోండి.

మిసిమి
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020.

Ph. 040-27645536, E-mail : misimi_monthly@yahoo.in

e-magazine : www.kinige.com/misimi



పద్మ రాగం

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2012-14



మౌన గానం